
భక్తి యోగం

# భక్తి యోగ తత్త్వము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని ద్వారకాదీష్ వాస్తు వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. దీనిద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) ద్వారకాదీష్ వాస్తు వారి వెబ్ సైట్: http://dwarkadheeshvastu.com
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో ద్వారకాదీష్ వాస్తు వారి వెబ్ సైట్ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org

Facebook: www.facebook.com/freegurukul Helpline: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

ద్వారకాదీష్ వాస్తు వారి వెబ్ సైట్:

**http://dwarkadheeshvastu.com**



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ప్రత్యక్షముగా పరమాత్మను దర్శించు ఉపాయము | 5 |
| 2. | మర్యాదా పురుషోత్తముడగు శ్రీరామచంద్రుని గుణములు - చరిత్ర | 11 |
| 3. | పరమాత్మను పొందుటకు శ్రద్ధ - విశ్వాసము - తీవ్రమైన కోరిక - శరణుజొచ్చుట. | 48 |
| 4. | ఈశ్వర సాక్షాత్కారమునకు నామజపమే అన్నిటికంటెను అత్యుత్తమమైన సాధనము | 59 |
| 5. | సత్సంగము - భగవద్భక్తుల లక్షణములు - వాటి యొక్క మహిమ, ప్రభావము (ఉదాహరణములు) | 76 |
| 6. | భగవత్సాక్షాత్కారమును పొందుట సులభమే | 92 |
| 7 | పరమాత్ముడగు శ్రీకృష్ణుని ప్రభావము | 97 |
| 8. | నామము, రూపము, లీలలు, పరమధామము | 112 |
| 9. | భక్తుడగుటకు సులభసాధనము | 140 |
| 10. | అనన్యభక్తియొక్క స్వరూప రహస్యములు | 168 |
| | అనుబంధము | |
| 1. | ధర్మము | 181 |
| 2. | బాలకులకు హితబోధ | 188 |


❖ ❖ ❖

# నివేదన

శ్రీజయదయాల్ గోయంద్కాగారి ప్రవచనములనుండి జ్ఞానయోగము, కర్మయోగము, భక్తియోగములను గూర్చి వివరణాత్మకముగా లభించిన వ్యాసములు ఇదివరలో మేము వేర్వేరుగా ప్రచురించియున్నాము. భక్తుల కోరిక ననుసరించి మూడు మోక్షసాధనమార్గములను గూర్చి సంగ్రహముగా "భక్తియోగతత్త్వము" అను పేర హిందీలో ప్రచురించబడినది. ఆ హిందీపుస్తకమునకే ఇది ఆంధ్రానువాదము. సరళమైన భాషలో అనువదించిన శ్రీగండ్లూరు నారాయణగారికి మా ధన్యవాదములు.

ఇందు భక్తిస్వరూపము, మహిమ, రహస్యము మున్నగు విషయములేగాక, భక్తుల లక్షణములు, మహిమాప్రభావములు, నామజపము, ధ్యానము, స్మరణము, సత్సంగము, స్వాధ్యాయము, శ్రద్ధ, ప్రేమ, శరణాగతి మున్నగు భక్తిసాధనములు వివరించబడినవి. అట్లే భగవంతుని నామము, రూపము, లీలాధామము, గుణములు, ప్రభావము, తత్త్వము, రహస్యము, స్వభావము మున్నగు అనేక విషయములు విశదీకరించబడినవి.

జ్ఞానయోగము, కర్మయోగము, అష్టాంగయోగము అను సాధనముల కన్న భక్తియోగము మిక్కిలి సులభోపాయము. బాలురు, వృద్ధులు, యువతీ, యువకులు అందరునూ ఈ మార్గమును అనుసరించి భగవత్సాక్షాత్కారమును పొందగలరు.

ఈ విషయములనన్నింటినీ పాఠకులు పఠించి, ఆకళింపు చేసికొని, ఆచరించి, సంసారసాగరమునుండి తరించి, మోక్షసామ్రాజ్యమును పొందగలరని మా ఆశాభావము.

ఇట్లు

ప్రకాశకులు

# భక్తియోగ తత్త్వము

## 1. ప్రత్యక్షముగా పరమాత్మను దర్శించు ఉపాయము

భగవంతుడు ఆనందమయుడు. ఆ స్వామిని ప్రత్యక్షముగా దర్శించుటకు నిజమైన భక్తియే అన్నిటికంటె ఉత్తమమైన ఉపాయము. ఆ భక్తి ఎట్లు ఉండవలయును? ఎట్టి భక్తికి ఆ ప్రభువు ప్రత్యక్షమై దర్శనమిచ్చును? ఈ విషయమున నేను కొంత నివేదింపదలచుకొనుచున్నాను.

అనేక విఘ్నములు ఎదురైనప్పటికిని ధ్రువునివలె భగవంతునిధ్యానములో నిశ్చలుడై యున్నచో ఆ దేవదేవుడు అతనికి ప్రత్యక్షమై దర్శనమిచ్చును.

శ్రీహరిని జపించిన మహాభక్తుడగు ప్రహ్లాదునివలె మనము రామనామమును ఆశ్రయించి, ఎన్నికష్టములెదురైనను సంతోషముతో సహించుటకును, నిశితమైన ఖడ్గమునకు తలను బలియిచ్చుటకును సిద్ధము కావలెను. అట్టివానికే భగవంతుని సాక్షాత్కారము కలుగగలదు.

ఆ దేవదేవుని (రాముని) సేవించుట కొఱకు లక్ష్మణుడు తన భార్యను, సకలైశ్వర్యములను, రాజ్యభోగములను పరిత్యజించెను, ఆయన వెంట వనములకు వెళ్లెను. తన సర్వస్వమును ఆ ప్రభువునకు సమర్పించి సేవించిన లక్ష్మణస్వామికి ఆ పరంధాముడు ప్రత్యక్షముగా దర్శనమును ప్రసాదించెను.

ఋషికుమారుడగు సుతీక్ష్ణుడు పరమాత్మధ్యాసలో నిమగ్నుడై తన సర్వస్వమును మరచిపోవుచుండెను. ప్రేమోన్మత్తుడగుచుండెను. తానేమి చేయుచున్నాడో తనకే తెలియని స్థితిలో ఉండెను. ఆయనకు పరమాత్మ తప్ప ఇంకొక ధ్యాసయే లేదు. అందువలన సుతీక్ష్ణునకు భగవంతుని దర్శనము లభించెను.

శ్రీరామునిరాక పరమశ్రేయోదాయకము. ఆ శుభవార్తను విన్న సుతీక్ష్ణుని స్థితి విలక్షణముగనుండెను. తులసీదాస స్వామి దీనిని మిగుల గొప్పగా వర్ణించెను. ఆ శబ్దములు మనస్సును ప్రభావితము చేయునవి. రామచరిత మానసమునందు శంకరభగవానుడు ఉమాదేవితో ఇట్లు పలికెను.

సుతీక్ష్ణుడు భగవంతుని స్వభావమును స్మరించుచు ఆనందమగ్నుడై ఇట్లనుకొనెను. "సంసారబంధములనుండి విముక్తిని ప్రసాదించు ప్రభువు యొక్క ముఖకమలదర్శనమువలన నేడు నా కన్నులు సార్థకము లగును." (శివుడు పలుకుచున్నాడు) "భవానీ! జ్ఞానియైన సుతీక్ష్ణముని సంపూర్ణముగ భక్తిపరవశుడాయెను. అతని తన్మయత్వము వర్ణనాతీతము. అతడు దిశలను, మార్గమును మరచిపోయెను. తానెవరో తన గమ్యమేమిటో అను విషయము అతని స్మృతిలో లేదు. ఒక్కొక్కసారి వెనుకకు మరలిపోవును. మరల ముందుకు నడుచును. మరియొక తరి ప్రభువుగుణములను కీర్తించుచు నాట్యము చేయును. ముని భక్తిపారవశ్యములో మునిగిపోయెను. శ్రీరామచంద్రుడు ఆ సుతీక్ష్ణునిప్రేమోన్మత్తదశను ఒకచెట్టు చాటుననుండి గమనించెను. భవబంధములను తొలగించు శ్రీరాముడు ఆ ముని ప్రేమాతిశయమునకు ముగ్ధుడై అతనిహృదయమునందే ప్రకటితుడాయెను. సుతీక్ష్ణుడు ఆ రామచంద్ర ప్రభువును దర్శించి మార్గమునందే నిశ్చలుడై కూర్చుండెను. అతని తనువు పులకించి పనసపండువలె కంటకితమాయెను. అప్పుడు శ్రీరాముడు అతని సరసనచేరి తన భక్తుని ప్రేమవిహ్వలస్థితిని చూచి మిక్కిలి ప్రసన్నుడాయెను."

(రా.మా. అరణ్యా. దో. 9/5-9)

"రామచంద్రప్రభువు సత్పురుషులకు ప్రియమైనవాడు. సేవకుల దుఃఖమునకు, దారిద్ర్యమునకు దావానలమువంటివాడు (వాటిని రూపుమాపువాడు). అట్టి ప్రభువు మునిగణముల చెంతకు వేంచేసెను. ఆయన నాకు ప్రాణసముడు. ఓ బ్రాహ్మణులారా! మునులారా! లేచి ఆ ప్రభువును దర్శింపుడు."

ఆంజనేయునకు రామచంద్రునియెడగల భక్తిశ్రద్ధలు అపారములు. ఆయన ప్రేమవిహ్వలుడు. ఆ మారుతి ప్రభువును శరణుజొచ్చిన తీరు భక్తిపారవశ్యమునకును, తన్మయతకును నిదర్శనము. ఆ స్వామికి పరమాత్మయొక్క ప్రత్యక్షదర్శనము లభించెను.

భరతుడు శ్రీరామదర్శనముకొరకు అనుభవించిన వేదన నిరుపమానము. ఆయన ప్రేమస్వరూపుడు. మహానుభావుడగు భరతునకు ప్రత్యక్షముగా భగవద్దర్శనము కలిగెను. పదునాలుగు సంవత్సరముల వనవాసము యొక్క గడువు ముగియుచుండగా ఆయనస్థితి అత్యంత విలక్షణముగా అతిదీనముగా నుండెను. దీనిని తులసీదాసు మిగుల చక్కగా వర్ణించెను.

"నా ప్రాణములకు ఆధారమైన వ్యవధి ఒక్కదినము మాత్రమే మిగిలియున్నది". ఇట్లు ఆలోచించుచుండగనే భరతుని మనస్సు మిక్కిలి దుఃఖాక్రాంతమైనది. "స్వామి ఇంకను రాకుండుటకుగల కారణమేమి? నన్ను కుటిలునిగా భావించి మరచిపోయెనా? శ్రీరామునిచరణకమలములను ఆశ్రయించుకొనియున్న లక్ష్మణుడు ఎంత ధన్యుడు? ఆహా! ఎంతభాగ్యశాలి! ప్రభువు నన్ను కపటిగాను, కుటిలునిగాను భావించి యుండవచ్చును. అందువలననే అతడు నన్ను తనతోబాటు తీసికొనిపోలేదు. నా కృత్యములను ఆయన తన మనస్సులో పెట్టుకొన్నచో ఎన్ని కల్పములవరకైనను నాకు నిష్కృతి ఉండదు. కాని ప్రభువు తన సేవకుల దోషములను ఎన్నడును లెక్కింపడు. అతడు దీనజనబంధువు. ఆయన స్వభావము అతి కోమలము. శ్రీరామచంద్రప్రభువు తప్పక రాగలడని నా మనస్సు విశ్వసించుచున్నది. ఏలనన అన్నియు శుభశకునములే అగుచున్నవి. కాని గడువు ముగిసిన పిమ్మట కూడ నేను ప్రాణములతో మిగిలియున్నచో నావంటి అధముడెవ్వడును ఉండడు, ఉండబోడు". (రా.మా. ఉ.కాం. దో. 1 క.ఖ)

భరతునిమనస్సు శ్రీరామునివిరహసముద్రమున మునిగిపోవుచుండగా రక్షించుటకు వచ్చిన ఓడవలె హనుమంతుడు బ్రాహ్మణవేషముతో అచటికి వచ్చెను. దుర్బల శరీరుడై, జటామకుటధారియై, నిరంతరము "రామరామ" అని జపించుచు, అశ్రువులనుగార్చుచు, కుశాసనముపై కూర్చున్న భరతుని ఆంజనేయుడు చూచెను. (రా.మా. ఉ.కాం. దో.1/క. ఖ)

భక్తుడగు మారుతి భరతుని కలిసెను. వారిరువురిమధ్య సంభాషణ జరిగెను. శ్రీరామచంద్రుడు భరతుని కలిసికొనిన సమయమున గోస్వామి తులసీదాసు ఇట్లు వర్ణించెను. పరమేశ్వరుడగు శివుడు పార్వతీదేవితో ఇట్లు నుడివెను.

"కమలములవంటి శ్రీరామునికన్నులనుండి ప్రేమాశ్రువులు ప్రవహింపసాగెను. శరీరము పులకించెను. ముల్లోకములకును స్వామియైన శ్రీరామచంద్రప్రభువు తన తమ్ముడగు భరతుని అత్యంతప్రేమతో హృదయమునకు హత్తుకొనెను. సోదరునితో కలియుసమయమున ఆ ప్రభుశోభను వర్ణించుట నాతరముగాదు. ప్రేమవాత్సల్యములు ఆకృతిదాల్చినట్లుండెను. దయానిధియైన స్వామి భరతుని కుశలప్రశ్నలడిగెను. కాని ఆనందపారవశ్యముచే భరతునినోట మాట రాలేదు (శివుడు పల్కుచున్నాడు) పార్వతీ! వినుము. భరతుని సుఖము (ఆనందము) మనోవాక్కులకు అతీతము. అది అనుభవైకవేద్యము. భరతుడు పలికెను "కోసలాధీశా! నన్ను ఆర్తునిగా గుర్తించి, దర్శనమొసంగినారు. కావున నేను ఇప్పుడు కుశలినే. విరహసముద్రములో మునిగిపోవుచున్న నన్ను కృపాళువులై మీరు చేయూతనిచ్చి కాపాడితిరి!! (రా.మా. ఉ.కాం. దో.4. ఛంద్ 1-2)

అక్రూరుడు అభిమానప్రతిష్ఠలను వదలిపెట్టి, భగవంతుని చరణకమలముల జాడలు పడిన (అడుగులు పడిన) ధూళియందు పొర్లుచుండెను. ఆయనకు పరమాత్మునియొక్క ప్రత్యక్షదర్శనము లభించెను.

పదాని తస్యాఖిలలోకపాలకిరీటజుష్టామలపాదరేణోః ।
దదర్శ గోష్ఠే క్షితికౌతుకాని విలక్షితాన్యబ్జయవాంకుశాద్యైః ॥
తద్దర్శనాహ్లాదవివృద్ధసంభ్రమః
ప్రేమ్ణోర్ధ్వరోమాశ్రుకలాకులేక్షణః ।
రథాదవస్కంద్య స తేష్వచేష్టత
ప్రభోరమూన్యంఘ్రిరజాంస్యహో ఇతి ॥
దేహంభృతామియానర్థో హిత్వా దంభ భియం శుచమ్ ।
సందేశాద్యో హరేర్లింగదర్శనశ్రవణాదిభిః ॥
(శ్రీమద్భా. 10/38/25, 26, 27)

రాజా! లోకపాలకులందరు తమతమ కిరీటములచే శ్రీకృష్ణుని విమలపాదరేణువులను సేవించుచుందురు. అక్రూరుడు గోష్ఠమున

మహాత్ముడగు ఆ శ్రీకృష్ణునిచరణములను చూచెను. అవి పద్మయ వాంకుశాదులచే చిహ్నితములు, పృథ్వికి అలంకారరూపములు. అప్పుడీపాదపద్మ దర్శనముచే ఆయన ఆనందమునకు అవధులు లేకుండెను. ఆయనమనస్సున సంభ్రమము అనగా చాంచల్యము కలిగెను. ప్రేమపారవశ్యముచే శరీరము గగుర్పాటు చెందెను. అశ్రుబిందువులచే నయనములు కప్పివేయబడెను. అప్పుడు ఆయన రథమునుండి దిగి "ఆహా! ఇవి ఆ ప్రభువుయొక్క పాదపద్మములముద్రలు పడిన ధూళి రేణువులు" అని పలికి వానిపై పొర్లాడెను. రాజా! దేహధారులు గురూపదేశమును అనుసరించి, దంభమును, భయమును, శోకమును వీడవలెను. పరమాత్ముని యొక్క దివ్యరూపమును దర్శింపవలెను - ఆయనగుణములను శ్రవణము చేయవలెను. అక్రూరునివలె ఆ స్వామిని సేవించినచో ఆయనవలె మనము గూడ దైవానుగ్రహమునకు పాత్రులము అగుదుము.

గోపికలవిశుద్ధమైన ప్రేమభావమును చూచి ఉద్ధవుడు జ్ఞానమును, యోగాభిమానమును పరిత్యజించెను. ఆయనవలె ప్రేమ విహ్వలుడైనవానికి భగవంతుడు సాక్షాత్కరించును.

రుక్మిణీదేవి శ్రీకృష్ణునివియోగమును భరింపలేక ఒక్కక్షణకాలమును సైతము ప్రళయముతో సమానముగ గడిపెడిది. ఆయనకొఱకు ఆమె హృదయవిదారముగ విలపించెడిది. అట్లు ఆ పరమాత్మను కలియుటకై పరితపించువారికి భగవంతుడు ప్రత్యక్షదర్శనమొసగును. మయూరధ్వజుడు మహాత్ములఆజ్ఞలను అమలుపరచుటయందు తత్పరుడు. సమయము వచ్చినప్పుడు అతడు తన కుమారునితలను ఖండించుటకు కూడ సందేహించలేదు. అట్టి ఆత్మసమర్పణము చేసికొను భక్తులకు పరమాత్ముడు తప్పక తన సాక్షాత్కారమొసగును.

శ్రీనరసీమెహతా సిగ్గును, అభిమానమును, గొప్పతనమును (ఆడంబరమును), భయమును వదలి ఆ సర్వేశ్వరుని గుణములను గానము

చేయుటయందు నిమగ్నుడై విహరించెడివాడు. అందువలన అతనికి పరమాత్ముడు ప్రత్యక్షముగా లభించెను.

"బి.ఏ", "ఎమ్.ఏ", "ఆచార్య" మొదలగు పరీక్షలకుమాదిరిగా భక్తప్రహ్లాదునివలె నవవిధభక్తి[1] రీతులు అనెడి నిజమైన పరీక్షయందు ఉత్తీర్ణుడైనవానికి భగవంతుని ప్రత్యక్షదర్శనముప్రాప్తమగును. పరమాత్ముడు కేవలము దర్శనమిచ్చుటయే కాక ద్రౌపది, గజేంద్రుడు, శబరి, విదురుడు మొదలగువారు ప్రేమతో అర్పించిన వస్తువులను ఆ స్వామి స్వయముగా స్వీకరించెను.

పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।
తదహం భక్త్యుపహృతమ్ అశ్నామి ప్రయతాత్మనః ॥

(గీత. 9/26)

నిర్మలబుద్ధితో, నిష్కామభావముతో పరమభక్తునిచే సమర్పింపబడిన పత్రమునుగాని, పుష్పమునుగాని, ఫలమునుగాని, జలమును గాని, నేను ప్రత్యక్షముగా (స్వయముగా) ప్రీతితో[2] స్వీకరింతును.

కనుక సకలజీవులు పరమప్రీతితో మిగుల ఉత్కంఠతతో ఆ దేవదేవుని దర్శించుటకు వ్యాకులతను పొందవలయును.

❖ ❖ ❖

---

1. శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్ ।
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్ ॥

(శ్రీమద్భా. 7/5/23)

పరమాత్ముడగు విష్ణువుయొక్క నామరూపగుణముల, ప్రభావాదుల శ్రవణము, కీర్తనము, స్మరణము చేయుట, పరమాత్ముని చరణసేవ చేయుట, పూజించుట, ప్రణమిల్లుట, దాసభావముచే, సఖ్యభావముచేత సేవించుట, ఆత్మసమర్పణము చేసికొనుట ఇవి తొమ్మిది విధములైన భక్తిరూపములు.

2. భక్తితో పెట్టిన పట్టెడన్నము చాలు – అని గదా! వేమన శతకము.

## 2. మర్యాదాపురుషోత్తముడగు శ్రీరామచంద్రుని గుణములు - చరిత్ర

శ్రీరామచంద్రుడు మర్యాదాపురుషోత్తముడు. ఆ పరమాత్ముని నామము, రూపము, గుణములు, లీలలు అద్భుతములు. ఆ స్వామిని ఆరాధించు వారిలోగల భక్తిప్రపత్తులు, వాటి ప్రభావములతో విలసిల్లు కథలు అమృత మయములు. వాటిని వినుట, చదువుట, మననము చేయుట మొదలగు వాటివలన మనకు మిగుల శ్రేయస్సు చేకూరును. మనము ఎల్లప్పుడును ఆ ప్రభువుయొక్క రూపమును మనస్సునందు నిలుపుకొన వలయును. ఆ దేవదేవుని గుణములను, చరిత్రలను మనస్ఫూర్తిగా తలంచుకొనుచుండ వలయును. ఆయన వచనములు ఆదర్శప్రాయములు. వాటిని పరమధర్మములనుగా తలపోయవలయును. అట్లు భావించి వాటిని ఆచరించు పుణ్యాత్ముల విషయమున ఇక చెప్పవలసినదేమున్నది? అట్టివారిని దర్శించుట, స్పృశించుట, భాషించుట అనునవి అదృష్టఫలములు. అట్టి సౌభాగ్యము గలిగిన మనుజుడు మిక్కిలి ధన్యుడు.

"మేము భగవంతుని నామమును అనేకదినములనుండి జపించు చున్నాము. ఐనను మాకు అంతగా ప్రయోజనము కలుగలేదు" - అని కొందరు సోదరులు చెప్పుచుందురు. దీనికి సమాధానము ఇట్లు చెప్పబడినది. భగవంతునినామమహిమ మిగుల అపారమైనది. దానిని ఎంత గానము చేసినను అది తక్కువయేయగును. ఆ భగవన్నామమును జపించువారికి ఆశించిన ప్రయోజనము కనిపించకపోవుటకు వారొనర్చిన [1]పది

---

1. నామాపరాధములు.

1. సత్పురుషులను నిందించుట. 2. శ్రద్ధలేనివారికి నామమహిమను చెప్పుట. 3. శ్రీమహావిష్ణువునకును, శంకరభగవానునకును మధ్య భేదబుద్ధిని కలిగియుండుట. 4. వేదముల యందు ప్రమాణబుద్ధి లేకుండుట. 5. శాస్త్రముల యందు అశ్రద్ధను చూపుట. 6. గురువునందు శ్రద్ధ చూపించకుండుట. 7. నామమాహాత్మ్యమునందు అర్థవాదమును కల్పనచేయుట. 8. శాస్త్రములు నిషేధించిన కర్మలను ఆచరించుట. 9. నామము నాధారముగ చేసికొని శాస్త్రములందు చెప్పబడిన కర్మలు పరిత్యజించుట. 10. ఇతర ధర్మములతో పరమాత్ముని నామమహిమను పోల్చుచు వాటిమధ్య తారతమ్యములను చూచుట.

నామాపరాధములే ప్రధాన కారణములు. వాటిని పరిత్యజింపవలయును. ఆ పది అపరాధములను దూరముచేసికొని జపించుటవలన శాస్త్రములలో చెప్పబడిన నామజపఫలము తప్పక ప్రాప్తించును. ఆ భగవన్నామమును అట్లు జపించువారికి ప్రత్యక్షముగా తగిన ఫలము ప్రాప్తించుననుటలో ఏమాత్రము సందేహములేదు. పూర్తిగా భక్తిశ్రద్ధలు కలిగి, ఈ విషయముల మీదనే ధ్యానముంచి అర్థవంతముగా నామమును జపించవలయును. అట్టివానికి భగవత్సాక్షాత్కారము, పరమానందము మిక్కిలి త్వరగా ప్రాప్తమగును. భగవన్నామమును జపించుచు పరమాత్ముని స్వరూపమును ధ్యానించుచుండ వలయును. అది అమృతమయము, దివ్యము. అప్పుడు అతనికి ఆ పరంధాముని దివ్యగుణప్రభావములు ప్రతిక్షణము స్మృతిపథమున మెదలు చుండును. అయితే 'వైరాది భావములతో సేవించినను దైవానుగ్రహము లభించును' - అని యనుట. ఆ దివ్యస్మృతి అపూర్వము, అనిర్వచనీయము. అది భక్తిశ్రద్ధలను, ఆనందమును కలుగచేయుచుండును. తులసీ రామాయణము నందు నామమహిమ ఇట్లు ప్రస్తావింపబడినది.

"నామస్మరణను భక్తిభావముతోగాని, వైరభావముతోగాని, క్రోధముతోగాని, అలసత్వముతోగాని ఏ రీతిగా చేసినను దాని ప్రభావమున అంతటను, అన్నింటను హితమే చేకూరును". (రా.మా. బా.కాం. దో. 27-1)

"ఐతే ఆ దేవదేవుని నామమును భక్తిశ్రద్ధలతో జపించినచో దాని ఫలితము తప్పక లభించును. కాని భక్తిశ్రద్ధలు లోపించినచో ఆ ఫలము లభించదు. 'ఇది ఎట్లు సమంజసమగును?' - అను ప్రశ్న ఉదయించును. దీనికి సమాధానముగ పెద్దలు ఇట్లు చెప్పిరి. భక్తిభావముతోగాని, వైరభావముతోగాని (భావము - కుభావము) ఏవిధముగనైనను నామజపము చేసినచో దానివలన అన్ని దిశల యందును శుభము జరుగును. ఈ విషయమును గురించి శ్రద్ధ వహించ వలయును. అట్లు శ్రద్ధ వహించనిచో ఉత్తమఫలితము ఎట్లు లభించగలదు? ఎవరైనను ఇట్లు చెప్పవచ్చును. "ఆలోచించుట ద్వారా మనము

శ్రద్ధ వహించెదము. కాని మనస్సు దీనిని స్వీకరించదు. ఈ పరిస్థితిలో మనమేమి చేయగలము?" దీనికి సమాధానము ఇట్లు చెప్పబడినది. ఇది బుద్ధికి సంబంధించినది. ఆలోచనద్వారా దృఢమైన విశ్వాసముతో ఆ దివ్యనామమును జపించుచుండవలయును. పరమాత్మునిమీద నమ్మకముండుట వలన నామముయొక్క జపప్రభావముచేత మున్ముందు సంపూర్ణమైన భక్తిశ్రద్ధలు తమంతట తాముగా కుదురుకొనగలవు. కాని అర్థవంతముగా జపమొనర్చినచో శీఘ్రముగా పరమానందము ప్రాప్తించగలదు.

"మనము ఎన్నో సంవత్సరములనుండి భగవంతుని దర్శించుటకు మందిరములకు వెళ్లుచున్నాము. కాని మనకు విశేషమైన ప్రయోజనమేమియు కలుగలేదు. దీనికి కారణము ఏమైయుండవచ్చును?" అని చాలమంది సోదరులు పలుకుచుందురు. దీనికి సమాధానముగ రెండు కారణములు చెప్పబడినవి. విశేష ప్రయోజనము ఏదియు లేదనుటకు ఈ రెండు కారణములు కన్పించును. మొదటిది శ్రద్ధాభక్తులు లోపించుట, రెండవది - పరమాత్ముని విగ్రహములను దర్శించుటలోగల రహస్యము తెలియకపోవుట. మందిరమునందు భగవంతుని దర్శించుటలోగల పరమార్థమును గూర్చి ఇట్లు చెప్పబడినది. పరమాత్ముని రూపలావణ్యములను, గుణప్రభావములను, చరిత్రలను స్మరించవలయును. మననము చేయవలయును. ఆయన చరణములకు తననుతాను సమర్పించుకొనవలయును. కాని అట్లు జరుగుటలేదు. ఆ స్వామిని దర్శించుటయందలి పరమార్థమును, ప్రభావమును తెలిసికొనుట యందు కలిగిన లోపమే దీనికి కారణము. మందిరమునకు వెళ్లి భగవంతునిస్వరూపమును, గుణములను స్మరించు చుండవలెను. ఆ దేవదేవుని ప్రార్థించవలెను. దానివలన ఆయనమధుర స్వరూపమును గూర్చిన చింతన మనస్సునందు ఎల్లప్పుడును నిలిచియుండును. ఆ పరంధాముని ఆదర్శలీలలకు, ఆజ్ఞలకు అనుగుణముగా మన ఆచరణ జరుగుచుండవలయును. అట్టివారికి ఆ పరబ్రహ్మ పరమేశ్వరుని కృపవలన మిగుల శీఘ్రముగా ప్రత్యక్షముగా శాంతి లభ్యమగును. అట్టివారు దేహమును పరిత్యజించిన తరువాత పరమగతిని పొందుటలో సందేహమునకు తావేయుండదు.

పరమాత్ముని గుణములనంతములు. వాటి నెవ్వరును వర్ణింపజాలరు. ఆ పరమేశ్వరుడు జీవులను కరుణించుటకే అవతరించుచుండును. ఆయన చేయు లీలలను గూర్చి విని, గానము చేయుచు వాటిని అనుసరించెడి జీవులకు పరమశ్రేయస్సు లభించును. మర్యాదాపురుషోత్తముడైన పరమాత్ముడగు శ్రీరామచంద్రునియొక్క అవతారము ఆయనయొక్క అపారమైన దయతో కూడినదే. ఆయనగుణములను, ప్రభావమును, ఆచరణమును లీలలు మొదలగువాటి మహిమలను శేషుడు, మహేశ్వరుడు, గణేశ్వరుడు, సరస్వతీదేవి కూడ గానము చేయలేరు. అట్టిఎడల నావంటి సాధారణమనుష్యులు ఏమిచెప్పగలరు? అయినప్పటికిని సజ్జనులు, మహానుభావులు ఆ ప్రభువును గూర్చి ఆయనగుణముల మాహాత్మ్యములను గుఱించి శాస్త్రములలో గానముచేసి, తమవాణిని పవిత్రమొనర్చుకొనిరి. వాటి నాధారముగ చేసికొని బాలకుని (సామాన్యుని) వలె నేను కూడ కొంత చెప్పుటకు సాహసించు చున్నాను.

పరమాత్ముడగు శ్రీరామచంద్రుని గుణములు, చరిత్రయు మిగుల ఆదర్శప్రాయములు. వాటి ప్రభావము నిరుపమానమైనది. ఆయన గుణముల ముందు మనము ఒక లెక్కలోనివారము కూడ కాము. ఆ ప్రభువు అయోధ్యను పరిపాలించు సమయమున ఆ దేవదేవునిగుణములయొక్క ప్రభావము ప్రజలమీద మిగుల ఆశ్చర్యమును గొల్పునదిగా ఉండెను. దానిని పరిశీలించి చూచినచో ఆ సత్యయుగమునందలి దైవప్రభావము త్రేతాయుగము నందలి రామరాజ్య ప్రభావమే ప్రజలపై ఎక్కువగా నుండెను.

రామరాజ్యమునిట్లు వర్ణించిరి -

"రామరాజ్యమునందు ప్రజలందఱును తమతమ వర్ణాశ్రమ నియమములను అనుసరించి, ధర్మతత్పరులై యుండిరి. వేదమార్గమున సంచరించుచు సుఖులైయుండిరి. భయము, రోగము, శోకము అనునవి వారికి తెలియకుండెను. శ్రీరాముని పాలనమున ఎవ్వరును దైవిక, దైహిక, భౌతిక, తాప (త్రయ) ములకు లోనుకాకుండిరి. జనులెల్లరును పరస్పర

ప్రేమానురాగములతో వేదోక్త నీతిమార్గ తత్పరులై తమ తమ ధర్మములను, నిర్వహించుచుండిరి. ధర్మము నాలుగు పాదములపై (సత్యము, శౌచము, దయ, దానము - అనువానిపై) పరిపూర్ణముగ నడచుచుండెను. స్వప్నములోనైనను పాపమనునదియే కానరాకుండెను. స్త్రీ పురుషులు రామభక్తిలో లీనమైయుండిరి. రామానుగ్రహమున అయోధ్యావాసులు అందఱును పరమపదమునకు పాత్రులై ఉండిరి. ప్రజలెవ్వరును అకాల మృత్యువునకు గుఱికాకుండిరి. ఎవ్వరికిని ఎట్టి బాధలును లేకుండెను. అందఱి శరీరములును స్వాస్థ్యము, సౌందర్యము కలిగియుండెను. రామ రాజ్యమున దరిద్రులు, దీనులు, దుఃఖితులు, మూర్ఖులు, శుభలక్షణ హీనులు ఏమాత్రము లేకుండిరి. అందఱును నిరాడంబరులై ధర్మపరాయణులై పుణ్యాత్ములై యుండిరి. స్త్రీ పురుషులెల్లరును నీతి నిపుణులు, గుణవంతులు. గుణములను సముచితముగ ఆదరించెడివారు. వారు పండితులు, జ్ఞానులు, కృతజ్ఞులు, కపటము నెఱుగని వారు." (రా.మా. ఉ.కాం. దో. 20)

అందఱును ఉదారగుణసంపన్నులు, పరోపకార పరాయణులు, బ్రాహ్మణులను సేవించుచుండెడివారు. మనసా వాచా కర్మణా ఏకపత్నీ వ్రతులు. స్త్రీలందఱును పరమపతివ్రతలు. ఈశ్వర భక్తియందు సాక్షాత్తుగా భక్తియు, ధర్మమును మూర్తిమంతములై వారిలో నివసించుచున్నవా అనునట్లు పరమేశ్వర భక్తియందు, ధర్మమునందు స్త్రీ పురుషులందరు నిరతులై యుండెడివారు. పశువులు, పక్షులు సకలమును చక్కగా, సుఖముగా జీవించుచుండెడివి. భూమి పచ్చదనముతో (సస్యశ్యామలమై) అలరారు చుండెను. వృక్షములు అన్ని ఋతువులయందును ఫలపుష్పములతో శోభలొలుకుచుండెను. సూర్యచంద్రాది దేవతలు అడుగకుండగనే సుఖప్రదములగు సకల వస్తువులను ప్రసాదించుచుండిరి. దేశమంతయు సుఖసంపదలతో విరాజిల్లుచుండెను. సీతామతల్లియు, లక్ష్మణ భరత శత్రుఘ్నులు (ముగ్గురు సోదరులును), ప్రజలందరును పరమాత్ముడగు శ్రీరాముని సేవించుటయే తమ పరమసౌభాగ్యమని తలంచుచుండిరి. ఆ స్వామి కూడ వారికి హితమును చేకూర్చుటయందే నిరతుడై యుండెడివాడు.

రామరాజ్యమునందలి ఈ చక్కని వ్యవస్థ మిగుల ఆదర్శప్రాయమైనది. నేడు కూడ ప్రపంచమునందలి ఏ రాజ్యమును ప్రశంసించవలసి వచ్చినను ఆదర్శప్రాయమని చెప్పవలయునన్నను అన్నిటికంటె గొప్పదని మెచ్చుకొనవలసినను అట్టిదానికి రామరాజ్యమునే ఉదాహరణముగా చెప్పుదురు.

రామరాజ్యము శ్రీరాముని గుణగణములచేత ప్రభావితమైనది. ప్రజల ప్రవర్తన, జీవన విధానము, వారి గుణగణములను, పరమపావనమగు వారి చరిత్రను ఊహించుకొనినచో భక్తిపారవశ్యమున హృదయము గగుర్పాటు చెందును. భగవంతుని గుణములు అనంతములు. ఆయన చరిత్రములు పరమపవిత్రములు. వాటిని ఏ కొంచెమైనను స్మరించినను, మననము చేసికొనినను అవి పరమశ్రేయోదాయకములగును, పరమపావనములగును. ఈ ఉద్దేశ్యముతో ఇచట ఆ ప్రభువుయొక్క కొన్ని గుణములు మిక్కిలి సంక్షిప్తముగ వర్ణించబడుచున్నవి.

## గురుభక్తి

మహాత్ముడగు శ్రీరామచంద్రునియొక్క గురుభక్తి మిగుల ఆదర్శవంతమైనది. ఆ స్వామికి గురువు ఎడలగల గౌరవభావము, విశ్వాసము ఎనలేనివి. గురువును సేవించుటయందు ఆ ప్రభువునకు కలిగెడి ఆనందము, సంభాషించునపుడు ఆయన వినయసంపద కొనియాడదగినవి. పైన పేర్కొనిన ఆదర్శములు శ్రీరామునిగురుభక్తియందు చక్కగా ప్రకటితములగు చుండును. వసిష్ఠమహర్షి ఆయనకు విద్యనేర్పిన గురువు. అవతారపురుషుడైన శ్రీరాముడు సకలవిద్యలకు నిధి. ఐనను లోకమర్యాదను అనుసరించి ఆ స్వామి ఆయననుండి సమస్త విద్యలను గ్రహించెను.

సోదరులగు రామలక్ష్మణులిరువురును విశ్వామిత్రమహర్షివెంట జనకుని పురమునకు వేంచేసిరి. వారు గురువుగారి అనుమతినిపొంది మిథిలానగరము యొక్క అందచందములను చూచుటకు బయలుదేరిరి. ఈ నెపముతో వారు

ఆ నగరమునందలి స్త్రీ పురుషుల నేత్రములకు తమ దర్శనభాగ్యమును కలుగచేసి వారినానందింపజేసిరి. శ్రీతులసీదాసు ఇట్లు చెప్పెను.

"బాలురు రామచంద్రునకు ధనుర్యాగశాలను చూపించిరి. వారు తమపై ప్రదర్శించు అనురాగములకు సంతుష్టులై రామలక్ష్మణులు వాటిని అత్యాశ్చర్యముతో తిలకించుచుండిరి. ఈ విధముగా రంగభూమియందలి చిత్రముల నన్నింటిని చూచినపిదప తమ ఆలస్యమునకు గురువుగారు కోపగింతురేమో అని భయపడుచు ఆ మహర్షియొద్దకు చేరిరి. భయమునకే భయమును గొలుపు ఆ ప్రభువు ఇట్లు తన భక్తిని ప్రకటించెను. సోదరు లిరువురును భయము, ప్రేమ, వినయసంకోచములతో గురువుగారికి పాదాభివందనముల నాచరించి కూర్చొనిరి."(రా.మా. బా.కాం. 224/3,4, 225)

"విశ్వామిత్రుడు శయనింపగా రామలక్ష్మణులు ఆయనకు పాదసేవ లొనర్చిరి. గురువులయెడ వారికిగల భక్తిశ్రద్ధలు అపూర్వములు."

(రా.మా. బా.కాం. 225/3)

వసిష్ఠమహర్షి వారికి కులగురువు. గురువులకు అన్నివిధములగు సేవలొనర్చుటయే తమ పరమసౌభాగ్యమని వారు భావించెదరు. వనమునందు వసిష్ఠమహాముని భరతుని పక్షమువహించి భగవంతునితో (రామునితో) ఇట్లు చెప్పెను.

"నీవు అందరి హృదయములలో అంతర్యామివై ఉందువు. వారి మంచిచెడు భావములను కూడ ఎఱుంగుదువు. పురవాసులకును, తల్లులకును, భరతునకును శుభప్రదమైన ఉపాయమును తెలుపుము."

(రా.మా. అయోధ్యా. దో. 257)

అప్పుడు శ్రీరామచంద్రుడు భరతునియెడల గురువుగారికిగల స్నేహవాత్సల్య ములకు ముగ్ధుడయ్యెను. పిదప ఆ స్వామి భరతునిసౌభాగ్యమును కొనియాడుచు ఇట్లు పలికెను.

"భరతునితో సమానుడైన సోదరుడు ఎవ్వడును లేడు. గురుచరణ

కమలములను ప్రేమించువానిని లోకములు, వేదములును భాగ్యవంతునిగా గౌరవించును. అంతేకాక మీ అనురాగమునకు నోచుకొనిన భరతుని భాగ్యమును ఎవరు కొనియాడగలరు?" (రా.మా. అయోధ్యా. దో.258)

ఇదే ప్రసంగమున రామచంద్రుడు వసిష్ఠమహర్షితో ఇట్లు చెప్పెను.

"మునీశ్వరా! ఉపాయమును మీరే తెలుపవలయును. మీ కోరికను నెరవేర్చుచు మీ ఆజ్ఞను పాలించుటలోనే అందరికిని మేలు చేకూరును. మీ నిర్ణయమును నేను శిరసావహించెదను". (రా.మా. అయోధ్యా. దో.257)

ఒకసారి వసిష్ఠమహర్షి శ్రీరామునిచరణకమలములయందు తనకుగల భక్తివిశ్వాసములు జన్మజన్మాంతరముల వరకును స్థిరముగా నుండవలెనని" వరమును అడుగుటకై ఆ ప్రభువు కడకు వచ్చెను. ఆ పరమాత్ముని ఒంటరిగా కలిసికొనెను. ఆ సమయమునకూడ మర్యాదాపురుషోత్తముడగు రఘురాముడు ఉదాత్తమైన తన గురుభక్తిని ప్రకటించెను.

"రఘునాథుడు ఆయనను మిక్కిలి ఆదరముతో గౌరవించి ఆయన కాళ్ల కడిగి ఆ పాదోదకమును గ్రోలెను." (రా.మా. ఉ.కాం. దో. 47)

## పితృభక్తి

మర్యాదాపురుషోత్తముడగు రామచంద్రుని పితృభక్తి సాటిలేనిది. తండ్రిగారు స్వయముగా, వనవాసమునకు ఆజ్ఞాపింపకున్నను సూత్రప్రాయముగా ఆయన భావమును గ్రహించి శ్రీరాముడు మిగుల సంతోషించెను. అప్పుడు అతడు పదునాలుగు సంవత్సరములు వనవాసము చేయుటకు నిశ్చయించుకొనెను. అయోధ్యా రాజ్యమును పరిత్యజించెను. ఆయనను వనములకు వెళ్లుమని స్పష్టముగా (మాటలతో) దశరథమహారాజు ఆజ్ఞాపించలేదు. తండ్రిగారు మౌనము వహించియుండుటతో అది అంగీకారసూచనయేయని కైకేయి మాతద్వారా శ్రీరాముడు గ్రహించెను. ఆయన దానిని (మౌనమును) తండ్రిగారి ఆజ్ఞగా స్వీకరించెను. వనవాసము అతికష్టముతో కూడిన పని. ఐనను దానిని అతడు తనకు లభించిన వరముగా తలంచి అందులకు శిరసావహించెను. తల్లి కైకేయి ఏమాత్రము కనికరము చూపక

అన్నివిషయములను మిగుల కఠోరముగా శ్రీరామునకు తెలిపెను. కాని రామచంద్రుడు మాత్రము వాటినన్నిటిని మిగుల సంతోషముతో స్వీకరించెను. వినయముతో కూడిన ఆ స్వామి మాటలు, వనములకు వెళ్లుటకు ఆ ప్రభువు చూపిన ఉత్సాహము మిగుల కొనియాడదగినవి. పిమ్మట ఆయన ఇట్లు పలికెను.

"రాజాజ్ఞఐనచో అగ్నిలోనైన దూకెదను. నా తండ్రియే నాకు గురువు, పాలకుడు, హితుడు అన్నియును. అతడాదేశించినచో తీవ్రమైన విషమును సహితము త్రాగెదను. అగాధమైన సముద్రమునందైనను పడిపోయెదను".

(రా.మా. అయోధ్యా. దో.18/28,29)

తులసీ రామాయణమునందిట్లు చెప్పిరి.

"మాతా! వినుము! మాతాపితరుల ఆజ్ఞలను పాలించుటయందు అనురాగముగల పుత్రుడే నిజముగ భాగ్యశాలి. జననీ! తలిదండ్రులను సంతృప్తిపరచు పుత్రుడు ప్రపంచములో దుర్లభుడు. వనములో గూడ నాకు అన్నివిధముల మేలే జరుగును. అక్కడ ముఖ్యముగా మునులతో సమాగమ మగును. పైగా మీరు చెప్పినట్లు ఇది మా తండ్రిగారి ఆజ్ఞ. దీనికి మీ సమ్మతియు కలదు. నా బహిఃప్రాణమైన భరతుడు రాజ్యమేలును. విధాత నేడు నాకు అంతయును అనుకూలముగనే చేయుచున్నాడు. ఇట్టి పరిస్థితులలో కూడ వనములకు పోనిచో నేనొక మహామూర్ఖుడనే అగుదును".

(రా.మా. అయోధ్యా. దో.40)

తల్లి కౌసల్య అనుమతిని, ఆశీర్వాదమును పొందుటకు రామచంద్రుడు ఆమె దగ్గఱకు వెళ్లెను. ఆ విషయమును విని ఆ తల్లి మిగుల దుఃఖించెను. తన దుఃఖమును వినిపించి ఆయనను వనములకు వెళ్లుటనుండి ఆపదలచెను. అప్పుడు ఆ మహానుభావుడిట్లు పలికెను.

నాస్తి శక్తిః పితుర్వాక్యం సమతిక్రమితుం మమ ।
ప్రసాదయే త్వాం శిరసా గంతుమిచ్ఛామ్యహం వనమ్ ॥

(వా.రా. అయోధ్యా. 21/29)

"అమ్మా! తండ్రి ఆజ్ఞను జవదాటుటకు నేను అశక్తుడను. నీకు శిరసా ప్రణమిల్లుచున్నాను. నేను వనములకు వెళ్లుటకే సిద్ధముగా ఉన్నాను. దయతో అనుమతింపుము".

ఇదేవిధముగా రామచంద్రప్రభువు ధర్మముయొక్క మహత్త్వమును లక్ష్మణునకును తెలిపెను. పిమ్మట పెద్దల ఆజ్ఞలను పాలించుటవలన కలిగెడి మహిమను వచించుచు అతనితో ఇట్లనెను.

ధర్మో హి పరమో లోకే ధర్మే సత్యం ప్రతిష్ఠితమ్ ।
ధర్మసంశ్రితమేతచ్చ పితుర్వచనముత్తమమ్ ॥

సోఽహం న శక్ష్యామి పితుః నియోగమతివర్తితుమ్ ।
పితుర్హివచనాద్వీర కైకేయ్యాఽహం ప్రచోదితః ॥

(వా.రా. అయోధ్యా. 21/40, 42)

"లోకమున పురుషార్థములలో ధర్మము అగ్రగణ్యము (ప్రధానము) సత్యమునకు ధర్మమే ఆధారము. అత్యుత్తమైన ఈ పితృాజ్ఞ ధర్మసమ్మత మైనది. ధర్మబద్ధుడనైన నేను తండ్రి ఆజ్ఞను జవదాటజాలను. ఓ వీరా! మన తండ్రి చేసిన వాగ్దానమును అనుసరించియే కైకేయి నాకు వనవాసమును విధించినది".

సత్యః సత్యాభిసంధశ్చ నిత్యం సత్యపరాక్రమః ।
పరలోకభయాద్భీతో నిర్భయోఽస్తు పితా మమ ॥

(వా.రా. అయోధ్యా. 22/9)

"పరలోకభీతికలవాడైన నాతండ్రి ఆడినమాట తప్పనివాడై, అమోఘ పరాక్రమశాలియై, సత్యవచనుడగుటచే నిర్భయముగ జీవించుగాక!"

శోకముతో కుమిలిపోవుచున్న తన తండ్రితో రఘురాముడిట్లు వచించెను. "మహారాజా! ఇంతచిన్న విషయమునకు మీరింతగా ఎందుకు దుఃఖించు చున్నారు? ఇంతవరకును ఈ విషయమును నాకెవ్వరును తెలుపలేదు. ప్రభూ! మిమ్ము ఈ స్థితిలో చూచితిని. దీనికి కారణమును కైకేయిమాతను అడిగితిని.

ఆమె ద్వారా విషయములన్నింటిని తెలిసికొంటిని. నాకు మిగుల సంతోషము కలిగినది. సుఖవాయుస్పర్శచే వలె నా అవయవములన్నియును చల్లని సౌఖ్యములనుభవించినవి. నాకు మిగుల శాంతిసమకూరినది. కనుక ఇది శుభమును కలిగించు సమయము. బాధను వదలివేయుడు. నిండుమనస్సుతో సంతోషముగా నన్ను ఆజ్ఞాపింపుడు". ఇట్లు చెప్పుచుండగనే శ్రీరామచంద్రుని అంగములన్నియు హర్షాతిరేకమున పులకితములయ్యెను.

(రా.మా. అయోధ్యా. 44/4 దో.45)

ఆ పరంధామునిపితృభక్తి మిగుల ధన్యమైనది. స్నేహపరవశుడై సత్యసంధుడగు దశరథమహారాజు శ్రీరాముని స్మరించుచునే శరీరమును పరిత్యజించెను.

## మాతృభక్తి

ఆ శ్రీరాముని మాతృభక్తి మహోన్నతమైనది. జన్మనిచ్చిన తల్లి యెడల ప్రభువునకు గల ఆదరభావము మహత్తరమైనది. తల్లి కైకేయి ఆ స్వామితో కఠోరవచనములు పలికినది. ఆయనను అడవులకు పంపినది. అయినప్పటికిని కౌసల్యామాతమీద ఆయనకున్న గౌరవభావముకంటే కైకేయిమాతమీద ఆ ప్రభువునకు గల ఆదరభావము మిక్కుటము. అది ఆ మహానుభావుని లీలావిలాసము, వైశిష్ట్యము. కౌసల్యాదేవి ఆయనతో "తండ్రి ఆజ్ఞకంటె తల్లి ఆనతి శ్రేష్ఠమైనది. కనుక నీవు వనములకు వెళ్లవలదు" అని పలికెను. అప్పుడా స్వామి తల్లి కైకేయి ఆజ్ఞను తెలిపెను. (కైకేయియును తల్లియే కదా!) అప్పుడా జనని కౌసల్యాదేవి రామచంద్రుని మాటలకు మారుపలుకజాలకపోయెను. పిదప ఆమె ఇట్లు పలికెను.

'నాయనా! తల్లిదండ్రులిద్దరును నిన్ను వనములకు పొమ్మనినచో అడవులే వంద అయోధ్యలతో సమానము'. (రా.మా. అయోధ్యా. 55-1)

కైకేయికూడ భరతునివెంట శ్రీరాముని కడకు అడవులకు వెళ్లెను. రామచంద్రుడు అందరి కంటె ముందు ఆ తల్లినే కలిసెను. ఆమెకు అన్నివిధములుగా నచ్చజెప్పి ఆమె సంకోచమును తొలగించెను.

"రామచంద్రుడు మొదట కైకేయిని దర్శించి ఆమెకు ప్రణమిల్లెను. తన సరళ స్వభావమును ప్రకటించి భక్తిప్రపత్తులతో ఆమె మనోవ్యథను చల్లార్చెను. ఆమెను ఊరడించెను. కాలకర్మ విధివైపరీత్యములను దోషులనుగా పేర్కొనెను". (రా.మా. అయోధ్యా. 243-4)

ఒకనాడు లక్ష్మణుడు పంచవటియందు మాట్లాడుచు భరతుని గొప్పదనమును పేర్కొనెను. తల్లి కైకేయిని నిందించెను. అప్పుడు ఆయన ఇట్లు పలికెను.

**భర్తా దశరథో యస్యాః సాధుశ్చ భరతః సుతః ।**
**కథం ను సాఽంబా కైకేయీ తాదృశీ క్రూరశీలినీ ॥**

(వా.రా. అరణ్య. 16/35)

"సత్యసంధుడైన దశరథమహారాజునకు భార్యయయ్యును,, ధర్మనిరతుడైన భరతునకు తల్లియయ్యును కైకేయి ఇట్టి క్రూరురాలు ఎట్లైనది?"

ఇది వినుటతోడనే పరమాత్ముడగు శ్రీరాముడు ఇట్లు పలికెను.

**న తేఽంబా మధ్యమా తాత గర్హితవ్యా కథంచన ।**
**తా మేవేక్ష్వాకునాథస్య భరతస్య కథాం కురు ॥**

(వా.రా. అరణ్య. 16/37)

నాయనా! లక్ష్మణా! పినతల్లియైన కైకేయిని ఎట్టి పరిస్థితిలోను ఇట్లు నిందింపదగదు. ప్రస్తుతము కోసలరాజ్యమును పాలించుచున్న భరతుని గూర్చి మాట్లాడుము.

**ఇతి బ్రువాణం రాజానం రామః ప్రాఞ్జలిరబ్రవీత్ ।**
**కురు ప్రసాదం ధర్మజ్ఞ కైకేయ్యా భరతస్య చ ॥**

**సపుత్రా త్వాం త్యజామీతి యదుక్తా కేకయీ త్వయా ।**
**స శాపః కేకయీం ఘోరః సపుత్రాం న స్పృశేత్ ప్రభో ॥**

(వా.రా. యు.కాం. 122/24, 25, 26)

తండ్రియగు దశరథమహారాజునకు అంజలి ఘటించి రఘురాముడు ఇట్లు నుడివెను. "ధర్మాత్మా! కైకేయితల్లి ఎడలను భరతునిపైనను అనుగ్రహము చూపుము. నీవు ఇంతకు ముందు ఆ దేవితో 'నిన్ను, నీ పుత్రుడైన భరతుని కూడ త్యజించుచున్నాను' - అని ఆగ్రహవచనములను పలికియుంటివి. ఘోరమైన ఆ శాపము వారిరువురిని తాకకుండుగాక!".

అయోధ్యకు తిరిగివచ్చినప్పుడు కూడ రామచంద్రుడు మొదట తల్లి కైకేయినే కలిసెను. అన్నివిధముల నచ్చజెప్పి ఆ తల్లిని సంతోషపరచెను. మాతృభక్తికి ఇంతకుమించిన ఉదాహరణములేమి ఉండును?

## సోదరప్రేమ

మర్యాదాపురుషోత్తముడగు శ్రీరాముని సోదరప్రేమ సాటిలేనిది. ఆ స్వామి సోదరప్రేమను ఆదర్శముగా గైకొనినచో ఈ జగత్తునందు ఎచ్చటను కలహములే ఉండవు. సోదరులయందు పరస్పరము శాంతి విరాజిల్లుచుండును. ఆ ప్రభువు చిన్నతనమునుండియు తన సోదరులను ముగ్గురిని మిక్కిలి ప్రేమించుచుండెడివాడు. వారినెల్లవేళల అన్నివిధముల చక్కగా చూచుకొనెడి వాడు. వారికి సుఖములను గూర్చుటకును, ప్రసన్నులునుగానుంచుటకును ప్రయత్నించెడివాడు. అప్పుడప్పుడు ఆటలయందు వారిని గెలిపించుటకు తాను ఓడిపోవుచుండెడివాడు. ఎల్లవేళలలోను తన ముగ్గురు సోదరులతో కూడియే భోజనము చేయుచుండెడివాడు. నలుగురి వివాహములు కూడ ఒక్కసారియే జరిగినవి.

దశరథమహారాజు శ్రీరాముని రాజ్యాభిషేకమునకు ఏర్పాట్లను గావించెను. ఆ వార్తను విని శ్రీరాముడు మిగుల దుఃఖించెను. అప్పుడు ఆయన పశ్చాత్తాపమును చెందుచు ఇట్లు పలికెను.

"నేను, నా సోదరులును ఒకే సమయమున జన్మించితిమి. బాల్యమున కలిసి తింటిమి, నిద్రించితిమి, ఆడుకొంటిమి. కర్ణవేధము, ఉపనయనము, వివాహము మున్నగు సంస్కారము లన్నియును అందఱికిని ఒకే సమయమున జరిగినవి. సోదరులందరిని వీడి, పెద్దవానికి ఒక్కనికే యువరాజ పట్టాభిషేకము

చేయుట నిర్మలమైన ఈ సూర్యవంశమున అనుచితకార్యము అనెడి విచికిత్సకు లోనయ్యెను." (రా.మా. అయోధ్యా. దో. 9-3,4)

యువరాజ పట్టాభిషేక ప్రస్తావన రఘురామునకు మిగుల అనుచితమని తోచెను. అది తండ్రిగారి ఆజ్ఞ. ఆయన ప్రజల హితము కొఱకును, సోదరులను ప్రసన్నులనుగా చేయుటకొఱకును తాను ఈ రాజ్యాభిషేకమునకు అంగీకరించెను. ఆ మహానుభావుడు తాను వనములకు వెళ్లునపుడు, భరతునకు రాజ్యము లభించినందులకు మిక్కిలి ఆనందించెను. వనమునందు ఆ పరంధాముడు లక్ష్మణునితో స్పష్టమైన రీతిలో ఇట్లు నుడివెను.

ధర్మమర్థం చ కామం చ పృథివీం చాపి లక్ష్మణ ।
ఇచ్ఛామి భవతామర్థే హ్యేతత్ ప్రతిశృణోమి తే ॥

భ్రాతౄణాం సంగ్రహార్థం చ సుఖార్థం చాపి లక్ష్మణ ।
రాజ్య మప్యహమిచ్ఛామి సత్యేనాఽఽయుధమాలభే ॥

యద్వినా భరతం త్వాం చ శత్రుఘ్నం చాపి మానద ।
భవేన్మమ సుఖం కించిత్ భస్మ తత్ కురుతాం శిఖీ ॥

(వా.రా. అయోధ్యా. 97/5, 6,8)

"ఓ లక్ష్మణా! ధర్మార్థకామములనుగాని, కడకు ఈ రాజ్యమునుగాని మీ అందఱి నిమిత్తముగనే కోరుచున్నాను. ఈ మాటను నేను నీ ముందు శపథముచేసి చెప్పుచున్నాను. నేను సోదరుల కొఱకే ధనమును సంపాదింతును. ఈ రాజ్యమునైనను వారి సుఖము కొఱకే కోరుచున్నాను. నా ఆయుధములమీద ఒట్టుపెట్టుకొని చెప్పుచున్నాను. ఓ మానదా! భరతునకును, నీకును శత్రుఘ్నునకును లేని సుఖము నాకుమాత్రము ఎందులకు? అది కాల్పనా?"

శ్రీరాముడు లక్ష్మణునిఎదుట భరతుని ఎంతగానో ప్రశంసించెను. కాని ఆ స్వామికి తృప్తికలుగలేదు. రామచరితమానసమందు

భరతునిగుణశీలస్వభావములను వర్ణించుచు శ్రీరాముడు ప్రేమ సాగరమున మునిగిపోయెను. (రా.మా. అయోధ్యా. దో.231-4)

భరతుడు చిత్రకూటమునకు వెళ్లెను. రాజ్యమును స్వీకరించుమని అతడు పరమాత్ముఁడగు రామచంద్రుని మిగుల ప్రార్థించెను. అప్పుడా ప్రభువు ఇట్లు నుడివెను. "నాయనా! భరతా! వినుము. మహారాజుగారు సత్యమును పరిరక్షించుటకై నన్ను త్యజించిరి. నాపైగల ప్రేమకారణముగ ప్రాణములనే త్యజించిరి. అట్టి తండ్రిగారిమాటను జవదాటినచో మనస్సు బాధపడును. అన్నిటికంటెను ఎక్కువగా నా మనస్సులో నీ గుఱించియే చింతకలదు. వీటన్నిటికంటెను ముఖ్యమైనది గురువుగారి ఆజ్ఞ. కావున నీవేది చెప్పినను దానిని నేను తప్పక చేయుదును."

"ప్రశాంతచిత్తుడవై సంకోచమును వీడి నేనేమి చేయవలయునో తెలుపుము. దానిని నేను నెరవేర్చెదను". సత్యసంధుడైన శ్రీరామునిమాటలను విని సభాసదులు ప్రసన్నచిత్తులైరి. (రా.మా. అయోధ్యా. 264)

భరతుడు కూడ ఆ శ్రీరామునకు సోదరుడే కదా! ఆయన తన స్వామిని సంకోచములో ఉంచుట అనుచితమని తలంచెను. సందేహమును వదలి ఆయననే ఆజ్ఞాపింపుమని నుడివెను. కాని శ్రీరామునిసోదరప్రేమ ఇచట పరాకాష్ఠకు చేరినది. ఆ ప్రభువు తనకు జన్మనిచ్చిన తల్లియొక్క వచనములను అంగీకరించలేదు. ఆయన వనములకు వెళ్లెను. కాని భరతునితో "నీవు ఏమి చెప్పినను దానిని చేయుటకు నేను సంసిద్ధుడ" నని తెలుపుచున్నాడు.

రాఘవేంద్రుడు తండ్రిగారి ఆజ్ఞను నిమిత్తముగ చేసికొనెను. వసిష్ఠుడు, జనకుడు మొదలగు గురుజనములకు, భరతునకు నచ్చజెప్పి, ఆ స్వామి వారికి సంతోషమును ప్రసాదించెను. చివరకు ఏదో ఒకవిధముగ రాజ్యపాలనా భారమును భరతునకు అప్పగించెను. రాజ్యమును, భోగానుభవములును తుచ్ఛములని ఆ పరమాత్ముఁడిచట తన ప్రవర్తనచేత ప్రత్యక్షముగ ఋజువు చేసెను. ఈ విధముగా ఆ ప్రభువు ఒక మహత్తరమైన గొప్ప ఆదర్శమును నెలకొల్పెను. భరతుడు త్యాగమూర్తి. ఆయన శ్రీరామచంద్రప్రభువుయొక్క ఆజ్ఞను శిరసావహించెను. కేవలము రాజ్యపాలమునే స్వీకరించెనుగాని రాజ్యమును కాదు. ఇది గమనింపదగినది, ఇది మహోన్నతమైన ఆదర్శము. చంపకవనమునందు తుమ్మెద నివసించినట్లుగా భరతుడు పదునాలుగు

సంవత్సరముల గడువువరకు అయోధ్యారాజ్య సుఖభోగములయందు నిర్లిప్తుడై యుండెను - "చంచరీక జిమి చంపక బాగా".

రావణుడు ప్రయోగించిన శక్తి అను బాణము లక్ష్మణస్వామికి తగిలెను. దానిదెబ్బకు ఆయన స్పృహతప్పిపడిపోయెను. ఆ సమయమున రామచంద్రుని పరితాపస్థితి ఆయన సోదరప్రేమకు మిక్కిలి చక్కని ఆదర్శము. అప్పుడు ఆయన ఇట్లు రోదించెను.

పరిత్యక్ష్యామ్యహం ప్రాణాన్ వానరాణాం తు పశ్యతాం ।
యది పంచత్వమాపన్నః సుమిత్రానందవర్ధనః ॥
(వా.రా. యు.కా. 49/7)

"సుమిత్రామాతకు ప్రియసుతుడైన సౌమిత్రి మృతిచెందుట నిజమేయైనచో వానరుల సమక్షముననే నేను నా ప్రాణములను త్యజింతును. లక్ష్మణుడు లేకుండ నేను అయోధ్యకు చేరినచో కొడుకు రాక కొఱకై వేయి కనులతో ఎదురుచూచుచున్న సుమిత్రామాతకు ఏమని సమాధానము చెప్పగలను?"

ఇచట రఘురాముడు విలపించుటను గోస్వామి తులసీదాసు ఇట్లు వర్ణించెను. దీనివలన సోదరప్రేమను గూర్చిన ఒక చక్కని ప్రబోధము లభించును.

లంకను జయించిన తరువాత విభీషణుడు ఒకసారి లంకయందు తన ఆతిథ్యమును స్వీకరించి కృతార్థుని చేయుమని రామచంద్రప్రభువును ప్రార్థించెను. అప్పుడా స్వామి విభీషణునితో ఇట్లు పలికెను. "సోదరా! వినుము! నీ సంపద, భవనములు మొదలగునవి అన్నియును నావే. ఇది నిజము. కాని భరతుని స్థితి నా తలంపునకు వచ్చినపుడెల్ల ప్రతిక్షణము నాకు ఒక యుగముగ గడుచుచున్నది. తాపసి వేషములో కృశించిన శరీరముతో అతడు అనుక్షణము నా నామమునే జపించుచున్నాడు. సఖా! నేను అతనిని త్వరగా చూచెడి ఉపాయమును ఆలోచింపుము. మిత్రమా! ఇదియే నా ప్రార్థన. ఈ పదునాలుగు సంవత్సరముల అవధి ముగిసిన పిదప వెళ్ళినచో నా సోదరుని సజీవునిగా చూడలేను". తన తమ్ముడైన భరతునిప్రేమనుగూర్చి తలంచుకొనిన కొలదియు ప్రభువు శరీరము పదేపదే రోమాంచితమాయెను.

"అందరును అయోధ్యకు చేరిరి. అప్పుడు ప్రేమసముద్రము పొంగుచుండి నట్లుండెను. రామచంద్రుడు భూమిమీద పడియున్న మహనీయుడగు భరతుని బలవంతముగలేపి తన హృదయమునకు హత్తుకొనెను. ఆ స్వామి శరీరమంతయు పులకరించెను. ఆ ప్రభువుయొక్క కమలముల వంటి నయనములనుండి ప్రేమాశ్రువులు ధారగా ప్రవహించసాగెను.

(రా.మా లం.కా. దో.116 గ)

'రాజ్యాభిషేకమునకు ఏర్పాట్లు జరుగుచుండెను. దయాసముద్రుడగు శ్రీరాముడు భరతుని పిలిచి, తన మృదువైన కరకమలములతో స్వయముగా ఆతని జటాజూటమును విప్పిదువ్వెను. ఆ సమయమున రాముని హృదయమున భరతునిఎడ గూడుకట్టుకొనియున్న అపారప్రేమ ఉప్పొంగు చుండెను. పిమ్మట భక్తవత్సలుడైన రఘునాథుడు తన ముగ్గురు సోదరులకును స్నానములను చేయించెను". (రా.మా. ఉ.కాం. దో.2, 3)

శ్రీరాముడు రాజ్యమును స్వీకరించుటకూడ వాస్తవముగ సోదరులను సుఖపెట్టుటకే. ఆయన అప్పుడప్పుడు వారి కొసగు ఉపదేశములు, ఆదేశములు కూడ వారి హితముకొఱకే. సోదరులకెవరికిని, ఏ విధమైన సంకోచమూ కలుగనీయని ఆయన ప్రవర్తన మిగుల పవిత్రమైనది. ఒకసారి భరతుడు అన్నను ఏదియో అడుగవలెనని సంకల్పించెను. కాని సంకోచమునకు లోనై స్వయముగా అడుగజాలకపోయెను. దానిని ఆయన హనుమంతుని ద్వారా తెలిపెను. అప్పుడు శ్రీరాముడిట్లు నుడివెను.

"మారుతీ! నీవు నా స్వభావమును ఎరుగుదువు. నాకును భరతునకును మధ్య ఎట్టి భేదము లేదు." (రా.మా. ఉ.కాం. దో.35-3)

వారిప్రేమయొక్క ఔన్నత్యమునకు ఇంతకంటెను చెప్పవలసిన దేముండును? ఆ పరంధాముడు తన సోదరులగుణములను గానముచేయుట యందును, వారిని స్మరించుటయందే సుఖమును పొందుచుండెను.

"శ్రీరాముడు భరతుని నామమును స్మరించును. ఆయనకు భరతునితో సమానమైన ప్రీతిపాత్రుడు ఎవ్వడును లేడు." (రా.మా. అయోధ్య. దో.217/4)

హనుమంతుడిట్లు పలికెను.

"చరాచరజగత్తునకు స్వామియైన శ్రీరఘునాథుడు భరతుని గుణసమూహములనే నిరంతరము వర్ణించుచుండెను. అట్టి భరతుడు వినయమునకును, పరమపవిత్ర సద్గుణములకును నిలయుడేల కాకుండును?'

(రా.మా. ఉ.కాం. దో.1, ఛం)

ఈ విధముగా ఆ స్వామి సోదరప్రేమయొక్క ఆదర్శమును నెలకొల్పెను. సోదరులను వెంటనిడుకొని పరమధామమునకు ఆయన వెళ్లిపోయెను. నేడు కూడ ఈ నలుగురి సోదరులప్రేమ జగత్తునందు అందరికి గొప్ప ప్రబోధముగా నిలిచియున్నది - ఇది ఈ లోకమున శాశ్వతముగ విలసిల్లును.

## ఏకపత్నీవ్రతము - సహధర్మచారిణియందుగల ప్రేమ

శ్రీరామచంద్రుని ఏకపత్నీవ్రతమునకు ఉదాహరణము సీతాదేవియందు ఆయనకుగల ఆదర్శప్రేమయే. ఆ మహితాత్మురాలిని ప్రసన్నురాలినిగా చేయుటకొఱకే ఆమెను తనవెంట వనములకు తీసికొనివెళ్లెను. అచట ఆమెకు అనేకవిధములైన ఇతిహాసములను, ధర్మశాస్త్రములను వినిపించి ఆమెకు ఆనందమును కలిగించుచుండెడివాడు. రావణుడు సీతాదేవినపహరించెను. అప్పుడాయన సాధారణ మానవునివలె విలపించెను. "యే యథా మాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహం". భక్తులు నన్ను సేవించినరీతికి అనుగుణముగా నేను వారిని అనుగ్రహింతును. ఈ ధర్మము ననుసరించి ఆమె కొఱకు అనేక విధములుగా రోదించుచు ఆయన తన విరహవేదనను ప్రకటించెను. ఆ మహాత్ముని విరహవేదనను చూచినచో జగన్మాతయగు సీతాదేవికిని మోహము కలుగును. ఈ ఘట్టము మిక్కిలి అద్భుతమైనది. రామచంద్రుడు ఉన్మత్తునివలె

'ఓ సద్గుణఖనీ! జానకీ! నీవు రూపశీలవ్రతనియమములచే పవిత్రమైన దానవు. ఇంతకును నీవు ఎక్కడ నుంటివి?' అని విలపించుచుండెను.

(రా.మా. అరణ్య. దో.29-4)

సీతాదేవినిగూర్చిన సమాచారమునకై ఆయన తీగలను, వృక్షములను, పక్షులను, పశువులను, తుమ్మెదల సమూహములను అడుగుచుండెను. సీతాదేవి ఆకాశమార్గమునుండి తన వస్త్రాభరణములను క్రిందకు పడవేసెను. వాటిని తెచ్చి సుగ్రీవుడు రఘురామునకిచ్చెను. అప్పుడు ఆ మహానుభావుడు వాటిని హృదయమునకు హత్తుకొని "పట ఉర లాఇ సోచ అతి కీన్హా" అనుచు చింతించసాగెను. హనుమంతుడు లంకకు వెళ్లెను. రామచంద్రుడు ఆయనద్వారా సందేశమును పంపెను. ఆ సందేశము మిగుల చక్కనిది, మహోన్నతమైనది. ప్రేమస్వరూపమంతయు దానియందు ఇమిడియున్నది. ఆ ప్రభువిట్లు పలికెను.

"ప్రియురాలా! మనప్రేమతత్త్వము నా మనస్సునకే తెలియును. కాని ఆ మనస్సు నీ యొద్దనే యున్నది. ఇదియే నా ప్రేమసారము అని ఎఱుంగుము. (రా.మా. సుందర.దో.14-3,4)

ప్రజారంజనమను నెపముచేత రఘురాముడు సీతాదేవిని అడవులకు పంపెను. ఇది మహారాణియగు జానకీదేవియొక్క పాతివ్రత్యధర్మగౌరవమును ఇంకను ఉజ్జ్వల మొనర్చుటకే ఇట్లు చేసెనని గమనించవలయును. తదుపరి ఆ ప్రభువు అశ్వమేధయజ్ఞమును చేయసంకల్పించెను. ఆ యజ్ఞమునందు తనతోపాటు ఉండుటకు సీతా మహాసాధ్వియొక్క బంగారుప్రతిమను చేయించెను. ఈ విధముగా ఆ పరంధాముడు పవిత్రమైన ఏకపత్నీ వ్రతమునకు మిగుల గొప్ప ఆదర్శమును నెలకొల్పెను.

## భక్తవత్సలత

ఆ పరమాత్ముని భక్తవాత్సల్యమునకు ప్రతిరూపము శ్రీరామునియొక్క సుప్రసిద్ధమైన రూపమే. తన భక్తునికొఱకుగాని, సేవకునికొఱకుగాని ఆ పరమాత్ముడు చేయలేని పనియే లేదు. భక్తులననుగ్రహించుటకొఱకే పరమాత్ముడవతరించుచుండును. అదియే అందులకు ప్రధానకారణము. "పరిత్రాణాయ సాధూనాం" అని గదా గీతా ప్రమాణము. భగవంతుని కలిసికొనుటకు భక్తుడు విహ్వలుడై ఆయనను పిలుచును. అట్టియెడ ఆ

పరంధాముడు అచటికి రావలసియేవచ్చును. దండకారణ్యమునందు సుతీక్ష్ణుడు అను ఒక ముని నివసించుచుండెను. ఈతడు అగస్త్యమహాముని యొక్క శిష్యుడు, రామచంద్రునకు అనన్యభక్తుడు. దండకారణ్యమునకు ఆ స్వామి వచ్చియున్నాడను విషయము సుతీక్ష్ణునకు తెలిసెను. అతడు రామచంద్రుని దర్శనమునకు మిగుల వ్యాకులితుడయ్యెను. పిచ్చివానివలె లేచి పరుగిడెను. ఆయన తన శరీరస్పృహను కూడ మరచిపోయెను. ఆ స్వామి యొక్క భక్తిలో సంపూర్ణముగా నిమగ్నుడయ్యెను. పరమశివుడిట్లు పలికెను.

"ప్రభుముఖకమలదర్శనమువలన నేడు నా కన్నులు సార్థకములగును. (శివుడు పలుకుచున్నాడు) భవానీ! జ్ఞానియైన సుతీక్ష్ణముని సంపూర్ణముగ భక్తిపరవశుడాయెను. అతని తన్మయత్వము వర్ణనాతీతము. అతడు దిశలను, మార్గమును మరచెను, దిక్కుతోచని వాడయ్యెను. తానెవరో తన గమ్యమేమిటో అను విషయమే అతని స్మృతిలో లేదు. ఒక్కొక్కసారి వెనుకకు మరలిపోవును. మరలా ముందునకు నడచును. మరియొక తరి ప్రభుగుణములను కీర్తించుచు నాట్యము చేయును". (రా.మా. అరణ్య. దో. 9-5,6)

భక్తవత్సలుడగు ప్రియమైన తన భక్తుని (సుతీక్ష్ణుని) ఈ స్థితిని చెట్టుచాటున నుండి చూచి చూచి ముగ్ధుడగుచుండెను. ఆ మహామునియొక్క ప్రేమ పరవశత్వమును (భక్తి పారవశ్యములను చూచి భగవంతుడు ఆయన హృదయమునందు ప్రకటితుడయ్యెను. అయోధ్యా నాథుడగు శ్రీరామ చంద్రుని తన హృదయమునందే దర్శించి ఆ మహాముని పులకితుడయ్యెను. త్రోవలోనే కూర్చుండిపోయెను. ఆ పరంధాముడు ముని సమీపమునకు చేరి ఆయనను ధ్యానమునుండి మేల్కొల్పెను. కాని ధ్యానానందమున మత్తుడై యున్న ఆ ముని మేల్కొననేలేదు. అప్పుడు రఘురాముడు అతని హృదయమునుండి తన రూపమును తొలగించెను. వెంటనే మునీశ్వరుడు వ్యాకులతకులోనై కనులు తెరచెను. కనుల ఎదుట ఆనందనిలయుడైన ఆ శ్రీరామచంద్రుని దర్శించెను. ముని కృతార్థుడయ్యెను. ప్రేమమగ్నుడై ఆయన చరణముల మీద వ్రాలెను.

"అంతట ముని తన ఎదుట శ్యామసుందరుడు, సుఖధాముడు ఐన శ్రీరాముడు సీతాలక్ష్మణులతో గూడియుండగా గాంచెను. మిక్కిలి భాగ్యశాలి ఐన సుతీక్ష్ణమునిప్రవరుడు ప్రేమమగ్నుడై సాష్టాంగముగా శ్రీరాముని చరణములకు ప్రణమిల్లెను. పిమ్మట ఆ మహామునిని స్వామి అనుగ్రహించెను భగవంతుడు శబరివద్దకు స్వయముగా వేంచేసి ఆమెకు తన దర్శన భాగ్యమును కలిగించెను." (రా.మా. అరణ్య. దో. 9-10, 11)

ఆ ప్రభువు ఆమెతో ఇట్లు పలికెను. "భక్తురాలా! నా మాటలను వినుము. నేను కేవలము భక్తి తత్పరత్వమునే గౌరవించెదను. జాతి, కులము, ధనము, బంధుత్వము, గౌరవము, గుణము, బుద్ధికౌశలము మొదలగునవి ఎన్నియున్నను భక్తిలేని వ్యక్తి నీరులేని మేఘముతో సమానము. అట్టివారు నా ప్రేమకు పాత్రులు కారు" (రా.మా. అరణ్య. దో. 34-3). అని ఆ స్వామి ఆమెకు గౌరవమును ప్రసాదించెను. భక్తిశ్రద్ధలతో ప్రేమతో నిండిన పండ్లను తిని ఆ స్వామికి తృప్తి కలుగలేదు. ప్రభువు తన ప్రతి అవతారమునందును ఆ పరమాత్ముడు కాక భూషుండికి తన పరమమధురములైన బాలలీలల ఆనందమును ప్రసాదించెడివాడు.

హనుమంతునికి తాను ఋణపడియున్నానని ఆ పరమాత్ముడు తలంచెను. ఆయన ఇట్లు నుడివెను.

"మారుతీ! వినుము. నీ వంటి ఉపకారి దేవతలలోగాని, మునీశ్వరులలోగాని, మానవులలో గాని లేనేలేడు. నేను నీకేమి ప్రత్యుపకారము చేయగలను? నా మనస్సుకూడ నీ ముందుకు వచ్చుటకు జంకుచున్నది. ఆలోచింపగ నీ ఋణమునుండి విముక్తుడను కాలేనని తోచుచున్నది.

(రా.మా. సుందర. దో. 31-3,4)

వాల్మీకి రామాయణమునందు ఆ పరంధాముడు ఆంజనేయునితో ఇట్లు చెప్పెను.

చరిష్యతి కథా యావదేషా లోకే చ మామికా ॥
తావత్ తే భవితా కీర్తిః శరీరేఽప్యసవస్తథా ।

లోకా హి యావత్ స్థాస్యన్తి తావత్ స్థాస్యన్తి మే కథాః ॥
ఏకైకస్యోపకారస్య ప్రాణాన్ దాస్యామి తే కపే ।
శేషస్యేహోపకారాణాం భవామ ఋణినో వయమ్ ॥
మదఙ్గే జీర్ణతాం యాతు యత్త్వయోపకృతం కపే ।
నరః ప్రత్యుపకారాణామాపత్స్వాయాతి పాత్రతామ్ ॥

(వా.రా. ఉ.కాం. 40/21-24)

"కపివరా! నీవు కోరుకొనిన రీతిగనే జరుగును. సంశయములేదు. నా వృత్తాంతము లోకమున ప్రచలితమగుచుండునంతవరకును నీ శరీరములో ప్రాణములు నిలిచిఉండును. (నీవు 'చిరంజీవివి) నీ పేరుప్రతిష్ఠలు అజరామరములు. వానరోత్తమా! ఈ లోకములు నిలిచియున్నంతవరకును నా వృత్తాంతము కీర్తింపబడుచునే యుండును. వానరవీరా! మారుతీ! నీవు నాకు పెక్కు ఉపకారములను చేసియుంటివి. నా ప్రాణములను ధారపోసినను వాటిలో ఏ ఒక్క ఉపకారమూ తీరదు. మిగిలిన (తక్కిన) ఉపకారములకు నేను నీకు ఋణపడియే యుందును. కనుక నీవు చేసిన ఉపకారములు అన్నియును నాలోనే అణగిపోవుగాక! ఆపదలు వచ్చినపుడు నరుడు (ప్రతివ్యక్తియు) తాను ఇతరులకు చేసిన ఉపకారములకు ప్రత్యుపకారములను కోరుకొనుచునే యుండును. నేను నీకు ప్రత్యుపకారము చేయుటకు ఆలోచించుటయనగా నీకు ఆపదలు రావలయునని కోరుకొనుటయేగదా! అట్లు యోచన చేయుట సముచితము కాదు కదా!"

## శరణాగతవాత్సల్యము

భగవంతునిశరణాగతవాత్సల్యము సుప్రసిద్ధము. ఆ పరమాత్ముడు ఇట్లు నుడివెను.

సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే ।
అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ ॥

(వా.రా. యుద్ధ. 18/35)

"నేను నీ వాడను" అని పలుకుచు ఎవ్వరైనను భక్తిప్రపత్తులతో నన్ను శరణుగోరినచో వారికి (సకల ప్రాణులకును) అభయమిత్తును. (వారిని రక్షింతును) ఇది నా వ్రతము.

విభీషణుడు రావణునకు చక్కని ప్రబోధము చేసెను. దానికి బదులుగా అతడు తన అన్నతో కాలిదెబ్బ తినెను. సత్త్వగుణ సంపన్నములైన అనేక కోరికలు విభీషణుని మనస్సునందు మెదలుచుండెను. అతడు పరమాత్ముడగు శ్రీరాముని శరణుజొచ్చెను. అతడు రామచంద్రుడు వసించు శిబిరద్వారము కడకు చేరెను. వెంటనే వానరులాతనిని చుట్టుముట్టిరి. పిదప వారు ఈ విషయమును శ్రీరామునకు తెలిపిరి. ఆ స్వామి అప్పుడు తన మంత్రులను, మిత్రులను, సేనాపతులను వారి అభిప్రాయములను తెలుపుమని కోరెను. వాల్మీకి రామాయణమునకనుగుణముగ అచట అంగదుడు, జాంబవంతుడు, మైందుడు, నలుడు, హనుమంతుడు మొదలగువారందరును తమ తమ అభిప్రాయములను ప్రకటించిరి. ఆంజనేయుడు తప్ప మిగిలిన వారందరు విభీషణునకు విరుద్ధముగా తమ మనోగతములను వెలిబుచ్చిరి. రామచరితమానసమందు సుగ్రీవుడిట్లు పలికెను.

"మహారాజా! అవధరింపుడు. నిశాచరులు మాయావులు. వారి నిజ స్వరూపములను తెలిసికొనుట కష్టము. వారు కామరూపధారులు. ఈతని రాకయొక్క ఆంతర్యమేమో తెలియదు. ఈ దుష్టుడు మన రహస్యములను తెలిసికొనుటకై వచ్చినాడని నా అభిప్రాయము. ఇతనిని బంధించియుంచుట మంచిదని తోచుచున్నది". (రా.మా. సుందర. దో. 42-3,4)

అప్పుడు సుగ్రీవునితో రామచంద్రుడిట్లు పలికెను.

"మిత్రమా! నీవు తెలిపిన రాజనీతి ఒప్పుకొనదగినదే. కాని శరణుజొచ్చిన వానికి అభయమిచ్చి కాపాడుట నా ప్రతిజ్ఞ". శ్రీరాముడు మరల ఇట్లు పలికెను, "తనకు హాని జరుగునేమోయని శంకించి శరణాగతుని త్యజించునట్టివాడు నీచుడు, పాపి. అతనిని చూచుటయే మహాపాపము. కోటి బ్రహ్మహత్యలు చేసినవాడైనను నన్ను శరణుజొచ్చినచో నేను అతనికి అభయమిచ్చెదను. నా

సమ్ముఖమునకు వచ్చి "శరణు" అన్న ప్రాణియొక్క కోటిజన్మల పాపములు కూడ నశించిపోవును.

కనుక సుగ్రీవా! వెళ్లి అతనిని తీసికొని రమ్ము". సుగ్రీవాదులు స్నేహాతిరేకమున అభ్యంతరము తెలిపినను రఘురాముడు స్పష్టముగ ఇట్లు పలికెను. (రా.మా. సుందర దో. 42/4, 43-1)

ఇంకను ఆ ప్రభువు ఇట్లు పలికెను.

ఆనయైనం హరిశ్రేష్ఠ దత్తమస్యాఽభయం మయా ।
విభీషణో వా సుగ్రీవ యది వా రావణః స్వయమ్ ॥

(వా.రా. ఉ.కాం. 18/36)

"వానరోత్తమా! సుగ్రీవా! విభీషణునకు నేను అభయమిచ్చుచున్నాను. వెంటనే అతనిని తోడ్కొనిరమ్ము. అతనికేకాదు. స్వయముగా రావణుడే వచ్చి శరణు గోరినను వానికిని నేను అభయమిచ్చెదను".

సుగ్రీవుడు మొదలగువారు విభీషణుని తీసికొనివచ్చిరి. శ్రీరాముడు అతనికి ఆశ్రయమిచ్చి కృతార్థుని చేసెను.

లంకానగరమున యుద్ధము జరుగుచుండెను. ఒకసారి రావణుడు క్రుద్ధుడై విభీషణుని మీదకు శక్తిబాణమును వదలెను. శక్తిబాణము తాకినచో విభీషణుడు మరణించునని రామచంద్రుడెరుగును. శరణాగతవత్సలుడగు ఆ స్వామి వెంటనే విభీషణుని వెనుకకు నెట్టివేసి స్వయముగా తానే ముందుకు వచ్చెను. భయంకరమగు ఆ శక్తిబాణము ఆయన వక్షఃస్థలమును తాకెను. ఆ విధముగా శ్రీరాముడు విభీషణునకు ప్రమాదమును తప్పించెను. ఆ ప్రభువుయొక్క వాత్సల్యవైభవములు అట్టివి.

విభీషణునకు రాజ్యము లభించెను. ఆతనికి పరంధాముడగు రామచంద్రుడు మిగుల దుర్లభమైన తన భక్తిని ప్రసాదించెను.

(రా.మా. లంక. దో. 93-1)

## మిత్రులయెడ ఆ స్వామికిగల ప్రేమ

వాస్తవమునకు పరమాత్ముడు అందరకును సుహృదుడు. స్వాభావికముగనే మిత్రుడు. కాని తాను లీలలను చేయునపుడు ఆయన మిత్రులతో వ్యవహరించు తీరును మనము ఇచ్చట గమనించవలయును. లోకమున మనుష్యులను స్నేహితులనుగా చేసికొనుట కనిపించును. కాని భగవంతుడగు రఘురాముడు రాక్షసులను, వానరులను, ఎలుగుబంట్లను తనకు మిత్రులనుగా చేసికొని వారిని ధన్యులనుగచేసెను. సుగ్రీవుడు పుట్టెడు దుఃఖములో మునిగియుండెను. హనుమంతుని ప్రేరణచేత ఆ ప్రభువు అగ్నిసాక్షిగా సుగ్రీవుని తన సఖునిగా చేసికొనెను. వానరేంద్రుడగు సుగ్రీవుని యొక్క దుఃఖమును గూర్చి వినుటతోడనే ఆయనభుజములు వీరావేశముతో ఉప్పొంగెను. అప్పుడు ఆ రఘుకులతిలకుడు ఇట్లు పలికెను.

"సుగ్రీవా! వినుము. నేను ఒకే ఒక్క బాణముతో వాలిని వధించెదను. అతనిని బ్రహ్మరుద్రాదులు కూడ కాపాడలేరు". (రా.మా. కిష్కింధా. దో.6)

తదనంతరము మిత్రధర్మములను తెలుపుచు ఆ పరంధాముడిట్లు చెప్పెను.

"మిత్రుని దుఃఖమును గాంచి దుఃఖింపనివానిని చూచినచో మహాపాపము అంటును. తన కొండంత దుఃఖమును ధూళివలెను, ధూళితో సమానమైన మిత్రుని దుఃఖమును మేరుపర్వతమంతగాను చూడవలెను. సహజముగ ఇట్టి లక్షణములు లేనివాడు శఠుడు. అట్టివాడు పూనిక వహించి ఎవ్వరితోనైనను మైత్రి చేసికొనుటవలన ఏమి ప్రయోజనము? చెడుమార్గమున పోవుచున్న మిత్రుని ఆపి, మంచిమార్గమునకు మరల్చుట మిత్రధర్మము. ఎవ్వడైనను తన మిత్రులగుణములనే ప్రకటింపవలయును. దోషములను దాచవలయును[1].

(రా.మా. కిష్కింధా. దో. 6-1,2,3)

---

1. ........................ గోప్యంబుదాచు,
విడువడాపన్ను లేవడివేడనిచ్చు,
మిత్రుడీ లక్షణంబుల మెలగుచుండు

"మిత్రులు సంశయములకు తావియ్యక ఇచ్చిపుచ్చుకొనుచుండవలయును. సర్వదా మిత్రునకు తన శక్తికొలది మేలే చేయువలయును. ఆపదకాలమునందు మిత్రుని ఎక్కువగా ఆదుకొనవలయును. ఇవి మంచి మిత్రుని లక్షణములు" అని వేదములు నుడువుచున్నవి.

మిత్రుని ఈ లక్షణములు అందఱును సదా తమ మనస్సులయందు నిలుపుకొనదగినవి. తరువాత ఆ పరంధాముడు సుగ్రీవునకు, నమ్మకము కలిగించుచు ఇట్లు పలికెను.

అప్పుడు సుగ్రీవుడు "రఘువీరా! వాలి మిక్కిలి బలశాలి. యుద్ధములో అత్యంతధీరుడు, వీరుడు" అని పలికెను. (రా.మా. కిష్కింధా. దో. 6/5)

మిత్రుడైన సుగ్రీవునియొక్క సుఖమే రామునిమనస్సునందు ఎల్లప్పుడును మెదలుచుండెను. వాలి పలికిన ఘోరమైన ఉపాలంభనములను (దెప్పిపొడుపు మాటలను) ఆయన సహించెను. సుగ్రీవునకు శత్రువు, సోదరుడగు వాలిని రఘురాముడు వధించెను. ఆ స్వామి సుగ్రీవునితో మైత్రిని నిర్వహించిన తీరు అద్భుతము.

శ్రీరాముడు నిషాదరాజును తన మిత్రునిగా చేసికొనెను. స్వయముగా వసిష్ఠమహర్షియే అతనిని (గుహుని) హృదయమునకు హత్తుకొనెను. ఆ స్వామి అతనికి అంతటి మహోన్నత స్థానమును కల్పించెను.

"ప్రేమచే పులకితుడైన గుహుడు తనపేరు తెలుపుకొని వసిష్ఠునకు కొంతదూరమునుండి దండప్రణామములను ఆచరించెను. ఋషి అతడు రామసఖుడు అని ఎఱింగి, భూమిపైపడిన స్నేహమును (నూనెను) సేకరించినట్లు అతనిని లేపి తన ఆలింగనసౌభాగ్యమును కల్పించెను".

(రా.మా. అయోధ్యా. దో. 242/3)

తులసీదాసు వినయపత్రికయందు ఇట్లు చెప్పెను.

"జీవహింసకు అలవాటుపడినవాడు, తామసిక శరీరుడు, పశుతుల్యుడు, వనచరుడు అయిన నిషాదుని ప్రేమకు (వినయమునకు) విహ్వలుడై

వసిష్ఠమహర్షి అతనిని అక్కున చేర్చుకొనెను. ఇచట జాతి, కుల, ప్రస్తావనల ప్రసక్తియే లేకుండెను". (వినయపత్రిక 116)

శ్రీరామచంద్రుడు విజేతయై లంకనుండి అయోధ్యకు తిరిగివచ్చెను. ఆయన వానరవీరులను, భల్లూకప్రముఖులను, విభీషణాది మిత్రులను పిలిపించెను. వారితో గురువుగారి చరణములకు ప్రణామములు చేయించెను. వారిని పరిచయము చేయుచు ఆ స్వామి ఆ మహర్షితో ఇట్లు పలికెను.

"వీరందరును నా మిత్రులు. సంగ్రామసాగరమునుండి గట్టెక్కుటకు వీరు నాకు ఓడలవలె తోడ్పడిరి. నా హితము కొఱకు వీరు తమ ప్రాణములను సైతము పణముగాపెట్టి పోరాడిరి. వీరు నాకు భరతుని కంటెను ఎక్కువగా ప్రీతిపాత్రులు". (రా.మా. ఉ.కాం. దో. 7/4)

రాజ్యాభిషేకమునకు తరువాత శ్రీరాముడు తన మిత్రులనందరను పిలిచి ఇట్లు పలికెను.

"మీరు నాకెంతయు ప్రియమైనవారు. నాకు నా సోదరులును, రాజ్యము, సంపదలును, జానకీదేవియు, నా శరీరము, ఇల్లు, కుటుంబము, మిత్రులు వీరందరును ప్రియమైనవారే. కాని వారు మీ తరువాతనే. నేను సత్యము పచించెదను. ఇది నాకు సహజము". (రా.మా. ఉ.కాం. దో.15/3, 4)

తదుపరి రఘుకులతిలకుడు వస్త్రాభరణములను తెప్పించెను. పరమాత్ముడగు శ్రీరామచంద్రుడు ముగ్గురు సోదరులతో కలసి స్వయముగా తనచేతులమీదుగా వారికి ఆ వస్త్రాభూషణములను అలంకరింపచేసి వీడ్కోలు పలికెను.

అయోధ్యానగరమునందు ఈ నలుగురు సోదరులతో కలిసి ఆడుకొనుచు భోజనభాజనములు చేయుచుండిన ఆ బాల్యస్నేహితుల (అయోధ్యలోని బాలుర) మహిమనెవరు వర్ణించగలరు? వారు పొందిన సౌభాగ్యము సాటిలేనిది.

## దయాగుణము

పరంధాముడగు శ్రీరామచంద్రుని దయాసముద్రుడని చెప్పినను ఆయనయొక్క అపరిమితమైనదయను తక్కువ చేసినట్లేయగును. జీవులమీద ఆ స్వామికిగల దయ ఊహలకు అందనిది. మానవుడు ఆయన దయను ఎంత మహోన్నతముగ పేర్కొనినను (ఊహించినను) దానికంటె ఆ పరమాత్ముని దయాగుణములు అనంతములుగా నుండును. అది అపరిమితమైనది, విలక్షణమైనది. భగవంతుడు సంపూర్ణముగా దయామయుడే. "హై తులసిహి పరతీతి ఏక ప్రభు మూరతి కృపామయీ హై". గీత యందు శ్రీకృష్ణభగవానుడు కూడ ఇట్లు వచించెను. "సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాంతిమృచ్ఛతి" (గీత. 5/29) "నన్ను సమస్తప్రాణులకు సుహృదుడనని తెలిసికొని, మానవుడు శాంతిని పొందును".

పరమాత్మునిదయ రెండు రూపములలో ప్రకటితమగుచుండును. ఒకచోట అది అనుగ్రహరూపముగ దర్శనమొసగును. ఇంకొకచోట దండనరూపమున కనిపించును. ఆ స్వామి రాక్షసులను సంహరించెను, కాని అది సంహరించుటకాదు, నిజమునకు వారి నుద్ధరించుటయే. భగవంతుని క్రోధముకూడ ముక్తినే ప్రసాదించును. "నిర్వాణదాయకక్రోధజాకర". పరమాత్ముని చేతులమీదుగా అసువులను వీడిన రాక్షసులందరు దుర్లభమైన పరమపదమును పొందిరి. కొన్ని ఉదాహరణములు చూడుడు.

**తాటకిని**

శ్రీరాముడు ఒకే బాణముతో తాటకి ప్రాణములను హరించెను. కనికరముతో ఆమెను పరమధామమునకు చేర్చెను.

(రా.మా. బా.కాం. దో. 208-3)

**విరాధుని**

శ్రీరామునిచేతిలో మరణించిన ఆ విరాధునకు వెంటనే దివ్యసుందర రూపము ప్రాప్తించెను. ఆర్తుడైన అతనికి ఆ ప్రభువు పరంధామమును ప్రసాదించెను. (రా.మా. అరణ్యా. దో. 6-4)

ఖరదూషణాదులకు

దయానిధియైన శ్రీరామచంద్రుడు రాక్షససైనికులందరిని ఒక్క క్షణములో వధించెను. వారు 'రామరామ' యనుచు మరణించి మోక్షమును పొందిరి.

(రా.మా. అరణ్య. దో. 20 (క)

మారీచుని

సర్వజ్ఞుడైన ప్రభువు మారీచుని మనస్సునందలి భక్తిభావమును గ్రహించి మునీశ్వరులకును దుర్లభమైన పరమగతిని అతనికి ప్రసాదించెను.

(రా.మా. అరణ్యా. దో. 26-9)

కుంభకర్ణుని

కుంభకర్ణుని శరీరమునుండి ఒక తేజస్సు వెడలి శ్రీరామునిలో లీనమయ్యెను. (రా.మా. లం.కాం. దో. 70-4)

రావణుని

రావణునినుండి దివ్యమైన ఒక తేజస్సు రామచంద్రుని ముఖమున ప్రవేశించెను. (రా.మా. లం.కాం. దో. 102-5)

సకల రాక్షసులను

చనిపోవునపుడు రాక్షసులమనస్సులలో రామచంద్రుని ఆకారము నిలిచియుండెను. కావున వారందరును భవబంధములనుండి విముక్తులైరి.

(రా.మా. లం.కాం. దో. 113-4)

రాక్షసులు తమను దీనులమని అనుకోలేదు. వారు నిజమునకు ఆర్తులే. అట్టి దయనీయస్థితిగల రాక్షసులమీద తన దయను వర్షింపజేసి భగవంతుడు వారిని సంహరించుటద్వారా ఉద్ధరించెను.

పరమాత్ముడు పెక్కుమందిని అనుగ్రహించి తనవారినిగా చేసికొనెను. ఆ స్వామి గొప్ప గొప్ప ఋషులకును, మునులకును దుర్లభమైన గౌరవమును సకలవానరులకును ఎలుగుబంట్లకును ప్రసాదించెను.

"శ్రీరామచంద్రప్రభువు చెట్లక్రింద కూర్చొనియుండగా వానరుల మూకలు చెట్లకొమ్మలపై ఎగురుచుండెను. (మర్యాదాపురుషోత్తముడు, సచ్చిదానందఘన పరమాత్మయైన శ్రీరాముడెక్కడ? శాఖామృగములైన వానరములెక్కడ?) అయినను ప్రభువు వాటికి తనతో సమానమైన స్థానమునిచ్చెను."

(రా.మా. బాల.కాం. దో. 29 క)

గౌతమమహర్షి తన భార్యయగు అహల్యాదేవికి శాపమొసగెను. ఆమె ఆ శాపమునకు లోనై శిలగా మారిపోయెను. ఆర్తితో పరమాత్మును పిలుచుటకు కూడ ఆమెలో శక్తి లేకుండెను. ఆమె దీనదశను చూచి దయామయుడగు పరమాత్ముడు స్వయముగా ఆమె దగ్గఱకు వచ్చెను. తన చరణస్పర్శచేత ఆమెను ఉద్ధరించెను.

నిషాదునిచే తన పాదములను కడిగించుకొని రఘురాముడు దేవతలకును, మునులకును దుర్లభమైన తన చరణోదకమును వానికి ప్రసాదించెను. వానికేగాక, అతని పరివారమునకును ముక్తినొసగెను.

"శ్రీరామచంద్రుని చరణములను కడిగి నావికుడు ఆ పాదతీర్థమును తన పరివారముతో కలిసి స్వీకరించెను. తత్పుణ్య ప్రభావమున వాని పితరులును భవసాగరమును దాటిరి. పిమ్మట ఆనందోత్సాహములతో ఆ పడవవాడు సీతారామలక్ష్మణులను గంగానదిని దాటించెను."

(రా.మా. అయోధ్యా. దో. 101)

దండకారణ్యమునకు స్వయముగా వెళ్లి శ్రీరామచంద్రుడు ఆ వనమునకు శాపమునుండి ముక్తి కలిగించెను.

"ఆ వనమునందు దారిలో ఆ స్వామి ఒక ఎముకల కుప్పను చూచెను. ఆయనకు మిక్కిలి జాలి కలిగెను. ఆ స్వామి "ఇవి (ఈ ఎముకలు) ఎవరివి" అని మునీశ్వరులను అడిగెను. (రా.మా. అరణ్య.కాం. దో.8/3)

మునులు దుఃఖముతో బాధపడుచూ ఇట్లు నుడివిరి.

"పరమాత్మా! రాక్షసులు మునులను భక్షించిరి. ఈ ఎముకల కుప్పలు ఆ మునులవి". (రా.మా. అరణ్య. దో. 8-4)

ఈ మాటలను విని శ్రీరాముని కన్నులు చెమ్మగిల్లెను.

అప్పుడు శ్రీరాముడు కరములు సాచి "నేను ఈ నేలపై రాక్షసులను లేకుండ చేసెదను. ఇదియే నా ప్రతిజ్ఞ" అని పలికెను.

(రా.మా. అరణ్య. దో. 9)

వాలియొక్క ఘోరమైన అత్యాచారములనుండి ఆర్తుడైన సుగ్రీవుని రక్షించెను. అంగదుడు దీనుడని తెలిసి అతనిని ఆదుకొనెను, యువరాజ పదమును కల్పించెను.

ఒకానొక కవి మిగుల చక్కగా ఇట్లు వచించెను.

గృధ్రరాజైన జటాయువుమీద ఆ ప్రభువు చూపిన దయ సాటిలేనిది. రావణునిచే గాయపడి జటాయువు దిక్కుతోచని స్థితిలో పడియుండెను. రామచంద్రుడు అతనిని సమీపించెను. అతని దీనదశను చూచి దుఃఖించెను. ఆతనిని తన ఒడిలోనికి చేర్చుకొనెను. కనులనీరు నింపుకొని తన కోమల కరకమలములతో అతని తలను నిమిరెను. ఇట్లు ఆ ప్రభువు జటాయువునకు సుఖమును, శాంతిని ప్రసాదించెను. అతనికి ఊరట కల్పించెను.

రామచంద్రుడు జటాయువుతో ఇట్లు పలికెను. "తండ్రీ! మీరు కొన్ని దినములు ఇంకను శరీరమును ధరించియే ఉండుడు. నా తండ్రియొక్క సుఖమును నాకు కల్పింపుడు". జటాయువు మిగుల చతురుడు. అతడిట్లు పలికెను.

"అవసానదశయందు 'శ్రీరామనామము' స్మరించువాడు అధముడైనను ముక్తుడగునని వేదములు పలుకుచున్నవి. అట్టి మీరే నా కనుల ఎదుట నిలిచియుండగా నేను ఏ కోరికను తీర్చుకొనుటకై బ్రతుకవలయును".

(రా.మా. అరణ్య. దో. 30-3,4)

ఈ విధముగా పలికి పరమాత్ముని ఒడియందే యుండి ఆ స్వామిని తదేకదృష్టితో చూచుచుండెను. తన నోటితో శ్రీరాముని పవిత్రనామము ఉచ్చరించుచు జటాయువు మునులకు కూడ దుర్లభమైన పరమశాంతిని పొందెను.

పిమ్మట పరమదయాళువైన ఆ ప్రభువు తన చేతులమీదుగా జటాయువునకు అంత్యక్రియలను తన తండ్రికి చేసినటులే చేసెను.

(గీతావలి. అరణ్య. 16)

ఇట్టి ఈ దయ ఎంతటి మహోన్నతమైనది? ఇది ఆ ప్రభువుయొక్క కృపకు సాటిలేని ఉదాహరణము.

## ప్రజావాత్సల్యము

పరమాత్ముడగు శ్రీరామచంద్రుడు తన చక్కని వ్యవహారముచేతను, వాత్సల్యముతో నిండిన పనులచేతను ప్రజలకు అత్యంత ప్రీతిపాత్రుడయ్యెను. ఆయనవనగమనమునకు ఏర్పాట్లు జరుగునపుడు ఈ విషయము స్పష్టమగును. రాజ్యాభిషేక మహోత్సవ ప్రకటనతో సకల ప్రజలలోను ఆనందము వెల్లివిరియుచుండెను. జనసమూహమునందు ఆనందసాగరము పెల్లుబికి నట్లుండెను. ఆకస్మికముగా ఆ దృశ్యము మారిపోయినది. శ్రీరామలక్ష్మణులు సీతాదేవితో కూడి ముని వేషధారులై వనములకు వెళ్లుచుండిరి. ప్రజలు ఈ దృశ్యమును చూచి తట్టుకొనలేకపోయిరి. వారి ఎడబాటువలన కలిగిన దుఃఖమును సహించుటకు వారిలో సామర్థ్యము లేకుండెను. వారు సీతారామ లక్ష్మణులను అనుసరించిరి. రఘురాముడు వారికి అనేకవిధముల నచ్చజెప్పెను. కాని ప్రేమవశులై వారెవ్వరు కూడ అయోధ్యయందుండుటకు సమ్మతించలేదు.

"అందఱును తమతమ మనస్సులలో ఒకే ఆలోచనను కలిగియుండిరి. "సీతారామలక్ష్మణులు లేనిదే సుఖములేదు. శ్రీరాముడున్నచోటనే సమాజము సుఖముగా నుండును. శ్రీరాముడు లేని అయోధ్యలో మనకేమి పని?"

(రా.మా. అయోధ్యా 83-3)

"బాలురను, వృద్ధులను (స్త్రీలను) తమ ఇండ్లలో వదలి నగర ప్రజలందఱును ఆయనను అనుసరించిరి." (రా.మా. అయోధ్యా. దో. 84)

చివరకు వారు నిదురించుచుండగా (వారిని) వదలిపెట్టి రఘురాముడు ముందుకు సాగెను. భరతుడు చిత్రకూటమునకు వెళ్లుసమయమున ప్రజలందరు శ్రీరామదర్శనార్థము మిగుల ఉత్సాహితులైరి. ఇంటికి

కావలియుండుటకు కూడ ఎవ్వరును అంగీకరించలేదు. "ఎవరినైనను ఇంటికి కావలి యుండుమనినచో ఆతడు తన మెడమీద కత్తివ్రేటు పడినట్లు భావించుచుండెను." (రా.మా. అయోధ్యా. దో. 184-3)

అందఱును భరతునివెంట చిత్రకూటమునకు వెళ్లిరి.

"రామచంద్రుడు లంకానగరమును జయించి అయోధ్యకు తిరిగివచ్చెను. ఆ ప్రభువును దర్శించి అయోధ్యావాసులు ఆనందజలధిలో ఓలలాడిరి. వారి విరహజనితదుఃఖము మటుమాయమయ్యెను. ప్రేమవిహ్వలురైనవారిని చూచి దయాళువైన శ్రీరాముడు ఒక లీలను ప్రదర్శించెను. ఒకే సమయమున ఆ స్వామి అనేక రూపములలో ప్రకటితుడై ప్రతివ్యక్తికిని ఒకే సమయమున వారి వారి యోగ్యతలకు అనుగుణముగ దర్శనమిచ్చెను. శ్రీరఘువీరుని దయాదృష్టిచే స్త్రీ పురుషులందరును శోకరహితులైరి. ఒక్క క్షణముననే ఆ భగవంతుడు అందరిని ఆనందింపజేసెను. ఉమా! ప్రతియొక్కరును ప్రభువు మొట్టమొదట తననే కలిసికొన్నాడని భావించిరి.

(రా.మా. అయోధ్యా. దో. 5-2,3,4)

వాస్తవమునకు శ్రీరాముడు ప్రజల సుఖసంతోషముల కొఱకే రాజ్యమును స్వీకరించెను. నిజమునకు ఇదియే ఆదర్శము. ప్రజల సుఖముకొఱకు రాజైనవాడే నిజమైన రాజు.

(శివుడు పలుకుచున్నాడు) "ఓ ఉమా! అయోధ్యావాసులైన స్త్రీ పురుషులందఱును కృతార్థులు. ఏలనన వారి ప్రభువైన శ్రీరఘునాథుడు స్వయముగా పరమానందస్వరూపుడే కదా!" (రా.మా. అయోధ్యా. దో.46)

ప్రజావాత్సల్యమునకు ఆ ప్రభువే సాటిలేని ఉదాహరణము. అట్టివాడు జగత్తున ఎచటను లేడు. సీతాదేవికొఱకు ఆయన వనములందు విలపించుచు తిరిగెను. ఆ మహాసాధ్వికొఱకే రావణునితో భయంకరమైన పోరు సలిపెను. కేవలము ప్రజలను రంజింపచేయుటకే తన హృదయమును రాయి చేసికొనెను. నిర్దోషురాలని తెలిసికూడ ఆ స్వామి ఆమెను అడవులకు పంపెను. లోకాపవాదమును తొలగించుటకై అట్టి త్యాగమునకు సిద్ధపడిన ఆ ప్రభువు మిగుల ధన్యుడు.

పరమాత్ముడగు శ్రీరామచంద్రుని మహోన్నత గుణములతో కూడిన గాథలను ఎంతగా గానము చేసినను ఎవరును తృప్తిచెందజాలరు. ఆయన దయాసముద్రుడు. ప్రేమస్వరూపుడు. మిగుల సుహృదుడు. సాటిలేని సంయమనము గలవాడు. నిరుపమానమైన శుభములను ప్రసాదించువాడు. ఆయన బలపరాక్రమములు అపూర్వములు. ఆ ప్రభువు ఎంతయు బుద్ధిమంతుడు. శస్త్రవిద్యలయందు ఆరితేరినవాడు. సౌందర్యమాధుర్యములకు నెలవైనవాడు. శోభలతో విలసిల్లువాడు. (కాంతిమంతుడు), అసమాన ధైర్యశాలి, జితేంద్రియుడు, అత్యంత గంభీరుడు, మిగుల వినయశీలి, ఉదారత్వమున అసమానుడు, పరమబ్రహ్మణ్యుడు, అపూర్వసౌందర్యరాశి, ప్రియదర్శనుడు, సంగీతకళానిపుణుడు, సత్యముపలుకుటయందు ఆదర్శప్రాయుడు, మధురముగా పలుకువాడు, భూమాతవలె ఓర్పుగలవాడు, పుష్పములకంటె కోమలుడు, కర్తవ్యపాలనయందు వజ్రమువలె కఠోరుడు.[1] యశస్సంపన్నుడు. మహామహితాత్ముడైన వాగ్మి (మాటాడుటలో నేర్పరి). సర్వశాస్త్రములతత్త్వము నెఱిగినవాడు, అనుపమప్రతిభావంతుడు, ఆదర్శపుత్రుడు, ఆదర్శప్రాయుడైన శిష్యుడు, ఆదర్శపతి, అనుసరించదగిన సోదరుడు, సకలమునకును ఆయన స్వామి, ప్రభువు, మిత్రుడు, వీరశూరులలో ఆయనకాయనయే సాటి. నిరుపమదాత. గుణశీలములయందు సర్వోత్తముడు. సదాచారసంపన్నుడు ధర్మస్వరూపుడు, త్యాగమునందు అసమానుడు, నీతికోవిదుడు, సాధుజనప్రియుడు, అనన్య ప్రతాపశాలి. ధర్మసంరక్షణాభారనిర్వాహకుడు, సకల లోకములకును ప్రీతికరమైనవాడు. ఆ పరబ్రహ్మపరమేశ్వరుడు సర్వాంతర్యామి, సర్వశక్తిమంతుడు.

ఋజువర్తనమునందును, సత్యమునుపలుకువిషయమున ఆ స్వామి ప్రతిజ్ఞ చేయుచు ఇట్లు నుడివెను.

---

1. వజ్రాదపి కఠోరాణి, మృదూని కుసుమాదపి -

శ్రీరాముని వచనములు శిక్షాసమయములయందు వజ్రముకంటెను కఠినములు - ఆదరించునపుడు పువ్వులకంటెను కోమలములు. - ఉత్తరరామచరితము

రామో ద్విర్నాభిభాషతే (వా.రా. అయోధ్యా. 18/30)

రామచంద్రుడు రెండువిధములుగా పలుకడు. ఒకసారి ఏదిచెప్పునో అదియే నిశ్చితము. ఆ స్వామి ఆడినమాట తప్పడు.

ధర్మపరాయణత్వమునకు ఆయన సమస్తజీవితము క్రియారూపమైన ఉదాహరణమే. సాక్షాత్తు పరమాత్ముడైనప్పటికి కూడ ఆ ప్రభువు ధర్మమును నిలుపుటకు దానిని రక్షించుటకు నియమానుసారము సంధ్య - అగ్నిహోత్రాది కర్మలు స్వయముగా చేయుచుండెడివాడు. వర్ణాశ్రమముల కనుగుణముగా బ్రాహ్మణులను, ఋషులను, గురుజనులను పూజించెడివాడు. యజ్ఞయాగాదులను చేసెడివాడు, మందిరములు నిర్మించి విగ్రహారాధనలను ఆచరించెడివాడు. శ్రాద్ధము, తర్పణాది కర్మలను కడు జాగ్రత్తగా పాటించెడివాడు.

చిత్రకూటమునందు భరతుని వెంట వెళ్లిన ఋషులలో జాబాలియను ఒక మహర్షి యుండెను. మహారాజగు దశరథుని సభలో ఆయన ఒక ప్రముఖుడు. రామచంద్రుడు అయోధ్యకు తిరిగివచ్చు విషయమును విశదీకరించుచు ఆయన (జాబాలి) నాస్తికవాదమును సమర్థించునట్టి కొన్నిమాటలు చెప్పెను. ఆతని మాటలను విని మర్యాదాపురుషోత్తముడగు పరమాత్మ (శ్రీరాముడు) ఆయనమీద కినుకబూనెను. అది ఆయన లీల. ఆ స్వామి ఆ మహర్షిని మందలించుచు అనేక విషయములు చెప్పెను.

నిందామ్యహంకర్మ పితు కృతం స్తతత్ యస్త్వామగృహ్ణాద్విషమస్థబుద్ధిమ్ ।
బుద్ధ్యానయైవంవిధయా చరంతం సునాస్తికం ధర్మపథాదపేతమ్ ॥
(వా.రా. అయోధ్యా. 109/33)

"నీ బుద్ధి పెడత్రోవ పట్టినది. నీవు వేదవిరుద్ధమైన మార్గమును అవలంబించితివి. నీవు పచ్చినాస్తికుడవు. ధర్మమార్గమునకు ఎంతయు దూరమైతివి. ఇట్లు చార్వాకమతప్రచారమునకు పూనుకొనిన నిన్ను మా తండ్రిగారు తన కడకు చేరదీసి యాజకునిగా జేసిరి. అట్టి కృత్యమును నేను నిందించుచున్నాను".

నాస్తికవాదమును రఘురాముడు ఎంత దుష్టమైనదిగా భావించెనో ఈ మాటలవలన తెలియును. తనతండ్రి దశరథమహారాజు జాబాలిని తన

రాజ్యసభయందు ఒక సభ్యునిగా నియమించెను. రామచంద్రుడు తండ్రి ఒనర్చిన ఈ కార్యమును కూడ తప్పుపట్టెను. అయినను ఆయన తన తండ్రి వచనములకు కట్టుబడి తాను అడవులలో నివసించెను.

అంతట జాబాలి "నేను మిమ్ములను తిరిగి అయోధ్యకు మరలించుటకే సహేతుకములైన ఈమాటలను పలికితిని" అని చివరకు నుడివెను. ఇది నా అభిప్రాయము కాదని కూడ అతడు చెప్పెను. అప్పుడు గురువగు వసిష్ఠమహర్షి ఋజువర్తనముతో కూడిన ఆ జాబాలిమాటలను సమర్థించెను. అంతట పరమాత్ముడు శాంతించెను.

పరమేశ్వరుడగు శ్రీరామునియొక్క భావములన్నియును విలక్షణములు. ఆయన జననము, బాల్యభావము, కౌమారభావము, మిథిలానగరమున ఆ మహాత్ముని మధురభావము, వనములందు తాపసభావము, లంకానగరము నందు వీరభావము, రాచఠీకపు భావము, ప్రేమభావము ఇవన్నియును ఆదర్శప్రాయములు. మిక్కిలి అనుసరించదగినవి. ఆయన ఆదర్శజీవితము నుండి ప్రయోజనము పొందని మానవుడు గొప్ప మందభాగ్యుడే అగును.

రాఘవేంద్రునిగుణములు, ఆచరణములు అన్నియును ఆదర్శప్రాయములు. వాటిలో పరమాదర్శములు, అనుకరణయోగ్యములు కానివి ఏవియును లేవు. ఎక్కడైనను, ఏదైనను అసంబద్ధమైనదిగా, మనస్సునకు ప్రతికూలమైనదిగా తోచినచో దానికి ప్రధానకారణము శ్రద్ధయందలిలోపమే. శ్రద్ధ లోపించినచో పరమాత్మతత్త్వమునందలి పరమార్థము, గుణములు, ప్రభావములు తెలియవు. అట్టి జ్ఞానము లేని కారణమున ఆ పరబ్రహ్మలీలయందు మానవుడు భ్రమకు వశుడగును. అతని మనస్సులో సందేహము కలుగును. ఆయనలీల ఏదైనను అవగతము కాకపోయినచో దానిని విడిచిపెట్టి, ఆ పరమాత్మునియొక్క ఇతర ఆచరణములు అనుసరింపదగినవి. ఆ స్వామి ఉపదేశములు తప్పక పాటింపదగినవి. ఆ ప్రభువు తన సోదరులకు, ప్రజలకు మిక్కిలి చక్కని ప్రబోధములను చేసెను. వాటిని అక్షరాలా అనుసరించుటకు (ఆచరించుటకు) ప్రయత్నించవలెను. ఆ స్వామిఆజ్ఞలకు ఆయనఆచరణములకు అనుగుణముగా ఏ కొద్దిప్రయత్నము జరిగినను అది ఆ ప్రభువుయొక్క కృపయేనని భావించ

వలయును. భగవంతుని ఈ కృపను మాటిమాటికిని లక్ష్యమునందుంచు కొనవలయును. భక్తులు వాటిని అనుభవించుచు క్షణక్షణము ముగ్ధులగు చుందురు. ఆ స్వామియొక్క ప్రతిలీలయందును ప్రేమ, దయ, ఓర్పు, సత్యము మొదలగు గుణములు నిండియున్నవి. ఆ ప్రభువుయొక్క అపరిమితమైన ప్రభావము ఆయన లీలలయందు వ్యాపించియున్నది. ఇట్లు నిర్ణయించుకొని ప్రతిపనియందును ఆ పరమాత్ముని ఆదర్శవ్యవహారమును, మహోన్నతమైన గుణములను, వాటి ప్రభావమును, తత్త్వమును, పరమార్థమును చింతన చేయుచుండవలయును. దివ్యము, అమృతమయమగు రూపలావణ్యములతో కూడిన మనోహరమైన ఆయన ఆకారమును ప్రత్యక్షముగా ధ్యానము చేయుచుండవలెను. అట్టివాడు ఎల్లప్పుడు ప్రసన్నముగా నుండును. సాక్షాత్తు పూర్ణబ్రహ్మ, పరమేశ్వరుడు, మర్యాదాపురుషోత్తముడు ఐన శ్రీరామచంద్ర ప్రభువుయొక్క నామమును, రూపమును, గుణములను, చరిత్రను, ప్రభావమును, తత్త్వమును, పరమార్థమును అర్థము చేసికొని ఈ ప్రపంచము ప్రేమానందములో తన్మయతను చెందుచుండును. ఆయన ననుసరించు చుండును. విహరించుచుండును. అట్టి మహాపురుషులు నివసించు ఈ భూమి ధన్యమైనది. సాక్షాత్తు కళ్యాణప్రదులైన పురుషుల దర్శనము, వారితో భాషించుట, వారిని స్పృశించుట, స్మరించుట, మైత్రిని నెఱపుటయందలి ప్రయోజనము అత్యంత శ్రేయస్కరము. అట్టిదానిని పొందుట ఒక మహద్భాగ్యము. వారు పవిత్రులగుదురు. అట్టి పురుషులు నడిచిన దేశము తీర్థ స్థలముగా రూపొందును. ప్రేమ, ఆనందము, శాంతి నిరంతరముగా ప్రవహించుచుండును. అట్టి భగవత్పరాయణులు, పురుషరత్నములు జన్మించిన వంశము ధన్యమైనది. పరమపవిత్రులైన అట్టివారిని సకలజగత్తూ పూజించును. వారు జన్మించిన స్థలము పరమపవిత్రము, జగత్పూజ్యము. పరమేశ్వరుడగు శివుడు ఇట్లు చెప్పెను.

"ఉమా! వినుము. శ్రీరామభక్తి పరాయణులు జన్మించు వంశమే ధన్యము. అది జగత్తులో పరమపూజ్యము. అత్యంత పవిత్రము. (రా.మా.ఉ.కాం.దో.127)

❖ ❖ ❖

## 3. పరమాత్మను పొందుటకు శ్రద్ధ - విశ్వాసములు - తీవ్రమైన కోరిక - శరణుజొచ్చుట

భగవంతుని స్వరూపమును గూర్చిన జ్ఞానము లేనప్పటికిని, ఆయనయొక్క అస్తిత్వమును (ఆయన ఉన్నాడను నమ్మకమును) కలిగియున్నచో దానివలన కూడ పరమాత్మప్రాప్తి కలుగవచ్చును. కాని ఆ విశ్వాసము సంపూర్ణముగా ఉండవలయును. మనుష్యుని మనస్సులో ఆయన అస్తిత్వము మీద విశ్వాసము పెరుగుచున్నకొలదియు, అతడు ఆ స్వామికి దగ్గఱ అగుచుండును. భగవంతుని సగుణ నిర్గుణముల సాకార నిరాకారములలో ఏ స్వరూపమును గురించి కూడ ఎవ్వరికిని వాస్తవికమైన అనుభవము ఉండదు. కాని భగవంతుడు ఉన్నాడనుట సత్యము. ఆయన అంతటా వ్యాపించియున్నాడు. ఆయన సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, మిగుల వాత్సల్యము గలవాడు, పరమ దయాళువు, పతితపావనుడు. ఆ ప్రభువు అంతర్యామియై, మనము చేయు వాటినన్నిటిని చూచుచుండును. మనము మాట్లాడునవి అన్నియు వినుచుండును. మన హృదయములో నున్నవాటిని అన్నింటిని గూడ ఆయన ఎఱుగును. సాధకుడు ఇట్టి విశ్వాసమును కలిగియుండవలయును. అప్పుడు అతడు అబద్ధము చెప్పుట, కపటముగా వ్యవహరించుట, దొంగతనమునకు దిగుట, నమ్మకద్రోహమునకు పాల్పడుట, హింసచేయుట, వ్యభిచరించుట మొదలగువాటిని ఆచరింపడు. భగవంతుని పొందుటకు ఇవి నిషిద్ధములైనవి. భక్తుడు వీటికి దూరముగా ఉండవలయును. ఈ విశ్వాసము క్రమక్రమముగా వృద్ధియగుచున్నచో ఆ విపరీతమైన ఆచరణములకు అస్కారమే ఉండదు. విశ్వాసముతో యజ్ఞములు, దానములు, తపస్సు, తీర్థయాత్రలు, వ్రతములు, ఉపవాసములు, సేవలు, జపములు, పూజాపాఠములు, స్తుతులు, ప్రార్థనలు, సత్సంగములు, స్వాధ్యయనము మొదలగునవి అన్నియును పరమాత్ముని పొందుటకు మిగుల అనుకూలములు, ఉత్తమోత్తమములు. అవి ఆయనను ప్రసన్నునిగా చేసుకొనుట కొఱకే ఆచరింపబడుచుండును. భగవంతుని సేవించెడి భక్తులు ఓర్పు, దయ, శాంతి, సమత్వము, సరళత్వము, సంతోషము, భక్తి, జ్ఞానము, వైరాగ్యము మొదలగు భావములను కలిగియుండవలెను.

భగవంతుని పొందుటకు అవి అనుకూలములు, ఉత్తమోత్తమములు. అట్టివారి సేవలకు భగవంతుడు ప్రసన్నుడగును. భగవంతుని అస్తిత్వమునందుగల భక్తిపూర్వక విశ్వాసమే శ్రద్ధ. పరమాత్ముని గుణములను, ప్రభావమును, ఆయన తత్త్వమును, అందలి రహస్యములను అర్థము చేసికొనుటకు సాధకునకు ఆయనయందు మిగుల శ్రద్ధ యుండవలయును. అట్టి సాధకుని హృదయములో శాంతి, ప్రసన్నత క్రమముగా వృద్ధిచెందుచుండును. అప్పుడప్పుడు సాధకుని శరీరము రోమాంచితమగుచుండును. నేత్రములనుండి ఆనందాశ్రువులు రాలుచుండును. ఆనందాతిరేకమున హృదయము వికసించుచుండును. అప్పుడప్పుడు విరహవ్యాకులత చేత అతని ధైర్యము సడలిపోవుచుండును.నిజముగా భగవంతుడున్నచో మనము ఆయనను ఎందులకు పొందరాదు? అను భావము మనస్సున ఉదయించును. పరమాత్మునిలో ఏ విధమైన అశ్రద్ధయు ఉండదు. మన సాధనాలోపము చేతనే ఆయనను ప్రసన్నుని చేసికొనుటలో ఏదైనా ఆలస్యము జరుగవచ్చును. సాధనలోపమునకు ఆయనయందు విశ్వాసము తక్కువగుటయే కారణము. అది అజ్ఞానజనితము అనగా మూర్ఖత్వము వలన ఏర్పడినది.

భగవంతుడు నిశ్చితముగా ఉన్నాడనియు, ఆయన అనుగ్రహము పెక్కుమందికి ప్రాప్తించెననియు, ఇప్పుడు కూడ లభించుననియు గట్టి నమ్మకమును కలిగియుండవలయును. మనుష్యుడైన ప్రతివాడును ఆ ప్రభువును పొందు అధికారమును కలిగియున్నాడు - అన్న విశ్వాసము క్రమముగా పెరుగుచుండవలెను. నేను అర్హుడను కానప్పటికిని, దయామయుడగు భగవంతుడు నాకు మానవ శరీరమును ఒసగెను. తనను పొందుయోగ్యతను ప్రసాదించెను. అట్టి అధికారము ప్రాప్తించినను, నేను ఆయనను పొందలేకపోయినచో అది నా మూర్ఖతయే. అది నాకు మిగుల సిగ్గుపడవలసిన విషయము, దుఃఖింపదగిన విషయము. ఈవిధముగా పదే పదే ఆలోచించి, అర్థము చేసుకొనుచున్నచో భగవంతుడు ఉన్నాడన్న గట్టి నమ్మకము ఉత్తరోత్తరా పెంపొందుచుండును. దీనివలన సాధకుని మనస్సులో భగవంతుని పొందవలెనన్న కోరిక బలపడును. ఆ ఆకాంక్ష తీవ్రమగును. భగవంతునికృప లభింపలేకపోయినచో అతడు అసహనమునకు లోనగును.

కాని, అప్పుడు సాధకుడు భగవంతుని పొందుటలో ప్రయత్నలోపమును ఏ మాత్రమూ రానీయడు. భగవంతుని పొందవలెనను కోరిక అతనిలో తీవ్రమైనచో ఆ ప్రభువు అతనిని అనుగ్రహించకుండా ఉండజాలడు. ఆ స్వామిని పొందుటకు సాధకుడు మిగుల ఆతురత కలిగియుండును. ఒక్క క్షణమైనను భగవంతుడు భక్తుని ఎడల అశ్రద్ధచూపడు. కనుక సాధకునిలో భగవంతుని అస్తిత్వవిషయమునందు విశ్వాసము తీవ్రమగుచు వృద్ధి పొందుచుండ వలయును. భక్తితోకూడిన సంపూర్ణ విశ్వాసమే. పరమశ్రద్ధ యగును. అట్టి పరమశ్రద్ధ కలిగిన వెనువెంటనే పరమాత్మప్రాప్తి కలుగును. అప్పుడు ఒక్క క్షణమైనను ఆలస్యమునకు తావుండదు. భగవంతుని పొందుటలో కలుగు జాప్యమునకు మన శ్రద్ధా విశ్వాసముల యందలి లోపమే ముఖ్యకారణము.

## శాస్త్రములయెడలను, మహాత్ములయందు శ్రద్ధ

శాస్త్రములపైనను, మహాత్ములయందును నమ్మకముండినచో భగవంతుని పొందుట శీఘ్రాతిశీఘ్రముగా జరుగును. శాస్త్రములు 'భగవంతుడున్నాడని' వచించును. మహాత్ములు కూడ ఇదియే చెప్పుదురు. శాస్త్రవచనముల కంటె కూడ మహాత్ముల మాటలు మిగుల శక్తిమంతములు. మహాత్ములు పరమాత్మను దర్శించియే భగవంతుడున్నాడని వచింతురుగదా! మహాత్ములు నుడువునదే సత్యము. అసత్యమును పలికెడివారు మహాత్ములే కారు కదా! మహాత్ములు 'పరమాత్ముడున్నాడు' అని పలుకుచుందురు. అందులకు శాస్త్రములే ప్రమాణములు. ఈ విధముగా మహనీయుల వచనములు శాస్త్రవచనములతో సమానమగును. కాని శాస్త్రప్రమాణములను చూపకున్నను "భగవంతుడు నిశ్చితముగా ఉన్నాడు" అని మహాత్ములు అనుభవపూర్వకముగా చెప్పినచో అది ఇంకను బలమును చేకూర్చును. అది శాస్త్రప్రమాణము కంటెను గొప్పది. ఎందుకనగా పరమాత్మ సాక్షాత్కారము కలుగనిదే వారట్లు చెప్పరు కదా!

కనుక మహాత్ములమనస్సును (అభిప్రాయములను) గ్రహించి, ప్రవర్తించువారికి తప్పక శ్రేయస్సు కలుగును. దీనిని గుఱించి ఇక చెప్పవలసిన దేమున్నది? వారి సంకేతములను (సూచనలను) పాటించి, వారి

ఆజ్ఞానుసారముగ ఆచరించినచో సాధకులు నిశ్చితముగ పరమాత్మ ప్రాప్తిని పొందగలరు. శాస్త్రానుగుణముగ నడుచుకొనినచో శుభములు కలుగును. అట్టి ఎడ మహాపురుషులు చెప్పిన మార్గములలో నడచినను, వారిని అనుసరించినను శ్రేయస్సు కలుగుననుటలో సందేహమేమియునులేదు. కాని వారి వచనముల యందు మిగుల ప్రమాణబుద్ధి యుండవలయును. మన మిట్లు అనుకొందము. ఒక మహాత్ముడు ఒక శ్రద్ధాళువుతో ఇట్లు పలికెను. 'ఫలానా సంస్థకు ఒక మూట గోధుమలను, పది కంబళ్లను పంపించుము' అంతట ఆ మానవుడు తన బుద్ధిని ఉపయోగించి ఇట్లు సమాధానమొసగెను. "ఈ ఋతువు కంబళ్లను ఉపయోగించునదికాదు. వాటి నడుగువారును లేరు. వాటి అవసరమును లేదు". అప్పుడు ఆ మహాత్ముడు ఇట్లు చెప్పెను. "మంచిది గోధుమలనైతే పంపుము". ఆ శ్రద్ధాళువు ఈ విధముగా వచించెను". ఇక్కడ ఇంకను గోధుమలధర ఎక్కువగానున్నది. ఐదు దినముల తరువాత తగ్గిపోవును. ఇతర ప్రదేశములలో ధరలు పడిపోయినవి. ఇక్కడకూడ తగ్గిపోవును. కనుక వెల తగ్గిన తరువాత గోధుమలను పంపెదను". ఆ మహాత్ముడిట్లు వచించెను. "చాలమంచిది. నీవనుకొన్నట్లే చేయుము". దీనిని శ్రద్ధ అనరు. ఇచట మహాత్ముని ఆజ్ఞను, చెప్పినది చెప్పినట్లు చేయక శ్రద్ధాళువు తన బుద్ధిని ఉపయోగించెను. ఆ మహాత్ముడు తన స్వాభావిక ఔదార్యముచేత అతని మాటలకు సమ్మతించెను. మహాత్ములు స్వాభావికముగా ఉదారులై యుందురు గదా! ఇచట ఈ సాధకుడు శ్రద్ధకు ఏవిధమైన విలువ ఇయ్యలేదు. ఇతడు శ్రద్ధాళువును కాజాలడు, అది శ్రద్ధయును కాదు. మహాత్ముని ఆజ్ఞ తనకనుకూలముగ ఉండినచో సాధకుడు దాని నంగీకరించును. కాని అట్టివాడు శ్రద్ధాళువుకాడు. అట్టి శ్రద్ధకు ఏ విధమైన విలువయు ఉండదు. మహాత్ముని ఆజ్ఞలు తనకు అనుకూలముగ నుండినచో సాధకుడు వాటిని పాటించును. అయితే ఇతడు కూడ శ్రద్ధాళువు కాడు ఆ సత్పురుషుని ఆజ్ఞ సాధకునకు ప్రతికూలముగా తోచినను అతడు తన ధోరణిని విడనాడి దానిని అంగీకరించినను ఇది కూడ శ్రద్ధ అనబడదు. తనకు విపరీతముగ అనిపించినను మహాత్ముల ఆజ్ఞలను సంతోషముగ ఆచరించువాడే నిజమైన శ్రద్ధాళువు. యుధిష్ఠిరుడు మొదలగు ఐదుగురు సోదరులును, ద్రౌపదీదేవిని

వివాహము చేసికొనిరి. ఈ విషయములో తల్లియగు కుంతీదేవి వచనము లోకమునకు విరుద్ధముగ, శాస్త్రవిరుద్ధముగ కన్పింపవచ్చును. ఐనప్పటికిని వారు సంతోషముగా తమ తల్లి వచనములను తు.చ. తప్పకుండా పాటించిరి. దీనినే శ్రద్ధ అందురు.

వాల్మీకిరామాయణము నందలి అయోధ్యాకాండమున ఇట్లున్నది. వనములకు వెళ్లు సమయమున శ్రీరామచంద్రుడు కౌసల్యాదేవి చెంతకు వచ్చెను. "తండ్రి ఆజ్ఞానుసారము వనములకు వెళ్లుచున్నాను" అని తన తల్లితో ఆ ప్రభువు పలికెను. అపుడు తల్లి కౌసల్యాదేవి ఇట్లు నుడివెను. "తండ్రి నిన్ను వనములకు వెళ్లుమని ఆజ్ఞాపించెను. నేను వెళ్లవలదని ఆజ్ఞాపించుచున్నాను". తన తల్లి వచనములను వినిన పిదప పరమాత్ముడగు శ్రీరామచంద్రుడు ఇట్లు పలికెను. "తండ్రిగారి ఆజ్ఞను జవదాటుటకు నాకు శక్తి చాలదు. కనుక నేను వనములకు వెళ్లదలచుకొన్నాను. ఇందులకు అడ్డుచెప్పక దయచేసి నీవు నాకు అనుమతి ఇమ్ము".

అప్పుడు కౌసల్యాదేవి ఇట్లు చెప్పెను.

"నాయనా! ఇది కేవలము తండ్రిగారి ఆజ్ఞమాత్రమేయైనచో నీవు వనములకు పోవలదు. తల్లి స్థానము తండ్రి స్థానము కంటె ఉన్నతమైనది. తల్లిదండ్రులిద్దఱును నిన్ను వనములకు పొమ్మనినచో అడవులకు వెళ్లుట యుక్తమే. అప్పుడు ఆ వనములు నంద అయోధ్యలతో సమానము.

(రా.మా. అయోధ్యా. దో. 55-1)

పరమాత్ముడగు రామచంద్రునకు తన తండ్రియగు దశరథుని యందుగల శ్రద్ధ ఆదర్శప్రాయమైనది. అట్టిది పరమశ్రద్ధ యగును.

ఆయోదధౌమ్యుడను మహాముని, ఒకనాడు తన శిష్యుడగు ఆరుణితో ఇట్లు చెప్పెను. 'నీవు పొలమునకు వెళ్లి క్రిందివైపునకు ప్రవహించుచున్న నీటిని ఆపివేయుము'. ఆరుణి అచటికి వెళ్లి మట్టితో జలప్రవాహమును ఆపుటకు ప్రయత్నించెను. కాని అది ఫలించలేదు. మట్టితో అడ్డుకట్టలను తయారుచేసెను. కాని బలమైన జలప్రవాహమునకు అవియును కొట్టుకొని పోవుచుండెను. ప్రవాహము అప్పటికినీ ఆగలేదు. అప్పుడు ఆరుణి స్వయముగా

ఆ ప్రవాహమునకు అడ్డముగా పరుండెను. అంతట నీటి ప్రవాహము ఆగిపోయెను. కొద్దిసేపటి తరువాత గురువుగారు 'ఆరుణి ఎక్కడకు వెళ్లెను', అని శిష్యులను అడిగెను. అప్పుడువారు 'పొలమునందలి నీటిని ఆపుటకు మీరే అతనిని పంపితిరికదా' అని సమాధానమొసగిరి. అప్పుడు అయోదధౌమ్యముని ఆ మాటలను విని ఇట్లు పలికెను. 'ఇప్పటివరకు ఆరుణి తిరిగిరాలేదు. ఏమి జరిగినదో తెలియదు. రండు, మనమందరము అచటికే వెళ్లుదము''. తదనంతరము శిష్యులను వెంటబెట్టుకొని మహాముని పొలమునకు చేరెను. ఆరుణి స్వయముగా ప్రవాహమునకు అడ్డముగా పరుండి ఆ నీటిని ఆపియుండెను. 'నాయనా! ఆరుణీ! నీవెక్కడ ఉన్నావు? ఇచటికి రమ్ము!" అని ఆ మునీంద్రుడు పిలిచెను. ఆరుణి లేచి గురువుగారి దగ్గఱకు వచ్చెను. చేతులు జోడించి ఇట్లు పలికెను. "మీ ఆజ్ఞ ప్రకారము నేను నీటి ప్రవాహమును ఆపుటకు ప్రయత్నించితిని. కాని నీటి ప్రవాహము ఆగలేదు. కనుక నేను స్వయముగా, అడ్డముగా పరుండి నీటి ప్రవాహమును ఆపితిని. మీ పిలుపును విని ఇప్పుడిచటకు వచ్చితిని. మీకు నమస్కరించుచున్నాను. ఇప్పుడు మీరు నన్ను ఆజ్ఞాపించుడు. నీటిని అటులనే ఆపి ఉంచవలయునా? లేక ఏదేని ఉపాయమును చెప్పుదురా?" అప్పుడు గురువుగారు ఇట్లు పలికిరి. "నీవు స్వయముగా ఆనకట్టను నిర్మించి - ఉద్ధరించి వచ్చితివి. కనుక ఉద్దాలకుడను పేరుతో నీవు ప్రసిద్ధిచెందెదవు' ఆచార్యుడు ఉద్దాలకుని కరుణించి మరియు ఇట్లు పలికెను. "నీవు నా మాటలను పాటించితివి. కనుక నీకు శ్రేయస్సు కలుగుగాక! వేదములును సకలధర్మశాస్త్రములును నీకు సహజముగనే అబ్బును." గురువుగారి నుండి వరమును పొంది, ఆరుణి తన దేశమునకు తిరిగివెళ్లెను. ఆయనకు గురువుపై గల శ్రద్ధచేత చదువకుండగనే వేదజ్ఞానము ప్రాప్తించెను. (మహాభారతము, ఆది. 3/21-33)

శ్రీహరిద్రుమతగౌతముడను పేరుగల ఒక ఋషి ఉండెను. జాబాల కుమారుడైన సత్యకాముడు ఆ మహర్షి దగ్గఱకు వెళ్లెను. "స్వామీ! నేను బ్రహ్మచర్యమును పాటించుచు మిమ్ములను సేవించవలెననెడి కోరికతో ఇచటికి వచ్చితిని" అని పలికెను. నీ గోత్రము ఏమిటని గౌతముడు అతనిని

అడిగెను. అప్పుడతడు ఇట్లు సమాధానమొసగెను. నేను ఈ విషయమును మా తల్లి నడిగితిని'. ఆమె ఇట్లు పలికెను. 'నేను మీ తండ్రిగారి సేవ చేయుచుంటిని. గోత్రమును గుఱించి నాకు తెలియదు. నీ పేరు సత్యకాముడు, నాపేరు జాబాల" అని నుడివెను. ఆ మాటలకు గౌతముడు మిగుల సంతసించెను. ఆయన సత్యకామునితో ఇట్లు పలికెను. "నీవు సత్యమును చెప్పుచున్నావు. కనుక నీవు బ్రాహ్మణుడవు. నేటినుండి నీ తల్లి పేరుతోనే నీ గోత్రము ప్రవర్తిల్లును". పిమ్మట అతనిని శిష్యునిగ స్వీకరించి గౌతముడు. "నీవు సమిధలను తీసుకొనిరమ్ము, నేను నీకు ఉపనయనమును చేసెదను" అని పలికెను కొంతకాలము తరువాత ఆ మహర్షి నాలుగువందల గోవులను మందనుండి వేరుచేసి నీవు వీటివెంట వెళ్లుము' అని పలికెను. వాటిని తీసికొనిపోవునపుడు సత్యకాముడు గురువుగారితో ఇట్లు వచించెను. "ఈ గోవులసంఖ్య వెయ్యి అగునంతవరకు నేను తిరిగిరాను". ఇట్లు పలికి అతడు వనములకు వెళ్లెను. అచటనే అనేక సంవత్సరములుండెను. గోవుల సంఖ్య వెయ్యికి పెరిగెను. అప్పుడొక ఎద్దు ఇట్లు పలికెను. "ఇప్పుడు మా సంఖ్య వెయ్యికి పెరిగినది. మమ్ములను గురువుగారివద్దకు తీసికొనివెళ్లుము". అతడు గోవులను తీసికొని గురువుగారి దగ్గఱకు వెళ్లుటకు బయలుదేరెను. వెళ్లునప్పుడు త్రోవలో ఆయునకు ఆబోతుద్వారా బ్రహ్మయొక్క మొదటిపాదము, అగ్నిద్వారా రెండవపాదము, హంసద్వారా మూడవపాదము, మద్రువుద్వారా నాల్గవపాదముయొక్క ఉపదేశము ప్రాప్తించెను. ఈ విధముగా అప్రయత్నముగా బ్రహ్మోపదేశమును పొంది సత్యకాముడు బ్రహ్మజ్ఞాని అయ్యెను. అతడు గోవులను తీసికొని గురువుగారి దగ్గఱకు వెళ్లెను. గురువుగారైన గౌతముడు సత్యకాముని ముఖమునందు తేజస్సును, ప్రశాంతభావమును చూచి ఇట్లు నుడివెను. "సత్యకామా! నీకు బ్రహ్మజ్ఞానము కలిగినది. తేజోవిలసితమగు నీ ముఖము చూచినతోడనే ఆ సంగతి తెలియుచున్నది". అప్పుడు సత్యకాముడు "మీరు వచించినది సత్యము. ఐనప్పటికిని నేను మీ నుండి బ్రహ్మజ్ఞానమును పొందగోరుచున్నాను". అప్పుడు గురువైన గౌతముడు అతనికి బ్రహ్మజ్ఞానమును ఉపదేశించెను (ఛాందోగ్య. 4/4-9). ఈ కథవలన ఉద్దాలకుని శ్రద్ధ సర్వోత్కృష్టమైనదని స్పష్టమగు చున్నది.

గురువుగారి ఆదేశము తనకు ప్రతికూలముగ ఉండినను దానిని సంతోషముతో ఆచరించుటయే శ్రద్ధ - గురువుగారి ఆజ్ఞ సాధకుని మనస్సునకు ఎంత విరుద్ధమైనదిగా తోచినను, శిష్యుని మనస్సులో అది మిక్కిలి ఆనందమును కలుగజేయవలయును. అచట గురువుగారి ఆజ్ఞ ఎంత విపరీతముగ తోచునో దానిని అమలుపరచుటలో శిష్యునకు అంతకంటె ఎక్కువ ఆనందము కలుగవలెను. శిష్యుని సంతోషమునకు కూడ అవధులుండవు. గురువుగారి ఆజ్ఞ తనకు మిగుల ప్రతికూలము కావచ్చును. దానిని పాటించునపుడు శిష్యునియందు సంతోషము, ప్రశాంతత మొదలగునవి క్రమక్రమముగా వృద్ధియగుచుండును. దానివలన హృదయము నందు సంతోషము, వికాసము, శరీరమునందు రోమాంచము, కనులనుండి అశ్రుపాతము, మొదలగునవి కలుగును. వాటికి అంతము ఉండదు. ఆ స్థితి నిరంతరము ఎక్కువ అగుచునే యుండును. ఇదియే పరమశ్రద్ధ.

శ్రద్ధాభావముచేత భక్తుడు ప్రభావితుడై ప్రభువుయొక్క మనస్సును, ఆయన సూచనలను, ఆజ్ఞలను అనుసరించినచో అతనికి శీఘ్రాతిశీఘ్రముగా శ్రేయస్సు చేకూరును. ఇందులో ఏ విధమైన సందేహమునకు తావులేదు. శాస్త్రమునందు చెప్పిన విధులను పాలించుటలో సరియగు శ్రద్ధాభావమున్నచో, దానినే శాస్త్రమునందు తెలుపబడిన పరమశ్రద్ధయని అవగతము చేసికొనవలయును.

## పరమేశ్వరుని పొందుటకు బలమైన కోరిక

ఒక సోదరుడు దుర్గుణములతో, దురాచారములతో కూడియుండెను. ఒకనాడు ఆతడు పరమేశ్వరుని పొందుటచే కలుగు మహిమను గూర్చి వినెను. అంతట అతని మనస్సులో పరమాత్మప్రాప్తికై బలమైన కోరిక ఉదయించెను. అట్టి పరిస్థితులలో దయామయుడగు ఆ పరంధాముడు అతని దుర్గుణములను, దురాచారములను పట్టించుకొనక శీఘ్రముగా అతనికి దర్శనమిచ్చుటకు సిద్ధపడును. ఒకానొక బాలుడు రెండు సంవత్సరముల ప్రాయమువాడు కలడు. ఆ పసివాడు మలమూత్రములచే తడిసియుండెను.

అతడు తన తల్లికొఱకు తహతహలాడుచుండెను. తల్లి ప్రేమమూర్తి. కనుక ఆ దుర్భరస్థితిని పక్కనబెట్టి ఆ తల్లి తన పసికందును నీటితో శుభ్రము చేసెను, ప్రేమతో తన అక్కున చేర్చుకొనెను. ఆ పసివాడు తన తల్లి ఆలస్యమునకు ఓపికపట్టలేనంతగా ఆతురతకు లోనగుచుండెను. మలమూత్రములచే తడిసియున్నందున తల్లి తనను అక్కున చేర్చుకొనుటకు ఆలస్యము జరుగుచున్నదని ఆ పసివానికి తెలియదు కదా! ఆ బాలుడు అమ్మ ఒడిలో చేరుటకు కలతచెందుచు అతి దీనముగా వెక్కివెక్కి ఏడ్చుచుండెను. ఆ స్థితిలో మిక్కిలి ఆందోళనకు లోనగుచున్న ఆ పసివానిని ప్రేమమూర్తియగు ఆ జనని తన ఒడిలోనికి చేరదీసి అక్కున చేర్చుకొనెను. కాని భగవంతునివాత్సల్యము అపారముగదా! ఆ స్వామి ఆలస్యమెట్లు చేయగలడు?

ఆ బాలుడు మలమూత్రములతో తడిసియున్నందున ఆ తల్లి శుభ్రము చేయుటకు కొంత ఆలస్యమును గూడ చేయవచ్చును. కాని సాధకుని దురాచారములు, దుర్గుణములు భగవంతుని దృష్టికి రావుగదా! అట్టి ఎడ ఆలస్యము జరుగుటకు ఆస్కారమే ఉండదు. అతడెట్టి దుర్గుణములు గలవాడైనను పరమాత్మను చేరుటకు అతనిలో కోరిక మాత్రము తీవ్రముగా ఉండవలయును. తనను పొందదలచిన సాధకునియొక్క ప్రబలమగు కోరికను అతని భక్తిశ్రద్ధలను మాత్రమే ఆ సర్వేశ్వరుడు చూచును. పరమేశ్వరుని పొందుటతోడనే సాధకుని దుర్గుణములు, దురాచారములు దూరమగును.

కనుక మన హృదయమునందు ఆ స్వామిని చేరవలెనను బలమగు ఇచ్ఛ, పరమభక్తిశ్రద్ధలు ఉండవలయును. సాధకుడు ప్రాణములున్నంతవరకు దీనిని సాధించుటకు ప్రయత్నించుచుండవలెను.

## భగవంతునిమీద ఆధారపడుట

పిల్లిపిల్ల తన తల్లిమీద ఆధారపడి ఉండును. మనము దానికంటె కూడ ఎక్కువగా పరమేశ్వరునిపై భారమువేసి యుండవలయును. రెండు సంవత్సరముల బాలుడు కొంచెముసేపు కూడ తల్లిని వదలిపెట్టి ఉండడు. తల్లి కొట్టినను, బుజ్జగించినను ఆ పసికందు ఆమెనే చేరును. తన తల్లిమీదగల

నమ్మకము ఆ బిడ్డకు ఆధారము. ఆ వయస్సులో అతడు తన తల్లిని తప్ప ఇంకెవ్వరిని ఎరుగడు. ఒక్క తల్లిమీదనే అతడు సంపూర్ణముగ ఆధారపడి ఉండును. ఇదేవిధముగా భగవంతుడు తరింపజేసినను, నశింపజేసినను శుభములను కోరుకొనువాడు తన శ్రేయస్సుకొఱకు భగవంతునిమీదనే ఆశలుపెట్టుకొని యుండును. సాధకుడు తన లాభనష్టములను గుఱించి ఏమియు ఆలోచింపడు. కేవలము పరమాత్మనే పూర్తిగా నమ్మియుండును. భగవంతుని సంకల్పముల ననుసరించి సాధకునకు సుఖదుఃఖాదులు ప్రాప్తించుచుండును. అవి ఆయన అనుగ్రహించిన బహుమానములుగ (కానుకలుగ) తలంచి ఎల్లవేళల సంతోషముగా నుండవలయును. మన సకల కర్మలను ఆ మహాత్ముడే మనతో చేయించుచున్నట్లుగా భావించవలయును. అవి అట్లే జరుగుచుండును. ఈ విషయమునందు అకర్మణ్యతగాని, సకామకర్మలుగాని, శాస్త్రనిషిద్ధములైన కర్మలుగాని జరుగుచుండవచ్చును. అప్పుడా కర్మలయందు పరమాత్మునిజోక్యము ఎంతమాత్రము ఉండదు. పనులయొక్క ప్రభావమే ఉండును. భగవంతుని జోక్యముండినచో కర్తవ్యకర్మలు అవహేళనకు పాత్రములు కావు. కోరికలు లోపించుటవలన సకామకర్మలుకూడ జరుగవు. అప్పుడు పాపకర్మలు ఏవిధముగ చేయబడును? ఒకవేళ చేయబడినచో అవి మనము చేయు పనులలోని భాగమేయని తెలిసికొనవలెను. గీతయందు అర్జునుడు పరమాత్ముని ఇట్లు అడిగెను.

అథ కేన ప్రయుక్తోఽయం పాపం చరతి పూరుషః ।
అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః ॥ (గీత.3/36)

"ఓ కృష్ణా! మానవుడు తనకు ఇష్టము లేకున్నను ఇతరులు బలవంతము చేసినట్లుగా దేని ప్రభావముచే ప్రేరితుడై పాపములను చేయుచుండును?"

భగవంతుడు అర్జునుని ప్రశ్నకు సమాధానముగ ఇట్లు నుడివెను.

కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః ।
మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ ॥ (గీత.3/37)

"రజోగుణమునుండి ఉత్పన్నమగునదే కామము. ఇదియే క్రోధరూపమును దాల్చును. ఇది మహాశనము. భోగానుభవములతో ఇది చల్లారునది గాదు. పైగా అంతులేని పాపకర్మాచరణములకు ఇదియే ప్రేరకము. కనుక ఈ విషయమున దీనిని పరమశత్రువుగా ఎఱుంగుము."

భగవంతునిమీద ఆధారపడుట అనగా బాలకునివలె పూర్తిగా సకలకర్మలను పరిత్యజించుటకాదు. బాల్యమునందు పరిజ్ఞానముండదు కనుక ఆ బాలునకు కర్తవ్యము వర్తించదు. కాని జ్ఞానమున్నవాడు సంపూర్ణముగ కర్మలను వదలిపెట్టుట అనునది భగవంతునిమీద ఆధారపడుట కాదు. అది ముఖ్యముగ అకర్మణ్యత, ఏమఱుపాటు అగును. పరమాత్మునిమీద ఆధారపడినవాడు చింత, శోకము, భయము, ఈర్ష్య, ఉద్వేగము మొదలగు దోషములనుండి దూరమగును. అతనిలో ధైర్యము, వీరత్వము, గాంభీర్యము, భయము లేకుండుట, శాంతి, సంతోషము, సారళ్యము మొదలగు దివ్యగుణములు స్వయముగా చోటుచేసికొనును.

కనుక పరమాత్మప్రాప్తికొఱకు ఆ స్వామిని శరణు పొందవలయును. నిత్యము, నిరంతరము ఆయన నామరూపములను ధ్యానించుచుండ వలయును. ఆ పరంధాముని మీదనే పూర్తిగా ఆధారపడియుండవలయును. భగవంతుడు చేయు పనులన్నియు ఆయన లీలలని తలంచి వాటిని దర్శించుచుండవలయును. వాటియందే ఆనందము ననుభవించవలయును.

❖ ❖ ❖

## 4. ఈశ్వరసాక్షాత్కారమునకు నామజపమే అన్నింటికంటెను అత్యుత్తమమైన సాధనము

వాస్తవముగా మనస్సు నిరంతరము భగవంతుని నామజపమునందు సంలగ్నమై ఉండవలెను. నామముయొక్క ప్రీతికరమైన మధురస్మృతిచేత క్షణక్షణము రోమాంచము కలుగుచుండును. ఆనందబాష్పములు రాలుచుండును. ఒక్కక్షణమైనను దైవనామమును మానివేయుట జరిగినచో నీటిని ఎడబాసిన చేపవలె సాధకుడు విలవిలలాడును. సత్పురుషులు ఒక్క నిముసము కూడ పరంధాముని నామమును జపించుట వీడజాలరు. వారు నిష్కామభావముచేత నిరంతరము భక్తిశ్రద్ధలతో జపించుచు తన్మయతను చెందుచుందురు. అట్టి మహాత్ములే నామమహిమను సంపూర్ణముగ వర్ణించుటకు అర్హత కలిగియుందురు. అట్టివారి రచనలనుండి విశేష ప్రయోజనము చేకూరగలదు. నేను ఒక సాధారణ మానవుడను. పరమాత్ముడు గుణములకు పరమనిధి. ఆ స్వామి గుణములు అపరిమితములు. ఆయన నామమహిమ వర్ణనాతీతము. ఆ మహిమను వర్ణించు సామర్థ్యము నాకులేదు. ఐనప్పటికిని కొంతమంది మిత్రుల పట్టుదలచేత నాకు తెలిసినమేరకు వివరించుటకు నేను సాహసించుచున్నాను. కనుక ఈ రచనయందు ఏమైనా పొరపాట్లు దొర్లినచో మీరు నన్ను క్షమించగలరు.

### మహిమను గూర్చిన సూక్ష్మవివరణము

భగవంతుని నామమహిమ అపారమైనది. అన్నియుగములందును దీనిమహిమ విస్తృతముగ చెప్పబడినది. సకల శాస్త్రములును, సత్పురుషులును ముక్తకంఠముతో నామమహిమను వెల్లడించిరి. కాని కలియుగమునందు ముక్తిని పొందుటకు నామజపము ప్రముఖమైనది. దానితో సమానమైన ఉపాయము ఇంకేదియు చెప్పబడలేదు.

నారద పురాణమునందు ఇట్లు పేర్కొనబడినది.

హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలమ్ ।
కలౌనాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతిరన్యథా ॥ (నారదపురాణం, 1/41/115)

కలియుగమునందు శ్రీహరినామమును జపించుటయే ఉత్తమ తరణోపాయము. ముక్తిసాధనకు దీనిని మించినది మఱియొకటి లేనేలేదు. ఇది ముమ్మాటికి నిజము.

శ్రీమద్భాగవతమునందు నామమహిమ ఇట్లు వర్ణింపబడినది.

కృతే యద్ ధ్యాయతో విష్ణుం త్రేతాయాం యజతో మఖైః ।
ద్వాపరే పరిచర్యాయాం కలౌ తద్ధరికీర్తనాత్ ॥

శ్రీమద్భాగవతము (12/3/52)

సత్య (కృత) యుగమునందు, పరమాత్ముడగు శ్రీమహావిష్ణువును ధ్యానించుటవలనను, త్రేతాయుగమునందు యజ్ఞములు చేయుటవలనను, ద్వాపరయుగమునందు ఆ పరమేశ్వరుని సేవించుట, పూజించుటవలనను కలుగు ఫలము కలియుగమునందు కేవలము ఆ దేవదేవుని యొక్క నామసంకీర్తనము చేతనే లభించును.

"మానవులు కలియుగమున శ్రీహరిగుణములను గానముచేసి జననమరణ చక్రమునుండి ముక్తిని పొందెదరు. అదియే కలియుగమున మోక్షప్రాప్తికి ఆధారము. మానవుడు తగిన విశ్వాసము కలిగియున్నచో కలియుగముతో సమానమైన యుగములేదు. ఏలనన శ్రీరాముని నిర్మల గుణగణములను స్మరించి, ఎట్టి ప్రయాసయు లేకుండగనే అతడు సంసారసాగరమును దాటగలడు." (రా.మా. ఉ.కాం. 103 ఖ)

ఇంకను తులసీదాసు ఇట్లు పలుకుచున్నాడు. "నీవు లోపల బయట కూడ ప్రకాశమును కోరుకొనినచో ముఖమనెడి ద్వారమున నాలుకయనెడి గడపపై రామనామమను మణిదీపమును ఉంచుము. సర్వవిషయ వాంఛారహితులై రామభక్తిరసమునందు మునిగిన వారియొక్క మనస్సులు రామనామమనెడి మనోహర ప్రేమామృత సరోవరమునందు చేపలవలె హాయిని అనుభవించు చుండును. శబరి, జటాయువు, మొదలగు భక్తులకు మాత్రమే రఘునాథుడు ముక్తిని ప్రసాదించెను. కాని రామనామము పెక్కుమంది దుర్మార్గులను కూడ ఉద్ధరించెను. రామనామమహిమను వేదములును ప్రస్తుతించినవి.

(రా.మా. బా.కాం. దో.21, 22, 24)

శ్రీరామచంద్రుని భజింపక ముక్తిని కోరుకొను మనుష్యుడు జ్ఞానియైనను తోకయు, కొమ్ములులేని పశువుతో సమానము.

"నీటిని చిలికి నేతిని తియ్యవచ్చును. ఇసుక నుండి తైలమును తీయవచ్చును. కాని శ్రీహరిని సేవింపనిదే సంసారసాగరమునుండి తరించుట దుర్లభము. ఇది తిరుగులేని సిద్ధాంతము." (రామా. ఉ.కాం.దో. 78ఞ 122క)

భక్తులు ప్రేమాదరములతో అనాయాసముగా నామజపముచేసి శుభములకును ఆనందమునకును నిలయములైరి. ఈ నామజపమహత్త్వము వలననే ప్రహ్లాదుడు భక్తశిరోమణియై శ్రీహరికృపకు పాత్రుడయ్యెను. పావనియైన హనుమంతుడు ఈ పావననామస్మరణముచే శ్రీరాముని తన వశమునందుంచుకొన గలిగెను. పతితుడైన అజామీళుడు, ఆర్తుడైన గజేంద్రుడు, చిలుకకు రామనామమును నేర్పిన గణికాంగనయు శ్రీహరి నామమహిమచే ముక్తిని పొందిరి. నాలుగుయుగములందును, మూడు కాలములయందును (భూత భవిష్యద్ వర్తమానములు), మూడు లోకముల యందును పరమాత్ముని నామమును జపించి జీవులు శోకరహితులైరి. నామమహిమను గూర్చి నేనేమని (ఎంతని) చెప్పగలను? ఆ శ్రీరాముడు సహితము నామమహిమను వర్ణింపజాలడు.

(రా.మా. బా.కాం. దో. 23-1, 25-23, 26-1, 25-4)

నామమహిమను గురించిన ప్రమాణములు అసంఖ్యాకములు. వీటితో మన శాస్త్రములన్నియు నిండియున్నవి. విస్తారభయముచేత ఇచట ఈ కొన్నిటిని మాత్రమే ఉదహరించుట జరిగినది.. ఈశ్వరుని నామమహిమను ప్రపంచమున గల సకల మతములు అంగీకరించును, గానము చేయును. అభిరుచినిబట్టి వాటి భావములకనుగుణముగ నామములయందు భేదముండును. ఆ పరంధాముని దివ్యనామములలో ఏదైనను సరే. ఒకేవిధమైన శ్రేయస్సును కలుగజేయును. కనుక తమకు ఇష్టమువచ్చిన భగవన్నామమును ఏకాగ్రతతో జపించుచు అభ్యాసము చేయుచుండ వలయును.

## నా అనుభవము

నామజపమహత్త్వమును గురించి నా అనుభవములను వ్రాయుమని మిత్రులు కొందరు నన్ను కోరిరి. కాని భగవన్నామమును విశేషసంఖ్యలో జపించకపోయినచో నా అనుభవములను నేనెట్లు వ్రాయగలను? పరమాత్ముని కృపచేత కొంచెముగా నామస్మరణ చేయగలిగితిని. దాని మహత్త్వమును కూడ సంపూర్ణముగ వ్రాయజాలను.

నేను నా చిన్నతనమునుండే రామ (దైవ) నామజపమును అభ్యాసము చేయుట ప్రారంభించితిని. దానివలన నా మనస్సునందున్న విషయవాసనలు మెల్లమెల్లగా తక్కువ కాసాగెను. పాపములనుండి దూరమగుటకు అది నాకు మిగుల తోడ్పడినది. కామక్రోధాది - అవగుణములు తక్కువకాజొచ్చెను. అంతఃకరణమునందు శాంతివృద్ధిచెందదొడంగెను. అప్పుడప్పుడు కళ్లు మూసికొనుటవలన పరమాత్ముడగు శ్రీరామచంద్రుని ధ్యానము కూడ చక్కగా సాగుచుండెను. మనస్సునుండి ప్రాపంచిక స్ఫురణ దూరమగుచుండెను. భోగములనుండి వైరాగ్యము కలుగుచుండెను. ఆ సమయమున వనవాసముగాని, ఏకాంతముగా ఉండుటగాని అనుకూలమని అనిపించుచుండెను.

నాకు ఈ విధముగ నామజపముయొక్క అభ్యాసము సాగిపోవుచుండెను. ఒకనాడు స్వప్నమునందు సీతాలక్ష్మణ సమేతుడైన పరమేశ్వరుడగు శ్రీరామచంద్రుని దర్శనము నాకు కలిగినది. ఆ ప్రభువుతో నేను మాట్లాడుట కూడ జరిగినది. వరమును కోరుకొమ్మని అనేకవిధముల ఆస్వామి నాతో పలికెను. కాని నాకు వరమును కోరుకొనెడి కాంక్ష లేకుండెను. ఆ రఘురాముడు వరమునడుగుమని నన్ను బలవంతము చేసెను. అప్పుడు నేను "మీ నుండి' నాకు ఎప్పటికిని ఎడబాటు లేకుండునట్లు వరమును ప్రసాదించు"మని అడిగితిని. ఇది తప్ప ఇంకేదియు నేను కోరుకొనలేదు.

పిమ్మట నామజపమువలన నాకు ఎంతయో ప్రయోజనము కలిగెను. ఆ మహత్త్వమును వర్ణించు సామర్థ్యము నాకు లేదు. భగవద్గీతను అభ్యాసము చేయుటవలన కలిగిన లాభమును ప్రక్కనబెట్టినచో - అంతటి ప్రయోజనము

నాకు ఆ స్వామి నామమును జపించుటవలన కలిగినది. అంతటి శ్రేయస్సు ఇంక ఏ ఇతర సాధనములవలన కూడ నాకు సమకూరలేదు.

ఈ సాధనమునుండి దూరముచేసెడి గొప్ప విఘ్నములు నాకు ఎదురగుచుండెను. ఆయా సమయములయందు భక్తిశ్రద్ధలతో, భావుకత్వముతో నామజపము చేయుచుండెడివాడను. దాని ప్రభావమున ఆ విఘ్నములనుండి విముక్తి కలుగుచుండెను. స్వరూప ధ్యానముతో కూడిన భగవన్నామమును జపించుటతో సమానమైన ఏ ఇతర సాధనము లేదని నా దృఢమైన విశ్వాసము. దీనివలన సాధన మార్గమునందు కలుగు విఘ్నములు నశించును. మనస్సులో స్ఫురించుచుండెడి ప్రాపంచిక విషయములు దూరమగును. పరమాత్ముని నామజపమును పరిమితముగానైనను చేయుటవలన నాకు కలిగెడి పరమశాంతిని, అపారమైన ఆనందమును, సాటిలేని ప్రయోజనమును నేను వర్ణింపజాలకున్నాను. అట్టి ఎడల పరమేశ్వర నామమును నిష్కామభావముతో ధ్యానముతో కూడి నిత్యము, నిరంతరము జపించుచుండెడివానియొక్క ఆనందమహిమను ఎవరు వర్ణించగలరు?

### నామజపము ఎవరికొఱకు (దేని కొఱకు) చేయవలెను?

శ్రుతి ఇట్లు చెప్పును.

ఏతద్ ఏవ అక్షరం బ్రహ్మ ఏతద్ ఏవ అక్షరం పరం ।
ఏతద్ ఏవ అక్షరం జ్ఞాత్వా యో యదిచ్ఛతి తస్య తత్ ॥

(కఠ. I/2/16)

"ఈ ఓంకారరూపమైన అక్షర స్వరూపుడే (అక్షరమే) బ్రహ్మ. ఈయనయే పరబ్రహ్మ. ఈ ఓంకారరూపమైన అక్షరుని తెలిసికొనవలయును. అట్లు తెలిసికొనినవానికి తానుకోరిన వస్తువు తనంతకు తానే అతనికి లభించును'.

శ్రుతి చెప్పినట్లుగా భగవద్భజన మహాకల్పవృక్షము వంటిది. దాని ప్రభావము చేత మానవుడు కోరుకొనిన వస్తువు అతనికి అప్రయత్నముగా లభించును. కాని ఆత్మ శ్రేయస్సును కోరుకొనెడి పరమభక్తులు ఆ పరమేశ్వరుని నిష్కామభావముతో భజించవలయును. శాస్త్రములయందు నిష్కామభక్తుడే మిక్కిలి ప్రశంసింపబడెను.

కృష్ణభగవానుడిట్లు పలికెను.

చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోఽర్జున ।
ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥
తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే ।
ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమ్ అహం స చ మమ ప్రియః ॥

(గీత. 7/16-17)

"ఓ భరతశ్రేష్ఠా! అర్జునా! శుభకర్మలను ఆచరించుచు సుఖసంపదలను కోరుకొనువారు, (అర్థార్థులు) శారీరక, మానసిక సంతాపములకు గుఱియైన ఆర్తులు, ఐహిక విషయములపై ఆసక్తిని వీడి పరమాత్మతత్త్వ జ్ఞానము పొందుటకు ఇచ్ఛగలవారు (జిజ్ఞాసువులు) పరమాత్మప్రాప్తినొందిన జ్ఞానులు అను చతుర్విధ భక్తులు నన్ను భజింతురు. ఈ చతుర్విధ భక్తులలో నిరంతరము నాయందే ఏకీభావస్థితుడై, అనన్యభక్తియుతుడైన జ్ఞాని అత్యుత్తముడు. ఏలనన వాస్తవముగ నన్ను (నా తత్త్వమును) తెలిసికొనిన జ్ఞానికి నేను మిక్కిలి ఇష్టుడను. అతడును నాకు మిక్కిలి ఇష్టుడు".

ఇట్లు నిష్కామభావముతో భక్తిశ్రద్ధలతో చేసెడి భగవద్భజనయొక్క ప్రభావమును ఎఱింగిన మనుష్యుడు, ఒక్కక్షణముకూడ ఆ పరమాత్మను విస్మరించడు. పరమేశ్వరుడు కూడ అతనిని మరువడు. ఆ పరబ్రహ్మ స్వయముగా ఇట్లు నుడివెను.

యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి ।
తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి ॥

(గీత. 6/30)

"సకల ప్రాణులయందును ఆత్మరూపమున నున్న నన్ను (వాసుదేవుని) చూచు పురుషునకు, అట్లే ప్రాణులన్నింటిని నాయందు అంతర్గతములుగ నున్నట్లు చూచువానికి నేను అదృశ్యుడను కాను. అతడును నాకు అదృశ్యుడుకాడు".

నిజమైన భక్తిశ్రద్ధలు గల వ్యక్తి తనకు ప్రియతముడైన పరమాత్మను వదలి ఇంకొకరి కెవరికైనను తనయందు స్థానమును ఇయ్యగలడా? తనకు అత్యంత సౌఖ్యప్రదాతయగు ఆ పరంధామునియొక్క ప్రభావమును ఎఱిగిన మానవుడు మిక్కిలి అదృష్టవంతుడు. ఆతడు ఆ పరమేశ్వరుని మిక్కిలి ప్రీతికరమైన వానినిగా చేసికొనును. అట్టివాడు రేయింబవళ్లు తమకు ప్రియమైన ఆ నామమునే జపించుచుండును, తన్మయతను పొందుచుండును. ఇతర వస్తువులను ఎపుడును కోరడు. ఆతనికేదియును రుచింపదు (తాను ఇష్టపడడు).

కనుక ఈ అవస్థ సమకూరునంతవరకును నామజపమును అభ్యాసము చేయుచునే యుండవలయును. నామమును జపించు సమయమున భక్తిపారవశ్యమును పొందవలెను. శరీరస్పృహయే యుండరాదు. ఎంతటి ఆపదలు ఎదురైనప్పటికిని విశుద్ధమగు భక్తివిశ్వాసములు, భగవత్ సాక్షాత్కారము తప్ప ఏ ఇతర ప్రాపంచిక వస్తువులను గుఱించిన కోరికలకును లోనుకారాదు. ఐహిక సుఖములకై అర్థించుటకాని, ఆశించుటకాని ఎప్పుడును చేయకూడదు.

నిష్కామభావముతో విధివిధానముగ భగవన్నామమును జపించ వలయును. అట్టిసాధకుడు మిగుల శీఘ్రముగనే మంచి ప్రయోజనము పొందగలడు.

"చాలమంది పరమాత్మనామమును జపించుచుందురు. కాని వారికి విశేష ప్రయోజనమేమియు జరిగినట్లు కనిపించుటలేదు'' అని ఎవరైనా శంకింపవచ్చును. దానికి సమాధానము ఇదియే. "వారు శాస్త్రోక్తముగ జపమును అభ్యాసము చేయకపోవచ్చును. తను జపరూపమైన పరమైశ్వర్యములకు బదులుగా వారు తుచ్ఛమగు ప్రాపంచిక సుఖభోగములను కోరుకొని యుండవచ్చును''. అట్లు కాకపోయినచో వారికి విశేష ప్రయోజనము చేకూరుననుటలో సందేహమేమాత్రమును లేదు''.

చిన్నవిగాని, పెద్దవిగాని కోరికలను నెరవేర్చుకొనుటకై కాక, కేవలము విశుద్ధమగు భక్తిని పెంపొందించుటకొఱకే నామజపమును చేయవలయును.

నామజపము ఎట్లు చేయవలెను?

పతంజలి మహర్షి ఇట్లు చెప్పెను.

**తస్యవాచకః ప్రణవః** (యోగ 1/27)

"ఆ పరమాత్మవాచకమే అనగా నామమే 'ఓం'కారము.

**తజ్జపః తదర్థ భావనం** (యోగ 1/28)

"ఆ పరమాత్ముని నామజపమును, దానియొక్క అర్థమును భావన చేయుట. అనగా స్వరూపచింతన చేయుట".

**తతః ప్రత్యక్ చేతనాధిగమో౽ అంతరాయా౽ భావశ్చ** (యోగ. 1/29)

"పైన చెప్పిన సాధనమువలన సమస్త విఘ్నములు నశించును. పరమాత్మ ప్రాప్తియును కలుగును".

భగవన్నామమును పరమాత్ముని స్వరూపచింతన సహితముగ ధ్యానించ వలయును. స్వరూపచింతనతో కూడిన నామజపమువలననే ఆటంకము లన్నియు నశించును. పరమాత్మప్రాప్తియు కలుగును. భగవంతుడు నామమునకే అధీనుడై ఉండును కదా! గోస్వామి తులసీదాసు ఇట్లు వచించెను.

"రూపము నామము ననుసరించును. నామము లేనిచో రూపమును తెలిసికొనలేము. కాని వస్తురూపమును చూడకున్నను నామమును స్మరింపగనే రూపము హృదయఫలకమున గోచరించును."

(రా.మా. బా.కాం. దో. 20-2,3)

కనుక స్వరూపచింతనము చేయకున్నను కేవలము నామజపముయొక్క ప్రభావముననే సాధకునకు సరియైన సమయమున భగవత్స్వరూప సాక్షాత్కారము సహజముగనే కలుగును. కాని ఇందులో దైవ సాక్షాత్కారము ఆలస్యముగ జరుగును. పరమాత్ముని మోహనరూపమును చింతించుచు జపము నభ్యసించుటవలన మిక్కిలి శీఘ్రముగ ప్రయోజనము కలుగును. నిరంతరము చింతన చేయుటవలన పరమాత్మస్మరణయందు భేదమేమియు ఉండదు.

గీతయందు ఆ పరంధాముడిట్లు నుడివెను.

తస్మాత్ సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ ।
మయ్యర్పితమనోబుద్ధిః మామేవైష్యస్యసంశయమ్ ॥ (గీత.8/7)

"ఓ అర్జునా! నీవు సర్వదా నన్నే స్మరించుచుండుము. యుద్ధమును (కర్తవ్యకర్మను) కూడ చేయుము. ఈవిధముగా నీ మనోబుద్ధులను నాయందే నిల్పియున్నచో నిజముగా (నిస్సందేహముగా) నన్నే పొందెదవు."

భగవంతుని ఈ ఆదేశానుసారము లేచినను, కూర్చున్నను, తిను నప్పుడును, త్రాగునప్పుడును, నిదురించునప్పుడును, మేల్కొనియుండు సమయమునను (సర్వకాల సర్వావస్థలయందును) ప్రాపంచికమైన ఏ పనులను చేయుచుండునప్పుడు కూడ నామజపమును చేయుచుండవలెను. మనస్సుచేత, బుద్ధిచేత భగవంతుని స్వరూపమును చింతన చేయవలెను. నిశ్చయాత్మక బుద్ధి కలిగియుండవలెను. ఒక్కక్షణము కూడ ఆ స్మృతి నుండి ఎడబాటు కలుగరాదు.

'ఏ నామమును జపించుటవలన మిక్కిలి ప్రయోజనము కలుగగలదు?' అని ఎవరైనను అడుగవచ్చును. నామముతో కూడ పరమాత్మని ఏ స్వరూపమును ధ్యానించవలయుననియు ప్రశ్నించవచ్చును. దీనికి సమాధానముగ ఇట్లు చెప్పవచ్చును. పరమాత్మని నామములు అనేకములున్నవి. వాటియందు సాధకునకు మిక్కిలి ఇష్టమైనది, శ్రద్ధ కలిగిన పేరును స్వీకరించవలయును. అట్టి నామమును జపించుటవలన విశేషప్రయోజనము కలుగును. కనుక తన అభిరుచికి అనుగుణముగనే భగవంతుని నామమును జపించవలయును. ఆయన స్వరూపమును చింతన చేయవలయును. నామజపమున కనుగుణమైన స్వరూప చింతనము చేయవలయు నన్న విషయమును ఇక్కడ గమనించవలయును. ఉదాహరణమునకు "ఓం నమో భగవతే వాసుదేవాయ". ఈ మంత్రమును జపించువారు సర్వవ్యాపకుడగు వాసుదేవుని ధ్యానించవలయును. "ఓం నమో నారాయణాయ" ఈ మంత్రమును జపించువారు చతుర్భుజుడగు శ్రీవిష్ణుభగవానుని ధ్యానము చేయవలయును. "ఓం నమఃశివాయ" మంత్రమును జపించువారు త్రినేత్రభగవానుడైన శంకరుని ధ్యానించుట

సముచితము. కేవలము 'ఓం' కారమును జపించువారు సర్వవ్యాపకుడైన సచ్చిదానంద ఘన శుద్ధ బ్రహ్మను చింతన చేయవలయును. శ్రీరామనామమును ధ్యానించువారు దశరథనందనుడు, పరమాత్ముడగు రామచంద్రుని స్వరూప చింతన చేయుట ప్రయోజనకరమగును.

హరే రామ హరే రామ రామ రామ హరే హరే
హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే

ఈ మంత్రమును జపించువారు శ్రీరామచంద్రుని, కృష్ణపరమాత్మను, విష్ణుభగవానుని లేక సర్వవ్యాపకుడైన బ్రహ్మము మొదలగు సకలరూపములను తన అభిరుచికి, కోరికకు అనుగుణముగ ధ్యానము చేయవలయును. ఈ నామములన్నియు అన్నిరూపములకును వాచకములు కాగలవు.

సాధకునకు గురువుగారిచేత ఉపదేశింపబడినవి (నామరూపములు) తనకు భక్తిప్రపత్తులు కలవి, విశ్వాసము అధికముగా కలవి, తన ఆత్మకు అనుకూలముగ తోచునవి అగు నామములను జపించవలయును, రూపములను ధ్యానింపవలయును. అట్లు చేయుటవలన అధిక ప్రయోజనము సమకూరగలదని ఉదాహరణములవలన మనము అర్థము చేసికొనవలయును.

నామజపముతో కూడ స్వరూపధ్యానము తప్పక జరుగవలయును. నిజమునకు నామముతో కూడ నామి (భగవంతుని) స్మరణ అనివార్యమగును. మనుష్యుడు ఉచ్చరించు నామములకు సంబంధించిన ఆయా వస్తువులు ఒకసారి స్మృతిపథమునకు రావలయును. స్మృతికనుగుణముగనే మంచిచెడులు కూడ పరిణమించుచుండును. కామవశుడగు మానవుడు ఏ స్త్రీ నైనను జ్ఞాపకము చేసికొనిన, ఆమె స్మృతిపథమున మెదలుటచేత అతని శరీరమునందు కామము ఉత్తేజితమగును. వీర్యపాతాది దుర్ఘటనలు గూడ ఘటిల్లును. ఈ విధముగ వీరరస, కరుణరస ప్రధాన వృత్తులను స్మరించుటవలన దాని కనుకూలముగ మానవుని వృత్తులు, వాని భావములు రూపుదిద్దుకొనును. సత్పురుషులను స్మరించుటవలన మనస్సునందు ఉత్తమభావములు జాగృతమగును. దుష్టులను జ్ఞాపకము చేసికొనుటవలన చెడుభావములు ఆవిర్భవించును. లౌకిక విషయములను స్మరించుటవలన

ఇహలోక సంబంధమైన పరిణామమే కలుగును. అట్టి ఎడల పరమాత్ముని స్మరించుట వలన ఆ స్వామికి సంబంధించిన భావములు, గుణములు అంతః కరణమునందు ఉదయించును. ఇచట ఎట్టి సందేహమునకును తావులేదు.

కనుక సాధకుడు భగవంతునియందు భక్తివివశుడు కావలయును. నిష్కామభావయుతుడు కావలెను. నిత్యము, నిరంతరము (రాత్రింబవళ్లు) కర్తవ్య కర్మలు చేయుచు కూడ ఏకాగ్రతతో భగవన్నామమును జపించుటకు విశేష ప్రయత్నము చేయవలయును.

### సత్సంగమువలననే నామజపమునందు శ్రద్ధ కలుగును.

నామమహిమ అపారము. అది తెలిసికూడ ప్రజలు ఏకాగ్రతతో భగవన్నామమును జపించుటకు ఎందుకు ఉద్యుక్తులు కారు? అనునది ఒక ప్రశ్న. పరమాత్ముని దయను సంపూర్ణముగ పొందినవారే ఆ పరంధామ నామమును జపించుటయందలి నిజమైన రహస్యమును తెలిసికొనగలరు అనునదియే దీనికి సమాధానము.

ఆ పరమేశ్వరుని దయ అందరియందును సమానముగనే ప్రసరించుచుండును. ఆ ప్రభువుయొక్క అపారమైన దయను మనుష్యుడు గుర్తింపవలెను. అట్లు గుర్తించనిచో దానివలన ప్రయోజనమేమియు ఉండదు. ఎవరి ఇంటిలోనైనను ధనము పాతిపెట్టబడియున్నదని అనుకొందము. అతడు దానిని తెలిసికొననంతవరకును అతనికి దానితో లాభమేమియు ఉండదు. కాని దాని నెఱిగిన వారెవరైనను ఒకవేళ దానికొఱకు పరిశ్రమించినచో ఆ ధనమును పొందగలరు. వారికది లాభించును. ఈ విధముగనే పరమాత్ముని దయాప్రభావమును ఎరిగిన పురుషుల సాంగత్యముచేత మానవుడు నిరంతరము ప్రసరించుచుండెడి ఆ స్వామిదయను తెలిసికొనును. అట్టిజ్ఞానము కలుగుటచేత అతనికి భజనయొక్క పరమార్థము అవగతమగును. అప్పుడు అతడు ఆ స్వామిని భజించుటయందు ప్రవృత్తుడగును. భజన నిత్యము నిరంతరము కొనసాగుచుండవలెను. దానివలన సకల సంచిత పాపములు సమూలముగ నశించును. పరమాత్మప్రాప్తిరూపమగు సంపూర్ణ ప్రయోజనము సమకూరును.

**నామమునందు పాపమును నశింపజేయు స్వాభావిక శక్తి కలదు.**

పరమేశ్వరుడు తనను భజించువారి పాపములను నశింపజేయును. వారిని క్షమించును. అనినట్లైతే ఆ ప్రభువునందు పక్షపాత ధోరణియను దోషములేదా? అను ప్రశ్న ఉదయించును. అగ్నికి అది ప్రజ్వరిల్లుచున్నవైపు ప్రకాశమును కలిగించు శక్తి ఉన్నదికదా! అట్లే భగవన్నామమునందు కూడ పాపములను నశింపజేయుశక్తి స్వాభావికముగనే ఉండును.

**సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః ।**
**యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషుచాప్యహమ్ ॥** (గీత.9/29)

'నేను సకల భూతముల (ప్రాణుల) యందును సమభావముతో వ్యాపించి యుందును. నాకు అప్రియుడు కాని, ప్రియమైనవాడు గాని ఎవ్వడును లేడు. కాని నన్ను భక్తితో భజించువారు నా యందే యుందురు. నేనును వారియందు ప్రత్యక్షముగా ఉండును.''

శీతలత్వముతో బాధపడు పురుషులలో ఎవరైనను అగ్ని సమీపమునకు వెళ్లి, దానిని సేవించినచో, అది వారి చలిబాధను పోగొట్టును. కాని అగ్నిదగ్గఱకు వెళ్లనిచో వారి బాధ తొలగదు కదా! కనుక అగ్నిదేవుని యందు భేదభావము (పక్షపాతము) అను ధోరణియే లేదు. ఆయన అందరికిని తనవేడిని ప్రసాదించును. వారి బాధలను తొలగించుటకు ఎల్లప్పుడు సంసిద్ధుడై యుండును. ఆయన సమీపమునకే వెళ్లనిచో అగ్ని ఏమి చేయగలడు? ఇట్లే భగవంతుని భజించువారి అంతఃకరణము పరిశుద్ధమగును. పరమాత్ముడు వారి దుఃఖములను పూర్తిగా నశింపజేసి, వారికి భద్రత చేకూర్చును. కనుక భగవంతుని యందు భేదభావము (పక్షపాతము) అను దోషమేలేదు.

**నామమును జపించుటవలనను జ్ఞానము కలుగును**

(సందేహము) భగవన్నామమును జపించుటవలన పాపములు రూపుమాయును - అనుదానిని మనము అంగీకరించెదము. కాని దానివలన పరమపదము ఎట్లు ప్రాప్తించును? పరమపదప్రాప్తి కేవలము జ్ఞానముచేతనే కలుగును గదా!

(సమాధానము) ఇది సరియైనదే. పరపదము జ్ఞానము చేతనే ప్రాప్తించును. శ్రద్ధ, ప్రేమ, విశ్వాసములతో కూడిన నిష్కామభావముతో ఆ పరమాత్మను భజించవలయును. దాని ప్రభావముచేత పరమేశ్వరుడతనికి దివ్యజ్ఞానమును ప్రసాదించును. దానివలన అతనికి ఆస్వామి స్వరూపము యొక్క తత్త్వజ్ఞానము కలుగును. అప్పుడు ఆ సాధకునకు తప్పక పరమపద ప్రాప్తి కలుగును. పరమాత్ముడిట్లు వచించెను.

మచ్చిత్తా మద్గతప్రాణా బోధయంతః పరస్పరమ్ ।
కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ ॥
తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్ ।
దదామి బుద్ధియోగం తం యేన మాముపయాంతి తే ॥
తేషామేవానుకంపార్థమ్ అహమజ్ఞానజం తమః ।
నాశయామ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా ॥

(గీత. 10/9, 10, 11)

"నా భక్తులు తమ మనస్సులను నా యందే లగ్నమొనర్తురు. తమ ప్రాణములను, తమ కర్మల నన్నింటిని, తమ సర్వస్వమును నాకే అంకితమొనర్తురు. వారు పరస్పర చర్చలద్వారా నా మహత్త్వమును గూర్చి ఒకరికొకరు తెలుపుకొనుచు కథలు కథలుగా చెప్పుకొనుచు నిరంతరము సంతుష్టులగుచుందురు. మరియు వారు సతతము నా యందే రమించుచుందురు. అట్లు నిరంతరము ధ్యానాదులద్వారా నా యందే లగ్నమనస్కులై భక్తిశ్రద్ధలతో నన్నే భజించువారికి నేను బుద్ధియోగమును అనగా తత్త్వజ్ఞానరూపయోగమును ప్రసాదించెదను. దానిద్వారా వారు నన్నే పొందుదురు. ఓ అర్జునా! వారి అంతఃకరణముల యందు స్థితుడనైయున్న నేను వారిని అనుగ్రహించుటకై తేజోమయమైన తత్త్వజ్ఞానరూపదీపమును (జ్యోతిని) వెలిగించి అజ్ఞానాంధకారమును పారద్రోలెదను.

కనుక నిరంతరము భక్తిశ్రద్ధలతో నామజపమును, స్వరూపధ్యానమును చేయుటవలన జ్ఞానోదయము తనంతట తానే కలుగును. అట్టి జ్ఞానముచేత సత్వరమే సాధకునకు పరమపదము ప్రాప్తించును.

## నామజపమును ఉపేక్షింపరాదు

నామజప మహత్తును అర్థము చేసికొనలేని కారణమున కొందరు సోదరులు దానిని నిందించెదరు. "రామరామ" యనుట టాయ్ టాయ్ అనుట రెండును ఒకటే అంటూ ఉందురు. నామజపమను నెపముచేత సోమరులై తమ జీవితములను వ్యర్థము చేసికొనుచుందురని భావించెదరు. ఇట్లే అనేక విషయములు నామజపమును గుఱించి వారు విరుద్ధముగా పల్కుచుందురు.

శ్రద్ధతో పరిశీలించకుండ జిజ్ఞాసతో పరీక్షించకుండ నామజపమును నిందించుట సరియైనది కాదు. అట్లు చేయుట అనుచితము. నామమును జపించువారి హృదయములయందు వారికి అశ్రద్ధను కలిగించుటయే దీని పరిణామము. అట్టి చేష్టలు చేయరాదు. వారు ముఖ్యముగా కొంతకాలము నామజపమును చేసిచూచినచో దాని ప్రయోజనము వారికే తెలియగలదు. వ్యర్థముగా నిందించుటగాని, ఉపేక్షించుటగాని తగదు. దానివలన వారు పాపములనుండి రక్షింపబడలేరు

## నామజపమునందు ప్రమాదమును (ఏమఱుపాటును) సోమరితనమును రానీయరాదు

చాలామంది సోదరులు నామజపము మంచిదనియే భావించెదరు. కానివారు ఏమఱుపాటుచేత, సోమరితనమువలన ఆ సర్వేశ్వరుని భజింపరు. ఇదివారు చేయుచున్న పెద్దపొరపాటు. దుర్లభము, క్షణభంగురము ఐన మానవశరీరమును పొందియు, నామజపమునందు అలసత్వమును జూపువారిని ఏమనవలయును? జీవితముయొక్కసదుపయోగము ధ్యానము చేయుట యందే గలదు. ఒకవేళ ఇప్పుడు ఏమఱుపాటునకు లోనై అమూల్యమైన అవకాశమును పోగొట్టుకొనినచో తరుపరి పశ్చాత్తాపము తప్ప ఇంకేమి మిగులును?

కూర్చొనునపుడు, నిలబడునపుడు, నిదురించునపుడు (సర్వకాల సర్వావస్థలయందును) కర్తవ్యకర్మలను చేసికొనుచు ఏమఱుపాటును వదలి ఎల్లవేళల పరమాత్మను భజించు అభ్యాసమును తప్పక చేయుచుండ వలయును.

బాలుని మరపించుటకు తల్లి వాని ఎదుట పలురకములైన ఆటవస్తువులను పడవేయును. ఆహారపదార్థములను వాని చేతికిచ్చును. కొందరు పిల్లలు ఆ పదార్థముల రుచియందు మునిగినవారై తల్లికొఱకు ఏడ్చుటను మానివేయుదురు. తల్లికూడ వారిని వదలిపెట్టి తన పనులను తాను చేసికొనుచుండును. ఒక్కొక్క శిశువు ఏమిచ్చినను దానికి లోనుగాక తల్లికొఱకే మారాము చేయుచు "అమ్మా! అమ్మా!" అని ఏడ్చుచుండును. అప్పుడు తల్లికూడ తన పనులన్నిటిని వదలి ఆ పిల్లవానిని తన హృదయమునకు హత్తుకొని, వానిని ఊరడించవలసివచ్చును. "వీని కెన్ని వస్తువులను ఇచ్చి మరపింపజూచినను అది వీలుపడుట లేదు. నేను తప్ప వీని కింకేమియు అవసరములేదు" అని తల్లికి కూడ తెలియును.

ఇట్లే పరమాత్ముడు కూడ భక్తుని కోరికమేరకు పలువిధములగు ఆశలను చూపి, అతనిని ప్రలోభపెట్టి మరపింపజూచును. ఇది అతనికి పరమాత్మ పెట్టు పరీక్ష. ఆ ప్రలోభములకు లోనై ఆ పరంధాముని విస్మరించెడివాడు, పరీక్షయందు సఫలుడు కాజాలడు. ప్రాపంచిక విషయములను, పదార్థములను అన్నింటిని తుచ్ఛములని, క్షణికములని, నశ్వరములని తలపోయవలెను. వాటిని కాలదన్ని భక్తిశ్రద్ధలతో పరమాత్ముని యందు నిమగ్నుడు కావలయును. నిజమైన మనస్సుతో సచ్చిదానందస్వరూపిణియగు ఆ తల్లికొఱకు (భగవంతుని కొఱకు) ఎడతెగకుండ రోదించవలయును. అట్టి భక్తునియొక్క ఆర్తిని విని తన సమస్తమును వదలి పరమాత్ముడు స్వయముగా భక్తుని దగ్గఱకు పరుగెత్తుకొనివచ్చును.

మ. సిరికిం జెప్పడు శంఖచక్రయుగముం జేదోయి సంధింపఁడే
పరివారంబును జీరఁ డభ్రగపతిం బన్నింపఁ డాకర్ణికాం
తరధమ్మిల్లముఁ జక్కనొత్తఁడు వివాదప్రోత్థితశ్రీకుచో
పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై.

"ప్రపంచమునందలి సకల విషయములను విషపూరితములైన లడ్డులనుగా పరిగణించవలెను. వాటినుండి మనస్సును మఱలించి ఆ పరంధాముని పావననామమును జపించుటలో నిరతుడు కావలెను. పరమాత్ముని

నామమును జపించువానికి దయాళువగు ఆ ప్రభువు శీఘ్రముగా భవబంధములనుండి ముక్తిని కలిగించును.

పరమాత్ముడు తనను భజించువారి పాపములను మాత్రమే నశింప చేయును. వారికి మాత్రమే పరమపదమును ప్రసాదించును అనినచో 'భగవంతుడు దయాళువు, ఆ స్వామి అందరికిని సమానముగా న్యాయము చేయును' అనుమాట ఎట్లు పొసగును? అప్పుడు ఆ ప్రభువు దయాళుడని ఎందుకు చెప్పవలెను?

ఇట్లు చెప్పుట యుక్తియుక్తముగా కన్పట్టదు. ప్రపంచమునందలి గొప్ప రాజులు, మహారాజులు తమను ఆశ్రయించినవారికి బాహ్యములైన ధనములు మొదలగు పదార్థముల నొసగి సంతోషపరచెదరు. కాని పరమేశ్వరుడట్లు చేయడు. ఎవరు ఏ భావముతో భజింతురో దానినే ఆ స్వామి వారికి అనుగ్రహించును. అది ఆయన విధానము.

**యే యథా మాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహమ్ ।** (గీత. 4/11)

"పార్థా! భక్తుడు నన్ను సేవించినరీతికి అనుగుణముగ నేను వారిని అనుగ్రహింతును".

ఆ పరమాత్మునకు చిన్న పెద్ద అను తారతమ్యమే లేదు. ఒకడు మిగుల అల్పుడైన వాడు అయినను సరియే తనను ఏ భావముతో (దేనిని కోరి) భజించునో ఎట్లు తన ఎడల వ్యవహరించునో అట్లే, ఆ పరమేశ్వరుడు దానిని అతనికి ప్రసాదించును. ఎవడైనను ఆ స్వామి కొఱకు పరితపించుచు వ్యాకులుడైనచో ఆ స్వామియు అదేవిధముగా భక్తుని కలియుటకు ఆరాటపడును. ఇది ఆ ప్రభువుయొక్క సాటిలేని దయాగుణమునకు నిదర్శనము.

ఈ ప్రపంచము అనిత్యము, క్షణభంగురము, నశ్వరము. ఇందలి సమస్తభోగములును మిథ్య. వీటన్నిటిని వదలిపెట్టి ఆ స్వామిని సేవింపవలెను. ఏలనన ఆ ప్రభువు సర్వశక్తిమంతుడు, న్యాయమును చేయువాడు, పరిశుద్ధుడు, పరమదయాళువు, అత్యంతప్రీతిపాత్రుడు, అతడు సర్వేశ్వరుడు.

ఆ సర్వేశ్వరుని పవిత్రనామమును నిష్కామముగా భక్తిప్రపత్తులతో తదేక ధ్యానముతో (స్వరూపధ్యానముతో) ఎప్పుడు ఎల్లవేళల జపించుచుండవలెను.

ప్రపంచమునందలి సకలదుఃఖములనుండి ముక్తుడై ఈశ్వర సాక్షాత్కారము కొఱకు చేయు నామజపమే అన్నిటికంటెను శక్తిమంతమైనది, ఇది యుక్తియుక్తమైన సాధనము.

❖ ❖ ❖

## 5. సత్సంగము - భగవద్భక్తుల లక్షణములు - వాటియొక్క మహిమ, ప్రభావము (ఉదాహరణములు)

"సత్" అనునదే భగవంతుడు. ఆ స్వామిఎడల గల శ్రద్ధాభక్తులు, ఆయనను కలియుటకొఱకు పడు తపనయు సత్సంగమునకు ముఖ్యములు. వాస్తవికముగా అట్టిదియే ప్రథమశ్రేణికి చెందిన సత్సంగము. ఆ పరమాత్మను పొందిన భక్తుల లేక జీవన్ముక్తులైన జ్ఞానుల మహాత్ముల సాంగత్యము ద్వితీయశ్రేణికి చెందినది. భగవంతునియందు భక్తిశ్రద్ధలుగల ఉన్నతశ్రేణికి చెందిన సాధకుల సాంగత్యము, మూడవ తరగతికి చెందిన సత్సంగము, సచ్ఛాస్త్రముల పరిశీలనము నాల్గవశ్రేణికి చెందినది.

'సత్' స్వరూపమే భగవంతుడు. ఆయన ఎడల భక్తి ప్రపత్తులు కలిగియుండుట, ఆ దేవదేవుని కలిసికొనుటయే, సకలసాధనల యొక్క ఫలితము. భగవంతుని పొందినవారిని, ఆ ప్రభువునందు భక్తిశ్రద్ధలుకల మహాత్ములను కలిసికొనుటయు, వారి సాంగత్యము కూడ భగవంతుని కృపవలననే లభించును. తనమీద పరంధాముని ఎనలేని కృపకలదని విశ్వసించువారు పరమాత్మునిదయకు అర్హులగుదురు. అప్పుడు వారు ఆ స్వామి కృపవలన సర్వేశ్వర తత్త్వమును తెలిసికొని పరమశాంతిని పొందగలరు.
(గీత. 5/29)

భగవంతునియందు, ఆయన భక్తులయందు శ్రద్ధ, విశ్వాసములు, ప్రేమ కలిగిఉండవలయును. అంతఃకరణమునందు పూర్వజన్మసంచితములైన శ్రద్ధ, భక్తి ప్రపత్తులనెడి ఉత్తమ సంస్కారములు సంస్థితమై యుండువారు కూడ పరమాత్మునికృపకు పాత్రులగుదురు.

రామచరితమానసమున సుందరకాండమునందు భక్తుడగు విభీషణుడు ఆంజనేయునితో ఇట్లు పలికెను.

"ఆంజనేయా! ఆ ప్రభువుయొక్క కృపమాత్రము నా ఎడ గలదని నాకు గట్టి నమ్మకము ఏర్పడినది. ఏలనన శ్రీహరి కరుణలేనిదే సాధుసమాగమము జరుగదు గదా!" (రా.మా. సుందర. దో. 6-2)

శ్రీశంకరభగవానుడు పార్వతీదేవితో ఇట్లు పలికెను.

"ఓ గిరిజా! సజ్జన సమాగమమునుమించిన లాభమేయు లేదు. కాని హరి కృపావిశేషమువలననే ఇది లభ్యము. వేదపురాణములును ఇట్లే చెప్పుచున్నవి".

(రా.మా. ఉ.కాం. దో.125ఖ)

పూర్వజన్మమునందలి ఉత్తమ సంస్కారములయొక్క ప్రభావముచేత కూడ భక్తులను కలిసికొనుట జరుగును. తులసీ రామాయణమునందలి ఉత్తరకాండమునందు స్వయముగా శ్రీరామచంద్రప్రభువు ప్రజలకు ఉపదేశము నొసగుచు ఇట్లు పలికెను.

"భక్తి స్వతంత్రసాధనము. అన్నిసుఖములకును అది నిధానము. కాని సజ్జన సాంగత్యములేనిదే ప్రాణులకు ఇది లభింపదు. పుణ్యసమూహము లేకుండ సజ్జన సాంగత్యము ప్రాప్తించదు. సత్సాంగత్యమే జననమరణ చక్రమునుండి ప్రాణికోటికి ముక్తిని కలిగించును".

(రా.మా. ఉ.కాం. దో. 44-3)

భగవంతుని పొందిన పురుషుల లక్షణములను గూర్చి శ్రీకృష్ణపరమాత్మ స్వయముగా చెప్పుచు వారిని తనకు ప్రియభక్తులనుగా వర్ణించెను.

అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ ।
నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ ॥

సంతుష్టస్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః ।
మయ్యర్పితమనోబుద్ధిః యో మద్భక్తస్స మే ప్రియః ॥

(గీత. 12/13, 14)

"ఏ ప్రాణియందును ద్వేషభావము లేనివాడును, పైగా సర్వప్రాణుల యందును అవ్యాజమైనప్రేమ, కరుణకలవాడును, మమతాహంకారములు లేనివాడును, సుఖము ప్రాప్తించినను, దుఃఖముప్రాప్తించినను, సమభావమును కలిగియుండు వాడును, క్షమాగుణము కలవాడును (అపరాధికిని అభయమును ఇచ్చువాడును) సర్వకాల సర్వావస్థలయందును సంతుష్టుడై యుండు యోగియు, శరీరేంద్రియ మనస్సులను

వశమునందుంచుకొనిన వాడును, నాయందు దృఢమైన నిశ్చయము గలవాడును, అయి నాయందే మనోబుద్ధులను అర్పణ చేసిన నా భక్తుడు నాకు ప్రియుడు".

భగవంతునిపొందిన భక్తులకును లేక జీవన్ముక్తులకును గుణాతీత పురుషులకును సమస్తప్రాణులయందు సకల పదార్థముల యందు సమభావమేయుండును. (గీత. 14/24, 25). అట్టివారికి సర్వప్రాణులతోడను స్వార్థపరమైన సంబంధము ఏవిధముగను, ఏమాత్రముగను ఉండదు (గీత. 3/18). శరీరమునందును, నివాసస్థానములందును మమతాసక్తులు లేకుండును. అభిమానస్పర్శలేనివాడును నాకు ప్రియమైన భక్తుడు (గీత. 12/19) సర్వప్రాణులయందును అతడు అవ్యాజమైనప్రేమ, కరుణ కలిగియుండును. (గీత. 12/13). అన్నిటియందును అతనికి సమభావ ముండును. పరమాత్మను పొందిన అట్టి పురుషులయందలి సమభావమును వర్ణించుచు కృష్ణపరమాత్మ ఇట్లు పలికెను.

విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।
శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః ॥ (గీత. 5/18)

"జ్ఞానులు విద్యావినయసంపన్నుడైన బ్రాహ్మణునియందును, గోవు, ఏనుగు, కుక్క మొదలగువానియందును, చండాలునియందును సమదృష్టి కలిగియుందురు".

"పరమాత్ముడు జ్ఞానిని సమదర్శియని చెప్పెను. శాస్త్రములయందు చెప్పబడిన, న్యాయముతో కూడిన వ్యవహార భేదముండినప్పటికి కూడా అన్నిటియందును సమభావము ఉండును" - అను భావమును ఆ స్వామి వ్యక్తము చేసెను. అందరియెడల సమభావముతో వ్యవహరించుట ఎవ్వరికిని సంభవముకాదు. వివాహములు, శ్రాద్ధాదికర్మలు బ్రాహ్మణులచేతనే చేయింపబడును గాని, చండాలురచేత కాదు కదా! ఆవుపాలు త్రాగెదరుకాని, కుక్కపాలు త్రాగరు కదా! ఏనుగు వాహనము అగునుగాని, గోవు వాహనము కాదు కదా! ఆకులు, గడ్డి, ఏనుగులకును, ఆవులకును ఆహారమగునుగాని కుక్కలకును, మనుష్యులకును కాదు గదా! అందువలన అందరి హితమును

దృష్టిలో ఉంచుకొనియే వీలైనంతవరకు గౌరవమర్యాదలతో వ్యవహరించుటయే సమభావము. ఒకే పదార్థముతో సమస్తమును సమానముగ సేవించుట జరుగదు కదా! ఆయా విషయములకు అనుగుణముగ వాటియందు భేదముండినప్పటికి కూడ తన శరీరమువకు వలెనే (శరీరము నెట్లు చూచుకొందురో అట్లు) ఆత్మీయతలు అందరియందును సమానముగ నుండవలెను. తన శరీరమునందు ప్రేమ ఆత్మభావములు ఉండును. కాని తన అవయవములతో వ్యవహరించునపుడు అవి వాటి వాటి పనులను చేసికొనుచుండును. ఆ పనులలో కూడ తరతమ భేదములుండును. వాటి వ్యవహారములు వేరువేరుగ నుండును. శిరస్సుతో బ్రాహ్మణులకువలె చేతులతో క్షత్రియులకువలె, ఊరువులతో వైశ్యులకువలె, పాదములతో శూద్రులకువలె, గుద ఉపస్థలతో అస్పృశ్యులవలె వ్యవహరించుట జరుగును. అదేవిధముగా తన ఆత్మకు సమానముగ అందరిని భావించుచు, అందరియందును తగినట్లుగా వ్యవహరింపవలయును. గీతయందు కృష్ణ భగవానుడిట్లు పలికెను.

ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున ।
సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః ॥ (గీత. 6/32)

"ఓ అర్జునా! సర్వప్రాణులను తనవలె (తనతో సమానముగా చూచువాడును, సుఖమునుగాని, దుఃఖమునుగాని సమముగా (సమానముగ) చూచువాడును (ఇతరుల సుఖ దుఃఖములను తన సుఖదుఃఖములుగా భావించువాడును) అయిన యోగి పరమశ్రేష్ఠుడు".

రామచరితమానసమునందు భరతుని దృష్టిలో ఉంచుకొని సత్పురుషుల లక్షణములను తెలుపుచు దేవదేవుడగు ఆ రామచంద్రుడు ఇట్లు పలికెను.

"సజ్జనులు విషయవాసనాలోలురుగారు. వారు సచ్ఛీలురు, సద్గుణ సంపన్నులు. ఇతరుల దుఃఖములను తమ దుఃఖములుగను, ఇతరుల సుఖములను తమ సుఖములుగను భావించెదరు. వారు అన్నిటియందును, అన్నిచోట్లను, అన్ని సమయములయందును సమభావమును కలిగి యుందురు. వారి మనస్సులలో శత్రుభావము ఉండదు. వారు

అభిమానరహితులు, విరాగులు. వారిలో లోభము, క్రోధము, హర్షము, భయము లేశమాత్రమును కూడ ఉండవు. వారి హృదయములు కోమలములు. దీనులయెడ దుఃఖితులపైనను దయజూపుదురు. మనోవాక్కర్మలచే నాపై నిష్కపట భక్తిని కలిగియుందురు. వారు స్వయముగ అభిమానరహితులై ఇతరులను గౌరవించెదరు. భరతా! ఇట్టి సజ్జనులు నాకు ప్రాణతుల్యులు. వారికి ఎట్టి కోరికలును ఉండవు. వారు నా నామస్మరణమునందే నిరతులు. సజ్జనులు శాంతి, వైరాగ్యము, వినయము, ప్రసన్నత కలిగియుందురు. వారిలో మృదుస్వభావము, సరళత, అందరియెడ మిత్రభావము, బ్రాహ్మణభక్తి ఉండును.ఇదియే ధర్మమునకు మూలము. సోదరా! ఈ లక్షణములు గలవారిని సజ్జనులునుగా భావింపుము. వారు శమదమ నియమ నీతిమార్గములనుండి ఎన్నడును వైదొలగరు. వారెప్పుడును పరుష వచనములను పలుకరు". (రా.మా. ఉ.కాం. దో. 37-1,2,3,4)

"నిందాస్తుతులను సమానముగ భావించువారు, నా పాదపద్మములయందు అనన్యప్రేమ కలిగియుండువారు సజ్జనులు. వారు నాకు ప్రాణసములు, గుణధాములు, ఆనందస్వరూపులు". (రా.మా. ఉ.కాం.38)

ఈ లక్షణములు చాలవఱకు అంతఃకరణమునకు సంబంధించినవి కనుక స్వయముగా తెలిసికొనదగినవి. కనుక భక్తులు వాటిని స్వయముగనే ఎరుగుదురు. వాటియందలి ఆచరణములు ఎక్కువగా ఇతరులకు అనుసరించ దగినవిగా ఉండును. వాటినిచూచి ఇతరులు వాటి స్థితిని కొంత ఊహించగలరు. నిజమునకు పరమేశ్వరుని మరియు మహాత్ములయొక్క కృపను పొందినవారే వాటిని తెలుసుకొనగలరు. సత్పురుషుల సాంగత్యము వలనను వారిని దర్శించుటవలనను వారితో భాషించుటచేతను వార్తాలాపములు సలుపుటవలనను పరమేశ్వరప్రాప్తిని పొందిన పురుషుల లక్షణములు మనయందు ఉదయించును. అట్టివారే భగవంతుని పొందిన సత్పురుషులు, ఇట్లు భావించి ఆ సత్పురుషులనుండి మనము ప్రయోజనమును పొందవలెను. భక్తిశ్రద్ధలతో సత్పురుషుల సాంగత్యము చేసినవారు ధన్యులు. అట్టి వారి ఆజ్ఞలను పాలించువారే విశేషలాభమును పొందగలరు. గీతయందు ఆ పరంధాముడు ఇట్లు నుడివెను.

అన్యే త్వేవమజానంతః శ్రుత్వాన్యేభ్య ఉపాసతే ।
తేఽపి చాతితరంత్యేవ మృత్యుం శ్రుతిపరాయణాః ॥ (గీత. 13/25)

"కాని ఈ సాధనమార్గములనుగూర్చి ఎఱుగనిమందబుద్ధులు తత్త్వజ్ఞానముగల ఇతరులనుండి విని, తదనుసారముగ ఉపాసనలు చేయుదురు. ఆ శ్రవణపరాయణులును మృత్యురూపసంసార సాగరమునుండి నిస్సందేహముగా బయటపడుదురు".

అట్టి సత్పురుషుల సాంగత్యముయొక్క మహిమను, ప్రభావమును వర్ణించుచూ శ్రీగోస్వామి తులసీదాసు ఇట్లు పలికెను.

"భూచరములు, జలచరములు, ఖేచరములు మొదలగు చరాచర ప్రాణులన్నియును సత్సంగ ప్రభావమువలననే ఐశ్వర్యములను బుద్ధి, కీర్తి సద్గతులను పొందినవి. ఈ ఐశ్వర్యాదులను పొందుటకు సత్సాంగత్యము తప్ప మరి ఏ మార్గము లోకమునగానీ, వేదములలోగాని ప్రస్తావింపబడలేదు. సత్సాంగత్యము లేనిదే వివేకము అబ్బదు. శ్రీరాముని దయవలననే సత్సాంగత్యము లభించును. ఆనందప్రాప్తికిని, శ్రేయోలాభములకును సత్సాంగత్యమే మూలము. సాధనములన్నియు పుష్పములు. సత్సంగప్రాప్తియే ఫలము. ఇనుము పరుసవేదిని తాకినచో బంగారమగునట్లు దుష్టులు కూడ సత్సంగతివలన సత్పురుషులుగా అగుదురు". (రా.మా. బా.కాం. దో. 2/2-5)

ఇదేవిషయమున శ్రీమహాదేవుడు గరుడునితో ఇట్లు పలికెను.

"సత్సాంగత్యము లేకుండ హరికథాశ్రవణము ప్రాప్తింపదు. హరికథలను విననిదే మోహము దూరము కాదు. మోహరహితుడు కానివానికి శ్రీరామచంద్రుని చరణములపై గాఢమైన భక్తి కుదురుకొనదు".

(రా.మా. ఉ.కాం. దో. 61)

శ్రీ కాక భుశుండి కూడా గరుడునితో ఇట్లు పలికెను.

"అనన్యమైన హరిభక్తియే అన్నిసాధనముల ఫలము. సత్పురుషుల సహకారము లేనిదే ఎవ్వరును దానిని పొందలేరు. గరుడుడా! ఇట్లు యోచనచేసి సత్సాంగత్యము చేయు వారికే శ్రీరామభక్తి సులభముగా లభించును".

(రా.మా. ఉ.కాం. 119/9,10)

పరమాత్ముడు లోకకళ్యాణము కొఱకే కొందఱిని ప్రపంచమునకు పంపును. అట్టి పరమ అధికారముగల పురుషుని విషయమున ఇక చెప్పవలసినదేమున్నది? వారిని దర్శించుట, వారితో మాట్లాడుట, వారిని స్పృశించుట, వారిని గురించి ఆలోచించుట, వారితో వార్తాలాపములు చేయుటవలన మిగుల ఉత్తమమగు ప్రయోజనము కలుగును. కాముకుడైన పురుషుడు తాను వలచిన కాంతను దర్శించుట, ఆమెతో మాట్లాడుట, ఆమెను స్పృశించుట, ఆమెనుగూర్చి ఆలోచించుట వలన అతనిలో కామప్రవృత్తి మేల్కొనును. అటులనే భగవంతునియందు భక్తిశ్రద్ధలుగల సత్పురుషుల దర్శనము వలన, వారితో భాషించుట, వారిని స్పృశించుట, వారిని గూర్చి ఆలోచించుటవలన మనలో పరమాత్ముని గుఱించిన భక్తిప్రపత్తులు, ప్రేమయు తప్పక జాగృతములు అగును. పరుసవేదిని తాకుటచే లోహము బంగార మగును, కాని మహాత్ముల సాంగత్యమువలన అంతకుమించిన మహిమ చేకూరగలదని విజ్ఞులు చెప్పుదురు.

ఒకానొక కవి ఇట్లు చెప్పెను : 'పరుసవేదిని స్పృశించుటచే లోహము స్వర్ణమగును. అట్లు కాకపోయినచో అది నిజమైన పరుసవేది కాదనియు ఆ లోహము వాస్తవమైనది కాదనియు తెలియనగును. వాటిలో ఏదియో లోపముండునని ఊహించెదము. ఇట్లే మహాపురుషుల సాంగత్యమున సాధకుడు తప్పక మహాపురుషుడు కాగలడు. ఒకవేళ అట్లు జరగనిచో ఆ మహాపురుషుడు నిజమైన మహాపురుషుడు కాడని లేక సాధకునియందు శ్రద్ధాభక్తులు, నమ్మకము లోపించినవని అనుకొనవలెను.

భగవంతుని గురించి తెలుపుటకు అర్హత కలిగిన మహానుభావులదృష్టి పడినచోట, వారిని స్మరించిన, వారిని తాకిన వ్యక్తుల మరియు పదార్థముల యందు భగవంతుని ప్రేమపరమాణువులు ప్రవహింపసాగును. జిజ్ఞాసువు లెవరైనను మరణించుటకు ముందు సత్పురుషులచటకు చేరినచో ఆ పరమాత్ముని కథలను చెప్పి, కీర్తనలను వినిపించి, వారి ఆత్మకు శాంతిని చేకూర్చెదరు. శ్రీనారదపురాణమునందు దీనిని మిక్కిలి చక్కగా వివరించిరి.

మహాపాతకయుక్తా వా యుక్తా వా చోపపాతకైః ।
పరం పదం ప్రయాంత్యేవ మహద్భిరవలోకితాః ॥
కలేవరం వా తద్భస్మ తద్ధూమం వాపి సత్తమ ।
యది పశ్యతి పుణ్యాత్మా స ప్రయాతిపరాంగతిమ్ ॥

(నార.పు. పూర్వ. 7/74-75)

"మహాపాతకులతోగాని, ఉపపాతకులతోగాని కూడియున్నను, మహాత్ములైన సత్పురుషుల దృష్టికి నోచుకొన్నచో, వారును పరమపదమును పొందుదురు.

పవిత్రాత్ములగు మహాపురుషులు ఎవరి మృతదేహమునుగాని, చితినుండి వచ్చు పొగనుగాని, భస్మమునుగాని చూచినచో ఆ మరణించిన పురుషుడు కూడ పరమగతిని పొందును".

మహాపురుషులయొక్క సత్సంగమహిమ శాస్త్రముల యందు విశేషముగా వర్ణింపబడినది. శ్రీమద్భాగవతము నందు ఇట్లు చెప్పబడినది.

తులయామ లవేనాపి న స్వర్గం నాऽపునర్భవమ్ ।
భగవత్సంగిసంగస్య మర్త్యానాం కిముతాశిషః ॥

(శ్రీమద్భా. 1/18/13)

"భగవద్భక్తుల సాంగత్యము స్వల్పమాత్రమైనను దానితో స్వర్గముగాని, మోక్షముగాని సాటిరావు. ఇక మానవుల తుచ్ఛభోగముల విషయమై చెప్పనలసినదేమి?"

శ్రీరామచరితమానసమందు కూడ లంకినియను రాక్షసి హనుమంతునితో ఇట్టి మాటలనే పలికెను.

"నాయనా! స్వర్గమోక్షముల వలన లభించు సుఖముల నన్నింటిని త్రాసులో ఒక ప్రక్కన ఉంచినను అవి యన్నియును ఒక క్షణమాత్రమున లభించిన సాధుజనసాంగత్య సుఖముతో సమానముగావు".

(రామా. సుందర. కాం. దో.4)

అట్టి మహాపురుషులకృపను భగవంతుని పొందుటకు ప్రధాన సాధనముగా తెలుపుచూ నారదమహర్షి ఇట్లు తెలిపెను.

**"ముఖ్యతస్తు మహత్కృపయైవ భగవత్కృపాలేశాద్వా."** (నా.భ.సూ.38)

"పరమాత్మునియందలి భక్తి ముఖ్యముగా మహాపురుషుల కృపచేతనే కలుగును. భగవంతునిదయ కొంచెముగా ప్రసరించినను ప్రాప్తించును".

నారదమహర్షి మరియు ఇట్లు పలికెను.

**మహత్సంగస్తు దుర్లభో అగమ్యో అమోఘశ్చ**

"ఆ మహాపురుషుల సాంగత్యము అమోఘమైనది. అది సాధారణముగా ప్రాప్తించుట దుర్లభము, అగమ్యము".

**"లభ్యతేఽపి తత్కృపయైవ".** (నా.భ.సూ.40)

అది భగవంతుని కృపవలననే లభించును.

**దుర్లభో మానుషో దేహో దేహినాం క్షణభంగురః ।**
**తత్రాపి దుర్లభం మన్యే వైకుంఠప్రియదర్శనమ్ ॥** (12/2/29)

"ప్రాణులకు మానవశరీరము లభించుట మిగుల దుర్లభము. ఒకవేళ ప్రాప్తించినను అది క్షణభంగురము; అనిశ్చితము. అట్టి ఈ జన్మకు పరమాత్ముని ప్రియభక్తుల దర్శనము, ఇంకనూ దుర్లభము".

అట్టి మహాపురుషులు లభించినచో వారికి మనము సాష్టాంగ ప్రణామము చేయవలయును. భక్తిశ్రద్ధలతో వారిని జిజ్ఞాసతో ప్రార్థించి పరమాత్మ తత్త్వమును తెలిసికొనవలెను. వారి ఆదేశములను పాటించవలెను. వారికి సేవ చేయవలయును. వారి ఆజ్ఞలను పాలించుటయే వారికి చేయు నిజమైన సేవ. ఆ మహానుభావుల సంకేతములను సిద్ధాంతములను గ్రహించ వలయును. మన ప్రవర్తన వారి మనస్సులను అనుసరించి ఉండవలయును. మన మనస్సును, ఇంద్రియములనెడి కళ్లెములను వారికి అప్పగించి, వారిచేతి కీలుబొమ్మగా తయారగుట మిక్కిలి శ్రేష్ఠమైనది. ఈ విధముగా నడచుకొను శ్రద్ధాళువులగు భక్తులయొక్క హృదయములందు ఆ మహనీయుల సత్సంగ ప్రభావమున సద్గుణములు, సదాచారములు ప్రాదుర్భవించును.

దుర్గుణములు, దురాచారములు నశించును. అంతియేగాక భగవంతుని యందు భక్తియు, ఆయన తత్త్వమును గుఱించిన జ్ఞానము భగవత్ప్రాప్తియు సహజముగనే సిద్ధించును.

శాస్త్రములయందు సత్సంగ ప్రభావమును గుఱించిన అనేక - ఉదాహరణములు లభించును. వాటిమీద మనము ధ్యానముంచవలెను. సుతీక్ష్ణుడు, శబరియు భగవంతునియందలి భక్తితత్పరతతో శ్రీరామచంద్ర ప్రభువును కలిసికొనుటకు పడిన తపనలు సత్సంగమునకు శ్రేష్ఠమైన ఉదాహరణములు. తులసీదాసగోస్వామి రచించిన రామచరితమానసమందలి అరణ్యకాండమునందు ఈ కథలు మనకు దర్శనమిచ్చును. పరమాత్మప్రాప్తి కలిగిన భక్తుల సాంగత్యముచేత భగవంతుని తత్త్వజ్ఞానము ఆయనను పొందుటకు అనువగు అనేక ఉదాహరణములు లభ్యమగును. నారదమహర్షి సాంగత్యమునను, ఉపదేశముల వలనను ధ్రువునకు ఆ దేవదేవుని దర్శనము కలిగెను. ఆయన కోరికలు కూడ సిద్ధించెను. (శ్రీమద్భాగవతము, నాలుగవ స్కంధము, 8,9 అధ్యాయములు). శ్రీకాకభుశుండి సాంగత్యముచేత గరుడుని మోహము నశించుటయేకాక పరమాత్మయందు ఆయనకు అనన్యమైన భక్తి కలిగెను. (శ్రీరామచరిత మానసము, ఉత్తరకాండము). శ్రీగౌరాంగ మహాప్రభువు సాంగత్యమువలన, ఉపదేశములవలన శ్రీవాసుడు, రఘునాథభట్టు, హరిదాసు మొదలగువారు ఉద్ధరింపబడిరి.

ఈ విధముగానే జీవన్ముక్తులై తత్త్వజ్ఞానమునెఱిగిన మహాపురుషుల సాంగత్యముచేత కూడ పరమాత్ముని గురించిన జ్ఞానము, ఆ పరంధాముని పొందినవారి ఉదాహరణములు కూడ మనకు కనిపించును. మహాత్ముడగు హారిద్రుమత గౌతముని ఆజ్ఞను పాలించుటవలన జాబాలపుత్రుడైన సత్యకామునకు బ్రహ్మజ్ఞానము కలిగెను. సత్యకాముని సేవించుటవలన, ఆయన సాంగత్యమువలన ఉపకోసలుడు బ్రహ్మజ్ఞానమును పొందెను. (ఛా.ఉ. 4వ అధ్యాయము, 4వ ఖండము నుండి 17 వరకు). మహారాజగు అశ్వపతియొక్క సాంగత్యమునను, ఆయన ఉపదేశమువలనను మహాత్ముడైన ఉద్దాలకునకు జ్ఞానప్రాప్తి కలిగెను. ఉద్దాలక మహర్షి తన వెంట నిడుకొని

వచ్చిన ప్రాచీనశాలునకును, సత్యయజ్ఞునకును, ఇంద్రద్యుమ్నునకును, జననునకును, బుండిలునకును ఈ ఐదుగురు ఋషులకును బ్రహ్మజ్ఞానము ప్రాప్తించెను. (ఛాందోగ్య ఉపనిషత్తు, 5వ అధ్యాయము, 11వ ఖండము) అరుణపుత్రుడగు ఉద్దాలకుని సాంగత్యముచేత శ్వేతకేతువునకు బ్రహ్మజ్ఞానము అబ్బెను. (ఛాందోగ్య ఉపనిషత్తు, 6వ అధ్యాయము, 9వ ఖండమునుండి 16 వరకు) శ్రీసనత్కుమారుని సాంగత్యముచేతను, ఉపదేశముల వలనను నారదునియొక్క అజ్ఞానమనెడి అంధకారము తొలగిపోయెను, ఆయనకు బ్రహ్మజ్ఞానము ప్రాప్తించెను (ఛా.ఉ. 7వ అధ్యాయము). యాజ్ఞవల్క్య మహాముని ఉపదేశములవలన మైత్రేయికి బ్రహ్మజ్ఞానము లభించెను. (బృహదారణ్యకము, 4వ అధ్యాయము, బ్రా.5) యమధర్మరాజు సాంగత్యమువలనను, ఉపదేశముచేతను నచికేతుడు ఆత్మతత్త్వము నెఱిగెను, బ్రహ్మజ్ఞానమును పొందెను (కఠోపనిషత్తు, 1,2 అధ్యాయములు) మహాత్ముడగు జడభరతునియొక్క సాంగత్యమునను, ఉపదేశముచేతను రహూగణుడను మహారాజు పరమాత్మ జ్ఞానమును పొందెను. (శ్రీమద్భాగవతము, 5వ స్కంధము, 10వ అధ్యాయమునుండి 13 వరకు) ఇదేవిధముగా సత్సంగము వలన భగవంతుని ఎడ కలుగు భక్తిప్రపత్తులును, ఆ స్వామియొక్క తత్త్వజ్ఞానమును, ఆ ప్రభువును పొందిన భక్తుల ఉదాహరణములును ఎన్నియో శ్రుతులయందును, ఇతిహాస పురాణముల యందును కొల్లలుగా లభించును. శాస్త్రములను పరిశీలించి మనము సత్సాంగత్యముయొక్క ప్రభావము నెఱుగవలయును. సత్పురుషుల సాంగత్యమువలన కలుగు ప్రయోజనములను పొందవలయును. 'మానవుడు తాను చేయు సాంగత్యమునుబట్టి అతడు, ఉత్తముడు అగుటయో, అధముడు అగుటయో జరుగుచుండును' అను లోకోక్తి సుప్రసిద్ధము కదా! మానవుడు యోగుల సాంగత్యమువలన యోగియగును. భోగపురుషుల సాంగత్యమువలన భోగియగును. రోగుల సాంగత్యమువలన రోగియగును. ఈ విషయము తెలిసికొని మనము, ఈ ప్రాపంచిక విషయములయందు ఆసక్తిగల మనుష్యులయొక్క సాంగత్యము చేయరాదు. మహాత్ముల మహాపురుషుల సాంగత్యమే చేయవలెను. సత్పురుషుల సాంగత్యము ముక్తిదాయకము.

సాంసారిక విషయాసక్తులైన మానవులసాంగత్యము బంధములను కలిగించునది అగును.

గోస్వామి తులసీదాసు ఇట్లు చెప్పెను.

"సజ్జనుల సాంగత్యము మోక్షమును ప్రసాదించును. కాముకుల సాంగత్యము భవబంధములలో చిక్కుపడజేయును. సజ్జనులు, కవులు, పండితులు, వేదపురాణాది గ్రంథములు ఇట్లే నుడువుచుండుట లోకవిదితము".

మహాపురుషుల సాంగత్యము లభించనిచో, ఆ లోపమును తీర్చుటకు విరక్తులై దైవీసంపదతో కూడి, ఉన్నతశ్రేణికి చెందిన సాధకుల సాంగత్యము చేయవలయును. శ్రద్ధాభక్తులతో సాధన చేయుచు, వారి సాంగత్యము చేయుట వలన కూడా మిగుల ప్రయోజనము చేకూరగలదు. రాగరహితులైన పురుషులను స్మరించుటచేత మనలోని వైరాగ్యభావము మేల్కొనును. మనస్సునకు ఏకాగ్రత కలుగును. శ్రీపతంజలి యోగదర్శనమందు ఇట్లు చెప్పబడెను.

వీతరాగ విషయం వా చిత్తమ్ (1/37)

"ఆసక్తి పూర్తిగా నశించి విరక్తులైన పురుషులను లక్ష్యముగా జేసికొని అభ్యాసము చేయు వ్యక్తులు స్థిరచిత్తులగుదురు.

ఉన్నతశ్రేణికి చెందిన రాగరహితులు, సాధువులు, మహాత్ములగుదురు. వారికి మూడు లోకముల ఐశ్వర్యములు కూడ రేణువుతో సమానము. వారు అభిమానమును, ఆడంబరములను, గౌరవ ప్రతిష్ఠలను కళంకములుగా భావించెదరు. తమ పాదములను పూజించుటకు ఇష్టపడరు. తమ పాదధూళిని గాని, పాదోదకమునుగాని ఇతరుల కియ్యరు. తమ ఛాయాచిత్రమును (ఫోటోను) పూజించుకొన నియ్యరు. సన్మాన పత్రములను స్వీకరించరు. తమకు కీర్తి కావలయునని ఎన్నడును కోరుకొనరు. కీర్తియున్నచోట వారు నిలువనే నిలువరు. అట్టి ఎడల తమకు హారతిని ఇప్పించుకొనుట కాని, తాము తినగా మిగిలినదానిని (ఎంగిలిని) ఇతరుల కిచ్చుటగాని చేయరు. ఈ విషయముల ప్రస్తావననే రానియ్యరు. అట్లు విరక్తులైన మహాపురుషుల

సాంగత్యము లభించనంత మాత్రమున మానవుడు ఎట్టి పరిస్థితిలోను దుష్టుల సాంగత్యమునకు పాల్పడరాదు. దుష్టుల లక్షణముల వర్ణించుచు శ్రీతులసీదాసు ఇట్లు చెప్పెను.

"దుర్జనుల లక్షణములను వినుము. పొరపాటున కూడ వారితో సాంగత్యము చేయరాదు. వారి సహవాసము దుఃఖములకు కారణము. దుర్లక్షణములు గల గోవుతో కలిసి తిరుగుటవలన మంచి కపిలగోవుకూడ అట్లే మారును. దుష్టులైన వారి హృదయములందు సంతాపమధికము. వారు ఇతరుల సుఖసంపదలను చూచి అసూయపడెదరు. ఎప్పుడైనను ఇతరులను గూర్చిన నిందలను విన్నచో త్రోవలో నిధి దొరికినంతగా సంతోషపడెదరు. వారు కామక్రోధ లోభ మద పరాయణులు, నిర్దయులు, కపటులు, కుటిలురు, పాపిష్ఠులు, వారు అకారణముగా ఇతరులతో వైరము పూనెదరు. మేలు చేసినవారికి కీడు తలపెట్టెదరు". (రా.మా. ఉ.కాం. దో. 38/1,2,3)

"దుష్టులు ఇతరులతో నిష్కారణముగ వైరము పూనెదరు. పరస్త్రీల యందును, ధనమునందును ఆసక్తులై యుందురు. పరులు నిందలపాలైనచో సంతోషపడుచుందురు. వారు నీచులు, పాపాత్ములు, మానవశరీరములను ధరించిన రాక్షసులు". (రా.మా. ఉ.కాం. దో.39)

"దుష్టులు తల్లిదండ్రులను, గురువులను, బ్రాహ్మణులను అంతేకాదు ఎవ్వరిని గుర్తింపరు, గౌరవింపరు. తాము నశించుటయే గాక ఇతరులను గూడ నష్టపరచెదరు. మోహవశమున ఇతరులతో వైరము వహింతురు. వారికి సజ్జన సాంగత్యమునగాని, హరికథలయందుగాని అభిలాషయే ఉండదు. వారు దుర్గుణసాగరులు. మందబుద్ధులు, కాముకులు. వేదములను దూషించువారు, పరధనములను కబళించువారు. బ్రాహ్మణులకును, విశేషముగా దేవతలకును, కడకు పరమాత్మకును ద్రోహము చేయుదురు. వారి హృదయము దంభకపట పూరితము. వంచన చేయుటయే వారి స్వభావము. వారు పయోముఖ విషకుంభములు. చూచుటకు సజ్జనులవలె కన్పింతురు.

ఇట్టి అధములు, దుష్టులైన మనుజులు, కృతయుగమునందును,

త్రేతాయుగమునందు ఉండరు. ద్వాపరయుగములో స్వల్పముగా ఉండెదరు. కాని కలియుగములో వీరు కోకొల్లలు. వీరి సంఖ్య అపారము, అగణ్యము".
(రా.మా. ఉ.కాం. దో. 39/3-4, 40)

కలియుగమును వర్ణించుచు పూజ్యపాదులు గోస్వామిగారు ఇట్లు నుడివిరి.

'కలియుగపాపములవలన ధర్మములన్నియును నశించును. సద్గ్రంథము లన్నియును మరుగునపడును. పాషండులు తమ విపరీత బుద్ధులతో వివిధ సంప్రదాయములను కల్పింతురు". (రామా. ఉ.కాం. దో. 97క)

"ఎవరికి ఏది ఇష్టమో వారికి అదియే ధర్మము. బిగ్గఱగా అఱచువాడే పండితుడు. ఆడంబరముగా జీవించువానిని, ఆపాదమస్తకము కపటముతో కూడియుండువానిని, ప్రజలు సజ్జనునిగా భావింతురు. ఏ ఉపాయముద్వారా ఐనను ఇతరుల ధనమును అపహరించువాడే చతురుడు. కపటవర్తనుడే ఆచారపరుడు. అసత్యములాడుచు వాటిని పరిహాసముగా ప్రకటించువాడు కలియుగములో గుణవంతుడుగా చెల్లుబడియగును. ఆచారహీనుడును, వేదమార్గమును త్యజించువాడును గోళ్లను, జడలను పొడవుగా పెంచుకొను వాడును, జ్ఞానిగా, విరాగిగా, తాపసిగా ప్రసిద్ధికెక్కును. అశుభ (అమంగళకరములైన) వేషభూషణములను ధరించువాడును, తినదగినవి, తినకూడనివి అను విచక్షణ లేక అన్నింటిని తినెడివాడును ఐనట్టివాడే యోగి, సిద్ధుడు, కలియుగములో పూజ్యుడు". (రా.మా. ఉ.కాం. దో. 97క/2-4; 98)

"నూనెలను అమ్ముకొనెడి నీచవర్ణస్థులు, కుమ్మరులు, కుక్క మాంసమును భక్షించెడి చండాలురు, భిల్లులు, కోలులు, మద్యములను అమ్ముకొనెడివారు వీరందరును భార్య చనిపోయిన పిదపకాని, సంపదలు కోల్పోయిన తరువాతగాని, తలగొరిగించుకొని సన్న్యాసులయ్యెదరు. వారు బ్రాహ్మణుల చేతను పూజలందుకొందురు. అట్టివారు ఈ విధముగా తమ చేతులార అధోగతిపాలై ఇహపరలోకములకు దూరమగుదురు".
(రా.మా. ఉ.కాం. దో. 99/3,4)

గురువేమో జ్ఞానదృష్టిలేనివాడు, అతని శిష్యుడు విద్యాసక్తిలేనివాడు. అట్టి శిష్యుడు గురువుగారియొక్క ఉపదేశములను విననేవినడు. అట్టి గురువునకు

శిష్యుని బాగోగులు పట్టవు. పైగా ఆ గురువు శిష్యుని ధనము నపహరించును. కాని వాని దుఃఖమును తొలగించడు. అట్టి గురువు తప్పక ఘోర నరకము నందు పడును.

ప్రస్తుతము దాంభికులైన (కపటులైన) భక్తులు, సాధువులు, జ్ఞానులు, యోగులు తమను మహాత్ములుగా చెప్పుకొనుచున్నారు. వారు ఆ వేషములలో తమ నామములను, తమ స్వరూపములను భక్తులచేత ధ్యానము చేయించుకొనుచున్నారు. తన పాదజలమును తీర్థముగా వారితో త్రాగించు చున్నారు. తమ ఎంగిలిని వారిచే తినిపించుచు, తాము భ్రష్టులగుటయేగాక తమ అనుయాయులనూ భ్రష్టు పట్టించుచున్నారు. అట్టి దాంభికులైనవారియెడ అందరును జాగ్రత్తగా నుండవలయును. అట్టి వారి సాంగత్యములో మనుష్యులయందు దుర్గుణములు, దురాచారములు వృద్ధియగును. తత్ఫలితముగా వారు పతనమగుదురు. కాని మహాత్ముల దర్శనముచేత, వారితో భాషించుటవలన, వార్తాలాపములతో వారి సాంగత్యమువలన మనలో సద్గుణములు, సదాచార రూపములు దైవసంపద యొక్క లక్షణములు పెంపొందును. ఈ విషయములు గీతయందలి 16వ అధ్యాయమున మొదటి శ్లోకమునుండి మూడవ శ్లోకము వరకు చెప్పబడినవి. అప్పుడు మనకు పరమాత్మునిమీద భక్తి కుదురును. ఆ సత్పురుషుని దైవసంపదతోకూడి, ఉన్నతశ్రేణికి చెందిన సాధకుడుగ భగవద్భక్తుడుగ అర్థము చేసికొనవలెను. అట్టి సాధకులగు భక్తుల లక్షణములను గూర్చి గీతయందలి తొమ్మిదవ అధ్యాయమున 13-14 శ్లోకములందు ఇట్లు చెప్పబడినది".

మహాత్మానస్తు మాం పార్థ దైవీం ప్రకృతిమాశ్రితాః ।
భజంత్యనన్యమనసో జ్ఞాత్వా భూతాదిమవ్యయమ్ ॥

సతతం కీర్తయంతో మాం యతంతశ్చ దృఢవ్రతాః ।
నమస్యంతశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే ॥

(గీత. 9/13-14)

"ఓ పార్థా! దైవీప్రకృతిని ఆశ్రయించిన మహాత్ములైతే నన్ను సకల ప్రాణులకు మూలకారణముగను, అవ్యయునిగను (అక్షరస్వరూపునిగను)

తెలిసికొని, నిశ్చల మనస్కులై నిరంతరము నన్నే భజింతురు. ఆ దృఢవ్రతులైన భక్తులు నా నామగుణములను నిరంతరము వాద్య బృందముతో కీర్తింతురు. నన్ను చేరుటకుయత్నింతురు. పదేపదే నాకు ప్రణమిల్లుదురు. సర్వదా నా ధ్యానమునందే నిమగ్నులయ్యెదరు. అనన్య భక్తితో నన్ను ఉపాసింతురు."

శ్రద్ధాభక్తులతో అట్టి పురుషుల సాంగత్యము చేయుటవలన దైవీసంపదయొక్క లక్షణములు అబ్బును - అనన్య ఈశ్వరభక్తియు తప్పక ఉదయించును. అట్లు జరగనిచో మనము సాంగత్యము చేయు సాధక భక్తునియందు ఏదో లోపమున్నదని తెలిసికొనవలయును. లేక మనయొక్క శ్రద్ధ తగ్గిపోవుచున్నదని తలంచవలయును.

ఒకవేళ ఉన్నతశ్రేణికి చెందిన వీతరాగులగు సాధకుల సాంగత్యము లభించనిచో సచ్ఛాస్త్రములను అధ్యయనము చేయవలయును. శ్రుతులు, స్మృతులు, భగవద్గీత, రామాయణము, భాగవతము, ఇతిహాసములు, పురాణములు చదువవలయును. ఇదేవిధముగా జ్ఞానవైరాగ్య సదాచారములతో కూడిన ఇతర సచ్ఛాస్త్రములను శ్రద్ధతో పరిశీలింపనగును. వాటిలో చెప్పబడిన విషయములను మనస్సునకు పట్టించుకొని వాటిని పాటించవలయును. అట్టి మానవునకు ప్రపంచమునెడ వైరాగ్యము కలుగును. భగవంతునియందు భక్తిశ్రద్ధలు సమకూరును. అతడు మున్ముందు నిజమైన భక్తుడగును. అట్టి మహాత్ముడు భగవంతుని యథార్థరూపమును అవగతము చేసికొని ఆ స్వామిని పొందును.

❖ ❖ ❖

## 6. భగవత్సాక్షాత్కారమును పొందుట సులభమే

చాలామంది సజ్జనులు తమ మనసులలో (తమకు) కలిగిన సందేహములను తీర్చుకొనుటకై ఇట్లు ప్రశ్నించుచుందురు. ఇరువురు మంచి మిత్రులు పరస్పరము కలిసికొనునట్లు ఈ కలికాలమునందు కూడ ప్రత్యక్షముగా భగవద్దర్శనము లభించగలదా? ఒకవేళ అది సంభవమైనచో ఆ పరమాత్ముని మనోహరాకారమును శీఘ్రముగా దర్శించుటకు ఉపాయమేదైనను కలదా? ఈ కాలమునందును భగవద్దర్శనమును పొందిన పురుషులెవరైనను ఈ ప్రపంచమున కలరా?

ఆ పరమాత్ముని మనోహరాకారమును సాక్షాత్తుగా దర్శించిన మహాత్ములే. ఈ మూడు ప్రశ్నలకు సమాధానము చెప్పగలరు.

నేనొక సాధారణ మానవుడను. ఐనప్పటికిని పరమాత్మునియొక్క అనుగ్రహము చేతను, పరమపురుషులయొక్క దయావిశేషముచేతను ఈ మూడు ప్రశ్నల గుఱించి క్రమముగా కొంత వ్రాయుటకు సాహసించుచున్నాను. ఇది కేవలము నా మనోవినోదము కొఱకే అని గ్రహించవలెను.

1. కృతయుగమునందు ధ్రువునకు, ప్రహ్లాదునకు భగవంతుని దర్శనము కలిగెను. ఈ ప్రమాణములు మనకు పురాణగ్రంథములనుండి లభించుచున్నవి. అదేవిధముగా కలియుగమునందు కూడ భక్తుడగు సూరదాసునకును, మహాత్ముడగు తులసీదాసునకును, ఇంకను పెక్కుమంది భక్తులకును పరమాత్ముని ప్రత్యక్ష దర్శనము కలిగెనని ఇతిహాసములు చెప్పుచున్నవి. కృతయుగమున కంటెను కలియుగమున ఆ దేవదేవుని దర్శనము కలుగుట మిక్కిలి సులభమని విష్ణుపురాణాదులయందు చెప్పబడినది. శ్రీమద్భాగవతమునందు కూడ ఇట్లు చెప్పిరి.

కృతే యద్ ధ్యాయతో విష్ణుం త్రేతాయాం యజతో మఖైః ।
ద్వాపరే పరిచర్యాయాం కలౌ తద్ధరికీర్తనాత్ ॥

(శ్రీమద్భా. 12/3/52)

"కృతయుగమున నిరంతరము విష్ణువును ధ్యానించుటవలనను,

త్రేతాయుగమున యజ్ఞయాగాదులు చేయుటచేతను, ద్వాపరయుగమున ఆ స్వామిని ఆరాధించి పూజించుటవలనను పరమగతి ప్రాప్తించును. కలియుగమున ఆ శ్రీహరియొక్క నామమును కీర్తించుటవలననే భగవత్ప్రాప్తి కలుగును".

అరణి కర్రలను మథించుటచేత అగ్నిరగుల్కొనును. అట్లే భక్తి శ్రద్ధలతో కూడిన హృదయముతో పిలిచినచో పరమాత్ముడు అనుగ్రహించును. భగవన్నామము ఆత్మపరమాత్మలను అనుసంధానము చేయు పరమ సాధనము. ఆ భగవంతుని ప్రేమస్వరూపమగు నామమును తీవ్రతరముగా ఆర్తితో ఉచ్చరించుటవలన హృదయమునందు రాపిడి కలుగును. అది గంభీరముగా నుండును. ఆ ధ్వనియొక్క ప్రభావము అపారము. ఆ ప్రభావముచేత పరమాత్ముడు ప్రకటితుడగును. పతంజలిమహర్షి తన యోగదర్శనమందు ఇట్లు నుడివెను.

స్వాధ్యాయాదిష్టదేవతా సంప్రయోగః। (2/44)

'నామమును ఉచ్చరించుటవలన తన ఇష్టదైవమైన పరమేశ్వరునియొక్క సాక్షాత్కారము లభించును".

యోగి సత్యసంకల్పుడగును. తానేదైనను వస్తువును పొందుటకు సంకల్పించినచో ఆ వస్తువు ఆయనముందు ప్రత్యక్షమగును. అట్లే విశుద్ధ -అంతఃకరణముగల అనన్యభక్తుడు పరమాత్ముని భక్తియందు నిమగ్నుడు కావలెను. ఆ స్వామిని ఏ రూపమున దర్శింపగోరునో ఆ రూపముననే అదే సమయమున ఆ సర్వేశ్వరుడు అతనిముందు ప్రకటితుడగును. గీత. 11వ అధ్యాయమున 54వ శ్లోకమునందు ఆ పరంధాముడిట్లు వచించెను.

భక్త్యా త్వనన్యయా శక్య అహమేవంవిధోఽర్జున ।
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప ॥
(గీత. 11/54)

"అర్జునా! ఇట్టి నా చతుర్భుజరూపమును ప్రత్యక్షముగా చూచుటకును, తత్త్వజ్ఞానమును పొందుటకును, అందు ఏకీభావ స్థితినందుటకును కేవలము అనన్యభక్తిద్వారా మాత్రమే సాధ్యమగును".

ఒక మిత్రునకు తనకు ప్రియమైన ఇంకొక మిత్రుని కలిసికొనవలయునను తీవ్రమైన కోరికయుండును. ఈ విషయము ఆతని మిత్రునకు తెలిసినచో అతడు (మొదటివానిని) తన ప్రియమిత్రుని కలిసికొనకుండా ఉండగలడా? అట్లు జరుగదు. ఏలనన ఆ మిత్రునివలె తన స్నేహితుని ప్రేమతత్త్వమును ఎరిగినవారు ఉండరుకదా! అట్టి ఎడ ప్రేమస్వరూపుడగు పరమేశ్వరుడు తనకు ప్రియమైన భక్తుని కలిసికొనకుండ ఎట్లుండగలడు?

కనుక అన్ని కాలములయందును అన్ని దేశములయందును భక్తికి వశుడగు ఆ ప్రభువు అందఱకును తప్పక ప్రత్యక్షముగనే దర్శనమిచ్చును.

2. భగవంతుని కలిసికొనుటకు అనేక ఉపాయములు కలవు. వాటిలో సర్వోత్తమమైనది నిజమైన ప్రేమ (భక్తి)యే. శాస్త్రకారులు దీనిని అవ్యభిచారిణి భక్తి, భగవంతుని యందు అనురక్తి, ప్రేమభక్తి, విశుద్ధభక్తి అను పేర్లతో పేర్కొందురు.

సత్సంగము, భజన, చింతనము, నిర్మలత్వము, వైరాగ్యము, ఉపరతి, ప్రబలమగు కోరిక, పరమేశ్వరుని గూర్చిన వ్యాకులత క్రమముగా నుండినపుడే భగవంతుని మీద నిజమైన విశుద్ధప్రేమ కలుగును.

చాలామంది సోదరులకు భగవంతుడున్నాడను నమ్మకమే ఉండదు. ఇది బాధాకరమైన విషయము. ఎంతోమందికి భగవంతునిపై విశ్వాసముండి నప్పటికిని, వారు క్షణభంగురము, నశ్వరమగు మిథ్యాసుఖములలో మునిగితేలుచుండుటవలన ప్రాణప్రియుడైన ఆ స్వామిని కలియుటచే కలుగు ప్రభావమును, మహత్త్వమును ఎఱుగరు. కొందరు కొంత విని ఇతరులకు కొంత వినిపించి, మరికొంత విశ్వసించి ఆ ప్రభువును గుఱించి ఏ కొద్దిగనో తెలిసికొందురు. కొందఱు తమయొక్క స్వల్పప్రయత్నమునకే సంతోషపడి అచటనే ఉండిపోవుదురు. ఆ ప్రభువును పొందుటకు కొన్ని సాధనలు మాత్రము చేసి నిరాశచెందుదురు. వారు ద్రవ్యోపార్జనకు ఇచ్చు ప్రాధాన్యమును పరమాత్మ విషయమున చూపరు - అందులకై తగిన పరిశ్రమనుగూడ చేయరు.

"మేము చాల ప్రయత్నము చేసితిమి. కాని ప్రాణప్రియుడైన పరమేశ్వరుని దర్శనము లభించలేదు" అని కొందరు సోదరులు చెప్పుచుందురు. ఉరిశిక్షను తప్పించుకొను విషయమున చేయు ప్రయత్నమును జననమరణరూపమైన ఉరినుండి తప్పించుకొనుటకు ఎప్పుడైనను ప్రయత్నము చేసితివా? అసహ్యము, నింద్యము అగు స్త్రీ ప్రేమకు వశుడవై, ఆమెను కలిసికొనుటకు చేయు ప్రయత్నముతో సమానముగనైనను పరమాత్మని కలియుటకు పూనికవహించితివా? ఒకవేళ అట్లు చేయనట్లైతే భగవంతుడు లభించలేదనుకొనుట సంపూర్ణముగ వ్యర్థమే.

బాణములతో ఏర్పరుపబడిన అంపశయ్యమీద భీష్మపితామహుడు పరుండియుండెను. ఆయన భగవంతుని ధ్యానమునందు మగ్నుడై యుండెను. భక్తుడు ఆ భీష్మపితామహునివలె భక్తిచే పరవశుడు కావలెను. అప్పుడే ఆ పరమేశ్వరుడు కూడ భక్తుని ధ్యాసలో నిరతుడై ఉండును. తన భక్తుని కలియుటకు ఉత్సుకత చెందును. గీతయందు కృష్ణపరమాత్మ ఇట్లు పలికెను.

**యే యథా మాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహమ్** । (గీత. 4/11)

పార్థా! భక్తులు నన్ను సేవించిన రీతికి అనుగుణముగ నేను వారిని అనుగ్రహింతును.

పరమాత్మని పవిత్రనామమును నిరంతరము స్మరించుటవలన కలుగు ప్రభావము అపారమైనది. దానివలన క్షణక్షణము శరీరమునందు రోమాంచము కలుగుచుండును. అతని సమస్తపాపములు నశించును. భగవంతుడు తప్ప అతనికి ఏ వస్తువు రుచించదు. భగవంతుని విషయమున అత్యంత విరహవేదనతో వ్యాకులతకు లోనగుచుండును. అతని కనులనుండి అశ్రువులు ధారగా ప్రవహింపసాగును. దైవానుగ్రహప్రాప్తికై అతడు మూడు లోకములయందలి ఐశ్వర్యములను తైలము కాలదన్ని గోపికలవలె ప్రేమోన్మత్తుడై తిరుగుచుండును. నీటినుండి బైటకు తీసిన చేపవలె ఆ దేవదేవుని కొఱకు విలవిలలాడుచుండును. ఆ స్థితియందున్నప్పుడు అతడు ఆనందపరవశుడై, తన కత్యంత ప్రియుడైన శ్యామసుందరునియొక్క మోహనాకారమును దర్శించుచుండును. పరమాత్మని చేరుటకు నిజమైన ఉపాయమిదియే.

ఎవరికైనను ఆ పరంధాముని చేరవలయునను గాఢమైన కోరిక యున్నచో, ఆతడు రుక్మిణి, సీతాదేవి, వ్రజవనితలు (గోపికలు) మున్నగువారివలె నిరుపమానమైన ప్రేమతో (ఆర్ద్ర) హృదయముతో భగవంతుని కలయిక కొఱకు విలపించవలయును.

పైన పేర్కొనిన విధముగా 'కలికాలమునందు భగవంతునియొక్క సాక్షాత్తు దర్శనమును పొందిన పురుషులు ప్రత్యక్షముగా కనిపించరు' అని అనుకొనుటకూడ సరికాదు. 'పూర్తిగా ఎవరికిని ఆ ప్రభువు యొక్క దర్శనము లభించలేదు' అని అనుటయు సముచితముగాదు. ప్రహ్లాదాదులవంటి వేలకొలది భక్తులలో ఏదో ఒక విశేషకారణముగనే ఎవరికో ఒకరికి లోకమున ప్రసిద్ధి కలుగుచుండును. లేనిచో అట్టివారు ఈ విషయమును విఖ్యాతమొనరించుటవలన తమకు ఏ ప్రయోజనమూ కలుగదనియే తలంచెదరు.

ప్రాపంచిక హితమునకు పూర్వోత్తరవిషయములను తెలిసికొనుట సముచితమని అందరును అనుకొనినచో అది సరియైనదే. కాని అట్టి శ్రద్ధాళువులగు శ్రోతలు లభించుటకూడ కష్టమే. యోగ్యత లేకపోయినచో వారికి విశ్వాసముండుట (వారు నమ్ముట) కూడ జరుగకపోవచ్చును. యోగ్యత లేనివారు ప్రవచనములను ప్రారంభించినచో దానికి ఏ మాత్రము విలువ ఉండదు. ఎవరును దానిని నమ్మరు.

పైన చెప్పినట్లు భగవంతుని దర్శించిన మహాత్ములు ఈ ప్రపంచమున తప్పక ఉందురని మనము విశ్వసించవలయును. అట్టివారు లభించలేదనినచో దానికి కారణము మన అశ్రద్ధయే (మన ప్రయత్న లోపమే). నమ్మకపోవుటకు మాఱుగా నమ్ముటయే అన్నిటికంటెను శ్రేయోదాయకము. పరమేశ్వరుని యందు నిజమైన భక్తిశ్రద్ధలు కలిగియున్నచో, 'ఇరువురు మిత్రులు ఒకరిని మఱియొకరు దర్శించుకొనినట్లు ఆ స్వామియొక్క మనోహరాకారమును ప్రత్యక్షముగ దర్శించగలము' అను విశ్వాసమును కలిగియుండుట ముఖ్యము.

❖ ❖ ❖

## 7. పరమాత్ముడగు శ్రీకృష్ణుని ప్రభావము

పరమాత్ముడగు శ్రీకృష్ణుడు సాక్షాత్తు పూర్ణ పరబ్రహ్మము యొక్క అవతారము. అంతకంటెను సాక్షాత్తు పూర్ణపరబ్రహ్మమే శ్రీకృష్ణుని రూపమున ప్రకటితుడయ్యెనని చెప్పుట ఇంకను సమంజసమగును. ఆయన దివ్యగుణములు, ప్రభావములు ఆశ్చర్యకరములు, ఉపదేశప్రదములు. ఆ స్వామి మధురలీలలు మన ప్రాచీన గ్రంథములయందు నిండారియున్నవి. శ్రీమద్భాగవతము, మహాభారతము, జైమినియొక్క అశ్వమేధ పర్వ గ్రంథము లందును, ఇంకను ఇతర పురాణాదులలోను భగవంతునిప్రేమ, ప్రభావము, ఐశ్వర్యములు, విభూతులను గూర్చిన విషయములు అడుగడుగునను ప్రస్తావింపబడినవి. అవి సుప్రసిద్ధములు. జన్మించుట తోడనే చతుర్భుజ రూపముతో ప్రకటితుడైన ఆ ప్రభువు భక్తులను అనుగ్రహించుటకై చిన్నబాలుడుగ రూపొందెను. ఆ స్వామి యశోదమాతకు తన నోటియందు బ్రహ్మాండమును చూపించెను. గోపబాలకులను, గోవత్సములను క్రొత్తగా సృష్టించెను. అక్రూరునకు మార్గమధ్యమున నీటియందును, రథముపైనను ఒకేసారి రెండుచోట్ల ఒకే రూపముతో తన దర్శనభాగ్యమును కలిగించెను. కంసుడు మొదలగు గొప్పరాక్షసవీరులను సునాయాసముగా (అవలీలగా) మట్టుబెట్టెను. గురుపుత్రుని, బ్రాహ్మణ పుత్రులను దేవకీదేవియొక్క మరణించిన పుత్రులను వారివారికి తెచ్చియిచ్చెను. ఆ స్వామి ఒకేసారి తన రాణుల నివాస భవనములయందు విరాజిల్లుచు. వారిని వినోదింపజేసెను. ద్రౌపదీదేవి తనను ఆర్తితో కీర్తించినంతనే ఆమెకు అక్షయముగా చీరలను అనుగ్రహించి ఆమె పాతివ్రత్యమును, గౌరవమును కాపాడెను. దుర్వాసుడు అతిథిగా వచ్చినపుడు ద్రౌపదీదేవి ఆ ప్రభువును స్మరించెను. ఆ సంకటస్థితిలో వెంటనే ఆ ప్రభువు ప్రకటితుడై ఆమెను ఆదుకొనెను. కౌరవుల నిండుసభలో నున్న వారికి అందరకును తన విశ్వరూపమును చూపించెను. తనకు ప్రియమైన భక్తుడగు అర్జునునకు భక్తిజ్ఞాన రహస్యముల అంతరార్థమును హృదయంగమముగా తెలిపెను. అతనికి విశ్వరూప, చతుర్భుజరూప దర్శన సౌభాగ్యమును ప్రసాదించెను. అర్జునుడు జయద్రథుని (సైంధవుని) వధించు

సమయమున సూర్యాస్తమయమును కల్పించి, మరల సూర్యుని ప్రకటింపచేసి ఆ ప్రభువు అర్జునుని ప్రాణములను రక్షించెను. యుద్ధము ముగియగనే మొట్టమొదట ఆ పరమాత్ముఁడు రథమునుండి అర్జునుని క్రిందకు దింపెను. తదుపరి తాను స్వయముగా దిగుచుండగనే ఆ రథము కాలి భస్మమై పోవుచుండగా ఆ దృశ్యమును అర్జునునకు చూపెను. భీష్మద్రోణుల బాణాగ్నిచేత ముందుగనే రథము కాలిపోనున్నదనియు, కాని తాను తన సంకల్పప్రభావమున యుద్ధము ముగియునంతవరకు దానినట్లే (కాలిపోకుండ) ఉంచితిననియు ఆ పరమాత్ముఁడు పలికెను. అంపశయ్యమీద పడియున్న భీష్మపితామహుని బాధలనన్నిటిని ఆ పరంధాముడు తొలగించెను. ఆయనకు సాటిలేని బలమును, తేజస్సును, జ్ఞానమును ప్రసాదించెను. ఉత్తంకమహర్షికి తన దివ్యప్రభావమును, ఐశ్వర్యముతో కూడిన రూపమును చూపించెను. మృతిచెందిన పరీక్షిత్తుని పునరుజ్జీవితుని చేసెను. అశ్వమేధ యజ్ఞము చేయునపుడు పాండవులు స్మరించగనే ద్వారకనుండి రాత్రి సమయమున ఆకస్మికముగ అచటకు చేరుకొనెను. సుధన్వునితో యుద్ధము చేయునపుడు అర్జునుడు ఆ ప్రభువును స్మరించగా వెంటనే యుద్ధరంగమున ఆయన ప్రకటితుడయ్యెను. కళ్లెములను చేతబట్టి అర్జునునకు సారథి అయ్యెను. ఆయన తన కృష్ణరూపముననే పరమధామమునకు చేరుకొనెను. ఇట్టివి అనేక - అద్భుత కార్యముల కథలను చదువుటవలన అట్టి కర్మలు మనుష్యునకు అసాధ్యములని స్పష్టముగా విదితములగును. ఇట్టివి దేవతల కును, యోగులకును శక్తికి మించినవే యగును. ఈ చిన్న వ్యాసమునందు మిగుల సంక్షిప్తముగ ఆ పరమాత్ముని అద్భుతకార్యములను కొన్నిటిని తెలియజేయుట జరిగినది.

పరమాత్ముఁడగు శ్రీకృష్ణుఁడు ప్రేమస్వరూపుడు. ఆనందమూర్తి. ధర్మమును స్థాపించుటకును, భక్తిప్రపత్తులను నెలకొల్పుటకును, వాటి ప్రచారమునకును ఆ దేవదేవుడు అవతరించెను. భగవానుడు విశుద్ధ భక్తితత్త్వమును విస్తృతముగా ప్రవహింపజేసెను. దానినొకసారి అర్థముచేసికొనినచో భక్తుని హృదయము ద్రవించును. అతడు ఆనందమున ఓలలాడును. సంతోషమునకు పులకించని

వారు ఎవరు ఉందురు? ఆయన వాత్సల్యలీలలు అద్భుతములు. ప్రేమతత్త్వజ్ఞానము గంభీరమైనది. ఆ ప్రభువు అనుగ్రహము వలననే ఇవి అవగతమగును. శ్రీమద్భాగవతము మొదలగు పురాణములయందు గోపికలతో పరమాత్ముడు నెఱపిన ప్రేమలీలలు మనోజ్ఞముగా వర్ణించబడినవి. వాటిని చదివిన మానవుని మనస్సునందు అనేకవిధములగు సందేహములు ఉత్పన్నమగును. బాహ్యార్థములను మాత్రమే గ్రహించినచో ఆ ప్రేమయందు విషయవికారములే కనిపించును. కాని ఈ ఘట్టములను విశేషార్థములతో ఆలోచింపవలెను. గోపికలతో పరమాత్ముడు నెఱపిన ప్రణయలీలలు విషయజన్యములు, అనుచితములు కావని బోధపడును - అందువలననే ఉద్ధవుని వంటి మహాత్ములు, గౌరాంగ మహాప్రభువు వంటి త్యాగశీలురు, భక్తశిరోమణులు, సత్పురుషులు ఆ ప్రభువును వేనోళ్ల కీర్తించిరి. గోపికల ప్రణయము ఐహికపరమైనది ఏమాత్రమూ కాదు. వారు శ్రీకృష్ణుని సాక్షాత్తు పరమాత్ముడే అని హృదయపూర్వకముగా నమ్మియుండిరి. స్వయముగా ఆ గోపాంగనలే ఇట్లు పలికిరి.

న ఖలు గోపికానందనో భవాన్ అఖిల దేహినామంతరాత్మదృక్ ।
విఖనసార్థితో విశ్వగుప్తయే సఖ ఉదేయివాన్ సాత్వతాం కులే ॥

(శ్రీమద్భాగ. 10/31/4)

"సఖా! నీవు కేవలము గోపికలకు ఆనందమును కలిగించువాడవే కావు. సర్వప్రాణులలో అంతర్యామివైయున్నావు బ్రహ్మదేవుని ప్రార్థననుసరించి విశ్వమును పరిపాలించుటకు యదువంశమున జన్మించితివి".❖

వారి (గోపికల) ప్రేమ విశుద్ధమైనది. జ్ఞానవిలసితమని దీనివలన బోధపడును. వారి ప్రణయతత్త్వమును అలౌకికమైనదని సత్పురుషు

❖ నీవు యశోద బిడ్డఁడవె నీరజనేత్ర సమస్తజంతుచే
తో విదితాత్మ వీశుడవు తొల్లి విరించి దలంచి లోకర
క్షావిధ మాచరింపుమని సన్నుతిసేయగ సత్కులంబునన్
భూవలయంబుఁ గావ నిటు పుట్టితిగాదె మనోహరాకృతిన్
(పోతన భాగ. 10-1039)

లందరును మిగుల ప్రశంసించిరి. అంతియేకాదు స్వయముగా ఆ సర్వేశ్వరుడు కూడ వారి ప్రేమతత్త్వమును, దాని వైశిష్ట్యమును అనేకవిధముల కొనియాడెను. అర్జునునితో ఆ ప్రభువు ఇట్లు నుడివెను.

నిజాంగమపి యా గోప్యో మమేతి సముపాసతే ।
తాభ్యః పరం న మే పార్థ నిగూఢప్రేమ భాజనమ్ ॥ (ఆదిపురాణము)

"ఓ పార్థా! వారు తమ శరీరములను నావిగా (పరమాత్మవిగా) తలంచిరి. అట్లు విశ్వసించి వాటిని రక్షించుకొనుచుండిరి. గంభీరమగు నా ప్రణయమునకు వారే పాత్రులు. వారిని మించినవారు ఇంకెవరును లేరు".

భగవంతుడు స్వయముగా జ్ఞానస్వరూపుడు. ఆయనయందు విషయ వికారములను గూర్చి శంకించుటకు తావేలేదు. పురాణములలో వర్ణింపబడిన విషయప్రసంగముల అర్థమేమిటని ఎవరైనా అడిగినచో నా సామాన్యబుద్ధికి తోచిన సమాధానము నేనిట్లు చెప్పెదను. ఇందు శబ్దముల బాహ్యార్థములనే పట్టుకొని ఊగులాడవలసిన పని లేదు. అది సముచితమూ కాదు. ఇతిహాసములు, స్మృతులు, పురాణాది గ్రంథములలో ఎక్కడైనను పరమేశ్వరునిమీద అసత్యవాది, కపటి, వ్యభిచారి మొదలగు దోషములు ఉన్నట్లు పైకి కనబడినను, మద్యమాంసములు సేవించెడివాడు, డాంభికము కలవాడు మున్నగు దోషములు ఉన్నట్లు అనిపించినను - అవి అన్నియును భ్రమ ప్రమాదముల వలన కలిగినవిమాత్రమే. వాటిని లోతుగా పరిశీలించి వాటి యథార్థములన స్వీకరింప (ఎఱుంగ) వలెను. సందర్భములను అనుసరించి అందలి సదుపదేశములను గ్రహించవలెను. తదనుగుణముగ వాటిని ఆచరించవలెను.

ప్రపంచము, నిరంతర పరివర్తనముతో కూడినది. దేశము, కాలము, వస్తువులు అన్నియును క్షణక్షణము మార్పు చెందుచుండును. పురాతన ఘట్టములందు ఒకదానికి మరొక దానికిని సమయముయొక్క వ్యవధి ఎక్కువగా ఉండును. ఆ కారణమున సమయానుకూలముగా మార్పులు జరుగుచుండును. ఈ కారణమున శాస్త్రములలో వర్ణింపబడిన విషయము లన్నిటియొక్క ఉద్దేశ్యము పూర్తిగా సరియగురీతిలో అవగతము కాదు.

అంతేకాకుండ మనదేశము చాలకాలము వరకు ఇతర సంప్రదాయముల వారి (విదేశీయుల) ఆధిపత్యములో ఉండెను. ఆ కారణముగ 'ధర్మమునకు విరుద్ధముగా మన శాస్త్రములయందు అసత్యము, కపటము, దొంగతనము మొదలగు చెడుభావములు చొప్పింపబడెను', అని అనుటలో ఆశ్చర్యమేమియును లేదు. కనుక పురాణములలో చెప్పిన విషయముల నన్నిటిని, సరియైన అర్థములతో ప్రతి అక్షరమును విశదీకరించుట మనవంటివారి తరముకాదు. వాటి పూర్వాపరముల సంబంధములను తగురీతిలో వివరించుట సామాన్యులకు అంతసులభము కాదు. అవి మిథ్యలనికాని, అసత్యములనిగాని పూర్తిగా ఋజువు చేయు బాధ్యతను మనమీద వేసికొనుటకూడ సరియైనదికాదు. అందులకు మనము అర్హులమూ కాదు - ఎందుకనగా మనము సర్వము తెలిసినవారము కాదు కదా! పరమాత్ముడు ఈ లోకమున అవతరించి లీలలను ప్రకటించెను. వాటియందు ఎక్కడైనను శాస్త్రమర్యాదకు విపరీతముగ ఏవైనను దోషములుగా భ్రమప్రమాదమున భాసించవచ్చును. కాని ఆ సర్వేశ్వరునియందు ఎప్పుడును, ఏ దోషమును ఉండజాలదని మనము నిశ్చితమైన అభిప్రాయమును కలిగియుండవలెను. ఆ సర్వేశ్వరుడు మహితాత్ముడు, ఆయన కార్యములు సర్వదా దివ్యములు. అందువలన పురాణములను, ఇతిహాసములను కూడ అసత్యములని చెప్పుట తొందరపాటే అగును.

ఆ పరమాత్ముని దివ్యలీలలు, ఆ ప్రభువు అవతరణలక్ష్యము, ఆయన చేయు కార్యముల ఆంతర్యము దేవతలకును, మహర్షులకును కూడ సంపూర్ణముగా అర్థము కాదు. భగవంతుడే స్వయముగా ఇట్లు పలికెను.

న మే విదుః సురగణాః ప్రభవం న మహర్షయః ।
అహమాదిర్హి దేవానాం మహర్షీణాం చ సర్వశః ॥ (గీత. 10/2)

"నా ఉత్పత్తిని అనగా నా లీలావతారవిశేషములను దేవతలు గాని మహర్షులుగాని తెలిసికొనజాలరు. ఏలనన నేను అన్నివిధములుగా ఆ దేవతలకును, ఈ మహర్షులకును మూలకారణమైనవాడను".

ఇతిహాసములను, పురాణములను రచించిన ఋషులు, భగవత్తత్త్వము

నెఱిగిన సిద్ధమహాపురుషులు యోగులే ఐనప్పటికిని వారికి గూడ పరమాత్ముడగు శ్రీరామచంద్రుని వైభవమును, శ్రీకృష్ణుని లీలలను, వాటి ప్రభావమును సంపూర్ణముగా వర్ణించుటకు సామర్థ్యము చాలదు. ఆ పరంధాముని కృపావిశేషము వలన ఆ మహాత్ములు పరమాత్మను గూర్చి ఎన్నియో విషయములను వివరించిరి. కాని అల్పబుద్ధులమైన కారణమున మనము వారి భావములను సరియైన రీతిలో అర్థము చేసికొనలేక పోవుచున్నాము. మన తెలియని తనమును (అజ్ఞానమును) ఆ మహనీయులకు ఆపాదించుచున్నాము.

అవతారరూపములో ప్రకటితుడైన ఆ పరమాత్మను ఋషులు సైతము గుర్తింపలేరని మహాభారతము వెల్లడించుచున్నది. వారిలో ఏ కొందరో తత్త్వమును తెలిసిన మహాత్ములగు మహర్షులే పరమేశ్వరుని కృపచేత ఆ స్వామిని తెలిసికొందురు.

రామచరితమానసమందు ఈ విషయము కలదు.

"భక్తుల హృదయములను ఆహ్లాదపరచు చందనరూపమైన ఓ స్వామీ! నీ అనుగ్రహము ప్రసరించినప్పుడే భక్తులు నిన్ను తెలిసికొనగలరు".

(రా.మా. అయోధ్యా. కాం. దో. 126/2)

పరమాత్ముడు ఏ శరీరముతో అవతరించునో ఆ శరీరమునకు అనుగుణముగనే ఆయన లీలలు ఉండును. ఆ ప్రభువు మానవ శరీరమందు ప్రకటితుడైనచో ఆయన చేష్టలు మానవునివలె నుండును. ఆ స్వామియొక్క మానవోచిత కర్మలను చూచి మహర్షులు, మునిగణములు సైతము భ్రమించుచుందురు. ఇక మనుష్యుల విషయమున చెప్పవలసినదేమున్నది? వసిష్ఠమహర్షి ఇట్లు నుడివెను.

"స్వామీ! మీరు ఆచరించుచున్న మానవోచిత కార్యములను జూచి నా హృదయము అపార మోహమగ్నమగుచున్నది". (రా.మా. ఉ.కాం. దో.47/2)

మహాభారతమునందలి అశ్వమేధపర్వములోని 53వ అధ్యాయమునందు ఒక కథ గలదు. కౌరవ పాండవుల యుద్ధము ముగిసెను. మహారాజగు యుధిష్ఠిరుని వీడ్కొని పరమాత్ముడగు శ్రీకృష్ణుడు హస్తినాపురమునుండి

ద్వారకకు వెళ్లుచుండెను. ఆ మార్గమధ్యమునందే మరుభూమియందు ఉత్తంకుడను మహర్షి నివసించుచుండెను. ఆయన గురుభక్తుడు, పరమతప స్సంపన్నుడు. ఆ ఉత్తంకమహర్షిని శ్రీకృష్ణుడు కలిసెను. పాండవులు ఐదుగురు తప్ప కౌరవులందరు నశించిరను విషయము శ్రీకృష్ణుడాతనికి తెలిపెను. ఆ విషయమును పరమాత్ముడగు శ్రీకృష్ణుని నోటినుండి విని ఉత్తంకమహర్షి మిగుల కుపితుడయ్యెను. ఆయన శ్రీకృష్ణునితో ఇట్లు పలికెను. "నీవు సర్వశక్తి సంపన్నుడవై యుండికూడ యుద్ధమును ఆపలేదు. కనుక నేను నీకు శాపము నిచ్చెదను". దేవదేవుడు మిగుల దయగలవాడు. ఆ ప్రభువు శాపమునిచ్చుకు పూనుకొనిన మునిని నివారించుచు ఇట్లు పలికెను : "ఓ తాపసశ్రేష్ఠా! మీరు మీ గురువునకు సేవచేసి ఆయనను సంతోషపెట్టిరి. దానివలన మీ తపస్సు మిగుల తేజస్సంపన్నమై అలరారుచున్నది. నేను ఆ తపస్సును వ్యర్థము చేయించదలచుకొనుటలేదు. మీరుమిక్కిలి మీ శాపముయొక్క ప్రభావము నా మీద ఏ మాత్రమును ఉండదు. శాపమిచ్చుట వలన మీ తపస్సు నశించును. కనుక మీరు నా ఆధ్యాత్మ విషయకమగు ఆత్మతత్త్వమును, దాని ప్రభావమును వినుడు". పిమ్మట 54వ అధ్యాయ మందు ఉత్తంకమహర్షి అడిగినప్పుడు ఆ దేవాదిదేవుడు తానవతరించుటకు కారణమును, ప్రభావమును, స్వభావమును వర్ణించెను.

బహ్వీః సంసరమాణో వై యోనీర్వర్తామి సత్తమ ।<br>
ధర్మసంరక్షణార్థాయ ధర్మసంస్థాపనాయ చ ॥ 13

తైః తైః వేషైశ్చ రూపైశ్చ త్రిషు లోకేషు భార్గవ ।<br>
అహంవిష్ణురహం బ్రహ్మా శక్రోఽథ ప్రభవాప్యయః ॥ 14

భూతగ్రామస్య సర్వస్య స్రష్టా సంహార ఏవ చ ।<br>
అధర్మే వర్తమానానాం సర్వేషామహమచ్యుతః ॥ 15

ధర్మస్య సేతుం బధ్నామి చలితే చలితేయుగే ।<br>
తాస్తాయోనీః ప్రవిశ్యాహం ప్రజానాం హితకామ్యయా ॥ 16

(మహాభారతము, 54వ అధ్యాయము)

"ఓ బ్రాహ్మణోత్తమా! భార్గవా! నేను ధర్మమును స్థాపించుటకును, రక్షించుటకును అనేకయోనుల యందు అవతరించుచుందును. ఆయా వేషములను రూపములను కలిగియుందును. మూడులోకముల యందును ప్రకటితుడనగుచుందును. నేనే విష్ణువును, నేనే బ్రహ్మను, నేనే ఇంద్రుడను. ఉత్పత్తి, ప్రళయరూపములును నేనే. సకలభూతసముదాయమును సృష్టించినవాడను, లయమొనర్చెడివాడను కూడ నేనే. నేనే అచ్యుతుడను, పరమాత్ముడను, క్షణక్షణము మార్పునకు లోనగు యుగములందు ప్రజలహితమును దృష్టిలో నుంచుకొని వివిధయోనులందు ప్రవేశించు చుందును. అధర్మముగా ప్రవర్తించు సకల ప్రాణులకొఱకు ధర్మముయొక్క మర్యాదను దృఢము చేయుచుందును.

**యదాత్వహం దేవయోనౌ వర్తామి భృగునందన ।**
**తదాహం దేవవత్ సర్వమాచరామి న సంశయః ॥ 17**

"ఓ భృగునందనా! నేను దేవయోనియందు ప్రకటితుడనైన సందర్భమున దేవతలవలె సకలమును ఆచరించెదను".

**యదాగంధర్వయోనౌ వా వర్తామి భృగునందన ।**
**తదాగంధర్వవత్ సర్వమాచరామి న సంశయః ॥ 18**

"ఓ భార్గవా! గంధర్వయోనియందు అవతరించినప్పుడు నిస్సందేహముగా గంధర్వులవలెనే సకల వ్యవహారములను నడిపెదను".

**నాగయోనౌ యదాచైవ తదావర్తామి నాగవత్ ।**
**యక్షరాక్షసయోన్యోస్తు యథావత్ విచరామ్యహమ్ ॥ 19**

"నాగయోనియందు ఉత్పన్నుడనై నాగులవలె ప్రవర్తించెదను. యక్షరాక్షసుల యందు ప్రకటితుడనై వారికి అనుగుణముగనే వ్యవహరింతును".

**మనుష్యేవర్తమానే తు కృపణం యాచితా మయా ।**
**న చ తే జాతసమ్మోహా వచోఽగృహ్ణాం తమే హితమ్ ॥ 20**

"ఈ యుగమునందు మనుష్యయోనియందు అవతరించి, మానవులవలె ఆచరణ సలుపుచున్నాను. కౌరవులతో సంధికొఱకై మిగుల ప్రయత్నించితిని. కాని వారు మోహగ్రస్తులైన కారణమున నా హితకర్మమైన మాటలను వినలేదు."

ఈ విధముగా భగవంతుని ప్రభావమును, స్వరూపమును గురించిన విషయములను వినిన పిమ్మట ఆ మహర్షికి శ్రీకృష్ణుడు సాక్షాత్తు పరమాత్ముడు అను విశ్వాసమును సంపూర్ణముగా కలిగెను. అప్పుడా మునీంద్రుడు శ్రీకృష్ణభగవానునితో విశ్వరూపదర్శనమును ప్రసాదించుమని సవినయముగా ప్రార్థించెను. పరమాత్ముడు ఋషిప్రార్థనను మన్నించెను. అతనికి తన విశ్వరూప దర్శనమహాభాగ్యమును ప్రసాదించెను. అట్లు విశ్వరూపమును దర్శించి ఉత్తంకమహాముని సర్వేశ్వరుడగు ఆ శ్రీకృష్ణుని ప్రస్తుతించెను. తదుపరి భగవంతుడు మునీంద్రునకు వరముల ననుగ్రహించి ద్వారకా పురమునకు వేంచేసెను.

యజ్ఞములు, దానములు, తపస్సులు, గురుసేవ మొదలగునవి తపోధనులైన ఋషులు ఆచరించెదరు. కాని ఆ పరమాత్ముని కృప లేనిదే ఆ స్వామి అవతారస్వరూపమును (తత్త్వమును) గుర్తించలేరు. ఈ విషయము ఉత్తంకమహాముని గాథా దృష్టాంతమువలన స్పష్టమగును. ఆ సర్వేశ్వరుని అనుగ్రహమున ఆ ప్రభువుయొక్క పరిచయ భాగ్యమును పొందిన ఆ స్వామిని గుర్తించగలరు. ఆయన కృపకు పాత్రులైన ఆ స్వామి రూపమునే పొందుదురు.

"నీవు స్వయముగా నీ తత్త్వమును ఎవరికి అవగతమొనర్తువో వారే నిన్ను తెలిసికొనగలుగుదురు. నిన్ను తెలిసికొనినంతనే వారు నీ రూపమును పొందుదురు". (రా.మా. అయోధ్యా. దో. 126/2)

పరమాత్ముడు కృపాళువై ఎవరికి తన ఆత్మతత్త్వమును బోధపఱచునో అట్టివారే ఆయనను గుర్తించగలరు. అంతేగాని ఇతరులచే తెలుపబడినప్పటికి కూడ వారు పరమాత్ముని తెలిసికొనజాలరు. సంజయుడు పరమాత్ముని గుఱించి ధృతరాష్ట్రునకు ఎన్నోవిధముల తెలిపెను. అతడు ఆ స్వామి ప్రభావమును, మహిమను వివరించెను. కాని ధృతరాష్ట్రుడు ఆ ప్రభువును గుఱించి తెలిసికొనలేకపోయెను. మహాభారతములోని ఉద్యోగపర్వమునందలి 68వ అధ్యాయమునందు ఒక కథ గలదు. సంజయుడు దూతగా పాండవుల దగ్గఱకు వెళ్లెను. అచటినుండి తిరిగి వచ్చిన పిదప అతడు వేదవ్యాస భగవానుని ఆజ్ఞతో పరమాత్ముడగు శ్రీకృష్ణుని ప్రభావమును, భగవత్తత్త్వమును వర్ణించెను.

యతః సత్యం యతో ధర్మో యతో హ్రీః ఆర్జవం యతః ।
తతో భవతి గోవిందో యతః కృష్ణస్తతోజయః ॥

"సత్యము, ధర్మము, లజ్జ, ఋజుభావములున్నచోట శ్రీకృష్ణపరమాత్మ యుండును. కృష్ణపరమాత్మయున్నచోటనే విజయము ఉండును".

పృథివీం చాంతరిక్షం చ దివం చ పురుషోత్తమః ।
విచేష్టయతి భూతాత్మా క్రీడన్నివ జనార్దనః ॥ (10)

"జనార్దనుడు సకలప్రాణులకు ఆత్మస్వరూపుడు. ఆ పురుషోత్తముడు తన లీలలను ప్రకటించుచు పృథివిని, అంతరిక్షమును, దేవలోకమును క్రియాశీలములుగా చేయుచున్నాడు".

స కృత్వా పాండవాన్ సత్రం లోకం సమ్మోహయన్నివ ।
అధర్మనిరతాన్ మూఢాన్ దగ్ధు మిచ్ఛతి తే సుతాన్ ॥ (11)

"ఆ పరమాత్ముడే ప్రజలను మోహింపజేయుచు, పాండవులను నిమిత్తముగా చేసికొని, అధర్మనిరతులు, మూర్ఖులగు నీ పుత్రులను భస్మము చేయ తలంచుచున్నాడు".

కాలచక్రం జగచ్చక్రం యుగచక్రం చ కేశవః ।
ఆత్మయోగేన భగవాన్ పరివర్తయతేఽనిశమ్ ॥ (12)

"సర్వేశ్వరుడగు కేశవుడు కాలమను చక్రమును, జగత్ అను చక్రమును, యుగమను చక్రమును తన యోగశక్తిచేత నిరంతరము త్రిప్పుచున్నాడు".

కాలస్య చ హి మృత్యోశ్చ జంగమస్థావరస్య చ ।
ఈశతే భగవానేకః సత్యమేతత్ బ్రవీమి తే ॥ (13)

"పరమేశ్వరుడగు శ్రీకృష్ణుడు తాను ఒక్కడే కాలమును, మృత్యువును సకలచరాచర జగత్తును శాసించుచున్నాడని నేను నీతో పలుకుచున్న ఈ మాటలు ముమ్మాటికిని సత్యములు".

ఈశన్నపి మహాయోగీ సర్వస్య జగతో హరిః ।
కర్మాణ్యారభతే కర్తుం కీనాశ ఇవ వర్ధనః ॥ (14)

"శ్రీకృష్ణుడు మహాయోగి, సకల జగత్తును శాసించుచు, ధనధాన్యములను వృద్ధిచేయుటకై రైతువలె కర్మలను ఆరంభించుచున్నాడు".

తేన వంచయతే లోకాన్ మాయాయోగేన కేశవః ।
యే తమేవ ప్రపద్యంతే న తే ముహ్యంతి మానవాః ॥ (15)

"దేవదేవుడగు కేశవుడు తనయోగమాయచేత మనుష్యులను మోహితులను చేయుచు భ్రమకు గుఱి చేయుచుండును. కాని తనను శరణుజొచ్చిన మానవులను మాత్రము ఆ స్వామి మాయచే మోహితులు కావింపడు".

పిదప ధృతరాష్ట్రుడు సంజయుని ఇట్లు అడిగెను. "మాధవుడగు శ్రీకృష్ణుడు సకలలోకములకును సర్వేశ్వరుడను విషయము నీకు ఎట్లు తెలియును? నేను ఆ ప్రభువును ఎందుకు తెలిసికొనలేకపోవుచున్నాను?" అంతట సంజయుడు ప్రత్యుత్తరమిచ్చుచు ఇట్లు చెప్పెను. "ఓ రాజా! మానవుని జ్ఞానము అజ్ఞానము చేత కప్పబడియుండును. అట్టివారు భగవంతుడగు శ్రీకృష్ణుని తెలిసికొనజాలరు. నీలో ఆ జ్ఞానము లేదు. కనుక నీవు తెలుసుకొనలేవు. ఆ స్వామిని నే నెఱుగుదును".

పిమ్మట ఉద్యోగ పర్వమునందలి 70వ అధ్యాయమునందు మరల ధృతరాష్ట్రుడు సంజయునితో ఇట్లు అడిగెను. "ఓ సంజయా! శ్రీకృష్ణుని విషయములో నేను నిన్ను ఒక సంగతిని అడిగెదను. నీవు నాకు కమలనయనుడగు శ్రీకృష్ణుని కథలను వినిపింపుము. నామ మహిమను, చరిత్రను తెలిసికొని ఆ పరమాత్ముని పొందుదును". తరువాత సంజయుడు శ్రీకృష్ణుని నామ మహత్త్వములను, దివ్యగుణములను, ప్రభావములను పెక్కురీతుల వర్ణించెను. ఐనప్పటికిని ధృతరాష్ట్రుడు పరమాత్ముడగు శ్రీకృష్ణుని బాగుగా గుర్తించలేకపోయెను. భగవంతుని అనుగ్రహమును పొందినవారే ఆ స్వామిని గుర్తించగలుగుదురు.

పరమాత్మునియొక్క ప్రతికార్యమునందును విలక్షణభావము నిండి యుండును. ఆ స్వామి సర్వశక్తి సంపన్నుడు. బుద్ధికి సాగరుడు, అద్భుతమైన నేర్పుగలవాడు. ఆయన ఏ క్రియయైనను, ఏ ఒక్క సంకల్పమైనను, ఎప్పుడును నిష్ఫలము కాదు. ఎచటనైనను, ఏ పని ఐనను నిష్ఫలమైనదనినచో అది

ఆయన ఇచ్ఛచేతనే జరిగినదనుకొనవలయును. అట్లు సఫలము కాని దానియందు గొప్ప రహస్యము ఇమిడియుండును. పరమాత్ముడు పాండవుల దూతగా హస్తినాపురమునకు వెళ్ళెను. ఆయన తలపెట్టిన సంధికార్యము అచట సిద్ధించలేదు. ఆ స్వామికి సంధి జరుగవలయునను కోరిక లేకుండుటయే దానికి కారణము. దూతగా వెళ్లు సమయమున ఆ స్వామి ద్రౌపదీదేవితో మాట్లాడిన విధము గమనించినచో ఇది స్పష్టము కాగలదు. అప్పుడు ద్రౌపదీదేవి అనేకవిధములుగా విలపించుచు భగవంతుని ఇట్లు ప్రార్థించెను.

సుతా ద్రుపదరాజస్య వేదిమధ్యాత్ సముత్థితా ।
ధృష్టద్యుమ్నస్య భగినీ తవ కృష్ణప్రియా సఖీ ॥
ఆజమీఢకులం ప్రాప్తా స్నుషా పాండోర్మహాత్మనః ।
మహిషీ పాండుపుత్రాణాం పంచేంద్ర సమవర్చసామ్ ॥
సుతా మే పంచభిర్వీరైః పంచజాతా మహారథాః ।
అభిమన్యుర్యథా కృష్ణ తథా తే తవ ధర్మతః ॥
సాహం కేశగ్రహం ప్రాప్తా పరిక్లిష్టా సభాం గతా ।
పశ్యతాం పాండుపుత్రాణాం త్వయి జీవతి కేశవ ॥

(మహా. ఉద్యో. 82/21-24)

"ఓ కృష్ణా! నేను యజ్ఞవేదికయందు జన్మించిన మహారాజగు ద్రుపదుని పుత్రికను. ధృష్టద్యుమ్నునకు సోదరిని. నీ వాత్సల్యమునకు పాత్రురాలను. అజామీఢ కులమునందు మా వివాహము జరిగెను. మహాత్ముడగు పాండురాజునకు కోడలిని. ఇంద్రునియంతటి తేజస్సంపన్నులగు పంచపాండవులకు పట్టపురాణిని. ఆ ఐదుగురు మహావీరులకు జన్మించిన మహారథులగు ఐదుగురు పుత్రులకు తల్లిని. వారు ధర్మబద్ధముగా అభిమన్యునివలె నీకు ప్రియమైనవారు. ఓ కేశవా! నీవు మాకు ఆత్మబంధుడవై ఉన్నప్పటికిని ఆ పాండవులు చూచుచుండగనే ఆ కౌరవులు నా కేశములను పట్టుకొని నిండుసభకు నన్ను ఈడ్చుకొని వచ్చిరి, భరించరాని దుఃఖమునకు లోనుచేసిరి.

జీవత్సు పాండుపుత్రేషు పాంచాలేష్వథ వృష్ణిషు ।
దాసీభూతాస్మి పాపానాం సభామధ్యే వ్యవస్థితా ॥

"పాండుపుత్రులు, పాంచాలురు, వృష్ణికుల సంభవులు బ్రతికియుండగనే పాపాత్ములైన కౌరవులు తమ సభకు లాగుకొనివచ్చిరి. అచట నేను దాసిగా చూడబడితిని".

నిరమర్షేష్వచేష్టేషు ప్రేక్షమాణేషు పాండుషు ।
పాహిమామితి గోవింద మనసా చింతితోఽస్మిమే ॥

"పాండవులు ఈ దృశ్యమును (నా దురవస్థను) చూచుచుండియు, చేతగానివారివలె నిశ్చేష్టులై యుండిరేగాని (చేతులు ముడుచుకొనియుండిరే గాని) ఏ మాత్రము కినుక వహింపలేదు. అందువలన "ఓ గోవిందా! నన్ను రక్షింపుము" అనుచు నేను నా మనస్సులో నిన్నే ధ్యానించుచుంటిని.

అయంతే పుండరీకాక్ష దుశ్శాసన కరోద్ధృతః ।
స్మర్తవ్యం సర్వకార్యేషు పరేషాం సంధిమిచ్ఛతా ॥

"ఓ పుండరీకాక్షా! శత్రువులతో సంధికార్యములను గూర్చి చర్చించునపుడు అన్నికార్యములందును (అన్ని సందర్భములలోను) దుష్టుడైన దుశ్శాసనుడు తన చేతులతో ఈ (నా) కేశములను పట్టుకొని ఈడ్చుకొని వచ్చిన విషయమును విస్మరింపకుము".

దుశ్శాసన భుజం శ్యామం సంఛిన్నం పాంసుగుంఠితమ్ ।
యద్యహం తు న పశ్యామి కా శాంతిర్హృదయస్యమే ॥

"శ్యామల వర్ణముగల దుశ్శాసనుని భుజము కదనరంగములో తెగిపడి దుమ్ముతో నిండినప్పుడు నేను దానిని చూడవలయును. లేనిచో నా హృదయమునకు శాంతియే కలుగదు.

ఇత్యుక్త్వా బాష్పరుద్ధేన కంఠే నాయత లోచన ।
రురోద కృష్ణా సోత్కంపం సస్వరం బాష్పగద్గదమ్ ॥

"విశాలమైన కన్నులుగల ద్రౌపదీదేవి ఇట్లు పలుకుచు పట్టరాని దుఃఖముతో

బోరుమని ఏడ్చుచుండగా గొంతు పెగలకుండెను. అప్పుడు ఆమె గద్గద స్వరముతో వణికిపోవుచు ఎంతయు రోదించెను".

ద్రౌపదియొక్క దీనవచనములను వినినంతనే పరమాత్ముడామె యెడల ప్రసన్నుడయ్యెను. పిదప ఆ స్వామి కౌరవులను నాశనము చేసెదనని తీవ్రముగా ప్రతిజ్ఞ చేయుచు ఇట్లు పలికెను.

చలేద్ధి హిమవాంఛైలో మేదినీ శతధా ఫలేత్।
ద్యౌః పతేచ్చ సనక్షత్రా న మే మోఘం వచోభవేత్॥

"హిమాలయ పర్వతము చలించిపోవుగాక, ఈ పృథివి వందలకొలదిగా ముక్కలు ముక్కలు అగుగాక! నక్షత్రములతో కూడిన ఆకాశము ఊడిపడిపోవునుగాక నా ఈ వచనములు మాత్రము వ్యర్థములు కావు".

సత్యం తే ప్రతిజానామి కృష్ణే బాష్పం విగృహ్యతామ్।
హతామిత్రాన్ శ్రియా యుక్తానచిరాద్ ద్రక్ష్యసేపతీన్॥

"ఓ ద్రౌపదీ! ఇంక నీవు కన్నీరు పెట్టవద్దు. (ఇక నీవు దుఃఖింపకుము). ఇక మీ శత్రువులు (కౌరవులు) నేలగూలుట తథ్యము. ఇది నా ప్రతిజ్ఞ. ఇది ముమ్మాటికిని సత్యము. నీ భర్తలు రాజ్యమును పొంది, సుఖసంపదలతో వర్ధిల్లుట నిజము. వీటిని నీవు త్వరలోనే చూడగలవు. యుద్ధము అనివార్యము. దానిని జరిపింపక తప్పదు" అని ఆ పరమాత్ముడు (కృష్ణుడు) తలంచుచున్నట్లు దీనివలన సిద్ధించును. ప్రాపంచిక మర్యాదను (పద్ధతులను) పరిరక్షించుట కును, తన ప్రియమైన పాండవుల కళంకమును తొలగించుటకును ఆ స్వామి హస్తినాపురమునకు వెళ్లి సంధిప్రయత్నము చేసెనని గ్రహింపవలయును.

రణరంగమునందు ఆయుధమును పట్టనని పరమాత్ముడు ప్రతిజ్ఞ చేసెను. కాని తనకు ప్రియభక్తుడైన భీష్ముని చంపుదునని తన చక్రాయుధమును చేతబట్టెను. దీనికి కూడ కారణము ఆ ప్రభువుయొక్క ఇచ్ఛయే. భీష్మపర్వమునందలి ఈ ఘట్టము మిక్కిలి రహస్యముతో కూడినది. వీరరసభరితము. ఇది ప్రేమమయమైన ఆస్వామియొక్క లీలయే యని తెలియనగును. భీష్మపితామహుడు శ్రీకృష్ణునకు గొప్పభక్తుడు. అత్యంత శ్రద్ధాళువు. భీష్ముని సంతోషపెట్టుటకే ఆ సర్వేశ్వరుడు ఈ పనిచేసెను. ఇది

కడువిచిత్రమైనది. నిజమునకు పరంధాముని చేష్టలన్నియు దోషరహితములు, మిగుల దివ్యములు. ఆ స్వామియొక్క దివ్యతత్త్వమును తెలిసికొనుట సామాన్యవిషయము కాదు.

పరమాత్ముని అనంతదివ్యగుణముల మహిమను ఎవరు వర్ణించగలరు? ప్రపంచమునందు ఓర్పు, దయ, శాంతి మొదలగు సమస్త గుణములును తేజస్సు, ఐశ్వర్యము మొదలగు సకల విభూతులును, శక్తి ప్రతాపము ఆదిగాగల ఉన్నతభావములు అన్నియును సర్వశక్తిమంతుడగు శ్రీకృష్ణుని తేజస్సునందలి ఒక అంశముయొక్క విస్తారములే అని ఎఱుగవలయును. భగవంతుడు స్వయముగా ఇట్లు విశదీకరించెను.

యద్యద్విభూతిమత్ సత్త్వం శ్రీమదూర్జితమేవ వా ।
తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశసంభవమ్ ॥
అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున ।
విష్టభ్యాహమిదం కృత్స్నమ్ ఏకాంశేన స్థితో జగత్ ॥

(గీత. 10/41, 42)

"విభూతియుక్తము అనగా ఐశ్వర్యయుక్తము, కాంతియుక్తము, శక్తియుక్తము ఐన వస్తువేదైనను నా తేజస్సుయొక్క అంశమునుండియే కలిగినదిగా తెలిసికొనుము. అథవా! ఓ అర్జునా! ఇంతకంటెను విపులముగా తెలిసికొని ప్రయోజనమేమి? ఈసంపూర్ణజగత్తును కేవలము నా యోగశక్తియొక్క ఒక్క అంశతోడనేధరించు చున్నాను".

❖ ❖ ❖

# 8. నామము, రూపము, లీలలు, పరమధామము

మహాసృష్టికి ముందు నిర్గుణ నిరాకార సచ్చిదానంద ఘన బ్రహ్మయే యుండెను. మహాసృష్టి ప్రారంభమునందు ఆ పరమాత్మయొక్క అభిన్నశక్తిరూపమగు ప్రకృతి అవ్యాకృత మాయయని చెప్పుదురు. ఆ ప్రకృతియందు జీవుల కర్మఫలములను, వారిచే అనుభవింపజేయుటకు స్వాభావికముగనే మహాకలకలము చెలరేగెను. దానివలన ఆ అవ్యాకృత మాయ సహజముగనే మూడు గుణములుగ విభజితమయ్యెను. పెరుగును చిలుకుటవలన వెన్న, మజ్జిగయను రెండు రూపములలో అది (ఆ పెరుగు) పరిణతి చెందును. ఇట్లే ప్రకృతి క్షోభించినపుడు విద్య, అవిద్యయను రెండు రూపములు దానియందు కలుగును. అందులో ప్రభవించు కోలాహల రూపమగు క్రియయే రజోగుణము. దానివలన ఉత్పన్నమగు విద్యయే సత్త్వగుణము. అవిద్యయే తమోగుణము. ఇట్లు అది మూడు రూపములను పొందును. ఈ మూడు రూపములతో కూడిన పరమాత్మ స్వరూపమే సగుణనిరాకారము. దానివలననే ఆదిసృష్టియొక్క విస్తారము జరుగును. సృష్టియొక్క ఉత్పత్తిని, స్థితిని, సంహారములను చేయుటకు ఆ పరమాత్మ బ్రహ్మ విష్ణు మహేశ్వరులరూపములలో ప్రకటితుడగును. ఆ సగుణ నిరాకార పరమాత్మయే నృసింహుడు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు మొదలగు సగుణసాకార రూపములలో ప్రకటితుడు అగుచు యుగయుగములందు లీలలను నెఱపుచుండును. ఆకాశమందు పరమాణురూపములోనున్న జలమే మొదట రసరూపముననుండి పిమ్మట స్థూలజలరూపములో ప్రకటితమగును. పరమాణు రూపములో విద్యమానమైన నిరాకార పృథివియే గంధరూపమున ప్రకటితమగును. పిమ్మట భూమిగ సాకారరూపమును పొందును. ఇదేవిధముగ నిర్గుణనిరాకార బ్రహ్మయే సగుణ నిరాకారుడగును. తదుపరి సగుణ సాకార రూపమున ప్రాదుర్భవించును. జలమునకు కారణభూతమగు పరమాణురూపము, సూక్ష్మరస రూపము, స్థూలజలరూపము, ఈ మూడును వస్తుత: జలమే యగును. పృథివికి కారణభూతమగు పరమాణురూపము. సూక్ష్మగంధరూపము, స్థూలమగు పృథ్వీరూపము అను మూడును వాస్తవముగ

పృథివీరూపములే. నిర్గుణ నిరాకారమునందును, సగుణసాకారమునందును యథార్థముగ ఒకే పరమాత్మయుండును. ఈ విధముగ పరబ్రహ్మ పరమాత్మయొక్క సమగ్రరూపమైన తత్త్వమును తెలిసికొని ఆయనను భక్తిశ్రద్ధలతో ఉపాసించినచో మానవుడు అతి శీఘ్రముగా అవిద్యనుండియు, జననమరణ జరావ్యాధులనుండియు శాశ్వతముగా ముక్తుడగును. అట్లు సాధకుడు ఆ పరమాత్మను పొందగలడు.

భయంకరమైన ఈ కలికాలమునందు పరమాత్ముని పొందుటకు ఆ ప్రభువు నందు కలుగు భక్తియే సర్వోత్తమము, సరళమైన ఉపాయము. ఆ పరమాత్ముడు సగుణసాకార స్వరూపమందు అవతరించినపుడు అజ్ఞానులగు పురుషులు ఆయనను తెలిసికొనలేరు, ఏలనన వారు మాయయను తెరవెనుక (మాయచేత) కప్పబడియుందురు. (గీత. 7/25). పరమాత్ముని శరణుజొచ్చి ఆయనను భక్తితో ఆరాధించవలయును. అప్పుడు ఆ పరమాత్ముడు ఆ భక్తుని ఆవరించియున్న తన మాయయను తెరను తొలగించును. అప్పుడు సాక్షాత్తు చిన్మయుడు, దివ్యుడు, సగుణసాకార రూపుడగు ఆ స్వామిదర్శనము ఆ పురుషునకు ప్రత్యక్షముగ కలుగును. కనుక ప్రతి మానవుడు శ్రద్ధాభక్తులతో ఆ ప్రభువును భజింపవలెను.

భక్తిని అనుష్ఠించువారలకు మిక్కిలి సులభము, మహత్తరమునైన ఒక సాధన కలదు. భగవంతునకు సంబంధించిన పదార్థములలో పరమాత్ముని దివ్యనామము, ఆయన రూపము, లీలలు ఆ ప్రభువుయొక్క దివ్యధామము అను నాలుగు ముఖ్యాంశములు గలవు. సాధకుడు వీటియొక్క గుణములను, ప్రభావమును, తత్త్వమును, రహస్యమును (అంతర్యమును) ఈ నాలుగు విశేషరూపములను క్షుణ్ణముగా తెలుసుకొనవలయును. గుణముల ప్రభావమును, వాటి తత్త్వమును, రహస్యమును గూడ ఎరుగవలయును. అటులనే ప్రభావముయొక్క తత్త్వమును, అంతర్యమునుకూడ అవగతము చేసుకొనవలయును. ఈ మానవదేహమునకు ప్రాప్తమైన చెవులు, నేత్రములు, మనస్సు, వాణి ఈ నాల్గింటిద్వారా పైన చెప్పిన (భగవన్నామరూప లీలాధామములనెడి) పదార్థములను సేవించవలయును. అంతఃకరణములు,

ఇంద్రియములు మొదలగు అన్నిద్వారములనుండి పరమాత్ముని ఉపాసన జరుగుచున్నప్పటికిని వాటిలో కర్ణములు, నేత్రములు, మనస్సు, వాక్కు అను ఈ నాలుగు ద్వారములు ప్రముఖమైనవి. పైన చెప్పిన పదార్థములనుగూర్చి భక్తులనుండి శ్రద్ధాభక్తులతో కర్ణములద్వారా వినవలెను. నేత్రములతో సచ్ఛాస్త్రములను చదివి గ్రహింపవలెను. వాటిని మనస్సుచేత మననము చేయవలయును. పిమ్మట తన వాణిద్వారా ఇతరులకు బోధించుచుండ వలయును. ఇట్లు శ్రద్ధాభక్తులతో వీటిని సేవించుటవలన మానవునకు పరమాత్ముని యొక్క దర్శనము ప్రాప్తించును. పరమానందము కలుగును. అపరిమితమగు సమతాభావము సమకూరును. పరమాత్ముని స్వరూపజ్ఞానము ఉన్నదున్నటుల (యథాస్థితిలో) ప్రాప్తించును.

ఇప్పుడు ఈ పదార్థములను చక్కగా తెలిసికొనుటకై కొంతవిస్తృతముగ ఆలోచింపవలయును.

## పరమాత్ముని నామప్రభావము

ఓర్పు, దయ, శాంతి, ప్రేమ మొదలగునవి పరమాత్ముని దివ్యగుణములు. ఇవన్నియు ఆ స్వామియొక్క నామములన్నింటియందు కూడ ఉండును. నామమును జపించుట, కీర్తించుట, వినుట, స్మరించుటవలన నామియొక్క (పరమాత్మునియొక్క దివ్యగుణములు ఉపాసకునియందు సహజముగనే వచ్చిచేరును. నామముయొక్క గుణమాహాత్మ్యమును ఏమని చెప్పగలము? శ్రీతులసీదాసస్వామి నామమహిమను తెలుపుచు ఇట్లు పలికెను.

"నామమహిమను గూర్చి నేనేమి (ఎంతని) చెప్పగలను? ఆ శ్రీరాముడు సైతము నామమహిమను వర్ణింపజాలడు". (రా.మా. బా.కాం. దో. 25/4)

## భగవన్నామము యొక్క ప్రభావము

నామమును జపించుట, కీర్తించుట, శ్రవణముచేయుట, స్మరించుటవలన పూర్వము చేసికొన్న సమస్త పాపములు నశించును. అజ్ఞానముతో కూడిన అహంకార మమకారములు, రాగద్వేషములు, కామక్రోధములు, లోభమోహములు మొదలగు దుర్గుణములనుండి మానవుడు ముక్తుడగును.

అసత్యము, కపటము, హింస, దొంగతనము, వ్యభిచారము, మద్యపానము, జూదము, మొదలగు దురాచారములు దూరమగును. ఆధిభౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మిక దుఃఖములు పూర్తిగా తొలగిపోవును. అట్టివాడు నామజపమువలన పరమాత్మను తప్పక పొందగలడు.

"పావనివైన హనుమంతుడు ఈ పావన నామస్మరణముచే శ్రీరాముని తన వశమునందుంచుకొన గలిగెను. పతితుడైన అజామీళుడు, ఆర్తుడైన గజేంద్రుడు, చిలుకకు రామనామమును నేర్పిన గణికాంగనయు శ్రీహరినామ మహిమచే ముక్తిని పొందిరి. ఇంకను ఆయన ఇట్లు పలికెను".

(రా.మా. బా.కాం. 25/3, 4)

"నీవు లోపల, బయటకూడ ప్రకాశమును కోరుకొనినచో ముఖమనెడి ద్వారమున నాలుకయనెడి గడపపై రామనామమను మణిదీపమును ఉంచుము". (రా.మా. బా.కాం. దో. 21)

ఒకానొక కవి ఇట్లు చెప్పెను.

"ఎండినగడ్డిమీద నిప్పుకణిక పడినచో అది దగ్ధమైనట్లు భగవన్నామమును హృదయమునందు జపించినచో పాపములన్నియు నశించును".

శ్రీమద్భాగవతము నందు ఇట్లు నుడివిరి.

అజ్ఞానాదథవా జ్ఞానాదుత్తమశ్లోకనామ యత్ ।
సంకీర్తితమఘం పుంసో దహేదేధో యథానలః ॥ (6/2/18)

"అగ్ని కట్టెలను కాల్చివేయును. అట్లే తెలిసియైనను, తెలియక యైనను ఉత్తమ శ్లోకుడగు శ్రీహరినామమును కీర్తించిన వారియొక్క పాపములన్నియు నశించును".

శ్రీచైతన్యమహాప్రభువు ఇట్లు నుడివెను.

నామ్నామకారి బహుధా నిజసర్వశక్తి స్తత్రార్పితా -
నియమితః స్మరణే న కాలః (శిక్షాష్టక్)

"భగవంతుడు తన అనేక నామములను ప్రకటించెను. వాటిలో తన శక్తినంతయు జొప్పించెను. వానిని స్మరించుటకు కాలనియమమేదియును

చేయలేదు. మనుష్యుడు ఎల్లవేళల భగవన్నామమును స్మరింపవచ్చును. దీనికి ఏ ఆటంకమును ఉండదు".

శ్రీమద్భగవద్గీతయందు కృష్ణపరమాత్మ ఇట్లు పలికెను.

అపి చేత్ సుదురాచారో భజతే మామనన్యభాక్ ।
సాధురేవ స మంతవ్యః సమ్యగ్వ్యవసితో హి సః ॥

క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి ।
కౌంతేయ ప్రతి జానీహి న మే భక్తః ప్రణశ్యతి ॥

(గీత. 9/30, 31)

మిక్కిలి దురాచారుడైనను అనన్యభక్తితో నన్ను భజించినచో అతనిని సత్పురుషునిగానే భావింపదగును. ఏలనన యథార్థముగా అతడు నిశ్చయబుద్ధి గలవాడు. అనగాపరమాత్ముని సేవించుటతో సమానమైనది మఱియొకటి ఏదియును లేదని గట్టిగా నిశ్చయించుకొనినవాడు. కౌంతేయా! అతడు శీఘ్రముగా ధర్మాత్ముడగును. శాశ్వతమైన పరమశాంతిని పొందును.'నా భక్తుడెన్నడును నష్టమునకు గురికాడు' అను విషయమును నిశ్చయముగా ఎఱుంగుము.

## భగవంతుని నామముయొక్క తత్త్వము

నామము నామి* నుండి వేరు కాదు. నామికిని, నామమునకును భేదమేమియును లేదు. పరమాత్ముడు గీతలో ఇట్లు చెప్పెను.

**"యజ్ఞానాం జపయజ్ఞోస్మి"** (గీత. 10/25) యజ్ఞములయందు జపయజ్ఞమును నేను. ఇతర సమస్త యజ్ఞములు నన్ను పొందుటకు సాధనములు.

వాస్తవముగ పరమాత్మయే స్వయముగ నామము యొక్క రూపములో ప్రకటితుడగును. పరమాత్మస్వరూపమును పరమాత్మ విషయక జ్ఞానమును, భగవంతుని నామమును ఇవన్నియు సమానములే. వీటిమధ్య భేదము లేదు.

* నామము = పేరు, ఆనామము గలవాడు నామి.

కనుక నామమును జపించుటవలన నామియొక్క స్మరణము సహజముగ అప్రయత్నముగ జరుగుచుండును. ఇట్లు అర్థము చేసికొనుటయే పరమాత్మ నామ తత్త్వరహస్యమును తెలిసికొనుటయగును.

కఠోపనిషత్తునందు ఇట్లు చెప్పబడినది.

**ఏతద్ ఏవ అక్షరం బ్రహ్మ ఏతద్ ఏవ అక్షరం పరమ్ ।**
**ఏతద్ ఏవ అక్షరం జ్ఞాత్వా యోయదిచ్ఛతి తస్యతత్ ॥** (1/2/16)

"ఈ ఓంకారము అను అక్షరమే సగుణబ్రహ్మ. అతడు అక్షరుడు. అనగా శాశ్వతముగా ఉండువాడు. ఈ అక్షరుడే నిర్గుణ పరబ్రహ్మ. ఈ ఓంకారరూప అక్షరుని తెలిసికొనిన మనుష్యుడు తాను కోరుకొనిన ఏ వస్తువును ఐనను సునాయాసముగా పొందగలడు".

## భగవన్నామ రహస్యము

వాక్కుద్వారా భగవన్నామమును జపించుటకంటె మనస్సులో ధ్యానించుట (జపించుట) వలన అది వందరెట్లు అధిక ఫలము నొసగును. ఆ మానసిక జపము కూడ శ్రద్ధాభక్తులతో చేసిన ఎడల దానివలన అనంతఫలము లభించును. దానిని గుప్తముగా నిష్కామభావముతో చేసిన ఎడల అది శీఘ్రముగా పరమాత్మప్రాప్తి కలుగచేయును.

రామచరితమానసమందు ఇట్లు తెలుపబడినది.

"మనోవాక్కర్మలయందు (త్రికరణశుద్ధిగా) సర్వదా నన్నే స్మరించుచు నిష్కాముడై నన్ను భజించువాని హృదయమే నా నివాసస్థానము"

(రా.మా. అరణ్య. దో. 16)

"భక్తితో ధ్యానించు (జపించు)వారు సంసార సముద్రమును గోష్పాద సదృశమైన దానినిగా సులభముగా దాటగలరు".

(రా.మా. బా.కాం. దో. 118/2)

"నామజపమువలన పాపములు నశించుచుండును గదా' అని తలంచి పాపముల నాచరించుట, ప్రజలముందు ప్రదర్శించుట కొఱకు నామజపమును నెపముగా చేసికొని, లోలోపల రహస్యముగా పాపములు

చేయుట - భగవన్నామము పేరుతో పాపము చేయుట ఇవి అన్నియును డాంబికముగా ప్రవర్తించుటయే యగును. నామరహస్యము నెఱిగినవాడు దోషరహితుడగును.

## భగవత్స్వరూపము - గుణములు

పరమాత్ముని రంగు, రూపము, ఆకారము, లావణ్యము ఇవన్నియు అత్యంత మధురములు, కోమలములు, రసమయములు, పరమ ఆకర్షకములు, ఉజ్జ్వల కాంతిమయములు, సంశోభితములు, అలౌకికములు, సుందరములు, అద్భుతములు. ఆ స్వామి అనంతమైన క్షమాగుణము, అపారమైన దయ, పరమశాంతి, ప్రేమ, న్యాయబుద్ధి, సౌహార్దము, సారళ్యము, మాధుర్యము, సమానభావము, ఔదార్యము, ధైర్యము, వీరత్వము, గాంభీర్యము, సత్యసంధత, నిరభిమానము, నిరహంకారము, నిర్వైరము, భయము లేకుండుట, పవిత్రత, భక్తులయందు వాత్సల్యము, సౌమ్యభావము మొదలగు దివ్యగుణములు అనంతమైన, నిరతిశయములు. ఇవి అత్యంత విలక్షణమైనవి. ఇది సంక్షిప్తముగ పరమాత్ముని గుణములను నవలోకించుట యగును.

## పరమాత్మ స్వరూపముయొక్క ప్రభావము

పరమాత్ముని ప్రభావములు అపరిమితములు. ఆ స్వామి బలపరాక్రమ ములు సంపూర్ణములు, సాటిలేనివి, ఐశ్వర్యములు అద్భుతములు. తేజస్సు వర్ణనాతీతము. శక్తిసామర్థ్యములు, జ్ఞానవైరాగ్యములు నిరుపమానము ఆ స్వామి ధర్మస్వరూపుడు. యశస్సంపన్నుడు. శ్రీకరుడు. ఆయన విభూతులు, మహిమలు అనంతములు. ఆ ప్రభువు తేజస్స్వరూపుడు. జగదుత్పత్తి స్థితి, లయములను చేయుటలో సమర్థుడు, సర్వమును తెలిసినవాడు, సమస్త జగత్తును ధరించువాడు, భరించువాడు. సర్వవ్యాపకుడు, సకలమును నియంత్రించువాడు, సర్వేశ్వరుడు, సర్వాంతర్యామి ఆ ప్రభువు. సంభవమును అసంభవముగా, అసంభవమును సంభవముగా చేయుటయందు (అఘటన ఘటనా) సమర్థుడు. సూర్యోదయమగుటతోడనే అంధకారము నశించును. అట్లే పరమాత్మస్వరూపమును స్మరించుటవలన, ధ్యానించుటవలన సకల

దుర్గుణములు, దురాచారములు, వికారములు, దుఃఖములు, దోషములు సంపూర్ణముగ దూరమగును. మానవుడు సద్గుణములు కలిగి సదాచార సంపన్నుడగును. జననమరణరూపమైన సంసారసాగరమునుండి ఉద్ధరింప బడును. సహజముగ శీఘ్రముగనే పరమాత్మను పొందును.

అనన్యచేతాః సతతం యో మాం స్మరతి నిత్యశః ।
తస్యాహం సులభః పార్థ నిత్యయుక్తస్య యోగినః ॥ (గీత. 8/14)

"పార్థా! నిత్యము నిరంతరము అనన్యభావముతో చిత్తమును నాయందే నిలిపి, పురుషోత్తముడనైన నన్నే స్మరించుచు, సంతతము మత్పరాయణుడైన యోగికి నేను సులభుడను. అనగా అతనికి సహజముగనే నేను లభింతును".

తేషామహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్ ।
భవామి నచిరాత్ పార్థ మయ్యావేశితచేతసామ్ ॥ (గీత. 12/7)

"ఓ అర్జునా! నాయందేలగ్నమనస్కులైన అట్టి పరమభక్తులను నేను శీఘ్రముగనే మృత్యురూపసంసారసాగరమునుండి ఉద్ధరించెదను".

## భగవత్ స్వరూపతత్త్వము

ఆకాశమునందలి పరమాణువులు, ఆవిరి మేఘములు, (నీటి) బిందువులు, వడగండ్లు, మంచు ఇవన్నియు జలతత్త్వముయొక్క రూపములే. ఇదేవిధముగ సగుణ నిర్గుణములు, సాకార నిరాకారములు, వ్యక్తఅవ్యక్తములు జడచేతనములు, స్థావర జంగమములు, సదసత్తులు, స్థూలసూక్ష్మములు, కార్యకారణములు - వీటికి అతీతమైన సకలమును సాత్త్వికముగ ఒక్కపరమాత్మ స్వరూపమే యగును.

ఆ పరమేశ్వరుడు గీతయందు ఇట్లు చెప్పెను.

బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే ।
వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః ॥ (గీత. 7/19)

"అనేకజన్మలపిదప జ్ఞానియైనవాడు(భగవత్తత్త్వమును ఎఱిగినవాడు)

సర్వమూ వాసుదేవమయమే యని భావించి, నన్ను శరణుపొందును. అట్టి మహాత్ముడు లభించుట అరుదు".

మనసా వచసా దృష్ట్యా గృహ్యతేఽన్యైరపీంద్రియైః ।
అహమేవ న మత్తోఽన్యదితి బుధ్యధ్వమంజసా ॥

(శ్రీమద్భా.11/13/24)

"జగత్తులో మనస్సుచేత, వాక్కుచేత, దృష్టిచేత ఇంకను ఇతరములగు ఇంద్రియములచేత గ్రహింపబడు విషయములన్నియు నా స్వరూపములే. నాకంటే భిన్నములు కావు. ఈ సిద్ధాంతమును తెలిసికొనుడు".

## భగవత్స్వరూప దర్శనము

భగవంతుడు సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, సర్వత్ర సమభావము కలవాడు, సగుణ నిర్గుణరూపుడగు పరమాత్మయే, దివ్యమగు అవతారములను ధరించి, స్వయముగా ప్రకటితుడగుచుండును. ఆ స్వామి భవ్యగుణములు, ప్రభావములు, తత్త్వము, రహస్యము మొదలగునవి అచింత్యములు, అపరిమితములు, దివ్యములు. ఆ స్వామి భక్తులు తప్ప వాటినెవ్వరును తెలిసికొనజాలరు. ఇది ఆ ప్రభువుయొక్క రహస్యము. గీతలో భగవానుడిట్లు పలికెను.

అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్ ।
ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా ॥ (గీత. 4/6)

"నేను జన్మరహితుడను, నిత్యుడను, సమస్త ప్రాణులకును ఈశ్వరుడను. అయినను నా ప్రకృతిని అధీనములోనుంచుకొని, నా యోగ మాయచే అవతరించుచుందును. అర్జునుడిట్లు పలికెను".

సర్వమేతదృతం మన్యే యన్మాం వదసి కేశవ ।
న హి తే భగవన్ వ్యక్తిం విదుర్దేవా న దానవాః ॥
స్వయమేవాత్మనాత్మానం వేత్థ త్వం పురుషోత్తమ ।

(గీత. 10/14,15)

"ఓ కేశవా! నీవు చెప్పుచున్నది అంతయునుసత్యమే. హే భగవన్! నీ లీలా మయస్వరూపమును దేవతలు గాని దానవులు గాని తెలిసికొనజాలరు".

"ఓ పురుషోత్తమా! నీ తత్త్వమును నీవే స్వయముగా ఎఱుంగుదువు".

రామచరితమానసమునందు భగవంతునియొక్క స్వరూప రహస్యమును గూర్చి ఇట్లు ప్రస్తావింపబడినది.

"ఒకే సమయమున ప్రభువు అనేక రూపములలో ప్రకటితుడై ప్రతివ్యక్తికిని వారివారి యోగ్యతలకు అనుగుణముగ దర్శనమిచ్చెను. ఒక్క క్షణముననే భగవంతుడు అందఱిని ఆనందింపజేసెను. ఉమా! ప్రతియొక్కరును ప్రభువు మొట్టమొదట తననే కలిసికొన్నాడు అని భావించిరి".

(రా.మా. ఉ.కాం. దో. 5/3,4)

పరమాత్మస్వరూపమును స్మరించు పురుషుడు ఆ స్వామికి అత్యంత ప్రియమైనవాడు. ఇదికూడ స్వరూపరహస్య విషయమే.

**భగవంతుని లీలలయొక్క గుణముల ప్రభావము - తత్త్వరహస్యము**

ఇది రామావతారమునందలి కథ. విభీషణుడు సర్వేశ్వరుడగు శ్రీరాముని శరణుజొచ్చెను. అంత శ్రీరామచంద్రుడు "మిత్రమా! ఈ విషయమున నీ అభిప్రాయమేమి" అని సుగ్రీవుని అడిగెను. పిదప వానరరాజగు సుగ్రీవుడు ఇట్లు పలికెను. "మహారాజా! అవధరింపుడు. నిశాచరులు మాయావులు. వారి నిజస్వరూపములను తెలిసికొనుట కష్టము. వారు కామరూపులు. అతని (విభీషణుని) రాకయొక్క ఆంతర్యమేమో మనకు తెలియదు. ఈ దుష్టుడు మన రహస్యములను తెలిసికొనుటకై వచ్చినాడని నా అభిప్రాయము. ఇతనిని బంధించి యుంచుట మంచిదని నాకు తోచుచున్నది". అప్పుడు పరమాత్ముడిట్లు పలికెను. "మిత్రమా! నీవు తెలిపిన విషయము రాజనీతిని అనుసరించియుక్తమే".

"వానరరాజా! విభీషణుడు దుష్టుడే ఐనచో అతడు నన్ను ఆశ్రయించెడి వాడు కాడు. ఒకవేళ రావణుడు అతనిని మన రహస్యములను తెలిసికొనుటకే పంపినను మనము భయపడవలసిన పనియే లేదు. ఏలనన మిత్రమా! ప్రపంచములోని రాక్షసుల నందరిని ఈ లక్ష్మణుడు ఒకే ఒక్కక్షణములో

మట్టుపెట్టగలడు. అంతేగాక భయవిహ్వలుడై నన్ను శరణుగోరినవానిని నేను నా ప్రాణములవలె కాపాడుదును. ఇది నా నియమము".

"శరణుజొచ్చినవానికి అభయమిచ్చి కాపాడుట నా ప్రతిజ్ఞ".

(రా.మా. సుం.కా. 42/4)

ఈ విషయము వాల్మీకి రామాయణమునందు ఇట్లు ప్రస్తావింపబడినది.

**సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే ।**
**అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ ॥**

(వా.రా. యు.కాం. 18/35)

"నేను నీ వాడను' అని పలుకుచు ఎవ్వరైనను ప్రపత్తితో నన్ను శరణుగోరినచో వారికి (సకల ప్రాణులకును) అభయమిత్తును. (వారిని రక్షింతును.) ఇది నా వ్రతము".

హనుమదాది వానరులు విభీషణుని పరమాత్ముని చెంతకు తీసికొనివచ్చిరి. వచ్చినతోడనే విభీషణుడు భగవంతుడగు శ్రీరాముని చరణములమీద సాగిలపడి ప్రణమిల్లెను. ఆయన ఆ ప్రభువును శరణుజొచ్చెను. వెంటనే ఆ స్వామి విభీషణుని తన హృదయమునకు హత్తుకొనెను. పిమ్మట సముద్ర జలములను తెప్పించి ఆతనిని లంకాసామ్రాజ్యమునకు పట్టాభిషిక్తుని చేసెను.

రామచంద్రుడు విభీషణుని విషయములో సుగ్రీవునియొక్క అభిప్రాయమును కోరుట, ఆ వానరరాజిచ్చిన సలహా సముచితమైనదేయని పలుకుట అనునవి ఆ స్వామి యొక్క నీతికిని, స్నేహలక్షణమునకును నిదర్శనములు. శరణుజొచ్చిన వానిని పరిత్యజింపకుండుట ఆయన శరణాగత వాత్సల్యమునకు చక్కని తార్కాణము. విభీషణుని లంకకు రాజ్యాభిషిక్తుని గావించుట, ఆయన తన ధర్మముగా భావించెను. ఆ ప్రభువుయొక్క ఔదార్యము అట్టిది. ఇవన్నియును భగవంతుని లీలలను ఆ ప్రభువుయొక్క ఉదాత్తగుణములను తెలుపుచున్నవి.

దుష్టహృదయుడు పరమాత్ముని సమీపమునకే రాలేడు. ఇది ఆ స్వామి యొక్క లీలాప్రభావము. "లక్ష్మణుడు సకల రాక్షసులను క్షణములో

మట్టుపెట్టగలడు, అని రామచంద్రుడు పలికెను. ఇది కూడ ఆ ప్రభువు యొక్క అనుగ్రహమువలననే సాధ్యము. ఆ దేవదేవుని ప్రభావము అట్టిది.

పూర్ణబ్రహ్మయగు పరమాత్మయే స్వయముగా శ్రీరాముని రూపములో అవతరించెను. పరమాత్ముని భగవత్తత్త్వ రహస్యమును ఎఱుగుటయే ఆ సర్వేశ్వరుని లీలాతత్త్వమును తెలిసికొనుటయగును.

పరమాత్ముడు విభీషణునకు శరణము ఇయ్యవలెననియే భావించెను. కాని ఆ స్వామి దీనిని గుప్తముగనే యుంచి సుగ్రీవాదుల అభిప్రాయములను అడిగెను. వారి సూచనలను మన్నించుచునే తన అభిప్రాయమునకు అనుకూలముగ కార్యము నాచరించెను. సర్వేశ్వరునిముందు రాక్షసుల మాయ, కపటము, మోసము ఏవియు పనిచేయవు. ఈ విషయము సుగ్రీవాదులకు తెలియదు. కనుక వారి ఎదుట ఆ ప్రభువు తన ప్రభావ రహస్యమును ప్రకటించెను.

"విభీషణుడు దుష్టహృదయుడే ఐనచో నన్ను ఆశ్రయించెడి వాడు కాదు."

(రా.మా. సుందర. దో. 43/2)

"దుష్టులు నా చెంతకు రారు. నా దగ్గఱకు వచ్చెడివారు దోషరహితులై యుందురు", అని శ్రీరామచంద్రప్రభువు తనలో దాగియున్న ప్రభావమును సూచనప్రాయముగ తెలిపెను. ఆ స్వామి ఆంతర్యమును అర్థము చేసికొనుటయే ఆయన లీలలను గ్రహించుటయగును.

ఇక శ్రీకృష్ణావతారమునందలి విశేషములను గమనింతము - ఒకనాడు శ్రీకృష్ణుడు యమునానదీతీరమున చల్దులారగించుచు బాల్యలీలలను ప్రకటింపసాగెను. అందరును తమతమ చద్దిమూటలను విప్పి భోజనములు చేయసాగిరి. అప్పుడు భగవంతుడు అందఱకును మధ్యన కూర్చుండెను.*

---

* **జలజాంతస్స్థిత కర్ణికం దిరిగి రా సంఘంబులై యున్నతే**
**కులచందంబున, గృష్ణునిం దిరిగి రాఁ గూర్చుండి వీక్షించుచున్**
**శిలలుం బల్లవముల్ దృణంబులు లతల్ చిక్కంబులుం బువ్వు లా**
**కులు కంచంబులుగా భుజించి రచటన్ గోపార్భకుల్ భూవరా!**

(పోతన.శ్రీమద్భా. 10/493)

గోపాలురందరును ఆయనచుట్టు, పద్మమునందలి దుద్దుచుట్టునుగల రేకులవలె వలయాకారముగ కూర్చొనియుండిరి. ప్రతిఒక్కడు తన భోజనమే రుచికరమైనదని, శ్రేష్ఠమైనదని పలుకుచుండెను. అట్లు ఒకరినొకరు నవ్వించు కొనుచుండిరి. పరమేశ్వరుడు కమలములవంటి తన కరకములతో గడ్డిపరకలను పట్టుకొని వినోదము చేయుచుండెను. అవి అన్నియును పరమేశ్వర లీలలు. బాలకులందరు ఆ స్వామి ప్రకటించుచున్న అద్భుత వినోదములతో తన్మయులగుచుండిరి. వారు ఆ లీలావినోదముల యందు మునిగి ఆవుదూడల విషయమునే మరచిపోయిరి. ఆ ప్రభువు మాయవలన అవి వారి స్మృతిపథమునుండి తొలగిపోయెను. కొంతసేపటికి వారికి గోవత్సముల సంగతి జ్ఞాపకమునకు వచ్చెను. అప్పటికే అవి అడవిలో వీరికి కన్పించనంత దూరముగా వెళ్లిపోయెను. వెంటనే గోపాలురు భయభ్రాంతులైరి. పరమాత్ముడు వారితో ఇట్లు పలికెను. "మీరు భయపడవలదు. నేను మీకు వాటిని తెచ్చి ఇచ్చెదను. "సర్వేశ్వరుడు గోవులను వెదకుటకై బయలుదేరెను. బ్రహ్మదేవుడు ఆ స్వామి లీలలను చూచి మిగుల ముగ్ధుడయ్యెను. ఆయన మొదట ఆవులదూడలను, తదుపరి గోపాలురను దాచిపెట్టెను. (అంతర్ధానము చేసెను). పరమాత్మునకు గోవత్సములు దొరకలేదు సరికదా! తిరిగివచ్చి చూడగా అచట గోపాలురు కూడ కనిపించలేదు. అప్పుడు శ్రీకృష్ణునకు ఇదంతయు బ్రహ్మచేసిన పనియేయని అర్థమయ్యెను. అంతట ఆ కృష్ణ ప్రభువు గోపాలురమాతలను, గోవత్సముల తల్లులను (గోవులను) ఆనందింపచేయ దలంచెను. వారికి బ్రహ్మానందమును అనుగ్రహించవలెనని భావించెను. అట్లే బ్రహ్మదేవుని మోహమును కూడ తొలగింపజేయవలెనని తలంచెను. వారందరిని అనుగ్రహించుటకొఱకే ఆ స్వామి గోపాలుర, గోవత్సముల రూపములను ధరించెను. ఆ బాలుర శరీరములు, కరములు, పాదములు, శిరములు, వేణువులు, చల్దులు మూటగట్టిన వస్త్రములు, వారు ధరించిన వస్త్రాభరణములు, శీలస్వభావములు నామగుణములు వారి ఆకారములు, వారి అవస్థలు (వయస్సులు) వారు నేర్చిన ఆటపాటలు వీటన్నిటితోను వారి వారి రూపములతోను గోవత్సముల రూపములలోను ఆ పరమాత్ముడే ప్రకటితుడయ్యెను. అచట ఎంతమంది గోపబాలురుండిరో ఎన్ని

గోవత్సములుండెనో అన్ని రూపములలోను ఆ పరబ్రహ్మయే కనిపించెను. ఇది ఒక గొప్ప అద్భుతలీల. ఆ పరబ్రహ్మ " ఈ జగత్తంతయు విష్ణుమయమే" యను విషయమును ప్రత్యక్షముగా చూపించెను.*

బలరామునకు ఇదేదియు మొదట అర్థము కాలేదు. గోపాలుర తల్లులకు తమ పిల్లలమీద మునుపటికంటె ప్రేమానురాగములు చెప్పలేనంతగా అధికమయ్యెను. గోమాతలు వత్సములమీద అత్యంతప్రేమను వర్షింప చేయుచుండిరి. మహాత్ముడైన బలరామునకు అప్పుడు సందేహము కలిగెను. ఆయన పరిశీలనా దృష్టితో అందరిని చూడసాగెను. అప్పుడాస్వామికి గోవత్సములు, గోరక్షకులగు గోపాలురు, సకలసామగ్రియు ప్రత్యక్షముగా శ్రీకృష్ణుని రూపముననే కనిపించెను. అప్పుడాయన చకితుడై ముగ్ధుడయ్యెను. (కృష్ణప్రభువు లీలలు పరమాశ్చర్యకరములు, పరమానంద భరితములు కదా!)

ఈ లీలయందు బ్రహ్మదేవుని కాలమానమున ఒక్క త్రుటి కాలమే గడచెను. (అది మనకొక సంవత్సరము) బ్రహ్మదేవుడు ఆ వత్సములను, గోపబాలురను చూచెను. కృష్ణుడు స్వయముగా తానై రూపొందిన గోపాల గోవత్సములకును, తాను దాచి ఉంచిన గోవత్సగోపాలురకును మధ్యన భేదమేమియు ఆయునకు గోచరింపకుండెను. నిజమైన వారెవరు? తరువాత సృష్టింపబడిన వారెవరు? అనునది ఆయనకు అర్థమే కాలేదు. ఆయన భ్రమలో మునిగిపోయెను. ఈ విధముగా ఆలోచించుచుండగనే సృష్టికర్తకు గోపాలురు, గోవత్సములన్నియు శ్రీకృష్ణపరమాత్మ రూపముననే కనిపించసాగెను. వెంటనే ఆయునకు పరమాత్ముని పరమతత్త్వము అవగతమయ్యెను. అంతట పరమాత్ముని పాదములపైబడి బ్రహ్మదేవుడు సాష్టాంగముగ ప్రణమిల్లెను. గద్గదస్వరముతో ఆ ప్రభువును స్తుతించుచు తన్ను క్షమించుమని అర్థించెను. అప్పుడు ఆ సర్వేశ్వరుడు తన మాయను ఉపసంహరించెను.

---

* యావద్వత్సపవత్సకాల్పకవపుః యావత్కరాంఘ్ర్యాదికం
యావద్యష్టివిషాణవేణుదలశిక్ యావద్విభూషాంబరమ్
యావచ్ఛీలగుణాభిధాకృతివయో యావద్విహారాదికం
సర్వం విష్ణుమయం గిరోఽంగవదజః సర్వస్వరూపో బభౌ
(శ్రీమద్భాగ. 10/13/19)

గోపబాలకులతో కలిసి ప్రీతిభోజనము, విందులు, బాలక్రీడలు చేయుట ఆ పరమాత్మయొక్క ప్రేమానురాగములకు నిదర్శనములు. భగవంతుడు స్వయముగా గోపాలురుగా, గోవత్సములుగా రూపొంది వారి తల్లులతో ఆ గోమాతలతో మాతృభావమున వ్యవహరించెను. ఆ స్వామిదయ అపారము. ప్రేమానురాగములు అపూర్వములు. బ్రహ్మదేవునకు తన లీలా చమత్కారమును చూపి ఆయన మోహమును తొలగింపజేసెను. కనువిప్పు కలిగించెను. ఇదియును ఆ ప్రభువుయొక్క కృపావిశేషమే. ఇదియంతయు ఆ పరమాత్ముని లీలాగుణముల ప్రదర్శనమే.

పరంధాముడు తన అద్భుతమైన దివ్యశక్తి ప్రభావముచేత అనేక రూపములను ధరించెను. ఇదియును ఆయన లీలయే. తన ఆ లీలాప్రభావముతో మనకు మార్గము సులభము చేసెను.

గోపాలురు, గోవత్సములు, వారిచేతికర్రలు, పిల్లనగ్రోవులు మొదలగు వస్తువులుగా ఆ పరమాత్ముడే రూపొందెను. ఆ పరమేశ్వరుడే అనేక రూపములను ధరించి తన లీలలను చూపెను. ఇదియును భగవంతుని లీలయే. దీనితో ఆ స్వామి తన తత్త్వదర్శన భాగ్యమును కలుగజేసెను.

సర్వశక్తిమంతుడగు శ్రీకృష్ణభగవానునకు వాత్సల్య భావమునందు ఆసక్తి మెండు. ఆ దేవదేవుడిటుల గుప్తరూపమున దానిని తీర్చుకొని గోకులము వారి నందరిని అనుగ్రహించెను. ఇది ఆయన లీలారహస్యము. మనకు మార్గదర్శకము.

అడుగడుగున పరమాత్ముని ప్రతిచేష్టయు మంగళకరమే. అది శుభప్రదములైన గుణములతో కలిసి విరాజిల్లుచుండును. కనుక పరమాత్ముని ప్రతిక్రియయందును ఓర్పు, దయ, ప్రేమ, సమత మొదలగునవి పడుగు పేకలవలె అల్లుకొనియుండును. ఆయన గుణములు అనూహ్యములు. అనంతములు. వాటిని ఎఱుంగుటయే ఆయనయొక్క లీలా, గుణములను దర్శించుటయగును.

ఈ విధముగా పరంధాముని లీలలయందలి గుణములను, ప్రభావమును, తత్త్వమును, ఆంతర్యమును అర్థముచేసికొనవలయును. వాటి నాదర్శముగ

తీసికొనవలయును. ఆ ప్రభువును దర్శించుట, ధ్యానించుట, స్మరించుట చేయువలయును. ఆయన ననుసరించవలయును. భగవంతుని వ్యవహారమునకు అనుగుణముగ తన ఆచరణమును రూపొందించు కొనవలయును. దానివలన అంతఃకరణము పరిశుద్ధమగును. అట్టిమానవుడు ముక్తుడగును. ఇట్లు అర్థము చేసికొనుటకూడ ఆ సర్వేశ్వరుని లీలా ప్రభావమనియే గ్రహింపవలయును.

గోపాలురు, గోవత్సములు, వారిచేతికర్రలు, కొమ్ములు, పిల్లనగ్రోవులు, క్రీడలు, సమస్తము ఆ సర్వేశ్వరుడే. అట్లే ఈ విశ్వమునందలి కర్త, కర్మ, క్రియ మొదలగునవి అన్నియును తత్త్వతః ఆ పరమాత్మడే. ఇట్లు అర్థము చేసుకొనుటయే లీలాతత్త్వమును ఎఱుగుటయగును.

పరమాత్ముని చేష్టలన్నియును నిస్స్వార్థములు, అహంకార రహితములు, కనుక అవి పరమపవిత్రములు. అవియే కార్యములు, కారణములు, భగవంతుడెవరినైనను నిమిత్తముగ చేసికొని నిర్వహించు కార్యము ఆ మానవుని శ్రేయస్సు కొఅకే యగును. ఆయన సకలక్రియలు మిగుల విశుద్ధములు. ఇట్లు తలపోయుట ఆయన లీలారహస్యమని తెలిసికొనుటయే యగును.

## భగవద్ధామముయొక్క స్వరూపము

భగవంతుని చిన్మయతత్త్వము అన్నిటికిని అతీతమైనది, సర్వశ్రేష్ఠము, నిత్యము, సత్యము. నిత్యము దివ్యము అగు లోకమే ఆ పరంధామమని అర్థము చేసికొనవలెను. దానినే బ్రహ్మోపాసకులు బ్రహ్మలోకమని అందురు. వేదముల నెఱిగినవారు దానిని సత్యలోకముగా తలంతురు. శ్రీకృష్ణుని ఆరాధించువారు గోలోకముగ పరిగణింతురు. శ్రీరామచంద్రుని ఉపాసించువారు సాకేతధామమని విశ్వసింతురు. శ్రీమహావిష్ణువును పూజించువారు దానిని వైకుంఠలోకమని భావించెదరు. శివుని జపించువారు శివలోకమని తలంచెదరు. ఇట్లు వేరు వేరు ఉపాసకులు ఆ పరమధామమును వివిధ నామములతో పేర్కొందురు. ప్రతి ఉపాసకుడును తన ఉపాసనకు సంబంధించిన లోకమే అన్నిటికంటె గొప్పదని సర్వశ్రేష్ఠమని, పరమ

దివ్యమైనదని భావన చేయుచుండును. అట్టి ఆ లోకము బుద్ధికిని, మనస్సునకును, మాటలకును అతీతమైనది. ఇంతవరకు విషయము లన్నియును అత్యంత విలక్షణమైనవే.

## భగవంతుని ధామముయొక్క గుణములు

ఓర్పు, దయ, శాంతి, సమభావము, ప్రేమ, న్యాయము మొదలగునవి భగవంతుని గుణములు. ఇవి నిత్యసత్యములు. ఇవి ఆ పరమధామమున సహజముగనే విలసిల్లుచుండును. పరమాత్ముడే స్వయముగ తన ధామరూపమున ప్రాదుర్భవించెను. వాస్తవముగా పరమాత్ముడు, పరంధామము వేరుకాదు. కనుక ఆ ధామమునందు నివసించెడి భక్తులలో కూడ ఆ గుణములు స్వాభావికముగనే ఉండును. భగవంతుని సాక్షాత్కరింపజేసికొనిన భక్తులు ఆయన పరమధామమునకు చేరుదురు. ఆ పరంధాముని దర్శనప్రభావముననే క్షమాదిగుణములు వారిలో సహజముగనే వచ్చిచేరును. సాధకునకు భజన, ధ్యానము, సత్సంగము, స్వాధ్యయనము మొదలగు సాధనలద్వారా సాధకుడు భగవద్ధామమును పొందును. అతనియందు ఆ క్షమాదిగుణములన్నియు మునుముందుగనే వచ్చిచేరును. కాని అతని గుణములలో దేనిలోనైనను లోపమున్నచో అది ఆ పరంధామమున తొలగిపోవును. అతడు అక్కడ ప్రవేశించగనే ఆ క్షణముననే అవి సంపూర్ణత్వమును సంతరించుకొనును. ఇదిఅంతయు భగవధ్యానము యొక్క గుణములను సూచించునదియే.

## భగవంతుని ధామముయొక్క ప్రభావము

ఆ పరమధామమునకు చేరినవారు ఈ లోకమునకు తిరిగిరారు. లోకకళ్యాణముకొఱకు ఆ సర్వేశ్వరుని అనుసరించిగాని, ఆయన పరికరముగాగాని, ఆయన ఆజ్ఞానుసారముగా గాని ఎవరైనను ఈ లోకమునకు వచ్చినచో వారు కారణజన్ములగుదురు. అట్టి వారి జన్మయును, కర్మయును శరీరమును దోషరహితములగును. అవి విశుద్ధములు, దివ్యములు అగుటవలన వారు ఈ లోకమునకు వచ్చుట, రాకుండుట రెండును సమానములే. వారు ప్రాపంచికమాయకుగాని, మాయా కార్యములకుగాని

అతీతులై యుందురు. వారి శరీరము అనామయమై (రోగములు అంటనిదై) యుండును. ఆ పరంధామమునందు నివసించువారి శరీరములకు జననమరణములు, జరావ్యాధులు మొదలగు దోషములంటవు. వారు సకల వికారరహితులై ఉందురు. వారు పరమపవిత్రులై, పరమాత్మునివలెనే దివ్యులై, చిన్మయులై అలౌకికులై, సకల సద్గుణశోభితులై ఉందురు. సృష్టి, స్థితి, లయములు - అను ఈ మూడు కార్యములు తప్ప భగవంతునియొక్క తక్కిన ప్రభావములు, ఐశ్వర్యములు అన్నియును వారిలో చేరియే యుండును. ఆ ధామములో నున్న పదార్థములన్నియు దివ్యములు, చిన్మయములు, అలౌకికములగును. ఇదియంతయును భగవద్ధామముయొక్క ప్రభావసారమే.

### పరంధామతత్త్వము

పరమాత్ముడే స్వయముగా పరమధామరూపమున ప్రాదుర్భవించును. నిర్గుణ, నిరాకార, సచ్చిదానంద ఘనబ్రహ్మయే సగుణ నిరాకార రూపమున నుండి పరమధామ స్వరూపమున ప్రకటితుడగును. కనుక పరమధామము పరమాత్మ స్వరూపమగుటవలన ఆ స్వామికి అది అభిన్నము. దీనిని తెలిసికొనుటయే పరమధామతత్త్వము తెలిసికొనుటయగును.

### భగవద్ధామమునందలి రహస్యము

భగవంతుడు, భగవంతునిధామముయొక్క ప్రభావము, తత్త్వము, లీలలు, గోప్యములు. ఇవి దివ్యములు, రహస్యమయములు. ఇవి ఈ లోకమువారికి అర్థముకావు. భక్తులు ఆ పరమధామమునకు చేరినపుడు వీటిని వాస్తవముగా తెలిసికొనగలరు. అక్కడకువెళ్లినవారికి పరమాత్మయును, పరంధామ స్వరూపము పూర్తిగా బోధపడును. వీటి తాత్త్విక రహస్యము ప్రత్యక్షముగా విదితమగును. అంతవఱకును తెలియని విషయము లన్నియు తేటతెల్లమగును. అనుభవించని విషయములన్నియును అనుభవమునకు వచ్చును. చూడనివన్నియును చూచుట జరుగును. విననివన్నియును వినుట సంభవించును. అర్థముకాని వన్నియును అవగతములగును. ఆ ధామమునకు చేరిన వెంటనే వారి బుద్ధి, మనస్సు, ఇంద్రియములు మొదలగునవన్నియును దివ్యత్వమును సంతరించుకొనును. పరమాత్ముని పరమధామమును గూర్చిన

విషయములన్నియును వినుట, అర్థము చేసికొనుట జరుగును. దానివలన అతడు (భక్తుడు) సాటిలేని విధముగా విశిష్టమైన లక్షణములు గలవాడగును. ఎందుకనగా లౌకికములైన బుద్ధి, మనస్సు, వాణి అక్కడకు చేరనేలేదు. అక్కడకు చేరినపిదప వీటియొక్క సంపూర్ణమగు భేదము (వైవిధ్యము) లోతుపాతులు సువిదితమగును. ఈ విషయమున ఎట్టి శంకకును తావులేదు. దీనిని తెలిసికొనుటయే పరమధామరహస్యము తెలిసికొనుట అగును.

పరబ్రహ్మ పరమేశ్వరుడు ఈ లోకమునందు అవతరించి అయోధ్య, మధుర, బృందావనము మొదలగు స్థలములయందు తన లీలలను ప్రదర్శించెను. అవి అన్నియును పరమధామములై విరాజిల్లినవి. ఆ స్థలములయందు ఆ ప్రభువు శ్రద్ధాదరములతో మసలుటవలన అచట నివసించువారికి కూడ ఆ స్వామి గుణములే అబ్బును. ఆ ప్రభువుయొక్క తత్త్వరహస్యములను తెలిసికొనిన వారిలో క్రమముగా భక్తిశ్రద్ధలు, ఆదరాభిమానములు ఏర్పడును. ఆ పరమాత్ముని పాదస్పర్శతో పునీతములైన ఆయా స్థలములలో మరణించిన భక్తులు సకల పాపరహితులై ముక్తులగుదురు. ఆ స్థలముల ప్రభావము అట్టిది.

భగవంతుని గుణముల ప్రభావవైభవములు, తత్త్వరహస్య మహత్త్వములు, లీలావిశేషములు, పరంధామము యొక్క వైశిష్ట్యములు మున్నగువానిని గూర్చి తెలిసికొను విధానమిచట వివరింపబడినది.

## భగవంతుని గుణముల ప్రభావము

భగవంతుడు క్షమామూర్తి, దయాసాగరుడు, ప్రేమస్వరూపుడు. ఆ స్వామి దివ్యగుణములను శ్రవణముచేయుట, మననము చేయుట, చింతనము చేయుట, వర్ణించుట, గానము చేయుట మున్నగువాటివలన మానవునియందు ఆ దేవదేవుని గుణములు సంపూర్ణముగ పాదుకొనును. అంతట అతడు దోషరహితుడై ముక్తిని పొందును. ఇది గుణముల ప్రభావము.

## భగవంతుని గుణముల రహస్యము

భగవంతుని దయాగుణము ప్రేమతత్త్వము మొదలగునవి అవ్యాజమైనవి. ప్రతిఫలాపేక్ష లేనివి.* విశుద్ధములు. అట్టి ఆ విశిష్టగుణములయందలి ఆంతర్యమును గ్రహింపవలయును. పిరికితనము, మమకారము, కోరిక, లజ్జ, స్వార్థము, భయము ఇట్టిదోషము లేవియు వాటియందుండవు. ఆ స్వామి దయాదిగుణములన్నియును ప్రయోజనములను ఆశింపనివి. అనంతములు, దివ్యములు, విశుద్ధములు. ఈ గుణరహస్యముల నెరిగినవారు ఆ పరంధాముని శరణుజొచ్చెదరు. ఆ ప్రభువునందు అనన్యభక్తి శ్రద్ధలు కలిగియుందురు. అటులనే ఆయనను పొందుదురు. విభీషణుడు కూడ సుప్రసిద్ధములైన (ఖ్యాతి వహించిన) ఆ పరమాత్మని ప్రేమతత్త్వమును దయాగుణము మొదలగువాటిని ఆ ప్రభువుయొక్క ఔన్నత్యమును తెలిసికొనియే ఆయనను శరణుజొచ్చెను. స్వయముగా రామచరితమానసమందు ఆతడిట్లు చెప్పెను.

"జననమరణ భయములకు రూపుమాపువారు అనెడి మీ కీర్తిని విని మిమ్ము శరణుజొచ్చుటకై వచ్చితిని. దుఃఖార్తులను ఆదుకొనెడి రఘువీరా! నన్ను రక్షింపుము. శరణాగతులకు మీరు సుఖప్రదాతలు. నన్ను కాపాడుడు".

(రా.మా. సుందర. దో. 45)

పరమాత్మనిగుణములయొక్క ఆంతర్యము నెరిగినవాడు, స్వయముగా అటులనే రూపొందును. కృష్ణభగవానుడు గీతయందు భక్తుల లక్షణములను తెలుపుచు ఇట్లు నుడివెను. దయ, ప్రేమ, ఓర్పు, మమకార అహంకారములు లేకుండుట, సమభావము మొదలగు గుణములు స్వాభావికముగనే వారిలోవచ్చిచేరును. ప్రపంచమునగల సకలప్రాణులయందు కనిపించెడి గుణములన్నియు ఆ పరమాత్మని దివ్యగుణములలోని ఒక అంశయొక్క

---

* అహేతుక దయాసింధుః, బంధురానమతాం సతామ్ ।

సర్వేశ్వరుడు ప్రతిఫలమును అపేక్షింపక దయను వర్షించును (దయా సముద్రుడు) వినమ్రులై సేవించు సత్పురుషులకు ఆత్మబంధువు.

ఆభాసమాత్రమే యగును. ఆ పరబ్రహ్మ అనంతగుణ సంపన్నుడు కదా! ఈ విధముగా అర్థముచేసికొనుట ఆ స్వామిగుణ రహస్యముల నెరుంగుటయే.

పరమాత్మని తత్త్వము ప్రభావము

పరమాత్మని బలము, ఐశ్వర్యములు, శక్తి మొదలగు వాటి ప్రభావము లన్నియును ఆ స్వామికంటె భిన్నములు కావు. అగ్నినుండి వెడలు ప్రకాశము, కాల్చివేయు తత్త్వము ఆ అగ్నికి వేరు కావు. అటులనే భగవంతుని ప్రభావము ఆ స్వామినుండి వేరుకాదు. అదంతయు పరమాత్మని ప్రభావతత్త్వమనియే తెలిసికొనవలయును.

## పరమాత్మని ప్రభావము - అందలి వైశిష్ట్యము

అగ్ని, సూర్యుడు, చంద్రుడు, ప్రపంచమునందలి పదార్థములలో గల విభూతులు, తేజస్సులు, కాంతులు అన్నియును భగవంతుని ప్రభావమునకు సంబంధించిన ఒకే అంశము నుండి ప్రకటితమైన రూపములే.

భగవద్గీతలో కృష్ణపరమాత్మ ఇట్లు పలికెను.

**యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్ ।**
**యచ్చంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్ ॥** (గీత.15/12)

"సమస్తజగత్తును ప్రకాశింపజేయు సూర్యునితేజస్సును, అటులనే చంద్రుని తేజస్సును, అగ్నితేజస్సును నాతేజస్సేయనియెఱుంగుము." అటులనే

**యద్యద్విభూతిమత్ సత్త్వం శ్రీమదూర్జితమేవ వా ।**
**తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశసంభవమ్ ॥** (గీత.10/41)

"విభూతియుక్తము అనగా ఐశ్వర్యయుక్తము, కాంతియుక్తము, శక్తియుక్తము ఐన వస్తువేదైనను నా తేజస్సుయొక్క అంశమునుండియే కలిగినదిగా తెలిసికొనుము."

పైన తెలిపిన పదార్థములను సేవించువిధానమును పరిశీలించెదము.

భగవంతుని నామము, రూపము, లీల, ధామము, గుణములు, ప్రభావములు, తత్త్వములు, మహిమలు అపారములు. ఆ రహస్యములను

తెలిపెడి ఆ స్వామి కథలు అమృతమయములు. ఆ గాథలయందలి శ్రద్ధ[1], భక్తి[2], నిష్కామభావములు[3] మొదలగువానిని గూర్చి మనము భగవద్భక్తుల ద్వారా శ్రవణము చేయువలయును. వీణానాదమును విని హరిణము ఆనందించినట్లు ఆ గాథలను విని మనము ముగ్ధులము కావలయును. భక్తిపరవశత్వమున రోమాంచమగును. ఆనందాశ్రువులు స్రవించును. గొంతు బొంగురుపోవును. హృదయము ఆనందడోలికలలో తేలియాడును. ఈ చెవులతో అట్టి కథలను వినిన పిదప భగవంతుని కథలు మున్నగువాని యందలి మాధుర్యములను ఆస్వాదించవలయును. జ్ఞానులగు భక్తులను సమీపించి సాష్టాంగప్రణామము చేయువలయును. వారికి శుశ్రూష ఒనర్చవలయును. వారిని నిష్కపటభావముతో ప్రశ్నించవలెను. వారినుండి పరమాత్మను గురించిన విషయములు వినవలయును.

భగవంతుని నామమహిమ, రూపవైభవములు ఆ ప్రభువుయొక్క అద్భుతలీలలు, పరంధామము, ఆయన గుణములు, ప్రభావములు, తత్త్వరహస్యములు మున్నగునవి భగవద్గీత, రామాయణము, భాగవతము

---

1. ఈశ్వరుని, మహాత్ములను, శాస్త్రములను మరియు పరలోకములగూర్చి భక్తిపూర్వకముగా మనము ప్రత్యక్షముగా చవిచూచుచున్నట్లు విశ్వసించుటయే శ్రద్ధ. అట్టి శ్రద్ధ గలవానియందు గట్టి విశ్వాసము ఏర్పడినవాడు ఆయనయొక్క (శ్రద్ధాళువు యొక్క) సూచనలకు, భావములకు, ఆజ్ఞలకు అనుగుణముగనే నడచుకొనును. దానివలన అతనికి గొప్ప శాంతి, ఆనందములు లభించును. వాటిని పాటించకుండ అతడు ఉండనేలేడు. ఏ కారణముచేతనైనను భగవంతుని ఆజ్ఞలను పాలించలేకపోయినచో అతనికి అది మృత్యువుతో సమానమగును.
2. తనకు ప్రేమాస్పదుడైన పరమాత్మను ఎప్పుడును విస్మరించరాదు. ఆయన భగవంతుని వియోగమునకు గురిఅయినప్పుడు నీళ్లలో నుండి బైట పడిన చేపవలె భక్తుడు విలవిలలాడును. అట్లుండుటయే అనన్యభక్తి
3. అహంకారము, మమకారము, ఆసక్తులు ఏ మాత్రము లేకుండ తృష్ణ, ఇచ్ఛ, స్పృహ, వాసన, కోరిక మొదలగువానిని అన్నివిధములుగా పరిత్యజించుటయే నిష్కామభావము.

మొదలగు సచ్ఛాస్త్రములయందు మధురముగా, విశదముగా వర్ణించబడినవి. అమృతమయములగు ఆ పదములయొక్క అర్థములను, భావములను పరిశీలించి ఆస్వాదించవలెను. శ్రద్ధాభక్తులతో, నిష్కామభావముతో వాటి నధ్యయనము చేయవలెను. సకలప్రపంచమునందును పరమాత్మ స్వరూపమునే దర్శింపవలయును. భగవంతుని స్వరూపమును, ఆయన చిత్రపటములను, విగ్రహములను, లీలలను, చకోరము వెన్నెలను గ్రోలినట్లుగా కనులార్పక మహదానందముతో దర్శించవలెను. తలిదండ్రులను, యజమానులను, సుహృదులను, మిత్రులను, ఆచార్యులను, అతిథులను, జ్ఞానులను, భగవద్భక్తులను - భగవంతుని స్వరూపములుగా తలంచి దర్శించవలెను. అట్లు చేయునపుడు రోమాంచము కలుగును. ఆనందాశ్రువులు స్రవించును. గొంతు పెగలకుండును. హృదయమున ఆనందము పెల్లుబుకును. వీటిని అనుభవించుచు సాధకుడు తన్మయత్వముతో ముగ్ధుడు కావలయును. ఇట్లు భగవద్గీత మున్నగు సద్గ్రంథములను శ్రద్ధగా పఠించి, వాటియందలి మాధుర్యమును ఆస్వాదింపవలయును.

పరమాత్మునినామరూపములను, లీలలను, ధామమును, ఆ ప్రభువు గుణములను, ప్రభావమును, తత్త్వమును నిగూఢములై అమృతమయములైన కథలను విని, చదివి అవగాహన చేసికొనవలయును. శుచిప్రదేశమున ఏకాంతముగ స్థిరాసనమున కూర్చుండి శ్రద్ధాభక్తులు నిష్కామభావము, వివేకవైరాగ్యములు[1] గల చిత్తముతో ఆ గాథలను మననము చేసికొనవలెను. ఆ స్వామిని దివ్యస్తోత్రములద్వారా, పదములద్వారా మనస్సులో స్తుతించ వలెను, ప్రార్థించి పూజింపవలెను. పూజలు చేయుచు నమస్కరించవలెను.

---

1. 'సత్', అసత్, నిత్య, అనిత్యవస్తువివేచనమే వివేకము. వివేకవంతుడగు మనుష్యుడు ప్రతి అవస్థయందు, ప్రతి వస్తువునందును, ప్రతిక్షణము ఆత్మ అనాత్మలను గూర్చి విశ్లేషించుచుండును. పరమాత్మతత్త్వమును నిరంతరము మననము చేయుచుండును.

మహర్షి పతంజలి యోగదర్శనమునందు ఈ విధముగా వైరాగ్యమును వ్యాఖ్యానించెను.

(మిగతా తరువాతి పేజీలో)

నడచుచున్నప్పుడు, తిరుగుచున్నప్పుడు, కూర్చున్నప్పుడు, నిలిచియున్న సమయమున, లేచినప్పుడును, తినుచున్నప్పుడును, త్రాగుచున్నప్పుడును ఆయా పనులను చేసుకొనుచు అన్నివేళలయందును పై విషయములను మననము చేసికొనుచుండవలెను. నిదురించునప్పుడును ఆ విషయములను భావనచేయుచుమననము చేయుట శ్రేయస్కరమగును. మనస్సునందు సకలమును భగవత్స్వరూపమని తలంచుచుండవలెను. ఇట్లు చింతనచేయుచు శరీర స్పృహ లేకుండ తన్మయతను పొందవలెను. అప్పుడు శరీరము పులకించును, కనులనుండి అశ్రువులు రాలును. గొంతు పెగలకుండును. అట్టి భక్తుడు ఆనందమున తన్మయతను చెందును. ఇట్లు మనస్సుతో ఆ పరంధాముని ఆరాధింపవలయును.

సర్వేశ్వరుని నామరూపములు, ఆస్వామి చేయు లీలలు, ఆ ప్రభువుయొక్క పరమధామము, గుణములు, ప్రభావములు, తత్త్వము, ఆంతర్యము, సుధామయములు, వీటినన్నిటిని భక్తితాత్పర్యములతో ఏ కోరికయును లేక స్వయముగ అత్యంత మధురస్వరముతో కీర్తింపుము. కథా వ్యాఖ్యానములద్వారా ఇతరులకు వినిపింపుము. దివ్యస్తోత్రములద్వారా, పాటలచేత భగవంతుని స్తుతించుచు ప్రార్థింపుము. సకలమును భగవత్స్వరూపముగా దర్శింపుము. స్నేహపూర్వకముగా, ప్రేమతో, మధురముగ, కోమలముగ మాట్లాడుచు వ్యవహరింపుము. ఇట్లు ఆచరించు చుండగా శరీరము పులకరించును, కనులనుండి నీరు జాలువారును. కంఠము గద్గదికమగును. హృదయము ఆనందమున పరవశించును. అట్టివారు తన్మయత్వముతో ముగ్ధులగుదురు. వాణిద్వారా ఇట్లు పరమాత్మ తత్త్వమును ఆరాధించి, ఆస్వాదించవలెను.

ఈ విధముగా సాధన చేయుటవలన సాధకునకు అతని ఇష్టదైవము అతడు కోరుకొనిన రూపములో సాక్షాత్కరించును. అప్పుడాతని స్థితి

'దృష్టాను శ్రవిక విషయ వితృష్ణస్య వశీకారసంజ్ఞా వైరాగ్యమ్' (1/55)

స్త్రీలు, ధనము, భవనములు, అభిమానము, గొప్పతనము మొదలగు వాటియందును, ఈ లోకమునగాని, స్వర్గాది పరలోకములందుగాని విషయములన్నిటియందును తృష్ణారహితుడై చిత్తమును వశమునందుంచుకొను అవస్థయే 'వైరాగ్యము'.

విలక్షణముగా నుండును. ప్రేమానందములతో, అమితాశ్చర్యముతో అతడు ముగ్ధుడగుచుండును. అతనికి భగవంతుని విషయము తప్ప శరీరస్పృహ యుండదు. అతడు తదేకదృష్టితో పరమేశ్వరునే చూచుచుండును. అప్పుడు అతనికి కనురెప్పపాటు ఉండనే ఉండదు. ప్రత్యక్షముగా భగవంతుని దర్శించుట, స్పృశించుట, సంభాషించుట మొదలగు దివ్యానుభవములవలన అతనికి గగుర్పాటు కలుగును. కంఠము పెగలకుండును. కనులనుండి ఆనందాశ్రువులు స్రవించును. గొంతు బొంగురుపోవును. అతని సంతోషమునకు మేరయే యుండదు. అతడు పరమానందములో మునిగిపోవును.[1]

అతని మనస్సు, చూపులు, పరమాత్ముని ధ్యాసలోనే స్థిరముగా నిలిచియుండును. అనగా భగవంతుడు ఎల్లప్పుడును అతని మనస్సునకు గోచరించుచుండును, కనుల ఎదుట నిలిచియుండును.[2] ఈ విధముగా

1. అక్రూరుడు కంసుని ఆదేశానుసారము శ్రీకృష్ణపరమాత్మను, బలరామదేవులను మధురకు తీసికొని వచ్చుటకై గోకులమునకు వెళ్లెను. అప్పుడా మహాత్ముడు పరమాత్మను ప్రత్యక్షముగా దర్శించెను. అప్పుడు ఆయన స్థితిని వర్ణించుచు భాగవతమునందు ఇట్లు చెప్పబడినది.

భగవద్దర్శనాహ్లాద బాష్పపర్యాకులేక్షణః ।
పులకాంచితాఙ్గ ఔత్కంఠ్యాత్ స్వాఖ్యానేనాశకన్నృప ॥ (శ్రీమద్భా. 10/38/

రాజా! అప్పుడు భగవానుని దర్శనమువలన కలిగిన పారవశ్యముచే అతని నేత్రములు బాష్పాకులితములయ్యెను. శరీరము రోమాంచితమయ్యెను. అట్లు కాగా ఆయన (అక్రూరుడు) మిగుల ఉత్కంఠతో ఉన్నందువలన అక్రూరుడనైన నేను నమస్కరించుచున్నా" నని పలుకలేకపోయెను.

2. పరమాత్ముడిట్లు పలికెను :

యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి ।
తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి ॥ (గీత. 6/30)

సకల ప్రాణులయందును ఆత్మరూపముననున్న నన్ను (వాసుదేవుని) చూచుపురుషునకు, అట్లే ప్రాణులన్నింటిని నాయందు అంతర్గతములుగా నున్నట్లు చూచువానికి నేను అదృశ్యుడను కాను. అతడును నాకు అదృశ్యుడు కాడు.

సర్వత్ర అతడు భగవత్స్వరూపమునే దర్శించును. అంతట అతనిలో అద్భుతమైన సమభావము కలుగును. సకలపదార్థములయందును, భావములయందును, సంఘటనలయందును, చేష్టలయందును, పరిస్థితులయందును, సకల ప్రాణులయందును అతనిలో విలక్షణమైన సమత్వము గోచరించును.[1] సగుణ నిర్గుణుడు, సాకార నిరాకారుడు, వ్యక్త అవ్యక్తస్వరూపుడు అగు ఆ పరబ్రహ్మ పరమాత్మయొక్క ప్రభావము ఎట్టిదో? ఎంతటిదో? అను విషయము అతనికి యదార్థముగా (తత్త్వత:) తెలిసివచ్చును. అంతట అతనిలోగల సకల సంశయములు పటాపంచ లగును. భ్రమలు తొలగిపోవును. అతడు అజ్ఞానము నుండి, పాపములనుండి శాశ్వతముగా ముక్తుడగును. అతనికి చేయదగినది కాని, తెలిసికొనదగినది గాని, ఏదియును ఉండదు. అతడు అన్నివేళల పరమాత్మయందే తన్మయుడై యుండును. అతని చేష్టలన్నియును పరమాత్మను గూర్చియే యుండును.

పరమాత్ముడిట్లు పలికెను :

**సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వమాస్థిత: ।**
**సర్వథా వర్తమానోఽపి స యోగీ మయి వర్తతే ॥** (గీత. 6/31)

---

1. పరమాత్ముడు భక్తుల లక్షణములను తెలుపుచు ఇట్లు నుడివెను.

సమశ్శత్రౌ చ మిత్రే చ తథా మానావమానయో: ।
శీతోష్ణసుఖదు:ఖేషు సమస్సంగవివర్జిత: ॥
తుల్యనిందాస్తుతిర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్ ।
అనికేత: స్థిరమతి: భక్తిమాన్ మే ప్రియో నర: ॥

శత్రువులయెడను, మిత్రులయెడను సమభావముతో మెలగువాడును, మానావమానములు, శీతోష్ణములు, సుఖదు:ఖములు మొదలగు ద్వంద్వములను సమానముగా స్వీకరించువాడును, ఆసక్తిరహితుడును, నిందాస్తుతులకు చలింపనివాడును, మననశీలుడును, శరీరనిర్వహణకై లభించిన దానితోడనే తృప్తిపడువాడును, నివాసస్థానములయందు మమతాసక్తులు లేనివాడును, స్థితప్రజ్ఞుడును అగు భక్తుడు నాకు ఇష్టుడు.

"భగవంతునియందు ఏకీభావస్థితుడైనపురుషుడు సర్వభూతముల యందును ఆత్మరూపముననున్న సచ్చిదానందఘనవాసుదేవుడనైయున్న నన్ను భజించును. అట్టి యోగి సర్వథాసర్వవ్యవహారములయందు ప్రవర్తించుచున్ననునాయందే ప్రవర్తించుచుండును."

అట్టి మహాపురుషులను దర్శించుట, వారితో భాషించుట, వారిని స్పృశించుట, చింతన చేయుట, వార్తాలాపములు చేయుట మున్నగువాటివలన మానవుడు పరమపవిత్రుడగును. భాగవతమునందు పరీక్షిన్మహారాజునకు శుకదేవులను గూర్చిన శ్రద్ధ యినుమడింపగా భావోద్వేగముతో ఇట్లు పలికెను.

యేషాం సంస్మరణాత్పుంసాం సద్యశ్శుద్ధ్యంతి వై గృహాః ।
కిం పునర్దర్శనస్పర్శపాదశౌచాసనాదిభిః ॥
సాన్నిధ్యాత్తే మహాయోగిన్ పాతకాని మహాంత్యపి ।
సద్యో నశ్యంతి వై పుంసాం విష్ణోరివ సురేతరాః ॥

(శ్రీమద్భా. 1/19/33,34)

"సత్పురుషుల సంస్మరణము వలన మానవుల గృహములు అప్పటికప్పుడే పవిత్రములగును. వారిని దర్శించుట, స్పృశించు, వారికి పాదప్రక్షాళనము చేయుట, వారిని ఆసీనులను గావించుట మున్నగునవి మహద్భాగ్యములు. అట్లొనర్చినవారు పవిత్రులు అగుదురనుటలో ఇక సందేహమేమి యుండును? యోగివర్యా! విష్ణుసాన్నిధ్యమునందు అసురులు నిలువజాలనట్లు నీ సన్నిధిలో వశించు మాత్రముననే (నీ దర్శనము చేతనే) ఆయా వ్యక్తులయొక్క మహాపాపములన్నియును వెంటనే అంతరించును.

అట్టి మహాపురుషులు విహరించు స్థలము తీర్థస్థానమగును. అచటి వాతావరణమంతయు పరమపవిత్రమగును. నారదమహర్షి ఇట్లు చెప్పెను.

తీర్థీకుర్వంతి తీర్థాని సుకర్మీకుర్వంతి కర్మాణి సచ్ఛాస్త్రీకుర్వంతి శాస్త్రాణి

(నారద భక్తిసూత్రములు. 69)

"ఆ మహాత్ములు తమ ప్రభావముచే తీర్థములను పరమతీర్థ స్థానములుగా చేసెదరు. కర్మలను సత్కర్మలనుగా చేయుదురు. శాస్త్రములను సచ్ఛాస్త్రము

లుగా రూపొందింతురు". అనగా వారున్న ప్రదేశము తీర్థస్థాన మగును. వారు అచట నివసించుటవలన తీర్థస్థలముల మహత్త్వము (తీర్థత్త్వము) శాశ్వతమై, మహోన్నతముగా వర్ధిల్లును. వారు చేయు పనులన్నియును సత్కర్మలగును. వారి వాక్కే ఒక శాస్త్రముగా పరిణమించును. వారు చేపట్టిన శాస్త్రము మహత్త్వపూర్ణమగును. (వారి కరస్పర్శకు నోచుకొనినంతనే ఏ శాస్త్రమైనను అన్నివిధములుగా సుసంపన్నమగును) ఆ శాస్త్రమే సచ్ఛాస్త్రముగా రూపుదిద్దుకొని లోకమునకు ఆమోదయోగ్యమగును.

అటులనే

**కులం పవిత్రం జననీ కృతార్థా, వసుంధరా పుణ్యవతీ చ తేన ।**
**అపార సంవిత్సుఖ సాగరేస్మిం ల్లీనం పరే బ్రహ్మణియస్యచేత: ॥**

(స్కంద. మా.,కా.ఖం. 55/140)

"అపారమైన జ్ఞానమునకును, ఆముష్మిక సుఖములకును నిధియైన (నెలవైన) పరబ్రహ్మమునందు మనస్సును లీనమొనర్చినవాడు ఎంతయు ధన్యుడు. అట్టివానివలన వంశము పవిత్రమగును, తల్లి కృతార్థురాలగును, పృథివి పుణ్యాత్మురాలగును".

తులసీదాసు ఇట్లు చెప్పెను.

"ప్రభూ! శ్రీరాముని కంటెను ఆయన భక్తులే గొప్పవారని నా విశ్వాసము. శ్రీరాముడు జలనిధి ఐనచో ధీరులైన సజ్జనులు జలదములు. శ్రీహరి చందన వృక్షమైనచో సజ్జనులు గంధవహులు. (వాయువులు)".

కనుక పరమాత్ముని నామము, రూపము, లీలలు, ధామముయొక్క గుణములు, ప్రభావము, తత్త్వము, రహస్యము మొదలగువాటిని గుఱించి తెలిసికొనుట శ్రేయోదాయకమగును. అట్టిస్థితిని పొందుటయే మానవునకు సముచితమగును. చెవులు, నేత్రములు, మనస్సు, వాక్కుద్వారా అతడు శ్రద్ధాభక్తులతో, నిష్కామభావముతో, తత్పరత్వముతో నిత్యము, నిరంతరము ఆ పరమాత్ముని సేవించుచుండవలయును. అట్లు ఒనర్చుటవలన అతడు కృతార్థుడగును.

❖ ❖ ❖

## 9. భక్తుడగుటకు సులభ సాధనము

యోగినామపి సర్వేషాం మద్గతేనాంతరాత్మనా ।
శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మత: ॥ (గీత. 6/47)

"యోగులందఱిలోను శ్రద్ధాళునై, అంతరాత్మను నాయందే లగ్నమొనర్చి, అనగా భక్తివిశ్వాసములతో నిశ్చలమైన, దృఢమైన అనన్య భావముతో నాయందే స్థిరమైయున్నమనోబుద్ధిరూప - అంత:కరణమును గలిగి, నిరంతరము నన్నేభజించువాడు" నాకు పరమశ్రేష్ఠుడు- అని నానిశ్చితాభిప్రాయము.

పరమాత్మప్రాప్తికొఱకు శాస్త్రములయందు భక్తియోగము, జ్ఞానయోగము, కర్మయోగము, అష్టాంగయోగము మొదలగు అనేక ఉపాయములు చెప్పబడినవి. కాని అన్నిటికంటెను సులభమైనది భక్తియోగము. మానవులకు అది సర్వోత్తమమైనది. స్త్రీలు, పురుషులు, బాలకులు అన్ని వర్ణముల, ఆశ్రమములవారు దీనికి అర్హులు. అందరికిని ఇది సహజమైనది కూడ (గీత. 7/14). ఎంతటి పాపి ఐనను దైవభక్తి ప్రభావముచేత శీఘ్రముగనే ఉద్ధరింపబడును. పరమాత్ముడిట్లు పలికెను.

అపి చేత్ సుదురాచారో భజతే మామనన్యభాక్ ।
సాధురేవ స మంతవ్య: సమ్యగ్వ్యవసితో హి స: ॥

క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి ।
కౌంతేయ ప్రతిజానీహి న మే భక్త: ప్రణశ్యతి ॥

(గీత. 9/30,31)

"మిక్కిలి దురాచారుడైనను అనన్యభక్తితో నన్ను భజించినచో అతనిని సత్పురుషునిగానే భావింపదగును. ఏలనన యథార్థముగా అతడు నిశ్చయబుద్ధి గలవాడు. అనగాపరమాత్ముని సేవించుటతో సమానమైనది మఱియొకటి ఏదియును లేదని గట్టిగా నిశ్చయించుకొనినవాడు."

కౌంతేయా! అతడు శీఘ్రముగా ధర్మాత్ముడగును. శాశ్వతమైన పరమశాంతిని పొందును.'నా భక్తుడెన్నడును నష్టమునకు గురికాడు' అను విషయమును నిశ్చయముగాఎఱుంగుము.

ఇదేవిధముగా నీచాతినీచ జాతివాడైనను ఉద్ధరింపబడును. కృష్ణపరమాత్మ ఇట్లు చెప్పెను.

మాం హి పార్థ వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాపయోనయః ।
స్త్రియో వైశ్యాస్తథా శూద్రాః తేఽపి యాంతి పరాం గతిమ్ ॥

(గీత. 9/32)

"ఓ అర్జునా! స్త్రీ, వైశ్య, శూద్రులును, అట్లే చండాలాదిపాపయోనిజులును నన్ను శరణుపొంది పరమగతినే పొందుదురు."

మృత్యువునకు చేరువయైనవాడు (అవసానదశకు చేరినవాడు) కూడ భక్తిప్రభావము చేత వెంటనే పరమాత్మను చెందగలడని గీతయందు చెప్పబడినది.

అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కలేవరమ్ ।
యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః ॥

(గీత. 8/5)

"అంత్యకాలమునందైనను నన్నే స్మరించుచు దేహత్యాగమును చేసినవాడు నన్నే (నాస్వరూపమునే) పొందును. ఇందేమాత్రముగూడ సందేహము లేదు".

జ్ఞానము లేకుండ శ్రేయస్సు లభించదని చెప్పినచో అది సముచితమే యగును. భగవంతునిభక్తిప్రభావముచేత ఆ స్వామి కృపవలన అతనికి జ్ఞానప్రాప్తికూడ కలుగును.

గీతయందు స్వయముగా పరమాత్ముడిట్లు పలికెను.

తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్ ।
దదామి బుద్ధియోగం తం యేన మాముపయాంతి తే ॥
తేషామేవానుకంపార్థమ్ అహమజ్ఞానజం తమః ।
నాశయామ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా ॥

(గీత. 10/10,11)

"అట్లు నిరంతరము ధ్యానాదులద్వారా నాయందే లగ్నమనస్కులై భక్తిశ్రద్ధలతో నన్నే భజించువారికి నేను బుద్ధియోగమును అనగా తత్త్వజ్ఞానరూప

యోగమును ప్రసాదించెదను. దానిద్వారా వారు నన్నే పొందుదురు. ఓ అర్జునా! వారి యంతఃకరణములయందు స్థితుడనైయున్న నేను వారిని అనుగ్రహించుటకై తేజోమయమైన తత్త్వజ్ఞానరూప దీపమును (జ్యోతిని) వెలిగించి, వారి అజ్ఞానాంధకారమును పారద్రోలెదను".

నీచజాతివారైనను, ఆచరణహీనులైనను, మూర్ఖులైనను, అట్టివారికి కూడ భగవంతుని పొందుట సులభమని దీనివలన సిద్ధమగును. పరమేశ్వరునియందు శ్రద్ధాభక్తులుండవలయును. అట్టివారికి భక్తిప్రభావమువలన వెంటనే ముక్తి సుగమమగును.

గీత, రామాయణము, భాగవతాది గ్రంథములయందు భగవద్భక్తిని గూర్చిన మహిమ అపారముగ లభించును. మరి ఏ ఇతర సాధనములవలన కూడ అట్టిదానిని పొందలేము. దీనిని అన్నిటికంటె మిక్కిలి ఉపయోగకరమైనదని తలంచవలయును. భక్తిని సాధన చేయుటకు బాగుగా పరిశ్రమించవలసి వచ్చును. అన్నిసాధనములందును భక్తియొక్క సాధనము మిక్కిలి సులభమని చెప్పబడుచునేయున్నది. కాని కలియుగమునందు దీనియొక్క మహిమ విశేషముగా చెప్పబడినది. వేదవ్యాసమహర్షి ఇట్లు పలికెను.

కలిం సభాజయంత్యార్యా గుణజ్ఞాః సారభాగినః ।
యత్ర సంకీర్తనేనైవ సర్వః స్వార్థోఽభిలభ్యతే ॥

(శ్రీమద్భా. 11/5/36)

"రాజా శ్రీహరినామసంకీర్తనముద్వారానే అన్నియుగముల యందలి వివిధములైన పురుషార్థములును, లభించునని గుణగ్రాహులగు పెద్దలు ఈ కలియుగమును కీర్తించుచున్నారు".

కలియుగమునందు మిగుల సులభముగ, శీఘ్రముగ పరమాత్మప్రాప్తి కలుగునని దీనివలన సిద్ధించును.

మనమీద పరమాత్ముని అపారమైన కృపకలదు. అందువలననే శ్రేష్ఠమైన దేశము, ఉత్తమమైనకాలము, ఉన్నతమగు జాతి, మహోన్నతమైన ధర్మమునందు మనము జన్మించితిమి. ఈ కలికాలమునందు అప్పుడప్పుడు సత్పురుషుల సాంగత్యము లభించుచుండును. స్వాధ్యాయనమునకు

అవకాశము గూడ కలుగుచుండును. ఇది భగవంతునికి మనపైగల కృపావిశేషము. మూడు లోకముల యందును ఆత్మోద్ధరణమునకు ఈ పృథివియే మిగుల ఉత్తమమైనది. ఈ భూమండలమున భారతదేశము సర్వోత్తమమైనది పూర్వకాలమునందు సకలదేశములందలి ప్రజలు భారతదేశమునకు వచ్చి విద్యనభ్యసించుచుండిరి. కనుక మనువు ఇట్లు చెప్పెను.

**ఏతద్దేశ ప్రసూతస్య సకాశాదగ్రజన్మనః ।**
**స్వం స్వం చరిత్రం శిక్షేరన్ పృథివ్యాం సర్వమానవాః ॥ (2/20)**

"ఈ దేశము (భరతఖండము) నందు జన్మించిన బ్రాహ్మణుల వద్దనుండి సమస్త భూమండలమునందు నివసించు మానవులందరు ఆచారములను, విద్యను పొందుచుండవలెను".

మనము ఈ భారతభూమియందే జన్మించి, ఇచటనే నివసించుచున్నాము మరియు మనకు ఈ కలికాలముకూడ మిగుల ఉత్తమమైనది. కలియుగము సకలదోషములకును నిలయమై యున్నది కాని దీనియందొక విశేష గుణమున్నది. ఈ యుగమున భగవంతుని భజించుటవలన మానవుడు సునాయాసముగ ఉద్ధరింపబడును. ఇది ఈ యుగముయొక్క వైశిష్ట్యము. పురాణమునందు ఇట్లు చెప్పబడినది.

**కలేర్దోషనిధేశ్చైవ శ్రుణు చైకం మహాగుణమ్ ।**
**యదల్పేన తు కాలేన సిద్ధిం గచ్ఛంతి మానవాః ॥**

(స్కం. మా. కుమా. 35/115)

"కలియుగము సకలదోషములకు నిలయమే. ఐనప్పటికిని అందులో ఒక మేలైన గుణముకూడ ఉన్నది. దానిని వినుము. ఈ యుగమునందు కొంతకాలమైనను సాధనచేసినచో మానవుడు సిద్ధిని పొందును".

గోస్వామి తులసీదాసు ఇట్లు పలికెను.

"మానవుడు విశ్వాసము కలిగియున్నచో కలియుగముతో సమానమైన యుగములేదు. ఏలనన శ్రీరాముని నిర్మలగుణగణములను స్మరించి ఎట్టి ప్రయాసము లేకుండగనే సంసారసాగరమును దాటగలడు".

(రా.మా. ఉ.కాం. దో. 103 క)

మనుష్య శరీరమునకే పరమాత్మను పొందు గొప్ప అధికారము గలదు. కనుక శాస్త్రములయందు పదేపదే మానవజన్మను బహుళముగా ప్రశంసించుట జరిగినది.

తులసీదాసు ఇట్లు పలికెను.

"మహాభాగ్యవశమున ఈ మానవజన్మ లభించినది. ఈ దేహము దేవతలకును దుర్లభమని ప్రామాణిక శాస్త్ర గ్రంథములలో పేర్కొనబడినది".
(రా.మా. ఉ.కాం. దో. 42/4)

ధర్మములన్నిటిలో వైదికధర్మము సనాతనమైనది. అనాదియు, సర్వోత్తమము ఐనది. ప్రపంచమునందు ధర్మమనుపేరుతో అనేక మతములు ప్రచారములో నున్నవి. అవి కోట్లకొలది మానవులచే అంగీకరింపబడుచున్నది. ధర్మములని చెప్పబడినవి, నాలుగు విశేషముగా పేర్కొనబడును. అవి హిందూధర్మము, బౌద్ధధర్మము, మహమ్మదీయ ధర్మము, క్రైస్తవధర్మము. వీటిని గురించి లోతుగా ఆలోచించి చూచినచో అన్నిటికంటెను మొట్టమొదటిది వైదిక సనాతన హిందూ ధర్మమని ఋజువగును. గౌతమబుద్ధునిచేత నెలకొల్పబడిన బౌద్ధధర్మము ఇంచుమించు 2500 సంవత్సరముల క్రిందటిదని స్పష్టమగును. ఎందుకనగా ఈ ధర్మసంస్థాపకుడగు బుద్ధదేవుడు జన్మించి 2500 సంవత్సరములు గడచినవి. క్రైస్తవధర్మము కూడ 2000 సంవత్సరముల క్రింద స్థాపించబడినదే. ఎందుకనగా సత్పురుషుడైన ఏసుక్రీస్తు జన్మించి 1984 సంవత్సరములైనవి. ఇస్లాము ధర్మముయొక్క మూలగ్రంథము ఖురాన్ శరీఫ్. దీని ప్రవర్తకుడైన హజరత్ - మొహమ్మద్ జన్మించి ఇంచుమించు 1400 సంవత్సరములైనవి. కాని వైదిక సనాతన ధర్మమును (కాలమును) ఇది ఇన్ని సంవత్సరముల క్రిందటిది అని ఎవ్వరును నిర్ణయించజాలకపోయిరి. ఎందుకనగా ఇది మానవ నిర్మితము కాదు. (అపౌరుషేయము) ఇది అనాది. ప్రపంచమునందుగల మతమతాంతరములు, ధర్మమనుపేరుతో వర్తింపబడుచున్న సకల ధర్మములు, ప్రవర్తకులు వైదికధర్మమునుండియే పెక్కు విషయములను గ్రహించుట జరిగినది. మనుష్యుల బుద్ధులు చిత్రాతిచిత్రములు గనుక అనేకములగు

మతమతాంతరములు, సంప్రదాయములు సృష్టింపబడినవి. కనుక శ్రుతులలోను, స్మృతులయందును చెప్పబడిన సనాతన ధర్మమునే సర్వోత్తమ మైనదని వచించుట ఎంతమాత్రమును అత్యుక్తికాదు. మన ఈ ధర్మమునకు మూలము మంత్రబ్రాహ్మణాత్మకములైన వేదములు. ఇది శాఖోపశాఖలుగా విస్తరించినది. వీటిలో అనేకశాఖలు విధర్మీయులద్వారా నశింపజేయబడినవి. ఐనప్పటికి కూడ ముఖ్యములగు మంత్రములు, బ్రాహ్మణభాగములు నేడు కూడ లభ్యములు. ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వణవేదము అను ఈ నాలుగు సంహితలు మంత్రభావములని చెప్పబడినవి. అటులనే ఐతరేయము, తైత్తిరీయము, శతపథబ్రాహ్మణము మొదలగునవి అధికాంశములైన ఉపనిషత్తులు, బ్రాహ్మణ భాగములు. ఈ వైదికధర్మము అనాదికాలమునుండియు నిరంతరముగా కొనసాగుచు మహోజ్జ్వలమై ప్రవర్తిల్లుచు వచ్చుచునే యున్నది. కనుకనే ఇది సనాతన ధర్మమని అంగీకరింపబడినది. అట్టి సనాతన ధర్మమునే అనుసరించుచు దానినే జీవనముగ రూపొందించుకొన్న మానవులకు మనము జన్మించితిమి.

ఇంతేకాకుండ పదేపదే మనకు లభించు సత్పురుషుల సాంగత్యముకూడ ఆ భగవంతుని కృపావిశేషమే. స్కందపురాణమందిట్లు చెప్పిరి.

తదైవ జీవస్య భవేత్ కృపావిభో
దురంతశక్తేః తవ విశ్వమూర్తే ।
సమాగమః స్యాన్మహతాం హి పుంసాం
భవాంబుధిర్యేన హి గోష్పదాయతే ॥
సత్సంగమో దేవ యదైవ భూయాత్
తర్హీశ దేవే త్వయి జాయతే మతిః ।

(స్కం. వై. వై.మా. 16/18-19)

"ప్రభూ! విశ్వాకారా! జీవులయందు మీ కృపావిశేషము ప్రసరించినప్పుడే వారికి మహాపురుషుల సాంగత్యము లభించును. వారిసాంగత్యమువలన నిశ్చలముగనే ఈ సంసారసాగరము గోష్పాదములతో సమానమగును.

అటులనే దేవా! పరమేశ్వరా! సత్సాంగత్యము లభించునప్పుడే దాని ప్రభావమువలన ఆ పరమాత్మని ఎడల నిశ్చితముగా భక్తిశ్రద్ధలు కలుగును".

తులసీదాసస్వామి ఇట్లు నుడివెను.

"నిజమైన, పవిత్రమైన సజ్జనుల సమాగమము శ్రీరామునికృపకు పాత్రులైనవారికే లభించును". (రా.మా. ఉ.కాం. దో. 68/4)

అటులనే భక్తుడగు విభీషణుడు కూడ హనుమంతునితో ఇట్లు పలికెను.

"ఆంజనేయా! ఆ ప్రభువు కృప పూర్తిగా నా ఎడగలదని నాకు గట్టి నమ్మకము ఏర్పడినది. ఏలనన శ్రీహరి కరుణలేనిదే సాధుసమాగమము జరుగదు. (రా.మా. సుందర. దో. 6/2)

ఈవిధముగా భగవంతుని దయచేత అన్నియు కలిసి వచ్చినప్పటికిని మనము పరమాత్మని పొందుటలో విఫలులమైనచో మనకింతకంటె దుఃఖకరము, లజ్జాకరమైన విషయము వేరొకటి ఉండదు.

గోస్వామి ఇట్లు నుడివెను.

"ఇట్టి సాధనములు లభించినప్పటికిని, భవసాగరమునుండి తరించుటకు ప్రయత్నింపనివాడు మందబుద్ధి, కృతఘ్నుడు, అతడు ఆత్మఘాతకుడు పొందెడి గతిని చేరును". (రా.మా. ఉ.కాం. దో. 44)

మనజీవితము మిగుల అమూల్యమైనది. కనుక మనము శరీరమును గూర్చిన, ప్రపంచమును గుఱించిన మోహమును తొలగించుకొనవలయును. శరీరము, మనస్సు, ధనము (సంపదలు) మొదలగువాటిని అన్నింటిని సమర్పించి ఆ స్వామిని పొందుటకు ప్రాణములున్నంతవరకు భక్తిశ్రద్ధలతో పాటుపడవలెను. లేనిచో తరువాత పశ్చాత్తాపపడవలసి వచ్చును.

గోస్వామి తులసీదాసు ఇట్లు పలికెను.

"పరలోకమున దుఃఖమును అనుభవించును. నెత్తి బాదుకొనుచు 'లబోదిబో' యనును. పిదప 'కుయ్యో! మొఱ్రో!' అనుచు పశ్చాత్తాపపడును. కాలమును, కర్మను, పైగా భగవంతుని వ్యర్థముగా నిందించును".

(రా.మా. ఉ.కాం. దో. 43)

ఈ విషయములన్నియు ఆలోచించి మానవుడు పరమాత్మను పొందుటకు శీఘ్రాతిశీఘ్రముగా సాధనయందు మగ్నుడు కావలెను. ఎందుకనగా మృత్యువు విషయమున మనము ఉపేక్ష వహింపరాదు. ఏలనన ఎప్పుడది మనలకు కబళించునో తెలియదుకదా!

మన జీవితములకు ఆధారము పరమాత్ముడే యని తెలిసికొనవలెను. ఆ స్వామి అనుగ్రహము తప్ప ప్రపంచమునందు మనల నుద్ధరించు ఉపాయమింకొకటి లేదు. సర్వేశ్వరుడు లేకుండ మనము జీవించజాలము. మనకు ఆయన అవసరము చెప్పలేనంత కలదు. ఈ విషయమును గ్రహించినచో మనకు భగవత్ప్రాప్తి తొందరగా లభించును. ఇట్లు అర్థముచేసికొన్న మానవుడు ఎంతగొప్ప ఆపదవచ్చినను ఆ పరమేశ్వరుని విస్మరింపజాలడు. రాజగు ఉత్తానపాదుని కుమారుడు ధ్రువుడు ధ్యానమగ్నుడై ఉండెను. ఆయన గొప్ప భక్తుడు. ఆయన తపమాచరించు సమయమున రాక్షసులనేకులు ఆయన తపస్సునకు విఘ్నములు కలిగించుటకు పూనుకొనిరి. కాని ధ్రువుడు విచలితుడు కాలేదు. పైగా అతడింకను దృఢముగా ధ్యానమగ్నుడై పరమానందమున నోలలాడుచుండెను. పరమాత్ముడతనికి వెంటనే తన దర్శన భాగ్యమును ప్రసాదించెను. సత్యయుగమునందు తీవ్రమగు జపము, తపము, ధ్యానములు చేయుటవలన ధ్రువునకు ఐదున్నర నెలలలో భగవత్ప్రాప్తి కలిగెను. కాని ఈ కలికాలమందు అట్లు ధ్యాన తత్పరులైనచో అతిశీఘ్రముగా భగవంతునిపొంద గలరు.

స్కందపురాణమందు ఇట్లు పేర్కొనబడినది.

దశవర్షైస్తు యత్పుణ్యం క్రియతే తు కృతే యుగే ।
త్రేతాయామేకవర్షేణ తత్పుణ్యం సాధ్యతే నృభిః ॥
ద్వాపరే తచ్చమాసేన తద్దినేన కలౌయుగే* ।

(స్కం. మా. వై. మా. 43/3-4)

* విష్ణుపురాణముయొక్క ఆరవ అంశమునందు రెండవ అధ్యాయమున 15వ శ్లోకము కూడ ఇదే విషయమును చెప్పును.

సత్యయుగమునందు పదిసంవత్సరములవరకు మనుష్యులు సాధన చేసినచో కలుగు పుణ్యము, త్రేతాయుగమునందు ఒక సంవత్సరములో లభించును. ద్వాపరయుగమునందు ఒక మాసము సాధన చేయుటవలనను కలియుగమున ఒక దినము సాధన చేయుట వలనను అది సిద్ధించును.

త్రేతాయాం వార్షికోధర్మో ద్వాపరే మాసికః స్మృతః ।
యథాక్లేశం చరన్ ప్రాజ్ఞస్త దహ్నాప్రాప్యతే కలౌ ॥

(స్క.మా. కుమా. 35/117)

'క్లేశములను సహించి ధర్మానుష్ఠానము చేయు బుద్ధిమంతుడగు పురుషునకు త్రేతాయుగమునందు ఒకమాసమునను, కలియుగము నందు ఒక దినము అనుష్ఠానము చేయుటచేతను లభించును''.

ఈ విధముగా పరిగణించిచూచినచో దీక్షతో సత్యయుగమునందు ధ్రువునివలె కలియుగమునందు సాధనచేయువానికి ఇంచుమించు మూడు ఘడియలలో భగవత్ప్రాప్తి కలుగును. ఒకవేళ మనము ఆయనవలె శ్వాసను ఆపుటకు అసమర్థులమని భావించినచో అట్టి వానికి శ్వాసను నిరోధింపకున్నను మూడు ఘడియలకు బదులుగా మూడు దినములలో నైనను పరమాత్ముని దర్శనము లభించును. 'మూడు దినములవరకు మేము ఒక కాలిపై నిలబడి ఉండలేము', అనినచో కూర్చొని మూడు దినములకు బదులుగా ఆరుదినములు సాధన చేసినచో పరమాత్మప్రాప్తి కలుగును. ఎవరైనను మలమూత్రములను నిరోధింపలేక, ఆకలిదప్పులను, నిద్రను పూర్తిగా పరిత్యజించజాలక పోవచ్చును. కలియుగమునందు ఈ నియమములను పూర్తిగా పాటింపవలసిన అవసరములేదు. ఎనిమిది జాముల కొకసారి పాలుత్రాగి, పండ్లు తినియే ధ్రువునివలె నామమును జపించుచు స్వరూపధ్యానమును నిరంతరము చేసినచో ధ్రువున కెంతకాలమునకు భగవంతుడు లభించెనో అంతసమయములోనే మనకు పరమాత్మప్రాప్తి కాగలదు. లేకపోయినచో కలియుగనుయొక్క వైశిష్ట్యమేమి యుండును? కలియుగమునకు ఈ వెసులుబాటు కలదు.

తులసీదాసుకూడ ఇట్లు చెప్పెను.

"ఆరుమాసముల వరకు కేవలము పాలు, పండ్లను ఆహారముగా గొనుచు రామనామమును జపించుచుండుము. అట్లు చేసినచో సకల శుభములు, సిద్ధులు కరతలామలకములగును. అనగా వాటంతట అవి లభించునవి" తులసీదాసస్వామి చెప్పెను. (దోహావళి 5)

ఇందులో ప్రధానమైన విషయము ఏమిటనగా ఏవిధమైన సాధనయు చేయలేకపోయినచో ఆరుమాసముల వరకు నిరంతరము భజన, ధ్యానములు కొనసాగుచు ఉండవలయును. అవి ఆగిపోగూడదు. ఆ భజన, ధ్యానములు ప్రాపంచిక పదార్థములకొఱకు సకామములు కాకూడదు. వాటిని కేవలము భగవంతుని పొందుటకే పరమ విశ్వాసముతో నిష్కామభక్తిభావముతో చేయవలయును.

ఇందుకు ఆరుమాసములు పట్టిన- ఈ విషయమున మన శ్రద్ధాభక్తుల లోపమేయని గ్రహింపవలెను. భగవంతునియందు విశుద్ధమైన అనన్యప్రేమ కలిగియుండినవారు ఆకలిదప్పులు, నిద్రను లెక్కచెయ్యరు. అట్టివానికి పరమాత్ముడు తప్ప ఏ ఇతర వస్తువుపైనను ధ్యాసయుండదు. అంతేగాదు అట్టి సాధకునకు తన శరీర స్పృహ కూడ ఉండదు. అట్టిస్థితియందు భక్తుని అనుగ్రహించుటకు భగవంతుడాలస్యమే చేయడు. అట్టిసాధకునకు భగవదనుగ్రహము వెంటనే లభించును. భగవత్ప్రాప్తికి ఇంతసమయము పట్టును అను కాలనియమము లేదు. కేవలము ఆయనను పొందుటకు తీవ్రమగు భక్తిశ్రద్ధలు, దృఢమైన కోరికయు కావలయును.

సగరవంశమునందలి విశ్వసహమహారాజుయొక్క కుమారుడు ఖట్వాంగుని విషయము శ్రీమద్భాగవతమునందు కలదు. ఆతడు దేవతలతో "నా ఆయుష్షు ఎంతమిగిలియున్నది?" అని యడిగెను. "నీ ఆయుస్సు రెండు ఘడియలు మిగిలియున్నది" అని దేవతలు చెప్పిరి. ఇదివిని ఖట్వాంగ మహారాజు తన పనులన్నిటిని వదలిపెట్టి పరమాత్ముని ధ్యానమునందు తన్మయతను చెందెను. అట్లు ఆ మహారాజు తన తీవ్రమైన కోరికచే రెండు ఘడియలలోనే పరమాత్ముడగు శ్రీహరిని పొందెను.

పరమాత్ముని పొందుటకు ఎక్కువ సమయము అవసరములేదు. ఆ స్వామి అనుగ్రహమును పొందుకు తీవ్రమైన ఇచ్ఛ కావలెను. అట్టి కోరిక ఉన్నచో

పరమేశ్వరుడు లభ్యమగును. ఆ ప్రభువు ఆలస్యము చేయడు. ఉదాహరణకు ఒకానొకడు కాలుజారి నదిలో పడి నీటమునిగి నాడనుకొందము. అతనికి ఈతరాదు. బైటకు వచ్చుటకు మిక్కిలి ఆతురుడై యుండును. విలవిలలాడుచుండును. ఆ సమయమున అతని దృష్టి లక్ష్యము అంతయు నిరంతరము ఒడ్డుమీదనే ఉండును. అట్టిదియే తీవ్రమైన కోరిక. అట్లే సంసారసాగరమునుండి ఒడ్డుకు చేరవలయునను తహతహ ఉండవలయును. పరమాత్ముని పొందుటకు సాధకుడు తీవ్రమైన ఇచ్ఛ కలిగియుండవలెను. అట్టివానిని సర్వేశ్వరుడు భవసాగరము నుండి తప్పక ఉద్ధరించును. భగవద్గీతయందు ఇట్లు నుడువబడినది.

**తేషామహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్ ।**
**భవామి నచిరాత్ పార్థ మయ్యావేశితచేతసామ్ ॥**

(గీత. 12/7)

"ఓ అర్జునా! నాయందేలగ్నమనస్కులైన అట్టి పరమభక్తులను నేను శీఘ్రముగనే మృత్యురూపసంసారసాగరమునుండి ఉద్ధరించెదను".

పైన చెప్పినట్లుగా ఆ ప్రభువునందు మనస్సు లగ్నమగుట, భగవంతుని యందు తీవ్రమగు ఇచ్ఛ కలిగియుండుట, ఈ రెండునూ శ్రద్ధతో కూడిన అనన్యవిశుద్ధ భక్తిచేతనే సాధ్యమగును. సాధకునకు భగవంతునియందు అట్టి అనన్యవిశుద్ధ భక్తి కలిగినపుడే భగవత్ప్రాప్తి కలుగును. అతడు ప్రేమాస్పదుడైన భగవంతుని వియోగమును సహించలేడు. ఇదియే అనన్యప్రేమ యొక్క లక్షణము. అతడు భరతునివలె పరమాత్ముని విరహముతో వ్యాకులపాటునకు లోనగును. అతడు ఆ స్వామి వియోగమునకు తట్టుకొనజాలడు. అందులకై అతడు తన ప్రాణములను విడుచుటకు కూడ సంసిద్ధుడగును. శ్రీరాముని యెడబాటునకు లోనైన భరతుని దశను వర్ణించుచు గోస్వామి ఇట్లు పలికెను.

"భరతుని మనస్సు శ్రీరామునివిరహసముద్రమున మునిగిపోవుచుండగా రక్షించుటకు వచ్చిన ఓడవలె హనుమంతుడు బ్రాహ్మణవేషముతో వచ్చెను".

(రా.మా. ఉ.కాం. దో. 1. క)

ప్రేమాస్పదుడైన పరమాత్మ వియోగమున ఈ విధముగ సాధకుడు విరహవ్యాకులుడైనచో అచటకు భగవంతుడు వచ్చుటకు ఆలస్యము ఉండదు. జలములేనిచో చేప జలము కొఱకు విలవిలలాడునట్లు మనము భగవంతుని కొఱకు తహతహపడవలెను. కొందరిట్లు పలుకవచ్చును. 'చేప జలవియోగము చేత కొట్టుమిట్టాడుచు చనిపోవును. కాని నీరు ఆ చేపదగ్గరికి వచ్చి దానితో కలువదు కదా, అది అట్లే అగును. నీరు జడము కాని పరమాత్ముడు జలమువలె జడుడుకాడు .ఆ స్వామి చైతన్యమూర్తి, పరమప్రేమ స్వరూపుడు. దయాసాగరుడు. ఆయన ఎట్లు ఆగగలడు? "నన్ను ఎవరు ఎట్లు భజించెదరో, నేనును వారినట్లే అనుగ్రహించెదను'' అని ఆ స్వామి ప్రతిజ్ఞ చేసియుండెను. **(గీత. 4/11)**

పున్నమినాడు చంద్రుడస్తమించువరకును చకోరము ఆయనను కనులార్పక చూచుచునే ఉండును. అట్లే భక్తుడు నిత్యము నిరంతరము పరమేశ్వరుని ధ్యానించుచుండుటచేత ఆ ప్రభువు సహజముగనే లభించును. కృష్ణపరమాత్ముడిట్లు పలికెను.

**అనన్యచేతాః సతతం యో మాం స్మరతి నిత్యశః ।**
**తస్యాహం సులభః పార్థ నిత్యయుక్తస్య యోగినః ॥**

(గీత. **8/14**)

"పార్థా! నిత్యము, నిరంతరము అనన్యభావముతో చిత్తమును నాయందే నిలిపి, పురుషోత్తముడనైన నన్ను స్మరించుచు, సంతతము మత్పరాయణుడైన యోగికి నేను సులభుడను. అనగా అతనికి సహజముగనే నేను లభింతును''.

'చంద్రుడు ప్రత్యక్షముగా చకోరపక్షికి ఎదుటనే ఉండును. గనుక ఆయనను దర్శించుట దానికి సులభము' అని ఎవరైనా అనవచ్చును. అదియును సమంజసమే. కాని శ్రద్ధాభక్తులుండినచో మనకు కూడ పరబ్రహ్మ కనిపించును. అప్పుడు ఆ స్వామి మన సమ్ముఖముననే ఉండును. శ్రద్ధాభక్తులు లేనిచో ప్రత్యక్షముగ దగ్గఱనే ఉండికూడ దూరముగ నుండినట్లే అగును. పరమాత్ముడగు శ్రీకృష్ణుడు దుర్యోధనాదులకు అతిసమీపమున నుండెను. కాని వారికి ఆ స్వామియందు శ్రద్ధాభక్తులు లేవు. కనుక అతి

చేరువగా ఉండికూడ దూరముగా నుండినట్లే అయ్యెను. ఆ స్వామి చేరువలో లభించికూడ వారికి ఆ ప్రభువుయొక్క అనుగ్రహము లభించనట్లయ్యెను. కాని ధ్రువుడు మొదలగువారికి ఆ ప్రభువు దూరముగ నుండి కూడ వారి అనన్యభక్తి సాధనవలన ఆ స్వామి వారికి మిగుల దగ్గఱ అయ్యెను. అందులకు వారి పరమశ్రద్ధయు, అనన్యప్రేమయే కారణము. అందువలన ధ్రువుడు, దేవఋషియైన నారదునియొక్క ఉపదేశములను లక్ష్యముగా చేసికొని ఆ పరమాత్మయందు ధ్యానమగ్నుడయ్యెను. అదేవిధముగా మనము కూడ భగవద్గీత, రామాయణము, భాగవతము మొదలగు గ్రంథములను, మహాత్ముల వచనములను ఆధారముగా, ఆదర్శముగా చేసుకొని గట్టి సాధన కావింపవలయును. అనన్యభక్తిశ్రద్ధలతో పరమాత్ముని ధ్యానించవలయును. పరమాత్ముని ధ్యానరూపమైన ఆ లక్ష్యము నెరవేరువరకును, కఠినాతి కఠినములైన ఎన్ని ఆపదలు వచ్చినను చాతకమువలె పూనికవహించి, ఆ ప్రభువును ధ్యానించుట వదలిపెట్టకూడదు. మేఘములన్నియు వర్షింపవు. కాని వర్షింపని మేఘములను చూచికూడ చాతకము "ప్రియా ప్రియా" యని పిలుచుచుండును. ఒక్కొక్కప్పుడు ఆ మేఘములలో ఏదైనా ఒకమేఘము వర్షింపవచ్చును కదా! ఇదే విధముగా మనముకూడ భగవద్భక్తులవలె పరమేశ్వరుడు ఎప్పటికైనను లభించితీరును అను కోరికను, ఆశయమును కలిగియుండ వలయును. చాతకపక్షిమీద వడగండ్లుపడును. దానిరెక్కలు తెగిపోవును. అప్పటికి కూడ అది తన లక్ష్యమును వీడదు. నీటిబిందువులను ఆశించుచునే యుండును. అట్లే మనముకూడ ఎంతటి కష్టములు వచ్చిపడినను ఆ పరమేశ్వర స్వరూపదర్శన లక్ష్యమును విడనాడరాదు. భగవత్ప్రాప్తి రూపమైన బిందువును ఆశించుచునే యుండవలయును. ప్రాణములు పోవుదశకు చేరినను చాతకము మేఘములనుండి వర్షించు నీటిబిందువులనే గ్రహించును కాని ఇతర జలముల నెప్పుడూ కోరదు. అది దాని లక్షణము. అదేవిధముగ భగవత్ప్రాప్తి తప్ప ఇంకేవిధమైన ప్రాపంచిక భోగములను ఎప్పుడును కోరుకొనరాదు. తీవ్రమైన కోరికయు, మిక్కిలి అవసరమూ ఉన్నను. చాతకమునకు ఒక్కొక్కప్పుడు జలము లభింపకపోవచ్చును. కాని కోరికయందలి తీవ్రతనుబట్టి ఉత్తమసాధకునకు

పరమాత్ముడు తప్పక లభించును. చాతకమునకు జలము కావలయును కాని నీరు జడమగు కారణమున ఆ నీటికి చాతకము యొక్క అవసరములేదు. కాని భక్తుడు పరమేశ్వరుని కొఱకు ఎంతగా తహతహపడునో ఆ పరబ్రహ్మకూడ భక్తునికొఱకు అంతే ఆతురతకు లోనగును. పరమేశ్వరుడిట్లు పలికెను.

**యే యథా మాం ప్రపద్యంతే తాంస్తథైవభజామ్యహమ్ ।** (గీత. 4/11)

"పార్థా! భక్తులు నన్ను సేవించిన రీతికి అనుగుణముగ నేను వారిని అనుగ్రహింతును".

పరమాత్ముడింకను ఇట్లు పలికెను.

**సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః ।**
**యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్ ॥**

(గీత.9.29)

"నేను సకలభూతముల (ప్రాణుల)యందును సమభావముతో వ్యాపించి యుందును. నాకు అప్రియుడు గాని ప్రియుడు గాని ఎవ్వడును లేడు. కాని నన్ను భక్తితో భజించువారు నాయందేయుందురు. నేనును వారియందు ప్రత్యక్షముగా ఉందును."

జ్ఞానులగు భక్తులు నిష్కామభావముతో పరమాత్ముని భజించెదరు. వారికి పరమాత్ముడు మిగుల ప్రియమైనవాడు అగును. ఆ భగవంతునకు కూడ వారు అంతే ప్రియమైన వారగుదురు.

ఆ పరమాత్ముడిట్లు నుడివెను.

**తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే ।**
**ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమ్ అహం స చ మమప్రియః ॥**

(గీత. 7. 17)

"ఈ చతుర్విధభక్తులలో నిరంతరము నాయందే ఏకీభావస్థితుడై, అనన్య భక్తియుతుడైన జ్ఞాని అత్యుత్తముడు. ఏలనన వాస్తవముగ నన్ను

(నాతత్త్వమును) తెలిసికొనిన జ్ఞానికి నేను మిక్కిలి ఇష్టుడను. అతడును నాకు మిక్కిలి ఇష్టుడు".

కనుక మనకు పరమాత్మునియందు అనన్యభక్తిభావము, విశుద్ధప్రేమయు కలుగుటకు నిత్యము, నిరంతరము నిష్కామభావముతో, శ్రద్ధాభక్తులతో ఆ స్వామి ధ్యానమును కొనసాగించవలయును.

"వాయువు, తేజస్సు, జలము, పృథివి వీటన్నిటియందు ఆకాశము వ్యాపించియున్నది. ఈ విధముగనే పరబ్రహ్మ అన్నిటియందును వ్యాపించి యున్నాడు. సమస్తము పరమాత్ముని ఒక్క అంశమందే కలదు". మనము అన్నిసమయములలోను భగవంతుని ధ్యానించుచుండవలెను. గీతయందు ఇట్లు ప్రస్తావింపబడినది.

యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయిపశ్యతి ।
తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి ॥

(గీత. 6/30)

"సకల ప్రాణులయందును ఆత్మరూపముననున్న నన్ను (వాసుదేవుని) చూచుపురుషునకు, అట్లే ప్రాణులన్నింటిని నాయందు అంతర్గతములుగా నున్నట్లు చూచువానికి నేను అదృశ్యుడను కాను. అతడును నాకు అదృశ్యుడు కాడు".

పరమాత్ముడు తెలిపిన ఈ సాధనమును నిరంతరము ఉత్సాహముతో అభ్యాసము చేయుచుండవలయును. ప్రతివస్తువును భగవంతుని స్వరూపముగ భావించవలయును. ప్రతిచేష్టను ఆ స్వామి లీలగ తలపోయుచు అన్నివేళలలోను ఆనందముతో ముగ్ధులగుచుండవలయును. ఎందుకనగా స్వయముగ పరబ్రహ్మయే ప్రపంచమునందుగల సకల వస్తువుల రూపములుగ రూపొందెను. మొదట ఒక్క భగవంతుడే ఉండెననియు, తరువాత ఆయనకు "నేను అనేకములగుదును" అను కోరిక కలిగెననియు, ఉపనిషత్తులలో చెప్పబడినది.

"సోఽకామయత । బహు స్యాం ప్రజాయేయేతి" । (తైత్తరీయ 2/6)

అప్పుడు స్వయముగ సర్వేశ్వరుడు అనేక రూపములను పొందెను. ద్వాపరయుగమునందు బ్రహ్మదేవుడు గోపబాలురను గోవత్సములను తీసికొని వెళ్లి ఒక గుహయందు దాచిపెట్టెను. ఆ సమయమున స్వయముగ శ్రీకృష్ణభగవానుడే గోపాలుర గోవత్సముల రూపములలో ప్రకటితుడై, తన లీలలను ప్రకటింపసాగెను. శ్రీమద్భాగవతమునందు ఇట్లు చెప్పబడినది.

యావద్వత్సపవత్సకాల్పకవపుః యావత్కరాంఘ్ర్యాదికం ।
యావద్యష్టివిషాణవేణుదలశిక్ యావద్విభూషాంబరమ్ ॥
యావచ్ఛీలగుణాభిధాకృతివయో యావద్విహారాదికం ।
సర్వం విష్ణుమయం గిరోఽఙ్గవదజః సర్వస్వరూపో బభౌ ॥

(శ్రీమద్భా. 10/13/19)

"అప్పుడు అజుడగు శ్రీకృష్ణుడు గోపాల గోవత్సముల సంఖ్యను అనుసరించి కరములు, పాదములు మొదలగు అవయవములు, బెత్తములు, కొమ్ములు, వేణువులు, పత్రములు, చిక్కములు, ఆభూషణములు, వస్త్రములు, స్వభావములు, గుణములు, నామములు, ఆకారములు, వయస్సులు, విహారములు మున్నగునవి ఎవరికి ఎట్లున్నవో సరిగ వానినట్లే ధరించి 'సర్వజగత్తు విష్ణుమయ'మను వాక్కు రూపుదాల్చినట్లు ఆయన సర్వస్వరూపుడై ప్రకాశించెను".

ఈ విధముగ మనము సకల పదార్థములను భగవంతుని స్వరూపములే అనియు, చేష్టలన్నియు, ఆయన లీలలే అనియు తెలిసికొనవలయును. అట్లు భావించుచు క్షణక్షణము ఆనందముతో ముగ్ధులము కావలయును. భక్తులకు ఈ సాధనము మిగుల ఉత్తమమైనది, సులభమైనది.

పచ్చరంగు అద్దములను ధరించినవారి కనులకు ప్రపంచమంతయు పచ్చగా కనిపించును. అట్లే "శ్రీహరి" యొక్క భావరూపమైన అద్దములను ధరించిన వారి హృదయనేత్రములకు ప్రపంచమంతయు వస్తుతః పరమాత్ముడగు శ్రీహరిరూపముననే కనిపించసాగును. పచ్చరంగు కళ్లజోడు కంటె శ్రీహరి రూపమైన కళ్లజోడునందు ఒక విశేషము కలదు. ప్రపంచము

అనేక రంగులతో కూడినది. అద్దముల ప్రభావమున మనకు అది పచ్చగా అనిపించును. కాని ఈ ప్రపంచమైతే నిజముగ శ్రీహరి రూపమే. అజ్ఞానమువలన మనము ఈ రహస్యమును తెలుసుకొనలేకున్నాము. అందువలన మనకు శ్రీహరి ప్రపంచముయొక్క రూపమున కనిపించు చున్నాడు. నిజముగా సకలము పరమాత్ముడే అయి ఉండెను. ఇప్పుడును అన్నియు ఆ భగవంతుడు అయివున్నాడు.

గీతలో అన్నిటియందు పరమాత్మబుద్ధి కలిగియుండుటను, దాని మహిమను మిగుల గొప్పగా చెప్పబడినది. కృష్ణపరమాత్మ ఇట్లు నుడివెను.

బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాంప్రపద్యతే ।
వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః ॥ (గీత. 7/19)

"అనేకజన్మలపిదప జ్ఞానియైనవాడు(భగవత్తత్త్వమును ఎఱిగినవాడు) సర్వమూ వాసుదేవమయమే యని భావించి, నన్ను శరణుపొందును. అట్టి మహాత్ముడు లభించుట దుర్లభము".

ఈ సాధనము మిగుల ఉత్తమమైనది. కనుక మనము అందరిలోను పరమాత్మ స్వరూపమును దర్శించవలయును. ఇట్లు అభ్యాసము చేసినచో శీఘ్రముగా పరబ్రహ్మను పొందగలము. ఛాందోగ్యోపనిషత్తునందు ఒక కథ కలదు. ఉద్దాలక మహర్షి తన కుమారుడగు శ్వేతకేతువును ఇట్లు అడిగెను. "ఒకదానిని తెలిసికొనిన సమస్తము తెలియును. నీవీ విద్యను నేర్చుకొంటివా? లేదా?" దీనికి సమాధానముగ "ఆ విద్య మా గురుదేవులు కూడ ఎరుగరు. వారికి తెలిసియుండినచో నాకు తప్పక చెప్పియుండెడివారు. ఇప్పుడు మీరు దయచేసి నాకు దానిని ఉపదేశింపుడు". అప్పుడు ఉద్దాలకుడు చెప్పెను. బంగారము యొక్క స్వరూప స్వభావములను తెలిసికొనినచో సువర్ణముచే తయారగు సమస్త ఆభరణములగురించియు తెలియును. వాటి నామములు, రూపములు, ఆకారములు వేరువేరుగా ఉండవచ్చును. కాని వాటికి మూలము బంగారమేయగును. ఇటులనే పరమాత్మతత్త్వమును తెలుసుకొనినచో సమస్తమునందును పరమాత్మయే విరాజిల్లుచుండును. నీటి తత్త్వమును తెలిసికొనినచో మేఘములు, ఆవిరి, మంచు, నీటిబిందువులు మొదలగు

వాటియందు జలమే భాసిల్లుచుండును. ఇట్లే పరమాత్మ తత్త్వమును తెలిసికొనినచో సమస్త సృష్టియందును పరమాత్మయే గోచరించుచుండును. భేదము, అభేదము అను రెండు సిద్ధాంతములను అంగీకరించువారు ఈ విషయమును త్రికరణశుద్ధిగా స్వీకరింతురు. భేదమేమిటనగా అభేదతత్త్వమును ఉపాసించువారు 'ఈ ఉన్నదంతయు పరబ్రహ్మయేమరియు నేను కూడ పరబ్రహ్మనే' అని అందురు. పరబ్రహ్మయొక్క భేదతత్త్వమును ఉపాసించువారు 'ఈ ఉన్నదంతయు పరబ్రహ్మమే. నేను ఆయన సేవకుడను' అని అందురు. ఈ విషయమున ఈ ఇరువురియందునుగల భేదమిదియే. అధికారికభేదమునననుసరించి ఈ రెండు సాధనములు ఉత్తమమైనవే. రామచరితమానసమందు ఈ వర్ణన కలదు. కిష్కింధాకాండలో పరమాత్ముడగు శ్రీరాముడు భక్తిని దృష్టిలో నుంచుకొని భక్తుడగు హనుమంతునితో ఇట్లు పలికెను.

"అందరును నన్ను 'సమదర్శి' యందురు. కాని నా సేవకులే నాకు ఎక్కువ ప్రియమైనవారు. ఏలనన వారు అనన్యభక్తితో నాపైననే ఆధారపడియుందురు. ఓ హనుమంతుడా! 'నేను సేవకుడను. ఈ జడచేతనములన్నియును భగవంతుని రూపములే' అను నిశ్చయమును కలిగి నిశ్చలబుద్ధితో దానిపైననే దృఢముగా నుండువానిని 'అనన్య భక్తుడు' అని అందురు".

(రా.మా. కిష్కింధా. దో. 2/4,3)

సాధారణ మనుజునకు ఈ భక్తిమార్గము సరళమై, సుగమమైనది. కనుక ఇది ఉత్తమము. భక్తిమార్గమునకు అందరును అర్హులగుదురు. వారు నిమ్నజాతివారైనను, మూర్ఖులైనను, పాపులైనను సరే. వారికి కేవలము భగవంతునియందు విశుద్ధమగు భక్తివిశ్వాసములు ఉండవలయును. పరమాత్ముడు కేవలము భక్తిశ్రద్ధలనే చూచును. శబరి విశేషముగా చదువుకొన్నది కాదు. నిమ్నజాతియందు జన్మించినది. ఆమె స్వయముగ పరబ్రహ్మయగు రామచంద్రునితో ఇట్లు నుడివెను.

"ప్రభూ! నేనేవిధముగా మిమ్ము స్తుతింపవలయును? ఓ పాపవిమోచనా! నేను నిమ్నజాతి స్త్రీని. మందబుద్ధిని. అధమురాలను. అందునా అతి

నికృష్టురాలను. నేను జడమతిని". ఈ మాటలను విని రామచంద్రప్రభువు ఇట్లు పలికెను. (రా.మా. అరణ్యా. దో. 34/1)

"భక్తురాలా! నా మాటలను వినుము. నేను కేవలము భక్తితత్పరత్వమునే గౌరవించెదను". (రా.మా. కిష్కింధా. 34/2)

పరమాత్ముడు ఆమె భక్తిభావమును చూచి ముగ్ధుడయ్యెను. ఆమె కుటీరము చెంతకు వెళ్లెను. ఆమె 'తన చేతులతో (స్వయముగా) ఇచ్చిన ఫలములను తినెను. ఇది ఆ ప్రభువుయొక్క అవ్యాజమైన దయ. దయామయుడగు ఆ స్వామిదయకు పాత్రురాలైన శబరి జీవితము ఎంతయు మిగుల ధన్యమైనది.

"హృదయమునందు శ్రద్ధాభక్తులు లేనివాడు, భగవంతుని విశ్వసించనివాడు. నిజమైన భజనను చేయనేలేడు. అట్టి వారికి పరమాత్ముని అనుగ్రహము తొందరగా లభించదు. కనుక మనము భగవంతుని గుణముల, స్వభావముల వైపునకు దృష్టి సారింపవలెను. ఆ ప్రభువుయొక్క సాన్నిధ్యమును పొందుటకు సంపూర్ణమైన విశ్వాసముతో ప్రతిక్షణము ఆయన కొఱకు నిరీక్షించుచుండ వలెను 'వాస్తవముగా పరమాత్ముడు ఉన్నాడు. ఆ స్వామి ఇదివరలో ఎందరకో లభించెను. ఇప్పుడును లభించును. మనకు కూడ నిశ్చయముగ ప్రాప్తించును' అను దృఢ విశ్వాసమును మనస్సునందుంచు కొనవలెను. ఆ స్వామి మన అవగుణములను పట్టించుకొనడు. ఆయన హృదయము మిగుల కోమలము, సరళము, దయామయము. అది వాత్సల్యముతో నిండియుండును. ఆ పరమేశ్వరుడు సర్వాంతర్యామి, సర్వశక్తిమంతుడు, సకల ప్రదేశములందును ఎల్లప్పుడును స్థితుడైయుండును. భక్తునియందలి భక్తిప్రపత్తులతోడనే ఆయన సాక్షాత్కరించును.

రామచరితమానసమందు శివుడిట్లు పలికెను.

"శ్రీహరి సర్వవ్యాపి. భక్తిశ్రద్ధలు కలచోట తనను తాను ప్రకటించుకొనునని నా విశ్వాసము". (రా.మా. బా.కాం. 184/3)

ఈవిధముగా దృఢనిశ్చయము చేసికొనవలెను. శబరివలె ప్రతిక్షణము పరమవిశ్వాసముతో నిరీక్షించుచుండవలెను. ఇట్లు ఎదురుచూచుటవలన

భగవంతుడు శీఘ్రముగానే ప్రాప్తించుటను ఇందులకు భిన్నముగా సంశయములతో కూడినవాడైనచో "పరమాత్ముడున్నాడో, లేడో ఎవరికి తెలియును?" "ఇంతకుమునుపు ఎవరికైనను దర్శనమిచ్చెనో లేదో", ఇపుడు లభించునో, లభించదో", "నాకు ప్రాప్తించునో ప్రాప్తించదో" ఇట్టి సందేహములు కలిగియున్నవాడు భగవంతుని పొందుట కష్టమగును. ఎందుకనగా శ్రద్ధలేనివానికి, సంశయములతో కూడినవానికి, అజ్ఞాని అయినవానికి పరమేశ్వరుడు ప్రాప్తించుట దుర్లభమగును. అంతియేకాక అతనికి ఇహలోక సుఖములును ఉండవు. పరలోక సుఖములును దక్కవు. శ్రీకృష్ణుడిట్లు నుడివెను.

**అజ్ఞశ్చాశ్రద్దధానశ్చ సంశయాత్మా వినశ్యతి ।**
**నాయం లోకోఽస్తి న పరో న సుఖం సంశయాత్మనః ॥**

(గీత. 4/40)

"అవివేకియు, శ్రద్ధారహితుడును అయిన సంశయాత్ముడు పరమార్థ విషయమున అవశ్యము భ్రష్టుడేయగును. అట్టి సంశయాత్మునకు ఈ లోకమునందుగాని, పరలోకమునందుగాని ఎట్టి సుఖమూ ఉండదు".

భగవంతుని పొందుటలో సంశయమున్నను, ప్రయత్నములో లోపమున్నను ఆ స్వామిని దర్శించు దీక్ష, నిరీక్షణయు లేకున్నను ఆయనయందు మనస్సు లగ్నముకాదు. అందులకు మనము అధములము, పాపులము, అజ్ఞానులము, మూర్ఖులము ఐనను కావచ్చును. భగవంతుని యందు దృఢమైన శ్రద్ధావిశ్వాసములు కలిగి, ఆ స్వామిని పొందుటకు మనము ప్రయత్నశీలురము కావలయును. పరమదయాళువగు పరమాత్మునకు మన అవగుణములు పట్టవు. భరతుడిట్లు చెప్పెను.

"ప్రభువు తన సేవకుల దోషములను ఎన్నడును పరిగణింపడు. అతడు దీనజనబంధువు. ఆయన స్వభావము అతికోమలము. శ్రీరామచంద్రప్రభువు తప్పక రాగలడని నా మనస్సు విశ్వసించుచున్నది. ఏలనన అన్నియు శుభశకునములే కనిపించుచున్నవి". (రా.మా. ఉ.కాం. దో. 1/3,4)

అందువలన అభయహస్తుడగు ఆ పరమాత్మునిపై ధ్యానముంచి మనము

నిశ్చింతగ ఉండవలయును. ఆయన మన అవగుణములవైపే చూడడు. తప్పక మనలను తన వారినిగా చేసికొని ఆ స్వామి తన దర్శనభాగ్యమును మనకు ప్రసాదించును.

భక్తుడగు పద్మనాభుడు అను బ్రాహ్మణుడు ఈ భావముచేతనే ప్రభావితుడై తన మనస్సులో ఇట్లు ఆలోచించుచుండెను. 'భగవంతుడు నాకు తప్పక లభించును. నేను ఆయన పాదపద్మములమీద వ్రాలెదను. ప్రేమాశ్రువులచేత ఆ స్వామి చరణములకు అభిషేకము చేయుదును. ఆ దేవదేవుడు నన్ను చేరదీసి తన హృదయమునకు హత్తుకొనును. అప్పుడు నేను ఆనందసాగరమున మునిగి తేలుచుండును. అప్పుడు ఆ స్వామి నన్ను వరములు కోరుకొమ్మని పలుకును. అంతట నేను నాకేమియు వలదు. నేను మీ సేవను చేసికొనుచుందును. మిమ్ములనే చూచుచుందును' అని చెప్పెదను. ఈ విధముగా తన మనస్సులోనే ఆలోచించుచు అతడు ఆనందమగ్నుడగుచుండెడివాడు. ఆతని శరీరము రోమాంచమగుచుండెను. కనులనుండి అశ్రువులు స్రవించుచుండెను. భక్తి పారవశ్యములతో గూడిన అతని ఈ స్థితి చాలసేపటివరకు ఉంటూ ఉండెడిది. అతని పరమోత్తమభావమును తీవ్రమైన శ్రద్ధాభక్తులను గమనించి ఆ పరంధాముడు సాక్షాత్తుగా ప్రకటితుడై ఆయనకు దర్శనమిచ్చెను. అప్పుడు ఆ స్థలములన్నియు పరమాత్ముని దివ్యాంగనములనుండి వెలువడిన కాంతులు దేదీప్యమానములయ్యెను. భక్తుడైన పద్మనాభుడు వేలకొలది సూర్యులతో సమానమైన ఆ దివ్యప్రకాశమును చూచెను. చతుర్భుజుడగు ఆ పరమాత్మ శంఖచక్రగదా పద్మములను ధరించి ఆ ప్రకాశముచే దేదీప్యమానుడై విరాజిల్లుచుండెను. అట్టి శ్రీమహావిష్ణువును అతడు దర్శించెను. పరమభక్తుడగు పద్మనాభుని హృదయము ప్రశాంతతను పొందెను. కనులు నిర్నిమేషములై, ఆ దేవదేవుని యొక్క ఆనందరసమును ఆస్వాదింపసాగెను. ఆ ప్రభువు సకల రసామృత సాగరము గదా! భక్తిసాధన చేయువారికి భగవదనుగ్రహమును పొందుట మిక్కిలి సులభము. ఇది రహస్యముతో కూడిన సాధనము. కనుక భక్తులు పద్మనాభునే అనుసరించవలయును.

భగవంతుని ఉపాసించుటకు గల సాధనములన్నింటిలో ఆయనను సేవించుటకు, ఆ స్వామి దివ్యనామము, రూపము, ఆయన లీల, ధామము, ఈ నాలుగును ప్రధానములు. ఈ నాలుగింటిలో ప్రతిదానియందును నున్న గుణమును, ప్రభావమును, తత్త్వమును, అంతర్యమును అర్థము చేసుకొనవలయును. కనీసము చెవులు, నేత్రములు, మనస్సు, వాక్కు అను ఈ నాలుగింటి ద్వారా పైన చెప్పిన నాలుగింటిని తప్పక సేవించవలయును. పరబ్రహ్మయొక్క నామమును, రూపమును, లీలలను, ధామగుణములను, ప్రభావమును, తత్త్వమును, అందలి అంతర్యమును గూర్చి భక్తులనుండి శ్రద్ధాభక్తులతో చెవులార వినవలయును. నేత్రములద్వారా సచ్ఛాస్త్రములను చదువవలయును. వాటిని మనస్సుతో మననము చేయువలయును. వాక్కుద్వారా కీర్తించవలయును. భగవద్భక్తులకు ఈ విషయములను చెప్పుచుండవలయును. శ్రద్ధాభక్తులతో ఈ నాలుగింటిని అనుసరించుటవలన, ఆరాధించుటవలన పరమాత్మయొక్క సాక్షాత్కారము కలుగును. ఫలితముగా పరమానందము, పరమశాంతియు ప్రాప్తించును. అపారమైన సమభావము సమకూరును. ఆ దేవదేవుని స్వరూపజ్ఞానము కలుగును. ఇక పరమాత్ముని నామము, రూపము, ఆ స్వామిలీల, పరంధాముని యొక్క గుణములు, ప్రభావము, తత్త్వము, రహస్యములు అనువానిని గూర్చి సంక్షిప్తముగ తెలుపబడుచున్నవి. [1]

ఓర్పు, దయ, శాంతి, ప్రేమ, జ్ఞానము, సరళత మొదలగునవి పరమాత్ముని యొక్క అనంత దివ్యగుణములు. ఇవి అన్నియు ఆ స్వామి దివ్యనామము నందే కుదురుకొనియున్నవి. వటవృక్ష బీజమును భూమిలో నాటి నీరుపోయుటవలన అది మఱ్ఱిచెట్టుగ రూపొందును. అటులనే పరమాత్మ యొక్క నామరూప బీజమును హృదయమను భూమిలో నాటవలెను. ఆ బీజమును సత్సంగము, స్వాధ్యాయరూపమగు నీటితో తడుపవలెను. అప్పుడు

1. ఈ విషయమును విస్తృతముగా తెలిసికొనుటకు గీతాప్రెస్సువారు ప్రకటించిన "భక్తి - భక్త - భగవాన్" అను పుస్తకమునందు "నామ-రూప-లీల-ధామ్" శీర్షికతో ఉన్న వ్యాసమును చూడవలయును.

దివ్యమైన, భగవద్గుణరూపమగు వృక్షము రూపొందగలదు. జపము, కీర్తనము, శ్రవణము, స్మరణము చేయుటవలన ఉపాసకుని హృదయమందు పరమేశ్వరుని దివ్యగుణములు స్వాభావికముగనే ప్రకటితములగును. ఇవి నామముయొక్క గుణములని తెలుపబడెను. నామమును జపించుటవలనను, ఆ స్వామిని కీర్తించుటచేతను, ఆ ప్రభువును గూర్చి వినుట, స్మరించుట వలనను సమస్త పాపములు నశించును. అహంకార మమకారములు, రాగద్వేషములు, కామక్రోధములు, లోభమోహములు మొదలగు సకలదుర్గుణములును సమసిపోవును. అసత్యము, కపటము, చౌర్యము, హింస, వ్యభిచారము, మద్యపానము, జూదము మొదలగు దురాచారములు అంతరించును. దుఃఖములన్నియు దూరమగును. ఉపాసకునియందు స్వాభావికముగనే సద్గుణములు ఆవిర్భవించును. క్రమముగా భగవంతుని ప్రాప్తియు కలుగును. ఇది ఆ దివ్యనామముయొక్క ప్రభావము.

భగవన్నామము ఆ పరమేశ్వరునకు భిన్నముకాదు. పరమేశ్వర స్వరూపము, ఆ స్వామిని గురించిన జ్ఞానము, ఆ ప్రభువు నామము ఇవి అన్నియును ఒకటే. వ్యాపముగ పరబ్రహ్మయే స్వయముగ నామముయొక్క రూపమున ప్రకటితుడగును. ఈ విధముగా తెలిసికొనుటయే నామతత్త్వమును గ్రహించుటయగును.

వాక్కుద్వారా నామమును జపించుటకంటెను, మనస్సులో జపించుటవలన వందరెట్లు ఎక్కువగా ప్రయోజనము చేకూరును. ఆ మానసిక జపము కూడ భక్తిశ్రద్ధలతో చేసినచో దానిఫలము అనంతమగును. దానినే గోప్యముగను, నిష్కామభావముతోడను చేసినచో పరమాత్మప్రాప్తి శీఘ్రముగనే కలుగును. ఈ రహస్యమును ఎఱింగినవాడు ఎన్నడును భగవన్నామజపముచాటున పాపము చేయడు. ఇదియే భగవన్నామముయొక్క రహస్యము.

పరమేశ్వరుని రంగు, రూపము, ఆకారము మిగుల మనోహరమైనవి. అవి లావణ్య శోభితములు, రసమయములు, మిగుల ఆకర్షణీయములు, కాంతిమయములు, అలౌకికములు, ప్రకాశవంతములు, సుందరములు. అవి ఎంతయు అద్భుతమైనవి వాటియందు అత్యంత విలక్షణమైన సహనము,

దయ, శాంతి, ప్రేమ, న్యాయము, సమభావము, మాధుర్యము, సారళ్యము, ఔదార్యము మొదలగు అనంతమగు దివ్యగుణములున్నవి. ఇవి ఆ పరమేశ్వర స్వరూపముయొక్క గుణములు.

సంపూర్ణమైన బలము, ఐశ్వర్యములు, తేజస్సు, శక్తి, మహత్త్వ, సంభవమును అసంభవము చేయగల సామర్థ్యము, అసంభవమును సంభవము చేయు ఒడుపు మొదలగునవి ఆ దేవదేవుని ప్రభావములు. అవి అపరిమితములు. భగవంతుని స్వరూపదర్శనము, స్పర్శ, ఆ స్వామితో భాసించుట, స్మరించుట తోడనే సకల పాపములు, దుఃఖములు, దురాచారములు పూర్తిగా తొలగిపోవును. (నశించును). భక్తునియందు స్వాభావికముగనే సకల సద్గుణములు, సదాచారములు ఉదయించును. అతనికి భగవత్ప్రాప్తియును కలుగును. ఇది భగవంతుని మహిమగా తెలుపబడినది.

పరమాణువు, ఆవిరి, మంచు, మేఘములు, నీటిబిందువులు, వడగండ్లు, మంచుగడ్డలు మొదలగునవన్నియును తత్త్వతః జలమే. అటులనే సగుణ నిర్గుణములు, సాకార నిరాకారములు, వ్యక్తావ్యక్తములు, జడచేతనములు, స్థావర జంగమములు, సదసత్తులు, స్థూలసూక్ష్మములు, కార్యకారణములు, మొదలగునవన్నియును మరియు వీటి కతీతమగునవన్నియును గూడ తత్త్వదృష్టితో ఒక్క భగవంతుడే యగును. ఇది పరమేశ్వరునియొక్క స్వరూపతత్త్వము.

ఆ నిర్గుణ నిరాకార పరమాత్మయే సగుణసాకార రూపమున ప్రకటితుడగుచుండును. ఆ స్వామి కృపలేకుండ ఈ రహస్యమును ఋషులు, దేవగణములు కూడ తెలిసికొనలేదు. ఎందుకనగా వారు ఆ స్వామి యోగమాయచేత కప్పబడి యుందురు. ఆ స్వామి స్వరూపము అచింత్యము, హద్దులులేనిది, దివ్యమైనది. ఆయన తనను తానే ఎరుగును. మరియు ఆయన దయకు (అనుగ్రహమునకు) పాత్రులైనవారు మాత్రము ప్రభువును తెలుసుకొనగలరు. ద్వాపరయుగమునందు బ్రహ్మదేవుడు గోపాలురను, గోవత్సములను దొంగిలించి తీసికొనిపోయెను. అప్పుడు శ్రీకృష్ణపరమాత్మయే గొల్లబాలల, గోవత్సములరూపములను దాల్చెను. ఈ రహస్యమును

బలరామదేవుడు కూడ స్వయముగా తెలిసికొనలేకపోయెను. శ్రీకృష్ణుడే బలదేవునకు ఈ రహస్యము తెలిపెను. ఆ సమయమున గోపాలురయొక్క, గోవత్సములయొక్క రూపములలో నున్న పరమాత్ముని ఎవ్వరును గుర్తించలేదు. ఇదియే భగవంతుని స్వరూప రహస్యము.

విభీషణుడు రావణునిచేత అవమానింపబడి శ్రీరామచంద్ర భగవానుని శరణుజొచ్చెను. ఆ సమయమున భగవంతుడు అతనిమీద (శరణాగత) వాత్సల్యమును ప్రదర్శించెను. ఔదార్యమును చూపెను. దయతో ప్రేమతో సహృదయతతో ఆయనను చేరదీసెను. భగవంతుడు చూపిన ఇట్టి గుణములను గ్రహించుటయే పరమాత్ముని లీలయందలి గుణములను దిగ్దర్శనము చేయుట యగును.

రామచరితమానసమునందలి బాలకాండమున శివధనుర్భంగ ఘట్టము కలదు. మహాత్ముడగు పరశురాముడు అచటికి వేంచేసెను. అంత్యమున రామచంద్రునితో ఆయన ఇట్లు పలికెను.

"ఓ రామా! లక్ష్మీపతి యొక్క ఈ ధనస్సును చేతబట్టి సంధింపుము. ఆ సందేహము తీరిపోవును" అని అందించుచుండగనే ధనుస్సు స్వయముగా శ్రీరాముని చేతులలోనికి పోయెను. (ధనుస్సుతోపాటు విష్ణుసంబంధ తేజస్సు కూడ పరశురాముని నుండి శ్రీరాముని చేరెను). పరశురామునకు అత్యంత సంభ్రమాశ్చర్యములు కలిగెను". (రా.మా. బా.కాం. దో. 283/4)

ఈ విధముగా పరమాత్ముని స్పర్శ కలిగినంత ధనుస్సు తనంతట తానే సన్నద్ధమగుట ఆస్వామి లీలయొక్క ప్రభావమే. భగవంతుని లీలా గుణములను, ప్రభావమును, తత్త్వమును, రహస్యమును అవగతము చేసుకొనుచు ఆ స్వామి లీలను దర్శించుట, ఆయనను గూర్చి చింతన చేయుట, పఠనము, శ్రవణము, కీర్తనములు చేయుట వలనను, వాటిని అనుసరించుటవలనను మనుష్యుడు ఉద్ధరింపబడును. ఇదికూడ పరమేశ్వరుని లీల యొక్క ప్రభావమే.

బ్రహ్మదేవుడు గోపాలురను, గోవత్సములను దొంగిలించి తీసికొనిపోయెను. అప్పుడు స్వయముగ పరమేశ్వరుడే ఆ గోపాలుర,

గోవత్సముల రూపములను ధరించి, ఆ స్థితిని సంవత్సరము వరకు తన లీలలతో నడపెను.తన లీలల ప్రభావమున పరమాత్ముడు ఒక్కక్షణములో అనేక రూపములను దాల్చెను. ఈ లీలలను భగవంతుని స్వరూపమును తెలిసికొనుటయే. ఆ స్వామి లీలల యొక్క తత్త్వమును తెలిసికొనుటయగును. ఎందుకనగా కర్త, కర్మ, క్రియ, సకలము తత్త్వతః ఆ పరమాత్ముడే యగునుగదా!

అట్లే ఈ ప్రపంచమునందు సహజముగ జరుగు చేష్టలు (కదలికలు) అన్నియును కూడ ఆ దేవదేవుని లీలలే. అవి ఆయన కంటె భిన్నములు కావు. అవి ఆ స్వామి స్వరూపాలే. దీనిని తెలిసికొనుటకూడ ఆ ప్రభువుయొక్క లీలను తెలిసికొనుట యగును.

భగవంతుడగు శ్రీరాముడు పదునాలుగు సంవత్సరముల గడువు ముగియగనే అయోధ్యకు విచ్చేసెను. అయోధ్యావాసులందరు ఆయనను కలిసికొనుటకు మిగుల ఉబలాటపడుచుండిరి. ఇది తెలిసిన రామచంద్రుడు తాను అనంతరూపములలో ప్రకటితుడై ఒకే సమయమున అందరిని కలిసెను.

"ఒకే సమయమున ప్రభువు అనేక రూపములలో ప్రకటితుడై ప్రతివ్యక్తికిని ఒకే సమయమున వారి వారి యోగ్యతలకు అనుగుణముగ దర్శనమిచ్చెను. ఉమా! ప్రతి ఒక్కడును 'ప్రభువు మొట్టమొదట తననే కలిసికొన్నాడు' అని భావించెను. ఎవ్వరును ఈ లీలా రహస్యమును ఎరుగరు.

(రా.మా. ఉ.కాం. దో. 5/3,4)

భగవంతుని చిన్మయదివ్యలోకము సర్వశ్రేష్ఠమైనది. అన్నిటికంటె ఉత్తమమైనది. అది నిత్యము, సత్యమైనది. అచటకు మనస్సు, బుద్ధి, వాక్కు చేరలేవు. ఓర్పు, దయ, శాంతి, ప్రేమ, సమభావము, న్యాయము మొదలగు భగవంతుని దివ్యగుణములు నిత్యములు. అవి ఆ ధామమునందు సహజముగనే ఉండును. ఎందుకనగా స్వయముగ పరమాత్ముడే ధామము యొక్క రూపములో ప్రాదుర్భవించెను. ఇవి పరమాత్ముని ధామము యొక్క గుణములుగ చెప్పబడెను.

భక్తుడు భజన, ధ్యానము, సత్సంగము, స్వాధ్యాయము మొదలగు

సాధనములద్వారా ఆ సర్వేశ్వరుని పరమధామమునకు చేరును. అతనిలో పైన చెప్పబడిన గుణములన్నియు మొదటినుండియే స్వాభావికముగనే విలసిల్లుచుండును. ఒకవేళ ఏ కారణముచేతనైనను వాటిలో ఏ కొంచెము లోపముండినను అది పరమధామమునందు ప్రవేశించిన క్షణముననే నివారించబడును. అక్కడకు వెళ్లిన వారెవ్వరు కూడ తిరిగిరారు. ఆ దివ్యధామమందు ఉన్నవారి శరీరములకు జన్మమృత్యు జరావ్యాధి మొదలగుగాగల వికారములు అంటవు. వారు పరమ పవిత్రులై ఉందురు. పరమాత్మునివలె దివ్యులు, చిన్మయులై ఉందురు. వారు అలౌకికులగుదురు. సకల సద్గుణ సంపన్నులై యుందురు. ఆ ధామమునందున్న పదార్థము లన్నియు దివ్యములు, చిన్మయములు, అలౌకికములు అగును. ఇదంతయు భగవద్ధామ ప్రభావము యొక్క సంక్షిప్త వివరణము.

సచ్చిదానంద ఘన పరబ్రహ్మ పరమాత్మయే, పరమధామరూపమున ప్రాదుర్భవించెను. కనుక ఆ పరమధామము సర్వేశ్వరుని స్వరూపమే యగును. దీనిని తెలిసికొనుటయే ఆ దేవదేవుని యొక్క ధామతత్త్వమును తెలిసికొనుట యగును. పరమేశ్వరునియొక్క పరమధామమునందు అంతకుముందు తెలియని వస్తువులన్నింటిని తెలుసుకొనవచ్చును అనుభవించని వాటిని అన్నింటిని అనుభవించవచ్చును. చూడని వానిని అన్నింటిని చూడవచ్చును. ఎందుకనగా అచటకు చేరుటతోడనే బుద్ధి, మనస్సు, ఇంద్రియములు మొదలగునవన్నియు దివ్యములగును. అచట పరమేశ్వరుని యొక్క మరియు ఆయన ధామముయొక్క గుణములు, ప్రభావము, తత్త్వము, రహస్యము, లీలలను గురించిన విషయములు, వినినవి, అర్థము చేసుకొనినవి మిగుల విలక్షణముగా నుండును. అచటకు వెళ్లుటతోడనే పరబ్రహ్మ మరియు ఆ స్వామి ధామము 'వస్తుతః ఏమిటి? అన్న రహస్యము సంపూర్ణముగ అవగతమగును. ఇది భగవంతుని పరమధామము యొక్క రహస్యము.

ఇట్లు గుణములు, ప్రభావము, తత్త్వము, రహస్యమును తెలుసుకొని సాధనచేయు సాధకునకు తన ఇష్టదైవము సాక్షాత్తుగా దర్శనమిచ్చును. అప్పుడాతనిస్థితి విలక్షణముగా నుండును. అప్పుడతడు ప్రేమ, ఆనందము,

ఆశ్చర్యములతో ముగ్ధుడగును. అతనికి భగవంతుడు తప్ప ఇతరమైన దేనిమీదను చివరకు తనను గురించిన స్పృహ (జ్ఞానము) కూడ ఉండదు. అతడు పరమాత్మను తదేకదృష్టితో చూచుచుండును. అతని కనులు మూతపడవు. అతని శాంతికి హద్దులుండవు. అతనిలో అలౌకికమైన సమభావము ఏర్పడును. సగుణ, నిర్గుణ సాకార నిరాకార, వ్యక్త-అవ్యక్త రూపమగు పరబ్రహ్మపరమాత్మ ఏ ప్రభావము కలిగియుండునో దానిని ఉన్నదున్నట్లుగా సంపూర్ణముగా యథార్థరూపముతో తత్త్వతః తెలుసుకొనును. పిమ్మట అతడు సకల సంశయములు, భ్రమలు, అజ్ఞానము, పాపములు, వికారములు మున్నగువాని నుండి శాశ్వతముగ ముక్తుడగును. అప్పుడతనికి చేయవలసినదిగాని, తెలుసుకొనవలసినదిగాని ఏమియు మిగిలియుండదు.

కనుక మనము భగవంతుని పొందుటకొఱకు అనన్యభక్తిని శ్రద్ధతో సాధన చేయవలయును. నిష్కామభావముతో ఆతురత కలిగి ప్రాణములున్నంతవరకు క్రియాన్వితము చేయవలయును.

❖ ❖ ❖

# 10. అనన్యభక్తియొక్క స్వరూప రహస్యములు

సమయము అమూల్యమైనది. ఒక్కక్షణము కూడ వ్యర్థపఱచరాదు. రాత్రి నిదురించు సమయమున పరమేశ్వరుని నామమును జపించుచు, ధ్యానించుచు శయనించవలయును. అప్పుడు రాత్రి నిదురించు సమయము గూడ సాధనచేయు సమయముగా పరిగణింపబడును.

గోపికలు నడుచుచు, తిరుగుచు, తినుచు, త్రాగుచు, కూర్చొనుచు, లేచుచు ఉన్నప్పుడును తమ సమయమును శ్రీకృష్ణుని ధ్యాసలో గడుపుచుండినట్లు మనము కూడ గడుపవలయును. మన సమయమును భగవంతుని ధ్యాసలో గడుపవలెను.

శ్రీమద్భాగవతమునందు ఇట్లు చెప్పబడినది.

యా దోహనేఽవహననే మథనోపలేపఽ
ప్రేంఖేంఖనార్భరుదితోక్షణమార్జనాదౌ ।
గాయంతి చైనమనురక్తధియోఽశ్రుకంఠ్యో
ధన్యా వ్రజస్త్రియ ఉరుక్రమచిత్తయానాః ॥

"ముఖ్యముగా పాలు పితుకునపుడు, ధాన్యములను దంచునపుడు, పెరుగు చిలుకునపుడు, ఇల్లు అలుకునపుడు, ఊయలలూపునప్పుడు, ఏడ్చుచున్న శిశువులను జోకొట్టుచున్నప్పుడు, నీరు చల్లుచున్నపుడు, ఇండ్ల నూడ్చుచున్నప్పుడు అనగా ఎల్లప్పుడును గోపికల చిత్తములు దైవభక్తితో నిండియుండును. ప్రేమతో వారి కన్నులలో ఆనందాశ్రువులు స్రవించుచుండును. వారు బొంగురుపోయిన గొంతుతో శ్రీకృష్ణుని గూర్చి గానము చేయుచుందురు. వారి చిత్తములు ఎల్లవేళల శ్రీకృష్ణునియందే లగ్నమైయుండును. గోకులమునందలి అట్టి గోపికలెంత ధన్యురాండ్రో కదా!"

ఇదేవిధముగా మనము కూడ అన్నివేళల వాక్కుచే భగవంతుని నామమును జపించుచుండవలెను. ఆ స్వామి గుణములను కీర్తించవలెను. ఆ ప్రభువును మనస్సుతో ధ్యానించవలయును. ఈ విషయమున ఏ కొంచెము కూడ లోపము రానీయరాదు.

ఉదయము, సాయంత్రము రెండువేళల నియమానుసారముగ సాధన కొఱకు మనము మన సమయమును వినియోగించుకొనవలెను. నియమానుసారముగా మనము వెచ్చించు సమయమును కూడ మిక్కిలి విలువగలదిగా పరిగణించవలెను. పరమేశ్వరుని నామజపముతో ఈ క్రింద చెప్పిన అరు విషయములను విశేషముగా మనస్సునందుంచు కొనవలయును. అప్పుడు నామజపము మిగుల విలువైనది కాగలదు.

1. నామమును వీలైనచో మనస్సుతో జపించవలయును. లేనిచో శ్వాసద్వారా ధ్యానము చేయువలయును. అది కూడ చేయులేకపోయినచో నాలుకద్వారా చేయవలయును.
2. నామజపము చేయు సమయమున ఏ నామమును మనము ఉచ్చరించుచున్నామో, ఆ స్వామిని (భగవంతుని) జ్ఞాపకము ఉంచుకొనవలయును.)
3. నామమును గోప్యముగా జపించవలయును. నేను ఇంతజపము చేసితిని అని ఎవ్వరితోను చెప్పరాదు.
4. శ్రద్ధా విశ్వాసములతో నామమును జపించవలయును.
5. ప్రేమవిహ్వలుడై నామమును జపించవలయును.
6. నామజపమును నిష్కామభావముతో చేయువలయును.

వీటిలో ఒక్కొక్క భావము మిగుల విలువైనది. శ్రద్ధాభక్తులు, ప్రేమ, నిష్కామభావము అనువాటిలో ఏ ఒక్క భావమును అవలంబించినను దానివలన మనము సంసారసాగరము నుండి ఉద్ధరింపబడుదుము.

భగవంతుని ధ్యానించునపుడు మనము ఈ అరువిషయములను ఏమాత్రము విస్మరింపరాదు.

1. భగవంతునినామ జపము
2. సంసారమునందు వైరాగ్యము.
3. భగవంతుని గుణములను, ప్రభావమును, లీలలను స్మరించుట.

4. అందరిలోను ఉన్న (సర్వాంతర్యామియైన) భగవంతుని, తత్త్వరహస్యమును తెలిసికొనుట.
5. నిరంతరము ఆ ధ్యాసను కలిగియుండుట (ఎడతెగకుండా ఉండుట)
6. నిష్కామభావము.

ఈ విధముగా ధ్యానము చేయవలయును. అట్టిధ్యానము ఒక్క క్షణమైనను చాలును. తపస్సు చేయుట, తీర్థములను దర్శించుట, వ్రతములను ఆచరించుట, దానములను, యజ్ఞములను చేయుట - ఇవేవియును పైన చెప్పిన ధ్యానమునకు సాటిరావు.

ఈ విధముగా ప్రతివ్యక్తియును (ప్రతిసాధకుడును) తన సమయమును విలువైనదిగా చేసికొనవలయును.

గీతను ఈ విధముగా పఠించవలయును. ఒక మానవుడు గీతయొక్క పదునెనిమిది అధ్యాయముల యందలి మూల శ్లోకములను పఠించును. రెండవవాడు కేవలము ఒక అధ్యాయమునే అర్థమునెఱిగి భావమును తెలుసుకొని పఠించును. ఐతే మొదటివానికంటె ఒక అధ్యాయమును అర్థసహితముగా పఠించువాడు శ్రేష్ఠుడగును. అర్థమును, భావమును తెలిసికొని దానిని హృదయమందు ధారణచేసి తన కార్యముల యందు ఆచరించువాడు అందరికంటెను ఉత్తముడు. రామాయణాదులను పఠించుట యందు కూడ మనము ఈ పద్ధతినే పాటింపవలయును. దైవసన్నిధిలో ప్రత్యక్షముగా చేయుచున్నామా అనునట్లు మానసికముగా పరమాత్ముని పూజింపవలయును. భగవంతుని ధ్యానించి, పూజించవలయును. నైవేద్యమును సమర్పింపవలయును. హారతి నియ్యవలెను. పిమ్మట స్తుతించి ప్రార్థించవలయును. ఇదంతయు భావుకతచే మంత్రముల అర్థమును తెలిసికొని, శ్రద్ధాభక్తులతో, నిష్కామభావముతో భక్తితత్పరుడై చేయవలయును. చిత్రపటాదుల సహాయముతో ధ్యానము చేయునప్పుడు ఆయాచిత్ర పటములను గాక, విగ్రహములను గాక సాక్షాత్తు భగవంతునే ధ్యానించవలయును. ఈ ధ్యానము, పూజకూడా మిగుల విలువైనది. ఇట్లు పూజచేయు సమయమున మనస్సు ఇంకొకచోటికి పోవుటకు అవకాశమేలేదు.

ఎందుకనగా మానసిక పూజయందు భగవంతునిస్వరూపము కూడ మానసికముగనే ఉండును. మనము ఏ శరీరముతో భగవంతుని పూజించెదమో అది కూడ మానసికమే అగును. పూజకు కావలసిన సామాగ్రి కూడ మానసికమే అగును. మనము చేయు క్రియ కూడ మానసికమే. ఈ విధముగు పూజ చేయునపుడు మనస్సు ఇటు నటు పోవుటకు ఆస్కారమే ఉండదు.

'భావసహితముగ శ్రద్ధాభక్తులతో, నిష్కామభావముతో పరమాత్మని స్తుతించవలయును. ప్రార్థించవలయును. ఇంతకుముందు భగవత్ప్రాప్తి ఎందరికో కలిగెను, ఇప్పుడును కలుగుచున్నది. అట్లే నాకు కూడ భగవత్సాక్షాత్కారము (భగవదనుగ్రహము) లభించును' అని ఆ ప్రభువు విషయమున నమ్మకముండవలయును. ఇట్లు భగవంతుని ఉనికిని విశ్వసించి, ఆ స్వామి సులభముగా లభించునను నమ్మకముతో ఉండవలయును.

వివేకముతో కూడిన వైరాగ్యముండవలయును. వైరాగ్యపూర్వకమైన ఉపరతి, ప్రశాంతత ఏర్పడవలయును. శీఘ్రముగ మనస్సు ప్రాపంచిక విషయములకు దూరము కావలయును. అప్పుడు మనస్సు అప్రయత్నముగ పరమాత్మని యందు లగ్నమగును. మనకు శ్రద్ధయున్నచోట మనచిత్తవృత్తులు తమంతటతాము లగ్నమగును. కనుక భగవంతుని ఎడల భక్తిశ్రద్ధలు పెరుగవలయును. ప్రేమకు ప్రధానకారణము శ్రద్ధ, శ్రద్ధకు ముఖ్యకారణము అంతఃకరణముయొక్క పరిశుద్ధత.

గీతయందు పరమేశ్వరుడిట్లు పలికెను.

సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత ।
శ్రద్ధామయోఽయం పురుషో యో యచ్ఛ్రద్ధః స ఏవ సః ॥

(గీత. 17/3)

"ఓ అర్జునా! మనుష్యులందరి శ్రద్ధయు వారి అంతఃకరణరీతులకు తగినట్లు ఉండును. ప్రతివ్యక్తికిని ఏదో ఒక శ్రద్ధఉండనే ఉండును. అతని జీవన విధానమంతయును అతని శ్రద్ధకు అనుగుణముగా కొనసాగుచుండును. దానినిబట్టి అతడెట్టి శ్రద్ధ కలిగియున్నదియు తెలిసికొనవచ్చును".

శ్రద్ధకూడ సాధారణమైనది కాకుండ అతిశయమై పరమశ్రద్ధ కావలయును. ప్రత్యక్షమునకంటె కూడ శ్రేష్ఠమైన దానిని పరమశ్రద్ధ అందురు. ఏ విషయము గూడ ప్రత్యక్షముగా కనిపించదు. కాని ఆ వస్తువు ప్రత్యక్షముగా కనిపించుట కంటె కూడ ఎక్కువ స్పష్టముగా గోచరింపవలెను. శ్రద్ధకు నిలయమైన వాని (ఆ దైవముయొక్క) మాటలలో అట్టి దృఢవిశ్వాసముండవలయును. మహారాజగు ద్రుపదునకును, ఆయన ధర్మపత్నికిని పరమశివుని మాటలయందు అట్టి శ్రద్ధయే యుండెను. శిఖండి మొదట బాలిక రూపమున జన్మించి, పిమ్మట బాలకుడగునని పరమశివుడు ద్రుపదునితో పలికెను. ద్రుపదునకు బాలిక జన్మించెను. కాని ఆతడామెను బాలకుడుగానే పరిగణించెను. దశార్ణదేశమునకు రాజగు హిరణ్యవర్మయొక్క కుమార్తెతో ఆమెకు వివాహము జరిగెను. బాలిక ప్రత్యక్షముగా నున్నప్పుడు కూడ ఆమెను బాలకుడనియే మహారాజు అంగీకరించెను. భగవంతుని వచనములయందును, గీతావాక్యములయందును అట్టి విశ్వాసమే ఉండవలెను.

జ్ఞానము, వైరాగ్యము, ఏకాంతవాసము, నిష్కామభావము, నామజపము, శ్రద్ధ, ప్రేమ-ఇవన్నియు మిగుల విలువైనవి. వీటి కలయికచేత సర్వేశ్వరుని ధ్యానము, అప్రయత్నముగనే కొనసాగుచుండును. ఇవన్నియు ధ్యానమునందు సహాయకము లగును.

నిష్కామకర్మచేత భగవంతుని నామజపముచేత, ధ్యానముచేత అంతః కరణము పరిశుద్ధమగును. అంతఃకరణ శుద్ధివలన సర్వేశ్వరునియందు భక్తిశ్రద్ధలు కలుగును. శ్రద్ధవలన ప్రేమ ఉత్పన్నమగును. 'బిను పరతీతి కోఈ నహి ప్రీతీ' - ప్రేమవృద్ధియగుటవలన సాధకుడు భగవంతుని గుణములను, ప్రభావమును, తత్త్వమును, రహస్యమును యథార్థముగా అవగతము చేసికొనును. భగవంతుని గుణములు, ప్రభావము, తత్త్వము, రహస్యము ఇవన్నియు మిక్కిలి విలువైనవి. భగవంతుని నామరూపములు, లీలలు, ధామము - వీటన్నిటియందుగల గుణములను, ప్రభావమును, తత్త్వమును, రహస్యమును దర్శించవలయును. గుణప్రభావములు తత్త్వరహస్యములు అర్థమైనచో హృదయమందలి భావము తనంతట తాను ఉన్నతశ్రేణికి చెందినది

కాగలదు. అప్పుడు సాధకుని జీవనరూపము మారిపోవును. అతని పరిస్థితి యందు విలక్షణమైన మార్పు కలుగును.

ఈ విషయములన్నియు వినగా, వినగా మనస్సునందు ఆనందము కలుగును. ప్రసన్నత లభించును. ప్రశాంతత ప్రాప్తించును. ఆనందానుభూతి కలుగును. భగవంతుడు ప్రాప్తించునన్న ఆశ మొలకెత్తును. దీనివలన కూడ సాధకుని స్థితి మిక్కిలి శీఘ్రముగా మార్పుచెందగలదు. నిమిషములలో భగవత్ప్రాప్తియు కలుగగలదు. చిత్తవృత్తి మారిపోవగా హృదయవికాసము కలుగును. వాణి గద్గదికమగును. కంఠము పెగలకుండును. శరీరమందు రోమాంచము కలుగసాగును. నేత్రములనుండి ఆనందాశ్రువులు స్రవించుచుండును. నాసిక నుండి కూడ జలము ప్రవహించుచుండును. అతని మనస్సు, బుద్ధి, ఇంద్రియములు అన్నిటియందు ఆనందముయొక్క ప్రవాహము వెల్లివిరియు చుండును.

అట్టి అవస్థ కలుగకపోయినచో సర్వేశ్వరుని వియోగమునకు దుఃఖము కలుగవలయును. ఆ ప్రభువులేని జీవితము వ్యర్థమని దుఃఖముతో అనుభవము కావలయును. ప్రభువగు శ్రీరాముని విరహమున భరతునకు కలిగిన స్థితియే విరహవ్యాకులుడగు సాధకునకు కలుగవలయును. భరతుని మనోదశను వర్ణించుచు తులసీదాసు ఇట్లు చెప్పెను.

"భరతుని మనస్సు శ్రీరాముని విరహసముద్రమున మునిగిపోవుచుండగా రక్షించుటకు వచ్చిన ఓడవలె హనుమంతుడు బ్రాహ్మణవేషముతో వచ్చెను".

(రా.మా. ఉ.కాం. దో. 1 క)

దీనిని సాధించుటకు మనము సద్గుణములను, సదాచారములను, పరమేశ్వరభక్తిని, జ్ఞానవైరాగ్యములను అమృతతుల్యములుగ భావించ వలయును. అన్నివేళల వీటిని అనుసరించవలయును. వీటికి విపరీతములైన దుర్గుణములను, దురాచారములను, దుర్వ్యసనములను, సోమరితనమును, ప్రమాదమును (భ్రమను), నిద్రను, భోగానుభవములను సాధనయందు గొప్ప విఘ్నములుగా తలంచవలయును. వీటి స్వరూపమునే ఎల్లవేళల పరిత్యజించ వలయును. వీటికి ఒక్కక్షణము కూడ ఆశ్రయమియ్యరాదు.

భగవంతుని కలియుటలో ఏ ఒక్కక్షణము ఆలస్యమైనను అది ఒక యుగముగ అనిపించవలయును. భరతుడు రామచంద్ర ప్రభువును కలియుటకు చిత్రకూటమునకు వెళ్లుచుండెను. ఆ మహాత్ముడచటికి చేరుటలో జరిగిన ఆలస్యమును అతడు సహించలేకుండెను. అట్లే పరమాత్ముని కలియుటలో జరుగు ఆలస్యము మనకు తట్టుకొనలేనిది కావలయును. నీటినుండి విడిపోయి చేప గిలగిలలాడుచుండును. అట్టి తపనయే భగవంతుని విరహములో మనకు కలిగినచో అప్పుడాస్వామి లభించుటలో ఆలస్యమేమియు ఉండదు. మనలో ఏకీభావస్థితి కలుగవలయును. చాతకపక్షి ఒకే నిష్ఠకలిగియుండును. ఆకాశము నుండి పడుచున్న నీటిబిందువునే అది గ్రహించును. భూమిమీద పడిన జలము గంగాజలమైనను అది దానిని త్రాగదు. అటులనే ఒక్కపరమాత్మతప్ప ఏ వస్తువుకూడ మనకు పనికిరానిది కావలయును. చాతకపక్షివలె భగవంతుని ధ్యానమునందు మనకు ఏకాగ్రత ఉండవలయును. చకోరపక్షి పూర్ణిమనాడు చంద్రుడుదయించినప్పటి నుండి అస్తమించువరకు ప్రాణములను కూడ లెక్కచెయ్యకుండ ఆయనవైపే చూచుచుండును. ఆయననే రెప్పవాల్చక చూచుచుండును. అమృతతుల్యమగు స్వరూప మాధుర్యమును గ్రోలుచుండును అట్లే భగవంతుని ధ్యానించునపుడు ఆ స్వామి రూపమాధుర్యమునందలి సుధారసమును తనివిదీరా పానము చేయుచుండవలెను.

పరమాత్ముడగు శ్రీకృష్ణుని యొక్క విరహముతో రుక్మిణివలె మనము కూడ వ్యాకులత చెందవలయును. 'భగవంతుడు ప్రత్యక్షము కానిచో మా ప్రాణములు నిలువవు' అని ప్రతివ్యక్తియు గట్టి నిశ్చయమునకు రావలెను. అట్టివిడ బాధ్యతను వహించి పరమాత్ముడు తన భక్తుని దగ్గఱకు చేరును. భగవంతుడు లభించనిచో జీవించి ప్రయోజనమేమి? అనునంత నిష్ఠ సాధకునకు ఉండవలయును. ఐతే ఆత్మహత్య చేసుకొనవలెనని దీని అర్థముకాదు. ఆయన దర్శనము కలుగనిచో మనప్రాణములు పోవుటకు విలవిలలాడు స్థితి కలుగునని వికలతకు లోను కావలయును.

భరతుడిట్లు చెప్పెను.

"శ్రీరామచంద్రప్రభువు రావలసిన గడువు ముగిసిన పిమ్మటకూడ నేను ప్రాణములతో మిగిలియున్నచో నా వంటి అధముడెవ్వడును ఉండడు. ఉండబోడు". (రా.మా. ఉ.కాం. దో. 1-4)

అట్టి స్థితిని పొందుటకు మనస్సునకు ఏకాగ్రత కావలయును. ఎక్కడెక్కడికో వెళ్ళిన మనస్సును దారికి తీసికొని రావలయును. దానిని భగవంతునిలో లగ్నము చేయవలయును" పరమాత్ముడిట్లు నుడివెను.

**యతో యతో నిశ్చరతి మనశ్చంచలమస్థిరమ్ ।**
**తతస్తతో నియమ్యైతత్ ఆత్మన్యేవ వశం నయేత్ ॥**

(గీత. 6/26)

"సహజముగా నిలుకడలేని చంచలమైన మనస్సు ప్రాపంచిక విషయముల యందు విశృంఖలముగా పరిభ్రమించుచుండును. అట్టి మనస్సును ఆయా విషయములనుండి పదేపదే మఱల్చి, దానిని పరమాత్మయందే స్థిరముగా నిల్పవలెను."

లేక మనస్సు ఎటుపోవునో పరమాత్మను అచటనే దర్శించవలెను.

**యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి ।**
**తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి ॥**

(గీత. 6/30)

"సకల ప్రాణులయందును ఆత్మరూపముననున్న నన్ను (వాసుదేవుని) చూచుపురుషునకు, అట్లే ప్రాణులన్నింటిని నాయందు అంతర్గతములుగా నున్నట్లు చూచువానికి నేను అదృశ్యుడను కాను. అతడును నాకు అదృశ్యుడు కాడు".

ఎందుకనగా భగవంతుడు ఇట్లు పలికెను.

**సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః ।**
**యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్ ॥**

"నేను సకలభూతముల (ప్రాణుల)యందును సమభావముతో వ్యాపించి

యుందును. నాకు అప్రియుడు గాని ప్రియుడు గాని ఎవ్వడును లేడు. కాని నన్ను భక్తితో భజించువారు నాయందేయుందురు. నేనును వారియందు ప్రత్యక్షముగా ఉందును.

"అర్థమును గోరువారు, ఆర్తులు, జిజ్ఞాసువులు, జ్ఞానులు అని నాలుగు విధములైన భక్తులుందురు. వీరిలో నిష్కాముడైన జ్ఞాని శ్రేష్టుడు. భగవంతుడిట్లు పలికెను".

**తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే ।**
**ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమ్ అహం స చ మమ ప్రియః ॥**

(గీత. 7/17)

"ఈ చతుర్విధభక్తులలో నిరంతరము నాయందే ఏకీభావస్థితుడై, అనన్య భక్తియుతుడైన జ్ఞాని అత్యుత్తముడు. ఏలనన వాస్తవముగ నన్ను (నాతత్త్వమును) తెలిసికొనిన జ్ఞానికి నేను మిక్కిలి ఇష్టుడను. అతడును నాకు మిక్కిలి ఇష్టుడు."

**ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్ ।**
**ఆస్థితః స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్ ॥**

(గీత. 7/18)

"ఈ చతుర్విధభక్తులందఱును ఉదారులే. (అనగా భగవంతునియందు విశ్వాసమునుంచి, ఎల్లప్పుడును అతనినే సేవించుచు ఉండువారు.)కాని జ్ఞానియైన వాడు నా స్వరూపమే. ఇది నా అభిప్రాయము. ఏలనన అట్టి భక్తుడు తనమనస్సును బుద్ధిని నాయందే స్థిరముగా ఉంచి నన్నే పరమప్రాప్యునిగా భావించును. ఈవిధముగా అతడు నాయందే స్థితుడు."

ఈ విధముగా పైన చెప్పిన నలుగురు భక్తులయందును భగవంతుడు జ్ఞానిని విశేషముగా ప్రశంసించెను. ఏకనిష్ఠగల జ్ఞానిని శ్రేష్ఠుడని, తనకు అత్యంత ప్రియమైన వాడని పలికెను. ఎందుకనగా భగవంతుడిట్లు వివరించెను.

**యే యథా మాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహమ్ ।** (గీత. 4/11)

"పార్థా! భక్తులు నన్ను సేవించిన రీతికి అనుగుణముగ నేను వారిని అనుగ్రహింతును".

అందువలన భక్తుడు తన్మయుడై భగవంతుని భజింపవలెను.

సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వమాస్థితః ।
సర్వథా వర్తమానోఽపి స యోగీ మయి వర్తతే ॥

(గీత. 6/31)

"భగవంతునియందు ఏకీభావస్థితుడైనపురుషుడు సర్వభూతముల యందును ఆత్మరూపముననున్న సచ్చిదానందఘనవాసుదేవుడనైయున్న నన్ను భజించును. అట్టి యోగి సర్వథాసర్వవ్యవహారములయందు ప్రవర్తించుచున్ననునాయందే ప్రవర్తించుచుండును." "ఎందుకనగా అతనిదృష్టిలో నేను తప్ప ఇతర వస్తువేదియు లేనేలేదు. ప్రజలదృష్టిలో అతడు ప్రపంచమున నివసించుచు అన్నిపనులను చేయును. కాని నిజమునకు అతడు ప్రపంచములో స్థితుడై లేడు. నా యందే స్థితుడై యున్నాడు".

ఈ విషయముల నన్నిటిని తెలిసికొని జ్ఞానులు, మహాత్ములకువలె తమ స్థితిని సిద్ధము చేసికొనవలయును. ఉన్నతశ్రేణికి చెందిన సాధకుడు జ్ఞానముతో కూడిన భక్తుడు. అతడు నిరంతరము భగవంతుని భజించుచుండును. కనుక అట్టివానికి పరమాత్ముడు సులభుడగును. కృష్ణపరమాత్మ ఇట్లు చెప్పెను.

అనన్యచేతాః సతతం యో మాం స్మరతి నిత్యశః ।
తస్యాహం సులభః పార్థ నిత్యయుక్తస్య యోగినః ॥

(గీత. 8/14)

"పార్థా! నిత్యము నిరంతరము అనన్యభావముతో చిత్తమును నాయందే నిలిపి, పురుషోత్తముడనైన నన్నే స్మరించుచు, సంతతము మత్పరాయణుడైన యోగికి నేను సులభుడను. అనగా అతనికి సహజముగనే నేను లభింతును."

ఇందువలన భగవంతుడిట్లు పలికెను.

అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే ।
ఇతి మత్వా భజంతే మాం బుధా భావసమన్వితాః ॥

(గీత. 10/8)

"వాసుదేవుడనైన నేనే ఈసమస్తజగత్తుయొక్క ఉత్పత్తికి మూలకారణము. నావలననే ఈ జగత్తంతయు నడుచుచున్నది. ఈ విషయమును బాగుగా ఎఱింగిన జ్ఞానులైన భక్తులు భక్తిశ్రద్ధలతో నిరంతరము నన్నే సేవింతురు."

అట్టివారు ఏవిధముగా భజించెదరు? దీనికి సమాధానమును భగవంతుని మాటలలోనే వినుడు.

మచ్చిత్తా మద్గతప్రాణా బోధయంతః పరస్పరమ్ ।
కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ ॥

(గీత. 10/9)

"నా భక్తులు నాయందే తమ మనస్సులను లగ్నమొనర్తురు. తమ ప్రాణములను, తమ కర్మలన్నింటిని, తమ సర్వస్వమును నాకే అంకితమొనర్తురు. వారు పరస్పర చర్చలద్వారా నా మహత్త్వమును గూర్చి ఒకరికొకరు తెలుపుకొనుచు, కథలు కథలుగా చెప్పికొనుచు, నిరంతరము సంతుష్టులగుచుందురు. మఱియు వారు సంతతము నాయందే రమించుచుందురు." ఈ విధముగా ఆ భక్తులు నన్ను నిత్యము, నిరంతరము ప్రేమతో భజించుచుందురు. నా కృపచే పొందుదురు.

తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్ ।
దదామి బుద్ధియోగం తం యేన మాముపయాంతి తే ॥

(గీత. 10/10)

"అట్లు నిరంతరము ధ్యానాదులద్వారా నాయందే లగ్నమనస్కులై భక్తిశ్రద్ధలతో నన్నే భజించువారికి నేను బుద్ధియోగమును అనగా తత్త్వజ్ఞానరూప యోగమును ప్రసాదించెదను. దానిద్వారా వారు నన్నే పొందుదురు."

తేషామహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్ ।
భవామి నచిరాత్ పార్థ మయ్యావేశితచేతసామ్ ॥

(గీత. 12/7)

"ఓ అర్జునా! నాయందేలగ్నమనస్కులైన అట్టి పరమభక్తులను నేను శీఘ్రముగనే మృత్యురూపసంసారసాగరమునుండి ఉద్ధరించెదను. ఇందులో ఆలస్యమేమియు ఉండదు".

అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥

(గీత. 9/22)

"పరమేశ్వరుడనైన నన్నే నిరంతరము అనన్య భక్తితో చింతనచేయుచు, నిష్కామభావముతోసేవించువారియోగక్షేమములనునేనే వహించుచుందును"

అప్రాప్త వస్తుప్రాప్తిని "యోగము" అని అందురు. ప్రాప్తించిన వస్తురక్షణమును "క్షేమము" అని అందురు. అనగా వారు సాధన చేసి ఉన్నదానిని రక్షించెదను. నేటివరకు వారికి లభించని పరమపదమును (దానికొఱకు భగవంతుడు అభయమిచ్చుచున్నాడు) వారికి ప్రాప్తింపచేసెదను.

భగవంతుని ఈ వచనములను ధ్యానమందుంచుకొని మనము దానికి తగినట్లు రూపొందవలయును. అనన్యభక్తిచేత మనుష్యుడు కోరినదానినే పొందగలడు. పరమాత్ముడిట్లుచెప్పెను.

భక్త్యా త్వనన్యయా శక్య అహమేవంవిధోఽర్జున ।
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప ॥
మత్కర్మకృన్మత్పరమో మద్భక్తస్సంగవర్జితః ।
నిర్వైరస్సర్వభూతేషు యస్స మామేతి పాండవ ॥

(గీత. 11/54, 55)

"కాని ఓ పరంతపా! అర్జునా! ఇట్టి నా చతుర్భుజరూపమును ప్రత్యక్షముగా చూచుటకును, తత్త్వజ్ఞానమును పొందుటకును, అందు ఏకీభావస్థితినందుటకును కేవలము అనన్యభక్తిద్వారా మాత్రమే సాధ్యమగును. అర్జునా! కర్తవ్యకర్మలను అన్నింటినినాకేఅర్పించువాడును, మత్పరాయణుడును, నాయందు భక్తిశ్రద్ధలుగలవాడును, ప్రాపంచిక విషయముల యందు ఆసక్తిలేనివాడును, ఏ ప్రాణియందును ఏమాత్రము వైరభావములేనివాడును ఐన అనన్య (పరమ) భక్తుడు మాత్రమే నన్ను పొందగలడు."

దీనిపేరే ఏకనిష్ఠభక్తి, అవ్యభిచారిణి భక్తి, అనన్యశరణము, అనన్యప్రేమ, అనన్యభక్తి అని అందురు.

ఈ విషయములనన్నింటిని పరమాత్ముడే చెప్పెను. వీటికి అనుగుణముగ జీవితమును మలచుకొనవలయును. జీవితమును ఇట్లు రూపొందించుకొని, తదనుగుణముగ ప్రపంచమునందు జీవించువారి జీవితము ధన్యము. ప్రాపంచిక పదార్థములన్నియు ప్రజలదృష్టిలో ప్రాపంచికములే. కాని సాధకుని దృష్టిలో అవన్నియు భగవంతునివే, నేను భగవంతునివాడను, పరమాత్ముడు నావాడు. నేనేమి చేసినను ఆ ప్రభువుకొఱకే అని అర్థము చేసికొనవలయును. సకలము భగవంతుని స్వరూపమనియే తలంచవలయును. గీతయందు కృష్ణపరమాత్మ ఇట్లు నుడివెను.

**బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే ।**
**వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః ॥**

(గీత. 7/19)

"అనేకజన్మలపిదప జ్ఞానియైనవాడు(భగవత్తత్త్వమును ఎఱిగినవాడు) సర్వమూ వాసుదేవమయమే యని భావించి, నన్ను శరణుపొందును. అట్టి మహాత్ముడు లభించుట అరుదు."

అందువలన అందరిలో భగవంతుని దర్శింపవలయును. అందరిని పరమాత్మ స్వరూపులుగా భావించుచుండవలయును. ఆనందమున ముగ్ధులగుచుండవలయును. దీనివలన ఈ స్థితి నిమ్నస్థాయికి చెందినదని ఎందుకు భావించవలయును?

ప్రపంచమువలన తనకు ప్రయోజనమేమిటి? ఏమైనను కావచ్చును. తానైతే 'సమస్తము భగవంతునిదని నేను భగవంతుని వాడనని అంతయు ఆ స్వామియందే ఉన్నదని తాను తలంచవలయును. చేయు పనులన్నియు భగవంతుని ప్రేరణచేత ఆ ప్రభువుయొక్క ఆదేశానుసారము జరుగుచున్నవని భావించవలయును. నేను ఆయన కొఱకే ఇదంతయు చేయుచున్నాను, ఆ ప్రభువు చేయించుదానినే చేయుచున్నాను' అని తలపోయవలెను. ఈ భావము లన్నియు భగవంతుని దర్శించుటలో సహాయపడును. ఇట్లు అర్థము చేసుకొని అన్నివేళల, అన్నిచోట్ల భగవత్స్వరూపమునే అనుభవించవలయును. ఆ ప్రభువు నెప్పుడును విస్మరింపరాదు.

❖ ❖ ❖

## అనుబంధము

# 1. ధర్మము

(1) 'ధర్మ' శబ్దము "ధృ" ధాతువు నుండి ఏర్పడుతుంది. దానికి అర్థము సమస్త బ్రహ్మాండమును ధరించునదే ధర్మము -

శ్లో॥ ధారణాత్ ధర్మమిత్యాహుః ధర్మేణ విధృతాః ప్రజాః ।
యఃస్యాత్ ధారణసంయుక్తః స ధర్మ ఇతి నిశ్చయః ॥

'కణాదమహర్షి' ధర్మలక్షణం ఇలా అంటారు -

"యతోభ్యుదయ నిఃశ్రేయసా సిద్ధిః సధర్మః" (1-2)

"దేనివలన ఈ లోకమున అభ్యుదయము మరియు పరమకళ్యాణ రూపమగు మోక్షము ప్రాప్తించునో అదే ధర్మము".

(2) వేదస్మృతి సదాచారము మరియు తన రుచిననుసరించి పరిణామమున హితము చేయునది - ఇది నాల్గువిధాలుగా ధర్మానికి లక్షణము. మనువు కూడ ఇలాగే అన్నారు -

శ్లో॥ వేదః స్మృతిః సదాచారః స్వస్యచ ప్రియమాత్మనః ।
ఏత చ్చతుర్విధం ప్రాహుః సాక్షాద్ధర్మస్యలక్షణమ్ ॥ (2-12)

"ధరించడానికి యోగ్యత కల్గినదే ధర్మము. సమస్త విశ్వమును ధరించునది, సర్వశక్తివంతమైనది. మిక్కిలి సమర్థవంతమైన భగవంతుని న్యాయము మరియు చట్టము, అన్యాయాన్ని లేక చట్టాన్ని తెలుసుకొని, దానిని అనుసరించి ప్రవర్తించడమే ధర్మాన్ని ఆచరించడమౌతుంది".

(3) ఈశ్వరుని శాసనముననుసరించి ప్రవర్తించేవాడు సంసారమునందు అన్నివిధాల సుఖిస్తాడు. చివరికి ముక్తినికూడా పొందుతాడు. కాని దీనిని వ్యతిరేకించెడివాడు, ఎదురుదెబ్బతిని పడిపోతాడు, దుఃఖిస్తాడు, చివరికి అధోగతి పాలవుతాడు.

(4) ఈశ్వరుడు అనాది అయినట్లుగానే ఈ ఈశ్వరీయ న్యాయంకూడా అనాదియైయున్నది. కావున దీనిని సనాతనమైనదని అంటారు. ప్రాణిమాత్రునికి హితము చేయడమే మానవుని కర్తవ్యము. అందుకే ఈ ఈశ్వరీయ చట్టము లేక ధర్మము.

(5) పరమేశ్వరుని మరియు పరమేశ్వరుని చట్టప్రభావాన్ని తెలుసుకొన్నవాడు, దానికి వ్యతిరేకంగా ఎన్నటికి ఆచరించడు. అతను చేయు సమస్తకార్యములు సహజంగానే పరమేశ్వరుని చట్టానికి అనుకూలంగానే వుంటాయి. అతనిద్వారా ఏ చరాచర ప్రాణికి కూడా ఏ కాలంలోను ఏ స్థితిలోను ఏవిధంగాను అహితము జరగనే జరగదు.

(6) ధరించడానికి తగిన ధర్మము ఏమిటి?

ఈ లోకమున మరియు పరలోకమున కళ్యాణము చేయునటువంటి మహాపురుషుల ద్వారా ప్రసాదించబడిన విద్య.

(7) ఈ లోకమున మరియు పరలోకమున కళ్యాణము (మేలు) చేయునదే ధర్మమంటారు. లోక-పరలోకములు రెండింటికి అహితకరమైనది, మేలు చేయునదికాదు, కీడు చేయునదే అవుతుంది. పురస్కారము కాదు, గొప్ప కష్టమే అవుతుంది.

(8) ధైర్యము, క్షమ, మనోనిగ్రహము, చౌర్యము చేయకుండుట, బాహ్య-అభ్యంతరశుద్ధి, ఇంద్రియ సంయమము, సాత్త్వికబుద్ధి, అధ్యాత్మ విద్య, సత్యభాషణము, మరియు క్రోధము లేకుండుట, ఈ పది - ధర్మమునకు లక్షణములుగా చెప్పబడినవి.

(9) అహింసా, సత్యము, అస్తేయ, బ్రహ్మచర్య, అపరిగ్రహ, శౌచ, సంతోష, తప, స్వాధ్యాయము, ఈశ్వరభక్తి, జ్ఞాన, వైరాగ్య, మనోనిగ్రహము, ఇంద్రియ దమనము, తితిక్ష, శ్రద్ధ, క్షమ, వీరత్వము, దయ, తేజస్సు, సరళత, స్వార్థత్యాగము, అమానిత్వము, అదంభిత్వము, అపైశునత్వము, నిష్కపటత్వము, వినయము, ధృతి, సేవ, సత్సంగము, జపము, ధ్యానము, నిర్వైరత్వము, నిర్భయత్వము, సమత్వము, నిరహంకారత్వము, మైత్రి, దానము, కర్తవ్య పరాయణత మరియు శాంతి - ఈ నలుబది గుణములలోనుంచి ఏమతమున ఎన్ని ఎక్కువ గుణములు ఉండునో ఆ మతమే అన్నిటికన్న ముఖ్యమైనది మరియు శ్రేయస్కరమైనదిగా తెలుసుకొనదగినది.

(10) సద్గుణముల మరియు సదాచారముల పేరే ధర్మము.

(11) ఏ ధర్మమునకు లక్ష్యము చాలా గొప్పదో, నిత్యమైనదో, నిర్బాధమైనదో, ఆనందము కలుగచేయునదో, ఎందులో అందరికి అధికారము కలదో అదే అన్నిటికన్నా ఉత్తమమైన సార్వభౌమ ధర్మమని అనిపించుకోగలదు.

(12) పరమకళ్యాణమును ప్రాప్తింపచేయునదే సర్వోత్తమ ధర్మము. ఇలాంటి ధర్మము నాదృష్టిలో అది వైదిక సనాతన ధర్మమే అవుతుంది.

(13) హిందూ సనాతన ధర్మములో అతి స్వల్పకార్యము నుండి మహాత్కార్యములన్నిటికి ధర్మముతో సంబంధం ముడిపడివున్నది.

(14) హిందూ శబ్దానికి భావము -

హిందూస్థానమున (ఆర్యావర్తమున) జన్మించుట, మరియు హిందూస్థానములోని ఒకానొక ఆచార్యునిచేత నడిపించిన మతమును స్వీకరించుట.

(15) తనను హిందువుగా భావించెడి వాడే హిందువు అవుతాడు.

(16) ఒక్క హిందూధర్మమే అన్నివిధాల పరిపూర్ణమైన ధర్మము. మానవుని ఈ సంసారమునకు చెందిన తాపత్రయాగ్నుల నుండి విముక్తుని గావించి, అతనిని అనంత సుఖస్థితివరకు చేర్చి, అనుక్షణం ఆనందమయునిగా చేయుటయే దానియొక్క అంతిమలక్ష్యము.

(17) హిందూధర్మము యొక్క పవిత్ర సందేశమును స్వీకరించి పలుసమయములందు ఈ జగత్తుకు చెందిన దుఃఖ, దగ్ధ, అశాంతజీవులు పరమశాంతిని పొందినవి. మరియు నేటికి జగత్తుకు చెందిన గొప్పగొప్ప భావుక పురుషులు అత్యంత ఉత్సుకతతో ఈ సందేశమును స్వీకరించడానికి తహతహలాడుతున్నారు. ఏ ధర్మానికి ఇంతటి మహత్తు కలదో అది అనాది కాలమునుంచి ప్రచలితమైన పవిత్రమైన మరియు గంభీర ఆశయము కల్గిన ధర్మాన్ని పాటించుజాతి, వ్యామోహముచేత జగత్తులోని అన్య మతముల నాశ్రయించి ఈనాడు అజ్ఞాన సరితా ప్రవాహములో కొట్టుకు పోవాలనుకొంటున్నది. ఇది చాలా దుఃఖించవలసిన విషయము.

(18) ఏ మానవుడు ఏ వర్ణమున జన్మించునో, అతనికి లభించిన స్వాభావిక కర్మయే అతనికి స్వధర్మము. భారతవర్షమునకు చెందిన సువ్యవస్థిత వర్ణవ్యవస్థయే దీనికి పరమ ఆదర్శము. ఈ వర్ణవ్యవస్థను ఛిన్నాభిన్నం చేయడానికి ప్రయత్నించెడివారు పెద్దపొరపాటు చేస్తున్నారు. ఈ జగత్తులో భేదము అనునది ఎన్నటికి నశించదు. ఇలా ప్రయత్నించినందున వ్యవస్థవిధిగా తారుమారవుతుంది - ఇది మరీ దుఃఖాన్ని కలిగించెడి విషయము.

(19) ఈ సంఘము విరాడ్రూప భగవంతుని శరీరము. బ్రాహ్మణులు సంఘరూప శరీరానికి ముఖము లేక మస్తక స్థానీయులు. క్షత్రియులు బాహువులు, వైశ్యులు ఊరువులు (జంఘములు) మరియు శూద్రులు పాదములు.

(20) మస్తిష్కకార్యము బుద్ధిద్వారా శరీరాన్ని నడిపించడం, భుజములకార్యము భౌతిక ఆపదలనుండి రక్షించడం. ఊరువులపని సుస్థిరంగా వుంచడం. మరియు పాదములపని దానిని నడిపించడం. దానిపనులన్నిటిని చేయడం. శరీరమునకు పైన చెప్పబడిన అవయవముల ఉపయోగము ఏదైతే వున్నదో అదే సంఘం కోసం నాల్గువర్ణములకు చెందినదౌతుంది.

(21) జగత్తునకు జ్ఞానమును ప్రసాదించుట, పథ ప్రదర్శనము చేయుట, లేక హితమునకు వ్యవస్థ చేయుట, చట్టములను తయారుచేయుట బ్రాహ్మణుల కర్తవ్యము.

(22) అస్త్రశస్త్రములతో రాష్ట్రమును దురాక్రమణములనుండి మరియు దొంగలు, దోపిడీ దొంగలనుండి రక్షించుట, సముచిత న్యాయవ్యవస్థను కల్పించుట, దురాచారులను అణచివేయుట, బ్రాహ్మణులు నిర్దేశించిన మార్గముపైన ప్రజలను నడిపించుట క్షత్రియుల కర్తవ్యము.

(23) కృషి, వాణిజ్యము, గోరక్షణద్వారా సమాజమునందు సుఖసమృద్ధిని విస్తరింపచేయుట, రాష్ట్ర సంపదను పెంపొందించుట ద్రవ్యాన్నార్జించి దానిని లోకోపకారకార్యములందు వినియోగించుట మరియు ఈ విధంగా సమాజమును పోషించుట వైశ్యుల కర్తవ్యము.

(24) శిల్పము, కళలు, మరియు కుటీరపరిశ్రమలద్వారా సమాజముయొక్క విభిన్న అవసరములను పూర్తికావించుట, సేవచేయుట, మరియు సమాజమును సుఖంగా వుంచుట శూద్రుల కర్తవ్యము.

(25) ఎవరికోసం ఏ సమయమున ఏ కర్మ ఏవిధంగా చేయడం సమంజసమో అట్టి ఈ కర్మకౌశలము చేత హిందువు తన ఇహలోక జీవనమును సుఖమయంగా గడిపి తన కర్మలనన్నిటిని భగవంతునికి అర్పించి, చివరికి మానవజీవిత పరమలక్ష్యమగు పరమాత్మను పొందగలడని వర్ణాశ్రమ ధర్మము మనకు బోధిస్తున్నది.

(26) వర్ణాశ్రమ ధర్మమునకు వున్న దృఢత్వమే హిందూజాతిని కాపాడింది. వర్ణాశ్రమ ధర్మము లేకపోతే మరియు దానిపట్ల హిందూజాతికి వెనుకటి శతాబ్దాలలో జరిగిన దురాక్రమణలచేత విజేతల ప్రభావంచేత మన హిందూజాతి ఎప్పుడో నశించిపోయి వుండేది.

(27) ఈ దేశములో వర్ణాశ్రమ ధర్మము శ్రద్ధగా పాటించబడుతున్నంతవరకు దేశం స్వతంత్రంగా నుండెడిది, ఇక్కడ అన్నివిధాల సుఖసమృద్ధిగా వుండెడిది. వర్ణాశ్రమ ధర్మపాలనపట్ల హేయభావము కల్గినప్పటినుండి మనపరిస్థితి దిగజారిపోసాగింది.

(28) హిందువు జీవితం ధర్మబద్ధమైనది. అతని జన్మమరణములు, భోజనపానీయములు, నిద్రించుట, మేల్కొనుట, ఇచ్చిపుచ్చుకొనుట, ఉపార్జించుట, మరియు త్యజించుట, ఇవన్నీ ధర్మబద్ధంగానే కొనసాగాలి.

(29) పాశ్చాత్య సభ్యతను అనుకరించడం మనకు ఏవిధంగా హితకరంకాదు. ఇందువలన మన ధార్మికభావాలు పూర్తిగా నశిస్తాయి. మనము కేవలము భౌతిక ప్రగతి వెనుక పరుగిడి యదార్థలాభం నుండి వంచితులం కావాల్సివుంటుంది.

(30) తన వేష, భాషలను, భోజన-పానీయములను, మరియు ఆచార వ్యవహారములను త్యజించడంచేత ఆ జాతి పూర్తిగా నశిస్తుంది.

(31) పరదేశీయ మరియు పరధర్మీయుల సభ్యతను, భాషను, ఆచార వ్యవహారములను, రీతి-రివాజులను, దుస్తులను, మొదలగు వానిని అనుసరించడం వర్ణాశ్రమ ధర్మమును శిథిలపరచడంలో మిక్కిలి సహాయపడినది.

(32) సనాతన వైదిక వర్ణాశ్రమ ధర్మపరిరక్షణకు కారణభూతమైన బ్రాహ్మణత్వమును మరియు పరమధర్మరూపమగు సంస్కృత గ్రంథములను మరియు సంస్కృత భాషను రక్షించడం ప్రతి ఒక్క ధార్మికుని కర్తవ్యము.

(33) ధర్మగ్రంథములను మరియు సంస్కృత భాషను రక్షించడం చేతనే సనాతన ధర్మరక్షణ కొనసాగకలదు.

(34) సంస్కృతము అనాదిభాషయని, మరియు సర్వాంగపూర్ణమైనదని జ్ఞాపకం వుంచుకోవాలి. సంస్కృతంతో సమానమగు భాష మరొకటి లేనేలేదు.

(35) మన ప్రాచీన మహర్షులు, మునులద్వారా ఆచరింపబడిన ఆచారవ్యవహారములను, వేషభాషలను మరియు స్వభావ సభ్యతలను మనము విధిగా అనుసరించాలి. స్వధర్మాన్ని త్యజించడం ఎట్టి స్థితిలోను మంచిదికాదు.

(36) ధర్మమునకు అనుకూలంగా ప్రవర్తించడంలోనే మానవుని మానవత్వము, ఔన్నత్యము మరియు మిక్కిలి లాభము ఉంటుంది. ప్రతికూలంగా ప్రవర్తించడంచేత మానవత్వము నుండి పతితుడౌతాడు. అవనతిని పొందుతాడు. చివరకు మిక్కిలి హాని కల్గుతుంది.

(37) ప్రాణములు పోయినప్పటికినీ ధర్మమును త్యజించకుండా వుండటమే మానవుని కర్తవ్యం. కారణం ధర్మం నిమిత్తం మరణించువాడు ఉత్తమగతిని పొందుతాడు.

(38) గురుగోవింద సింగ్ కుమారులు ధర్మంకోసం తమ ప్రాణాలను త్యజించి సుస్థిరకీర్తిని, ఉత్తమగతిని పొందినారు.

(39) పరుల గుణయుక్త ఉత్తమధర్మంకన్నా, గుణరహితమైనప్పటికి స్వధర్మమే తనకు శ్రేష్ఠమయినది, మరియు ఆచరించదగినది. స్వధర్మమును అనుష్ఠించడంచేత మానవునకు పాపం అంటుకోదు. (గీత. 18-47)

(40) తన కళ్యాణము (శ్రేయస్సు) నిమిత్తం మానవమాత్రుడు నిత్యము, నిరంతరము ధర్మమును అనుసరించాలి.

(41) ధర్మమును అనుష్ఠించువానిని ధర్మము తప్పనిసరిగా రక్షించి తీరుతుంది.

(42) ధర్మము ఎవరిని వదలదు, ప్రజలే దానిని వదిలేస్తారు.

(43) ధర్మమును నశింపచేయువానిని లేక త్యజించువానిని ధర్మం కూడా నశింపచేస్తుంది. కాని ధర్మమును రక్షించువానిని ధర్మం కూడా రక్షిస్తుంది.

(44) ధర్మమే మానవునికి జీవనము, ప్రాణము. ఈ లోకమున, పరలోకమున కళ్యాణమును కలుగచేయునదికూడా ధర్మమే.

(45) పరలోకముకు కూడా ఒక్క ధర్మమే వెంటవస్తుంది. స్త్రీ, పుత్ర, బంధువులు మొదలగు వారెవ్వరూ కూడా అక్కడ సహకరించరు.

(46) ఘోర ఆపద వచ్చినప్పటికి, కామ, క్రోధ, లోభ, భయ, వ్యామోహములకు వశీభూతులై ధర్మమును ఎన్నటికి త్యజించకుండా వుండటమే మానవుల కర్తవ్యము.

(47) మానవులందరు తమ తమ స్వభావములను అనుసరించి కర్మలను ఆచరిస్తూ వుంటారు. ఇందుకు పట్టుదల వ్యర్థము. ప్రతి ఒక్క ఇంద్రియ భోగమునందు ఏ రాగద్వేషరూప శత్రువులు దాగివున్నవో పాపకర్మలను చేయుటకు ఏవి ప్రోత్సహించుచున్నవో వాటికి వశంకాకుండా మరియు ధర్మమును అనుష్ఠించుట యందు సుస్థిరంగా వుండటమే మానవుని కర్తవ్యము.

(48) ఒకవేళ ఏ మానవుడైనా ఒకానొక పరధర్మీయునిద్వారా ధర్మత్యాగ నిమిత్తము అణచివేయబడినచో అక్కడ ధర్మరక్షణకోసం తన ప్రాణాలను సైతం వదలవలసివస్తే వదిలేయాలి. కాని ధర్మమును మాత్రం వదలరాదు. ఇందులోనే మానవునికి కళ్యాణమున్నది.

(49) ధర్మమును అనుష్ఠించడంచేత గొప్ప ఆత్మికస్వారాజ్యము లభించగలదు. అలాంటప్పుడు ఈ సామాన్య స్వారాజ్య విషయం ఏమంత గొప్పది. అది మిక్కిలి సునాయాసంగానే లభించగలదు.

(50) అహింసా, సత్యము, ఆస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము, శౌచము, సంతోషము, తపము, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము మున్నగునవి శ్రుతి, స్మృతి ప్రతిపాదిత విధివాక్య ధర్మములు. ధర్మమును త్యజించి అన్యాయము చేయువాడు చివరికి నాశనమౌతాడు. కంసుడు, రావణుడు మొదలగువారు అన్యాయకారణంచేతనే నశించారు.

(51) ధర్మమార్గము మిక్కిలి సూక్ష్మమైనది. కాబట్టి మహాపురుషులు పయనించిన మార్గమే ధర్మమార్గము. అంటే అట్టి మహాపురుషుల మార్గమును అనుసరించడమే ధర్మము.

❖ ❖ ❖

# 2. బాలకులకు హితబోధ

(1) బాలకులు ఈ క్రింద వ్రాయబడిన 'ఆరు' విషయములను తమ జీవితంలో ప్రాణములతో సమానంగా భావించి వాటిని పాటించడానికి విశేషంగా ప్రయత్నించాలి. సదాచారము, సంయమము, బ్రహ్మచర్యపాలనము, విద్యాభ్యాసము, తల్లిదండ్రులు, ఆచార్యులు మొదలగు గురుజనులకు సేవ మరియు ఈశ్వరభక్తి అనునవి ఈ ఆరు విషయాలు.

(2) బాలకులు ప్రాతఃకాలమున సూర్యోదయమునకు పూర్వమే లేచి శౌచ-స్నానములు చేయాలి. తిరిగి నిత్యకర్మను పూర్తిగావించుకొని పెద్దలకు నమస్కరించాలి. తదుపరి శరీర ఆరోగ్యమునకు మరియు బలవృద్ధికి పశ్చిమోత్తాసనము, శీర్షాసనము, విపరీతకరణఆసనము మొదలగు ఆసనములను మరియు వ్యాయామమును చేయాలి. తరువాత పాలు త్రాగి విద్యను అభ్యసించాలి. ఆసన వ్యాయామములను గనుక సాయంత్రం చేయాలని వుంటే పాలు త్రాగకుండానే విద్యనభ్యసించాలి.

(3) నిద్రిస్తూ వుండగానే సూర్యోదయమైనచో ఆ పగటిపూటంతయు గాయత్రిని జపంచేస్తూ ఉపవాసం వుండాలి.

(4) నిత్యకర్మనందు భగవన్నామ జపంతోపాటు ధ్యానము కనీసం భగవద్గీతలోని ఒక్క అధ్యాయాన్నైనా పారాయణ చేయాలి.

శ్లో॥ నిత్యం స్నాత్వా శుచిః కుర్యాత్ దేవర్షి పితృతర్పణమ్ ।
దేవతాభ్యర్చనం చైవ సమిదాధాన మేవ చ ॥

"బ్రహ్మచారి నిత్యం స్నానమాచరించి పరిశుద్ధుడై దేవ-ఋషి- పితరులకు తర్పణము మరియు దేవతలకు పూజ మరియు అగ్నిహోత్రము విధిగా చేయవలెను".

(6) బ్రహ్మచారికి సూతకమంటూ ఎన్నటికి వుండనే వుండదు. కాని నిత్యకర్మ నాచరించడానికి ఎవరికి ఎట్టి అభ్యంతరము లేదు. జన్మ-మృత్యు సూతకమునందు సంధ్య, గాయత్రీజపము మున్నగు వైదికక్రియలను జలం లేకుండా మనసుతోటి మంత్రోచ్చారణపూర్వకంగా చేయాలి. సూర్యభగవానునికి మాత్రం జలంతో అర్ఘ్యం ఈయువలెను.

(7) బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్యులైనచో హోమము, సంధ్యావందనము, గాయత్రీజపము, స్వాధ్యాయము, దేవపూజనము మరియు తర్పణం కూడా చేయాలి.

(8) ఇందులోకూడా సంధ్యను మరియు గాయత్రీజపమునైతే విధిగా ఆచరించాలి. చేయనిపక్షములో ప్రాయశ్చిత్తానికి పాత్రుడు మరియు పతితుడౌతాడు.

(9) గాయత్రీ జపమును స్నానముచేసి పవిత్రత కలిగి చేయాలి. అటు, ఇటు తిరుగుతూ చేయరాదు.

(10) గాయత్రిని నిత్యం ఒక సహస్రం జపించినందున ఒకమాసంలో పాపమునుండి విముక్తుడౌతాడు. 3 సంవత్సరములు చేసినందున బ్రహ్మప్రాప్తి కల్గుతుందని మహర్షి మనువు వ్రాసినారు.

(11) భగవద్గీత, రామాయణము, మున్నగు ధార్మిక గ్రంథములను శ్రద్ధాభక్తి పూర్వకంగా మననం చేయడానికి కూడ కొంత సమయాన్ని వినియోగించాలి.

(12) బాల్యకాలమున విద్యనభ్యసించని బాలకుడు భావిజీవితములో సర్వదా పశ్చాత్తాప పడవలసివుంటుంది.

(13) బాలకులకు లౌకిక విద్యతోపాటు ధార్మిక విద్యను కూడ నేర్పవలసిన అవసరం ఎంతైనా వుంది. ధార్మిక విద్యలేని మానవుని జీవితం పశుతుల్యంగా చెప్పబడింది.

(14) అతిగా భుజించడం ఆరోగ్యమును, ఆయువును, పుణ్యమును మరియు స్వర్గమును నశింపచేస్తుంది. మరియు లోకనిందితము కూడా, కావున అతిగా భుజించరాదు.

(15) బాలకునకు వివాహము కానంతవరకు గురువు వద్దకాని లేక తల్లిదండ్రుల వద్దగాని ఎక్కడ వున్నప్పటికి బ్రహ్మచారిగానే వుండాలి.

(16) ప్రస్తుత కాలాన్ననుసరించి కనీసం 18 సంవత్సరముల వరకు బ్రహ్మచర్యాన్ని విధిగా పాటించాలి.

(17) సోడా, ఐస్, బిస్కట్స్, డాక్టర్ మందులు, హోటల్ భోజనము మున్నగునవి ఉచ్ఛిష్టములు మరియు మిక్కిలి అపవిత్రములు. కావున

వీటిని ధర్మమునకు విరుద్ధంగా భావించి త్యజించాలి. ఇట్టి భోజనమును భగవానుడు తామసమైనదిగా పేర్కొనెను.

(18) తరచుగా సోడావాటరు, ఐస్‌క్రీమ్, ఉచ్ఛిష్టములు. కేక్ మున్నగువానిలో గ్రుడ్లు, డాక్టర్ల ఔషధములలో మద్యమాంసముల కలయిక మరియు హోటలు భోజనమునందు మద్యమాంసాది సంపర్కమవడంచేత వీటినన్నిటిని మిక్కిలి అపవిత్రంగా భావించాలి.

(19) బ్రహ్మచారి వెల్లుల్లి, నీరుల్లి, మద్యమాంసములు, భంగు, పొగాకు, బీడి, సిగరెట్, గంజాయి మొదలగు ఘృణితమగు మరియు మత్తుపదార్థములను సేవించడం పనికిరాదు. వాటికి దూరంగా వుండాలి వాటిని ఎప్పుడు స్మరించనే స్మరించరాదు.

(20) అత్తరు, సుగంధిత తైలమును, పుష్పమాలను, కాటుకను, తలవెంట్రుకల శృంగారమును, నృత్యమును, గానమును, వాద్యయంత్రమును, స్త్రీలను దర్శించడం - భాషించడం - స్పర్శించడం మరియు సినిమా థియేటర్లు మున్నగు ఆటలు, తమాషాలను చూడటం - ఇవన్నీ అనర్థాలన్నింటికి మూలమని కామోద్దీపకములని మరియు వీర్యనాశకములని భావించి త్యజించాలి.

(21) అసత్యము, కపటము, మోసము ఛిద్రాన్వేషణము, జూదము, దెబ్బలాడుట, వివాదము, నింద, హింసా, దొంగతనము, వ్యభిచారము మున్నగువానిని మహాపాతకములుగా భావించి అన్నిటిని పూర్తిగా త్యజించాలి.

(22) ఆలస్య - ప్రమాదములకు దూరముగా వుండి తల్లిదండ్రులు మున్నగు గురుజనుల సేవను పరమధర్మముగా భావించాలి. వారిని పూజించడం, సేవించడం, ఆజ్ఞను పాటించడం తత్పరతతో చేయవలెను.

(23) కామ, క్రోధ, లోభ, మోహ, రాగ-ద్వేష, ఈర్ష్య, వైర అహంకార దంభ, దర్ప, అభిమాన అసూయ మున్నగు దుర్గుణములను పాపములన్నిటికి మరియు దుఃఖము లన్నిటికి మూలకారణములుగా తెలిసికొని హృదయమునుండి తొలగించడానికి విశేషంగా ప్రయత్నించాలి.

(24) దుర్గుణములను మరియు దురాచారములను త్యజించి మనస్సును మరియు ఇంద్రియములను విషయభోగములనుండి తొలగించి తన వశమునందు వుంచుకోవాలి.

(25) తల్లిదండ్రుల, ఆచార్యులసేవ, ఆజ్ఞాపాలనతో సమానమైనట్టి ధర్మము బాలకులకు వేరొకటి లేదు. వీరందరికి సేవ చేయడమే పరమధర్మము మిగిలినవన్నీ ఉపధర్మములు మాత్రమేనని మనువుగారు బోధించిరి.

(26) తనకన్న పెద్దవారినందర్నీ సేవించాలి, నమస్కరించాలి, వారిలో కూడా వేదశాస్త్రములను అభ్యసించిన బ్రాహ్మణుడైతే అందరికన్న అధికంగా సత్కరింపదగినవాడు.

(27) వైశ్య - ఋషి శ్రవణకుమారుడు, మర్యాదా పురుషోత్తముడగు శ్రీరామచంద్రుని మాదిరిగా మాతృ పితృ చరణములకు నిత్యము నమస్కరించాలి. మరియు శ్రద్ధా-భక్తి, వినయపూర్వకంగా వారి ఆజ్ఞను పాటిస్తూ తత్పరతతో వారిని సేవించాలి.

(28) మాతృ-పితృ సేవాపరాయణులైన పురుషులకు ఆయుర్వృద్ధి, విద్యావృద్ధి, బలవృద్ధి కలగడంతో పాటు ఉత్తమగతి, ఇహపరలోకములందు చిరకాలము వరకు వుండునటువంటి కీర్తికూడా కల్గుతుంది.

(29) తల్లిదండ్రుల, గురుజనుల, తోటివిద్యార్థుల విషయము నందే కాకుండా అందరి తోటి సదా సర్వదా హితకరమగు మరియు వినయముతో కూడిన వచనములనే పలకాలి. మనసు, వాక్కు, తనువుతో అన్నివిధాల పరులకు హితము కల్గునట్లుగానే వ్యవహరించాలి.

(30) జగత్తునందు అన్నిటికన్న మించినది ప్రేమ. ప్రేమ సాక్షాత్ పరమాత్ముని స్వరూపము. కావున ప్రేమ వున్నచోటనే సుఖమునకు మరియు శాంతికి సామ్రాజ్యము.

(31) ఎవరైనా తనను నిందించినప్పటికి లేక తిట్టినప్పటికి తాను దానికి బదులుగా శాంతిని కల్గించు సత్యము, ప్రియము, హితకరమగు కోమల వచనములనే పలకాలి.

(32) ఎంతటి ఆపదవచ్చినప్పటికి ధైర్యముతో మరియు నిర్భయంతో అన్నిటిని సహించాలి. ఎందుకంటే, నిర్భయంగా సహించడంచేత ఆత్మబలానికి వృద్ధి చేకూరుతుంది. ఇలా భావించి ఆపదయందుకూడా ధైర్యమును మరియు ధర్మమును విడనాడరాదు.

(33) సహనశక్తిచేత ధీరత్వము, వీరత్వము, గంభీరము, మరియు ఆత్మబలమునకు వృద్ధికూడ కల్గుతుంది. క్షమాబుద్ధితో విధిగా సహనశక్తి కల్గివుండాలి. పిరికితనము, లేక భయముతోటి కాదు.

(34) ప్రతి ఒక్క బాలకుడు తన బలమును వృద్ధి చెందునట్లుగా ప్రయత్నించాలి. ఇందుకు ఐదు విషయములు సహకరిస్తాయి :

(క) బ్రహ్మచర్యపాలనము - దీనిచేత శరీరముతోపాటు ఆత్మబలము కూడ వృద్ధిచెందుతుంది.

(ఖ) నిత్యం నియమంగా వ్యాయామం చేయడం. దీనిచేత శరీరమునకు పౌరుషము మరియు స్ఫూర్తి కలుగుతుంది.

(గ) సాయం ప్రాతఃకాలములందు విధిగా పాలుత్రాగటం, పాలు సాక్షాత్ అమృతం. బలమును మరియు బుద్ధిని వృద్ధి చేయడానికి ఇంతకు మించిన శ్రేష్ఠమైన పదార్థము మరొకటి లేదు. వ్యాయామ అనంతరము పాలు త్రాగినందున విశేషలాభం కలుగుతుంది. పాలను త్రాగటం చేత మనసు సాత్వికమౌతుంది.

(ఘ) స్వాస్థ్య విషయములందు విశేషదృష్టి కల్గివుండటం. రోగరహితులుగా వుండడానికి తన ఇంటిని, శరీరమందలి వస్త్రములను శుభ్రంగా వుంచుకోవాలి. ప్రతిఒక్క బాలకుడు తన బుద్ధిని వికసింపచేసుకోవాలి. విద్యచేత మరియు సద్గ్రంథముల అభ్యాసము చేత బుద్ధి పెరుగుతుంది. వృద్ధుల మరియు సజ్జనుల సాంగత్యము, సేవచేయడం మరియు నమస్కారము చేయడంచేత విచారములు పవిత్రమౌతాయి. ఉత్తమగుణముల సంగ్రహము ఉత్తమ ప్రవర్తన, శౌచాచారములను పాటించడంచేత కూడ బుద్ధి పవిత్రము మరియు చురుకుగా తయారవుతుంది.

(ఙ) బాలకులందరు తమ హృదయమునందు భగవద్భక్తి కల్గివుండాలి. భగవద్భక్తి వలన సదాచారములు మరియు సద్గుణములు వాటికవే వృద్ధి చెందుతాయి. ఉత్తమ ప్రవర్తనకు భగవద్భక్తి మూలాధారము. భగవంతుని కీర్తన, ధ్యానము, పూజ, ప్రార్థన, నమస్కారము, స్తుతి ఇవన్నీ భక్తికి అంగములు. బాలకులు వీటిపట్ల విశేషంగా దృష్టిని కల్గివుండాలి.

❖ ❖ ❖